సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 158

బుధవారం 28-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...

మహిళల టి20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగనున్న భారత జట్టు -14లో



మోహన్‌లాల్ రాజీనామా

'అమ్మ' అధ్యక్ష పదవికి మలయాళ హీరో మోహన్‌లాల్ రాజీనామా చేశారు -13లో



పుతిన్‌కు మోదీ ఫోన్

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఇరు దేశాలతో ముడిపడి ఉన్న అంశాలపై చర్చించారు.

వివరాలు 6లో ▸



ఆగని అకృత్యాలు

రాజస్తాన్‌లో బాలిక సామూహిక అత్యాచారానికి గురైంది. మరో ఘటనలో మహారాష్ట్రలో నర్సింగ్ విద్యార్థినిపై ఆటోడ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు.

వివరాలు 6లో ▸



81 డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు..

ఉక్రెయిన్‌పై 100 డ్రోన్లు, మరో 100 క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా..రెండో రోజూ 81 డ్రోన్లతో పాటు క్రూయిజ్ మిస్సైళ్లను ప్రయోగించింది.

వివరాలు 6లో ▸



'మగ' క్రోమోజోమ్ మాయం?

పురుషజాతి అంతరించిపోతే? అలాంటి సృష్టి వైపరీత్యమే దాపురించబోతోంది! కాకపోతే ఇప్పుడప్పుడే కాదు. కోటి సంవత్సరాల తర్వాత!

వివరాలు 6లో ▸

బెయిల్‌పై విడుదలైన కవిత

కేసీఆర్ బిడ్డను.. తప్పు చేయను



అన్నను హత్తుకుని.. కంటతడి పెడుతూ.. చిత్రంలో హరీశ్ రావు, కవిత కుమారుడు

ఎమ్మెల్సీ కవిత భావోద్వేగం

మంగళవారం రాత్రి 9.11 గంటలు.. తిహార్ జైలు ప్రాంగణం.. అంతటా ఉద్వేగపూరిత వాతావరణం.. సుమారు ఐదున్నర నెలల తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై విడుదలై.. జైలు నుంచి బయటకు వచ్చారు. ఎన్నడూ ఇంతకాలం పిల్లలను, కుటుంబాన్ని వదిలి ఉండలేదంటూ.. కుమారుడిని, భర్తను, అన్న కేటీఆర్‌ను హత్తుకుని కన్నీటి పర్యంతమయ్యారు. 'నేను కేసీఆర్ బిడ్డను. తప్పు చేసే ప్రసక్తే లేదు. ఐదున్నర నెలలు అక్రమంగా జైలులో పెట్టారు. వారికి వడ్డీతో సహా చెల్లిస్తా'నంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కన్నీటితోనే పిడికిలి బిగించి 'జై తెలంగాణ' అంటూ నినదించారు..

ఐదున్నర నెలలు నన్ను అక్రమంగా జైలులో పెట్టారు

అలా చేసిన వారికి వడ్డీతో సహా సమాధానం చెబుతా..

అసలే మొండిదానిని.. నన్ను జగమొండిని చేశారని వ్యాఖ్య



కవితకు బెయిల్‌పై సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఈడీ, సీబీఐల దర్యాప్తు పూర్తయి, చార్జిషీట్లు దాఖలైనా ఆమెకు బెయిల్ ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించడాన్ని తప్పు పడుతూ.. సుప్రీంకోర్టు కవితకు బెయిల్ మంజూరు చేసింది. అప్పటి నుంచి మాజీ సీఎం కేసీఆర్ పది నిమిషాలకోసారి కేటీఆర్, హరీశ్‌రావులకు ఫోన్ చేస్తూ.. ఆమె బయటికి ఎంతసేపట్లో వస్తుంది, వెంట ఎవరెవరు ఉన్నారంటూ ఆరా తీస్తూనే ఉన్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తిహార్ జైలు వద్దకు చేరుకుని.. 'డాటర్ ఆఫ్ ఫైటర్.. కవితమ్మా.. మేమంతా నీకు అండగా ఉన్నాం' అంటూ ప్లకార్డులతో స్వాగతం పలికారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కవిత ఢిల్లీ వసంత్ విహార్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్లి పార్టీ నేతలతో భేటీ అయ్యారు. నేడు (బుధవారం) మధ్యాహ్నం 2.45 గంటలకు కవిత ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు. ఆమెకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి 500 కార్లతో భారీ ర్యాలీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. 2లో

కవితకు బెయిల్

- ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- పీఎంఎల్ఏ సెక్షన్ 45ను అర్థం చేసుకోవడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైందన్న జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం 2లో
- సహ నిందితులు, సాక్షుల స్టేట్‌మెంట్లు తప్పు.. నేరంలో కవిత పాత్రపై ఆధారాలేవి?
- సాక్ష్యాలను ఆమె ట్యాంపరింగ్ చేశారని ఎలా చెబుతున్నారు?
- నేరారోపణ చేసిన మాగుంటను సాక్షిగా ఎలా మారుస్తారు?
- ఇదేనా దర్యాప్తు సంస్థల పారదర్శకత అని ప్రశ్నించిన ధర్మాసనం

"నేరారోపణ చేసిన వ్యక్తినే సాక్షిగా మారుస్తారా? రేపు ఇష్టానుసారం మరో వ్యక్తిని తీసుకొచ్చేస్తారా? అలా చేస్తూ.. సదరు వ్యక్తిని సహచర నిందితుడి హోదా నుంచి సాక్షిగా మారుస్తారా? ఇదా దర్యాప్తు సంస్థల పారదర్శకత? ఏ ఆరోపణ అయినా న్యాయంగా, సహేతుకంగా విచక్షణతో ఉండాలి.

- సుప్రీంకోర్టు

బీఆర్ఎస్ విలీనమే మిగిలింది!

కవితకు బెయిల్‌పై కాంగ్రెస్ ఎద్దేవా

ఈ బెయిల్ బీఆర్ఎస్, కాంగ్రెస్ సమష్టి విజయం

'ఎక్స్'లో కేంద్ర మంత్రి బండి సంజయ్

బండి సంజయ్ వ్యాఖ్యలు కోర్టు ధిక్కారం: కేటీఆర్

'సుప్రీం'కు ఉద్దేశాలు ఆపాదించొద్దు 2లో

ఫిర్యాదు చేసినందుకు ఉద్యోగం పీకేశారు..



ఈమె పేరు రేణుక. మేడ్చల్ జిల్లాకు చెందిన ఈమె హైదరాబాద్ నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఆమెతోపాటు ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ సిబ్బంది తమ వేతనంలో ఏజెన్సీ కోతపెడుతోందని.. రూ.15 వేలు ఇవ్వాల్సి ఉంటే, రూ. 10 వేలు మాత్రమే ఇస్తోందని గతంలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో రేణుక ఇటీవల ప్రజాభవన్‌కు వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇది తెలిసిన ఏజెన్సీ ఆ మరుసటి రోజే ఆమెను ఉద్యోగం నుంచి తొలగించింది. దీనితో రేణుక మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ అక్రమాలను అరికట్టాలని వేడుకున్నారు. ఆమెను తిరిగి ఉద్యోగంలో చేర్చుకుంటారా? ప్రభుత్వం ఏం చేస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

ఆర్భాటం ఎక్కువ పరిష్కారం తక్కువ

ప్రజావాణిలో అర్జీలు ఇస్తున్నా.. పరిష్కారం కాక ఆవేదనలో జనం

దరఖాస్తుల స్వీకరణకే అధికార యంత్రాంగం పరిమితం!

- తొలిరోజు మాత్రమే కనిపించిన సీఎం.. మరికొన్ని రోజులు హడావుడి చేసిన మంత్రులు.. తర్వాతి నుంచి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమం 16లో
- ప్రజాభవన్ నుంచి క్షేత్రస్థాయికి దరఖాస్తులు పంపుతున్న తీరు
- వాటి పరిష్కారం వైపు చర్యలేమిటన్న దానిపై అస్పష్టత
- మళ్లీ మళ్లీ వస్తున్నా ఏమీ తెలియడం లేదంటున్న ప్రజలు

మళ్లీ 'ప్రజాపాలన'

వచ్చే నెల 17 నుంచి పది రోజుల పాటు రాష్ట్రమంతటా నిర్వహణ

ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



- రేషన్, హెల్త్‌కార్డులకు లింక్ లేకుండా అన్ని కుటుంబాల వివరాల సేకరణ
- హెల్త్ డిజిటల్ కార్డుల జారీపై ఫ్రాన్స్ విధానాన్ని పరిశీలించండి
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్‌లకు ఈ కార్డే ప్రాతిపదిక అని వెల్లడి
- వ్యాధులపై ఉదాసీనంగా ఉంటే సస్పెన్షనేనని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరోమారు 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు జారీ చేయడమే ఎజెండాగా సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పది రోజుల పాటు రాష్ట్రమంతటా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించాలని, తగిన ఏర్పాట్లు మిగతా 3వ పేజీలో ▸

గోషామహల్‌కు ఉస్మానియా ఆసుపత్రి 5లో

న్యూస్‌రీల్

ఐసీసీ పీఠంపై జై షా



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కొత్త చైర్మన్‌గా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తనయుడు జై షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది డిసెంబర్ 1న ఆయన పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.

- వివరాలు 14లో▶

ఎల్ఆర్ఎస్ ఫ్లెక్సీపై రగడ



వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో ఈ నెల 25న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ప్రదర్శించిన ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. దీనిపై కాకతీయ కళాతోరణం లేని రాజముద్రను ముద్రించడంపై పెద్దఎత్తున విమర్శలువచ్చాయి.

- వివరాలు 12లో▶


డబ్బు కట్టాం.. సీట్లివ్వాల్సిందే



కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థుల మధ్య సీట్ల పంచాయితీ ముదురుతోంది. వివిధ కాలేజీల్లో దాదాపు 5 వేల మందికి అదనపు సీట్లు ఇస్తామని యాజమాన్యాలు ఆశలు రేపాయి. అయితే ఇప్పుడు లేవని చెబుతుండటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

- వివరాలు 12లో▶

సింఘ్వీ ఏకగ్రీవం



తెలంగాణ నుంచి ఎమ్మెల్యేల కోటాలో రాజ్యసభకు కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన తరఫున ధ్రువీకరణ పత్రాన్ని టీపీసీసీ ఎన్నికల సమన్వయకర్త నిరంజన్ అందుకున్నారు.

- వివరాలు 3లో▶

ఇవాళ్టి కార్టూన్





యువ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యత వహిస్తూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కోల్‌కతాలో మంగళవారం విద్యార్థులు చేపట్టిన 'నబన్నా అభియాన్' హింసాత్మకంగా మారింది. 6లో

రాళ్ల దాడులు.. లాఠీచార్జి.. ర్యాలీ హింసాత్మకం



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. 12లో

బుల్కాపూర్ నాలా మాయం!

- జన్వాడ సందర్శించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- నాలా పరిస్థితి, కబ్జా తీరు పరిశీలన
- నాలాపై ప్రహరీ, ప్రధాన గేటు ఉన్నట్లు గతంలోనే గుర్తింపు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలో మాజీ మంత్రి కేటీఆర్ లీజుకు తీసుకున్నట్లు చెబుతున్న ఫాంహౌస్‌కు ఆనుకుని ఉన్న బుల్కాపూర్ నాలాను మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తేజ, సర్వేయర్ సాయి తేజ, ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ లింగంలు సందర్శించారు. రెవెన్యూ రికార్డులతో పాటు గ్రామ నక్ష ఆధారంగా.. కబ్జాకు గురైన బుల్కాపూర్ నాలా ఎటు నుంచి ఎటు వైపు వెళ్తోంది? ఎన్ని మీటర్ల మేర కబ్జాకు గురైంది? ఎవరి కబ్జాలో ఉంది? వంటి వివరాలపై ఆరా తీశారు. రెవెన్యూ రికార్డులను, క్షేత్రస్థాయిలో నాలా పరిస్థితిని సరిపోల్చుకున్నారు. శంకర్‌పల్లి–ఖానాపూర్ రోడ్డులో ఉన్న ఈ నాలా ప్రస్తుతం చాలావరకు కన్పించకుండా మిగతా 3వ పేజీలో ▸



నిల్చున్న చోటే నిగ్గుతేల్చే యాప్!

- స్థలాల కొనుగోలుపై గందరగోళంలో సామాన్య ప్రజలు
- వీరికి ఉపయుక్తంగా ఉండేలా త్వరలో హైడ్రా యాప్ 3లో

'గోల్డెన్' బజార్!

హోల్‌సేల్ మార్కెట్లకు కేంద్రమైన బేగంబజార్ స్థల యజమానులకు మాత్రం గోల్డెన్ బజార్‌గా మారింది. కోకాపేటలో ఎకరం భూమి రూ.100 కోట్లు పలికితేనే అంతా ఆశ్చర్యపోయారు. కానీ తాజాగా పాతబస్తీని ఆనుకుని ఉన్న బేగంబజార్ ఫీల్‌ఖానాలోని 101 గజాల స్థలం రూ.10 కోట్లకు అమ్ముడుపోయింది. తద్వారా తెలంగాణలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా బేగంబజార్ నిలిచిందని స్థిరాస్తి రంగ నిపుణులు చెబుతున్నారు.

- అబిడ్స్ (హైదరాబాద్)

ఎందుకింత డిమాండ్?

తెలుగు రాష్ట్రాల్లో హోల్‌సేల్ మార్కెట్లకు కేరాఫ్ అడ్రస్ బేగంబజార్. వాణిజ్య మార్కెట్‌లో దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పోటీపడుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు చెందిన హోల్‌సేల్ వ్యాపారస్తులు బేగంబజార్‌లో స్థిరపడ్డారు. ఇక్కడ సుమారు 5–6 వేల హోల్‌సేల్ దుకాణాలుంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి నిత్యం దాదాపు లక్ష మంది రిటైల్ వ్యాపారస్తులు వస్తుంటారు. దీంతో కొత్తగా మౌలిక వసతుల అభివృద్ధి లేకపోయినప్పటికీ దుకాణాలు, వాణిజ్య సముదాయాలకు అవసరమైన స్థలాలకు డిమాండ్ విపరీతంగా ఉంటోంది. కొన్నిచోట్ల భూమి అందుబాటులో లేకపోవడంతో పాత భవనాలను కూల్చి కొత్త వాటిని నిర్మిస్తుండటం గమనార్హం. ఇక ఎక్కడైనా కొద్దిపాటి స్థలం అందుబాటులో ఉంటే పదుల సంఖ్యలో వ్యాపారస్తులు పోటీ పడుతున్నారు. దీంతో ఏ గల్లీలో అయినా స్థల యజమానులకు కాసుల వర్షం కురుస్తోంది. కొనుగోలుదారుల నుంచి ఉన్న డిమాండ్ కారణంగా భూ యజమానులు రాత్రికి రాత్రే ధరలను పెంచేస్తున్నారు. అత్యధికంగా ఉత్తరాది మిగతా 5వ పేజీలో ▸

బేగంబజార్‌లో గజం ధర రూ.10 లక్షలు

తాజాగా రూ.10 కోట్లు పలికిన 101 గజాల స్థలం

రాష్ట్రంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా గుర్తింపు

తెలుగు రాష్ట్రాల్లో హోల్‌సేల్ మార్కెట్లకు కేరాఫ్ అడ్రస్

దుకాణాలకు అవసరమైన స్థలాలకు ఉత్తరాది వ్యాపారుల పోటీ





పెసర ప్రభాకర్‌రెడ్డి (ఖమ్మం జిల్లా)



సంపత్‌కుమార్ (రాజన్న సిరిసిల్ల జిల్లా)

ఇద్దరు రాష్ట్ర ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు

- తాడూరి సంపత్‌కుమార్, పెసర ప్రభాకర్‌రెడ్డిని వరించిన అవార్డులు
- ఏపీ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు కూడా..
- దేశవ్యాప్తంగా 50 మంది ఎంపిక
- సెప్టెంబర్ 5న ఢిల్లీలో పురస్కారాల ప్రదానం
- ప్రశంసాపత్రం, వెండి పతకం, రూ. 50 వేల నగదు బహుమతి 16లో

కవితకు బెయిల్

ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకలపై నమోదైన ఈడీ, సీబీఐ కేసుల్లో ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తు సంస్థలు సహ నిందితులు, సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు కాకుండా.. నేరంలో కవిత పాత్రపై ఆధారాలేమీ చూపలేదని పేర్కొంది. ఈ కేసుల్లో దర్యాప్తు పూర్తవడం, చార్జిషీట్లు దాఖలు చేయడంతోపాటు ఒక మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.



ఢిల్లీ హైకోర్టు తీర్పు చట్టరూపం దాల్చితే.. సహేతుకం కాని ఆ పరిశీలనలతో చదువుకున్న ఏ మహిళకూ బెయిల్ రాకుండా పోతుంది. ఇది ఢిల్లీ హైకోర్టు పరిధిలోని అన్ని కోర్టులకూ వర్తిస్తుంది. ఏమిటిది? చదువుకున్న మహిళకు బెయిల్ ఇవ్వకపోవడం ఏమిటి? ఎంపీలు, సాధారణ వ్యక్తుల మధ్య భేదాలు చూపకూడదని, సమానంగా చూడాలని మేం చెబుతాం. కానీ దానికి విరుద్ధంగా ఈ కేసులో చట్టంలో లేని కృత్రిమ విచక్షణను హైకోర్టు అనుసరించింది. - సుప్రీంకోర్టు

సుదీర్ఘ వాదనల అనంతరం..

ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఇరుపక్షాలు గంటన్నరకుపైగా వాదనలు వినిపించాయి. ఈ క్రమంలో కవిత తరఫు లాయర్ల వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ.. ఈడీ, సీబీఐ కేసుల్లో కవితకు బెయిల్ మంజూరు చేసింది. రెండు కేసులకు సంబంధించి రూ.10 లక్షల చొప్పున పూచీకత్తు సమర్పించాలని.. ట్రయల్ కోర్టులో పాస్‌పోర్టును డిపాజిట్ చేయాలని షరతులు విధించింది. సాక్షులను బెదిరించడం, ఆధారాల ట్యాంపరింగ్ వంటివి చేయవద్దని.. ట్రయల్ కోర్టుకు రెగ్యులర్‌గా హాజరవుతూ, విచారణ వేగంగా పూర్తయ్యేందుకు సహకరించాలని స్పష్టం చేసింది.

ఇరువర్గాల వాదనలు, ప్రతివాదనలు ఇవీ..

సుప్రీంకోర్టులో కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ''ఈడీ కేసులో ఐదు నెలలుగా, సీబీఐ కేసులో నాలుగు నెలలుగా కవిత జైలులో ఉన్నారు. ఈడీ, సీబీఐ చార్జిషీట్ల దాఖలు పూర్తయింది. రెండు కేసుల్లోనూ మొత్తంగా 493 మంది సాక్షులను విచారించారు. సుమారు 50వేల పేజీల డాక్యుమెంట్లు తయారు చేశారు. కవిత మాజీ ఎంపీ, తండ్రి మాజీ ముఖ్యమంత్రి. ఆమె కోర్టు నుంచి తప్పించుకుని ఎక్కడికీ వెళ్లాలనుకోరు. మహిళలు త్వరగా బెయిల్ పొందడం సాధారణ విషయం. సౌత్ గ్రూపు నుంచి ఢిల్లీకి రూ.100 కోట్లు చేరాయని ఈ కేసుల్లో ఆరోపణలు చేశారు. అందులో రికవరీ చేసినట్టు ఏమీ లేదు. కేవలం సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ కేసులో మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు బెయిల్ కూడా మంజూరైంది. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం ఒక మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలు..'' అని ధర్మాసనానికి విన్నవించారు.

ఫోన్‌ను ఫార్మాట్ చేసి ట్యాంపర్ చేశారు..

దర్యాప్తు సంస్థల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ''కవితకు ఈడీ సమన్లు జారీ చేసిన రోజే ఆమె తన ఫోన్లను ధ్వంసం చేశారు. ఫార్మాట్ చేశారు. ఖరీదైన ఐఫోన్‌ను ఆమె పని మనుషుల (సర్వెంట్)కు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? కవిత తీరు ట్యాంపరింగ్‌తో సమానం. ఒక ఫోన్‌ను పరీక్షిస్తే.. అందులో డేటా లేదు, ఎలాంటి రికార్డు లేదు. ఐదారు నెలలు ఫోన్ ఉపయోగించినప్పుడు డేటా ఉండాలి కదా..'' అని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ కేవీ విశ్వనాథన్ జోక్యం చేసుకుంటూ.. ''ప్రజలు ఫోన్లలో మెసేజీలను డిలీట్ చేయడం మామూలు విషయమే. నాకు కూడా కొన్ని వాట్సాప్ గ్రూపుల మెసేజీలు డిలీట్ చేసే అలవాటు ఉంది. ఇది సాధారణ వ్యవహారమే..'' అని పేర్కొన్నారు. దీనిపై ఎస్వీ రాజు వివరణ ఇస్తూ.. కవిత అసలు ఫోన్లను కాకుండా, వేరే ఫోన్లను దర్యాప్తు సంస్థకు ఇచ్చారని.. కాంటాక్టు లిస్టు, రికార్డ్స్ హిస్టరీని ఎవరూ డిలీట్ చేయరు కదా అని వ్యాఖ్యానించారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ.. కవితకు నేరంతో సంబంధమేంటన్న విషయం కాకుండా మరో విషయంలోకి వెళ్తున్నట్టుగా ఉందన్నారు. అయితే కవిత ఫోన్‌ను ఫార్మాట్ చేసి, ఆధారాలను ట్యాంపర్ చేశారని.. ఆమె విషయంలో పీఎంఎల్ఏ సెక్షన్ 45ను పరిగణనలోకి తీసుకోవద్దని ఎస్వీ రాజు వాదించారు. దీనితో ''ఫోరెన్సిక్ నివేదిక ఫోన్‌ను ఫార్మాట్ చేశారని మాత్రమే చెబుతోంది. ఆమె సాక్ష్యాలను ట్యాంపరింగ్ చేశారని ఎలా అంటారు?'' అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. ఎస్వీ రాజు దీనికి బదులిస్తూ.. ఇతర నిందితులతో కవితకు సంబంధం ఉందని చూపడానికి తమ వద్ద కాల్ డాటా రికార్డు (సీడీఆర్) ఉందని, ఆమె ఉద్దేశపూర్వకంగా ఆధారాలను దాచిపెట్టారనడానికి మరో ఫోన్‌లో ఇతర ఆధారాలు ఉన్నాయని వివరించారు.

గంటల తరబడి వినలేం..?

ఈడీ, సీబీఐ తరఫు న్యాయవాది సుదీర్ఘంగా వాదనలు వినిపించడంపై జస్టిస్ బీఆర్ గవాయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక బెయిల్ కేసులోనే గంటల తరబడి వాదనలు వింటూ కూర్చొంటే.. ఇతర బెయిల్ కేసుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కేసులో కవిత పాత్రపై ఇంకేమైనా ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ''మాగుంట శ్రీనివాసులురెడ్డి చెప్పారని మాగుంట రాఘవ రూ.25 కోట్లను బుచ్చిబాబు, అభిషేక్‌లకు ఇచ్చారని అంటున్నారు. మరి మనీలాండరింగ్ కేసులో రాఘవ లేరని ఎలా అంటారు? నేరారోపణ చేసిన వ్యక్తినే సాక్షిగా మార్చారు? రేపు ఇష్టానుసారం మరో వ్యక్తిని తీసుకొస్తారా? ఇదా దర్యాప్తు సంస్థల పారదర్శకత?'' అని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు.

మాగుంటను నిందితుడిగా ఎందుకు చేర్చలేదు?

ఇక ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఈ కేసులో నిందితుడిగా ఎందుకు చేర్చలేదని దర్యాప్తు సంస్థలను ధర్మాసనం ప్రశ్నించింది. ఎస్వీ రాజు దీనికి స్పందిస్తూ.. ''కవిత ఫోన్లు ధ్వంసం చేయడానికి కారణం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో మాట్లాడటమే. మాగుంట శ్రీనివాసులు వాంగ్మూలంతోనే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేరు బయటికి వచ్చింది. మేజిస్ట్రేట్ ముందు మాగుంట వాంగ్మూలం ఇచ్చారు. లిక్కర్ పాలసీలో భాగస్వామ్యం కోసం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను మాగుంట కలిశారు. అయితే కవితను కలవాలని మాగుంటకు కేజ్రీవాల్ సూచించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని తన నివాసానికి రమ్మని కవిత తనకు ఫోన్ చేశారని మాగుంట వాంగ్మూలం ఇచ్చారు. ఆ ఆధారాలు బయటపడకుండా కవిత ఫోన్ ధ్వంసం చేశారు. లిక్కర్ పాలసీ అనుకూలంగా ఉండటానికి ఆప్ నేతలకు రూ.100 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని.. అందులో రూ.50 కోట్లు ఇవ్వాలని మాగుంట శ్రీనివాసులురెడ్డిని కవిత కోరారు. మాగుంట ఈ మేరకు వాంగ్మూలం ఇచ్చారు'' అని కోర్టుకు వివరించారు. శ్రీనివాసులురెడ్డి ఈ క్రమంలోనే అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబులకు తన కుమారుడు మాగుంట రాఘవ ద్వారా రూ.25 కోట్లు అందచేశారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ''మరి మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఎందుకు ముద్దాయిగా చేర్చలేదు? కవిత నిందితురాలు అయినపుడు మాగుంట శ్రీనివాసులు సాక్షి ఎలా అవుతారో చెప్పండి?'' అని ప్రశ్నించింది. ఈ సమయంలో ముకుల్ రోహత్గి కల్పించుకుని ''మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారుతానని చెప్పడంతోనే బెయిల్ వచ్చింది. వారు చేస్తున్న ఇలాంటి ఆరోపణలే తప్ప.. కవిత నేరం చేశారనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు..'' అని స్పష్టం చేశారు. ఈ సమయంలో కేజ్రీవాల్‌కు ఏ కేసులో బెయిల్ వచ్చిందనే దానిపై జస్టిస్ బీఆర్ గవాయ్ ఆరా తీశారు.

ఇలాగైతే చదువుకున్న మహిళలకు బెయిల్ రానట్టే..

ఇక ఎమ్మెల్సీ కవిత ఉన్నత విద్యావంతురాలు, అసాధారణ మహిళ అంటూ ఢిల్లీ హైకోర్టు బెయిల్ తిరస్కరించడాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్ తప్పుపట్టారు. ''పీఎంఎల్ఏ సెక్షన్ 45 (1) కింద మహిళల విషయంలో ప్రత్యేకంగా పరిశీలన జరపాల్సి ఉంటుంది. ఢిల్లీ హైకోర్టు తీర్పు చట్టరూపం దాల్చినట్లయితే.. ఆ సహేతుకం కాని పరిశీలనల కారణంగా చదువుకున్న ఏ మహిళకూ బెయిల్ రాని పరిస్థితి ఏర్పడుతుంది. కనీసం ఇది ఢిల్లీ హైకోర్టు పరిధిలోని అన్ని కోర్టులకు వర్తిస్తుంది. ఈ కేసులో చట్టంలో లేని కృత్రిమ విచక్షణను హైకోర్టు గుర్తించింది. ఇలాంటి కేసుల్లో కోర్టులు న్యాయపరంగా విచక్షణను వినియోగించాలి. హైకోర్టు కవితకు బెయిల్ నిరాకరిస్తూనే.. ఆమె ఉన్నత విద్యావంతురాలు, సామాజిక సేవ చేశారని నిర్ధారించింది. అలాంటప్పుడు కోర్టు సున్నితంగా వ్యవహరించాలి. కానీ పీఎంఎల్ఏ సెక్షన్ 45(1) నిబంధన వర్తింపజేయడంలో హైకోర్టు తప్పుదారి పట్టింది..'' అని పేర్కొన్నారు. కవిత బెయిల్‌కు అర్హురాలని స్పష్టం చేశారు.

కేసీఆర్ బిడ్డను.. తప్పు చేయను..

బెయిల్‌పై విడుదలైన అనంతరం ఎమ్మెల్సీ కవిత భావోద్వేగం

సాక్షి, న్యూఢిల్లీ: ''నేను 18 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. ఎన్నో ఎత్తు పల్లాలు చూశా. ఇన్ని రోజులు ఒక తల్లిగా పిల్లలకు ఏనాడూ దూరంగా ఉండలేదు. నన్ను ఈ పరిస్థితికి తెచ్చిన వారికి కచ్చితంగా వడ్డీతో సహా సమాధానం చెబుతాను'' అంటూ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర భావోద్వేగంతో అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలను ఎదుర్కొంటూ 166 రోజులపాటు ఢిల్లీ తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవితకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరుచేసింది. రాత్రి సరిగ్గా 9.11 గంటలకు తీహార్ జైలు నుంచి పిడికిలి బిగించి, జై తెలంగాణ అంటూ బయటకు వచ్చిన కవితకు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గేటు బయటకు రాగానే పెద్ద కుమారుడు ఆదిత్యను చూసిన కవిత భావోద్వేగానికి గురై ఆలింగనం చేసుకున్నారు. పక్కనే ఉన్న సోదరుడు కేటీఆర్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకోగా, కేటీఆర్ కవిత నుదిటిపై ముద్దుపెట్టారు. భర్త అనిల్, హరీశ్‌రావులతో ఆలింగనం అనంతరం అక్కడున్న బీఆర్ఎస్ నేతలు సునీత లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, మాలోతు కవిత తదితరులను ఆప్యాయంగా పలకరించారు. కవిత విడుదల అవుతున్నారని తెలుసుకున్న ఢిల్లీలోని తెలంగాణ ప్రజలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'డాటర్ ఆఫ్ ఫైటర్, కవిత కడిగిన ముత్యం, కవితమ్మా.. మేమంతా నీకు అండగా ఉన్నాం' అనే ప్లకార్డులతో స్వాగతం పలికారు.

నన్ను జగమొండిని చేశారు

కవిత జైలు బయట ఉన్న మీడియా, కార్యకర్తలనుద్దేశించి రెండు నిమిషాలు ప్రసంగించారు. 'ఐదున్నర నెలల తర్వాత కుటుంబ సభ్యులను, కార్యకర్తల్ని, మీడియాను కలవడం ఎంతో సంతోషంగా ఉంది. ఒక తల్లిగా పిల్లల్ని వదిలేసి ఐదున్నర నెలలు ఏనాడూ ఉండలేదు. ఇది చాలా ఇబ్బందికరమైన విషయం. నన్ను, నా కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేసిన వారికి తప్పకుండా వడ్డీతో సహా చెల్లిస్తాం, సరైన సమయానికి సరైన సమాధానం చెబుతాను. కష్టకాలంలో తోడుగా నిలిచిన ప్రతి ఒక్క కార్యకర్తకూ నా కృతజ్ఞతలు. ఎవరి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. నేను కేసీఆర్ బిడ్డను. తెలంగాణ బిడ్డను. కమిట్‌మెంట్‌తో పనిచేస్తాను, న్యాయపరంగా ఎదుర్కొంటాను, రాజకీయంగా కొట్లాడతాను. నేను మాములుగా కాస్త మొండిదానిని, మంచిదానిని, నన్ను అనవసరంగా జైలుకు పంపి ఇప్పుడు జగమొండిని చేశారు' అంటూ వ్యాఖ్యానించారు. తనను అక్రమంగా జైలుకు పంపారని, బీఆర్ఎస్, కేసీఆర్‌ను విచ్ఛిన్నం చేయడానికే ఇలా చేశారని మండిపడ్డారు.

నేడు 500 కార్లతో భారీ ర్యాలీ

కవిత బుధవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లనున్నారు. జైలు నుంచి విడుదలై రాష్ట్రానికి వస్తున్న కవితకు బీఆర్ఎస్ నేతలు ఘన స్వాగతం పలకనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సుమారు 500 కార్లతో భారీ ర్యాలీ ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

ఆటోలో కేటీఆర్: కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు కోర్టు బయటకు వచ్చారు. అప్పటికే అక్కడ భారీ సంఖ్యలో మీడియా ప్రతినిధులు వేచి ఉన్నారు. తమతో మాట్లాడాలని మీడియా ప్రతినిధులు వెంటపడుతున్న సమయంలో.. అందరికీ అభివాదం చేస్తూ బయటకు వచ్చారు. ఆ సమయంలో కారు అందుబాటులో లేకపోవడంతో ఓ ఆటో మాట్లాడుకుని దీన్‌దయాల్ మార్గంలోని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఇంటికి చేరుకున్నారు.



జైలు బయట భర్తతో కలసి అభివాదం చేస్తున్న కవిత

పది నిమిషాలకోసారి కేసీఆర్ ఫోన్

బెయిల్ మంజూరు అని తెలిసినప్పటి నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి పది నిమిషాలకోసారి కేటీఆర్, హరీశ్, కవిత భర్త అనిల్‌లకు ఫోన్ చేస్తూనే ఉన్నారు. ఎప్పటిలోగా బయటకు తెస్తారు, కవితమ్మ వెంట ఎవరెవరు ఉంటారు, జైలు వద్దకు ఎప్పుడు వెళతారంటూ కేసీఆర్ ఆరా తీస్తూనే ఉన్నారు.

అక్రమంగా జైలులో పెట్టారు

కవిత జైలు నుంచి నేరుగా వసంత్‌విహార్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. కవిత వెంట కారులో కేటీఆర్, కుమారుడు ఆదిత్య, భర్త అనిల్, పార్టీ నేతలు సునీత లక్ష్మారెడ్డి, మాలోతు కవిత ఉన్నారు. పార్టీ కార్యాలయానికి చేరుకున్న పది నిమిషాలకే పార్టీ నేతలతో కవిత సమావేశమయ్యారు. ఢిల్లీ లిక్కర్ కేసు బోగస్ అని, కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక తనను టార్గెట్ చేసుకుని జైలుకు పంపారంటూ ఆమె నేతలతో చర్చించారు.



తెలంగాణకు మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్

కేంద్ర బొగ్గు శాఖ చొరవతో అంగీకరించిన ఎన్ఎల్‌సీ సంస్థ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చే దిశగా జరుగుతున్న ప్రయత్నానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ చొరవతో ముందడుగు పడింది. దీని కారణంగా ఏటా 200 మెగావాట్ల సౌరవిద్యుత్ తెలంగాణకు అందించేలా.. ఎన్ఎల్‌సీ (నేవేలీ లిగ్నైట్ కార్పొరేషన్) ఇండియా లిమిటెడ్ సంస్థ అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పథకంలో భాగంగా.. సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ స్కీమ్ (సీపీఎస్‌యూ)కు లోబడి.. నేవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ 510 మెగా వాట్ల సామర్థ్యం గల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని కచ్ జిల్లా బిబర్ ప్రాంతంలో ఏర్పాటుచేస్తోంది. రూ.1,214 కోట్లతో నిర్మిస్తు న్న ఈ సౌర విద్యుదుత్పత్తి కేంద్రం పనులు పూర్తి కావొచ్చాయి. 2025 జూన్ నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమ్యే అవకాశాలున్నాయి. ఈ సోలార్ పవర్ ప్రాజెక్ట్ తెలంగాణ విద్యుత్ అవసరాలు తీర్చడంలో కీలకంగా మారనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఒక కేడబ్ల్యూహెచ్ విద్యుత్ రూ.2.57కే అందుబాటులోకి వస్తుంది. దీని ద్వారా వచ్చే 25 ఏళ్లలో దాదాపు రూ.2 వేల కోట్లు తెలంగాణ ట్రాన్స్‌కోకు ఆదా అవుతుంది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎన్ఎల్‌సీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ)పై సంతకాలు చేసుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు.

నోటీసులు, అరెస్టు నుంచి విడుదల దాకా..



హైదరాబాద్‌లో కవితను అరెస్టు చేసిన నాటి దృశ్యం

- 08-03-2023న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కవితకు సమన్లు జారీ చేసింది
- 11-03-2023న ఢిల్లీలో ఈడీ విచారణకు కవిత హాజరు
- 15-03-2023న ఈడీ సమన్లపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన కవిత
- 21-03-2023న తన ఫోన్లను ఈడీకి సమర్పించిన కవిత
- 14-09-2023న కవితకు మళ్లీ నోటీసులు జారీ చేసిన ఈడీ
- 15-09-2023న సమన్ల జారీని పదిరోజులు వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- 15-03-2024న లిక్కర్ స్కామ్‌లో కవితను అరెస్టు చేసిన ఈడీ
- 16-03-2024న ఢిల్లీలోని కోర్టులో హాజరు, రిమాండ్
- 05-04-2024న కవి తను విచారించేందుకు సీబీఐ పిటిషన్
- 08-04-2024న కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన ట్రయల్ కోర్టు
- 11-04-2024న తీహార్ జైల్లో కవితను అరెస్టు చేసిన సీబీఐ
- 12-04-2024న సీబీఐ కోర్టును ఆశ్రయించిన కవిత.. ఆ పిటిషన్‌పై తీర్పు రిజర్వు
- 15-04-2024న కవితకు 9 రోజులు జ్యుడీషియల్ కస్టడీ
- 16-04-2024న బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా
- 23-04-2024న మే 7 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు
- 14-05-2024న జ్యుడీషియల్ కస్టడీ మే 20 వరకు పొడిగింపు
- 03-06-2024న జూలై 3 వరకు రిమాండ్ కొనసాగింపునకు ఆదేశం
- 01-07-2024న కవిత బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు
- 03-07-2024న జ్యుడీషియల్ కస్టడీ జూలై 25 వరకు పొడిగింపు
- 22-07-2024న బెయిల్ పిటిషన్‌పై ట్రయల్ కోర్టు విచారణ వాయిదా
- 05-08-2024న బెయిల్ పిటిషన్‌పై ట్రయల్ కోర్టు విచారణ మళ్లీ వాయిదా
- 07-08-2024న సుప్రీంకోర్టును ఆశ్రయించిన కవిత
- 12-08-2024న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంలో విచారణ వాయిదా
- 20-08-2024న బెయిల్ పిటిషన్ విచారణ మళ్లీ వాయిదా
- 22-08-2024న కవితకు అస్వస్థత.. తీహార్ జైలు నుంచి ఆస్పత్రికి తరలింపు
- 27-08-2024న కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు.


ఏమిటీ ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు?

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం అమ్మకాలకు సంబంధించి ఆప్ ప్రభుత్వం 2021లో నూతన లిక్కర్ పాలసీని అమల్లోకి తెచ్చింది. సాధారణంగా ప్రభుత్వం టెండర్లు పిలిచి ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను అప్పగిస్తుంది. ఇందుకోసం లైసెన్స్ ఫీజు, మద్యం అమ్మకాలపై పన్నులను వసూలు చేస్తుంది. కానీ ఢిల్లీ ప్రభుత్వం కొత్త పాలసీలో.. మద్యం షాపుల లైసెన్సుల జారీ, పన్నుల్లో అపరిమిత రాయితీలను ప్రకటించింది. ఉదాహరణకు పాత విధానంలో 750 మిల్లీలీటర్ల మద్యం బాటిల్ హోల్‌సేల్ ధర రూ.166.71 అయితే.. కొత్త విధానంలో రూ.188.41కు పెంచారు. కానీ దానిపై ఎక్సైజ్ సుంకాన్ని రూ.223.89 నుంచి నామమాత్రంగా రూ.1.88కు, వ్యాట్‌ను రూ.106 నుంచి రూ.1.90కు తగ్గించారు. ఇదే సమయంలో ఆ బాటిల్‌పై షాపుల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్ (లాభం)ను రూ.33.35 నుంచి ఏకంగా రూ.363.27కు పెంచారు. బయటికి మద్యం ధరలు కాస్త పెరిగినట్టు కనబడినా.. రాయితీల వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం తగ్గి, మార్జిన్ పెంపువల్ల షాపుల నిర్వాహకులకు అతి భారీగా లాభం వచ్చేలా పాలసీ రూపొందింది. దీనికితోడు మద్యం హోం డెలివరీ, తెల్లవారుజామున 3 గంటల దాకా షాపులు తెరిచిపెట్టుకునే వెసులుబాటునూ ప్రభుత్వం కల్పించింది. ఈ పాలసీ కింద 849 మద్యం షాపులను ప్రైవేట్ వ్యక్తులు, కంపెనీలకు అప్పగించింది. ఇక్కడే ఆప్ ప్రభుత్వ పెద్దలు తమ సన్నిహితులకు భారీగా లాభం జరిగేలా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగం కల్పించుకుని.. మద్యం పాలసీలో భారీగా అవకతవకలు జరిగాయంటూ కేంద్రానికి, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. దీనితో ఈడీ, సీబీఐ కేసులు నమోదయ్యాయి. ఢిల్లీ మద్యం పాలసీ రూపకల్పన సమయం నుంచే అక్రమాలు చోటుచేసుకున్నాయని ఈడీ, సీబీఐ తమ దర్యాప్తులో గుర్తించాయి.

సిసోడియాకు 17 నెలలు రాలేదు..

కవితకు 5 నెలల్లోనే ఎలా?

- జడ్జి తీర్పు చెప్పకముందే బీఆర్ఎస్ నేతలకు బెయిల్ వస్తుందని తెలుసా?
- బీఆర్ఎస్ విలీనం.. లేదంటే పొత్తు... ఇదే మోదీకి కేసీఆర్ ఇచ్చే రిటర్న్ గిఫ్ట్: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నేత మనీశ్ సిసోడియాకు 17 నెలలు బెయిల్ రాలేదని, మరి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు 5 నెలలకే బెయిల్ ఎలా వచ్చిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ప్రశ్నించారు. కుంభకోణంలో పాలు పంచుకున్నా రన్న ఆరోపణలున్న వ్యక్తికి బెయిల్ రావడానికి అన్ని నెలలు పడితే, లిక్కర్ మాఫియాలో కీలక పాత్ర పోషించిన కవితకు ఇంత తొందరగా బెయిల్ వచ్చిందంటే బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య చీకటి ఒప్పందం కుదిరినట్టేనని వ్యాఖ్యానించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కవిత బెయిల్ గురించి కోర్టులో జడ్జి తీర్పు చెప్పకముందే బెయిల్ వస్తుందని బీఆర్ఎస్ నేతలకు తెలుసా అని ప్రశ్నించారు. అందుకే మూడు రోజులుగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు సోషల్ మీడియా హడావుడి చేశాయన్నారు. బెయిల్ వస్తుందని చెప్పినందుకు కోర్టు కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్‌ను ఉపయోగించుకునేలా బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని, కవితకు కండీషన్ బెయిల్ ఇచ్చే ఒప్పందంలో భాగంగానే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ డమ్మీ పాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే ఒప్పందంలో భాగంగానే బీఆర్ఎస్, బీజేపీలు వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయబోతున్నాయని, లేదంటే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని, ఇదే మోదీకి కేసీఆర్ ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

ఈ బెయిల్ బీఆర్ఎస్, కాంగ్రెస్ సమష్టి విజయం: బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి, వారి లాయర్లకు కంగ్రాట్స్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యంగ్యంగా స్పందించారు. మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇప్పించడంలో విజయాన్ని సాధించినందుకు అభినందనలు అని పేర్కొన్నారు. 'మీ అవిశ్రాంత కృషి చివరికి ఫలించింది. ఈ బెయిల్ బీఆర్ఎస్, కాంగ్రెస్ సమష్టి విజయం' అని మంగళవారం ఎక్స్‌లో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'బీఆర్ఎస్ నేత బెయిల్ మీద బయటకు వచ్చారు - కాంగ్రెస్ నాయకుడు రాజ్యసభలోకి వెళ్తున్నారు' అని సంజయ్ పేర్కొన్నారు. 'కేసీఆర్ అద్భుతమైన రాజకీయ చతురతకు హ్యాట్సాఫ్.. బెయిల్ కోసం వాదించిన కాంగ్రెస్ అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు ఇవ్వడం, అధికార కాంగ్రెస్ ఏకపక్షంగా రాజ్యసభకు నామినేట్ చేయడం...ఈ క్విడ్ ప్రో కో నేరంలో పాలు పంచుకున్న భాగస్వాములకు అభినందనలు' అని వ్యాఖ్యానించారు. తాజా పరిణామం రెండుపార్టీల మధ్య భాగస్వామ్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. విలీనం మాటముచ్చట పూర్తయింది.. ఇక 'అప్పగింతలే' తరువాయి అంటూ పేర్కొన్నారు.



ఢిల్లీలో కోర్టు నుంచి ఆటోలో వెళ్తున్న కేటీఆర్, కౌశిక్‌రెడ్డి

బండి సంజయ్ వ్యాఖ్యలు కోర్టు ధిక్కారం

సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించడం సరికాదు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ రావటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కవితకు బెయిల్ లభించడాన్ని 'కాంగ్రెస్, బీఆర్ఎస్ బంధం' అంటూ సుప్రీంకోర్టు తీర్పును అవమానించేలా బండి సంజయ్ ట్వీట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌పై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా సంజయ్ వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు.

- ధర్మాసనాలను గౌరవించాలనే ఇంగిత జ్ఞానం కేంద్ర మంత్రి బండి సంజయ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌లకు లేకపోవడం దురదృష్టకరమని బీఆర్ఎస్ మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు.
- సుప్రీంకోర్టు లాయర్లకు, రాజకీయ పార్టీలను అంటగట్టడం సరికాదని, గతంలో ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులో అటార్నీ జనరల్‌గా ఐదేళ్లు పనిచేసిన విషయాన్ని మాజీ ఎంపీ వినోద్ గుర్తు చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్‌తో కలిసి వినోద్ మీడియాతో మాట్లాడారు.
- కవితకు బెయిల్ రావడంపై కాంగ్రెస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు దేవీ ప్రసాద్, పల్లె రవికుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు.
- సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని రెండు రాజకీయ పార్టీల ఒప్పందంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడిన మాటలు.. ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు.
- బీజేపీతో పొత్తులో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని కాంగ్రెస్ నేతలు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు.
- ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇవ్వడంలో కాంగ్రెస్, బీజేపీలకు అభ్యంతరం ఏమిటని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు.
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడంపై మాజీ ఎమ్మెల్యే కాంత్రికిరణ్ హర్షం వ్యక్తం చేశారు.

కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన రాజాసింగ్, పాయల్‌శంకర్





సాక్షి, హైదరాబాద్: కవితకు బెయిల్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కోర్టు ధిక్కారం కిందకు వస్తాయని మాజీ మంత్రి కేటీ రామారావు పేర్కొనడాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు టి.రాజాసింగ్, పాయల్‌శంకర్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. సంజయ్ చేసిన ట్వీట్‌లో తప్పేముందని రాజాసింగ్ ప్రశ్నించారు. కవితకు బెయిల్ ఇవ్వాలని వాదించిన వ్యక్తికి కాంగ్రెస్ రాజ్యసభ టికెట్ ఇచ్చింది వాస్తవం కాదా అని నిలదీశారు. 38 మంది ఎమ్మెల్యేలున్నా రాజ్యసభకు బీఆర్ఎస్ తరఫున నామినేషన్ ఎందుకు వేయలేదో కేశవరావు ఎంపీ పదవికి రాజీనామా చేస్తే ఆ సీటును కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యక్తికి ఎందుకివ్వలేదో సమాధానం చెప్పగలవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం కావడం తథ్యం అని రాజాసింగ్ పేర్కొన్నారు. పాయల్‌శంకర్ స్పందిస్తూ...కేటీఆర్ చదువుకున్న అజ్ఞాని. సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సంజయ్ వ్యతిరేకించలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేననే విషయాన్ని బహిర్గతం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ 'క్విడ్ ప్రో కో'రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? సంజయ్ చేసిన ట్వీట్‌లో తప్పేముంది?'అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ విలీనమే మిగిలింది!

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై కాంగ్రెస్ నేతల ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు లిక్కర్ స్కాంలో బెయిల్ లభించడంపై అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ విమర్శలకు దిగింది. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు అంగీకరించడంతోనే కవితకు బెయిల్ వచ్చిందని, ఈ ఘటనతోనే బీఆర్ఎస్, బీజేపీల బంధం బయటపడిందని ఆరోపించింది. పార్టీని విలీనం చేస్తామంటూ ఢిల్లీ బీజేపీ పెద్దల వద్ద ఆపద మొక్కులు మొక్కి ఎమ్మెల్యేలతో పరేడ్ చేయించిన తర్వాతే కవితకు బెయిల్ లభించిందని, ఇక, బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేశారు.

ఇళ్ల చుట్టూ తిరిగి కాళ్ల మీద పడ్డారు...

కవితకు బెయిల్ రావడం ఊహించిందేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీల కుమ్మక్కు రాజకీయా లను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. టీఎస్‌డబ్ల్యూ ఎఫ్‌సీసీ చైర్మన్ బండ్రు శోభారాణి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులందరూ కలిసి ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం ముందు పరేడ్ చేసి బెయిల్ తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీతో బీఆర్ఎస్ చేసుకున్న ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని వ్యాఖ్యానించారు.

విద్యార్థులకు నష్టంరాకుండా సమయం ఇస్తున్నాం

ఒవైసీ అయినా, మల్లారెడ్డి అయినా అందరికీ ఒకటే రూల్: హైడ్రా కమిషనర్



సాక్షి, హైదరాబాద్: చాంద్రాయణగుట్ట సలకం చెరువులోని ఫాతిమా ఒవైసీ కాలేజీకి సంబంధించిన అక్రమ కట్టడాలు తొలగించేందుకు సమయం ఇస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యా సంస్థలు కాబట్టి అకడమిక్ ఇయర్ మధ్యలో చర్యలు తీసుకుంటే విద్యార్థులకు నష్టం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు రోడ్డున పడకూడదని మాత్రమే ఆలోచిస్తున్నామన్నారు. ఈలోపు వాళ్లకు వాళ్లుగా తొలగించకపోతే హైడ్రానే చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఒవైసీ అయినా, మల్లారెడ్డి అయినా అందరికీ ఒకటే రూల్ అని స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

తెలంగాణ తల్లి విగ్రహ స్థాపనకు నేడు భూమి పూజ

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు బుధవారం ఉదయం 11 గంటలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎమ్మెల్సీలు హాజరుకానున్నారని రాష్ట్ర వెనుకబడిన తరగతుల, రవాణా శాఖమంత్రి పొన్నం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు స్థలాన్ని ఇప్పటికే సీఎం పరిశీలించారని, ఆ స్థలంలోనే విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 9న భారీ సమావేశం ఏర్పాటు చేసి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామని పొన్నం చెప్పారు. తెలంగాణ తల్లి ఎలా ఉండాలో ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

మరో పదేళ్లు మాదే అధికారం: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నేతలు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా వచ్చే పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రజాకంటక పాలనకు విసుగు చెందే బీఆర్‌ఎస్‌ను ఓడించి తమను అధికారంలోకి తీసుకొచ్చారనే విషయం గుర్తు పెట్టుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీపై అసత్యాలు ప్రచారం చేస్తూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాన్ని మానుకోకపోతే మీకే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. సాంకేతిక కారణాల వల్ల అర్హులైన రైతులకు మాఫీ జరగకపోతే వాళ్లకు తప్పక న్యాయం చేస్తామని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు.

బీసీలకు 42% కోటాపై చట్టం ఎందుకు చేయడం లేదు?

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం ఎందుకు చేయలేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. తాము అధికారానికి వస్తే ఈ రిజర్వేషన్లు పెంచుతామంటూ కామారెడ్డి డిక్లరేషన్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ ఇచ్చిన హామీ అమలు ఏమైందని నిలదీశారు. హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. రాహుల్, కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తున్న తీరును తిప్పికొట్టి, వారికి బుద్ధి చెప్పేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 27 కులాలను సెంట్రల్ ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కేంద్రం త్వర లోనే చర్యలు చేపడుతుందని తెలిపారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనందగౌడ్ అధ్యక్షతన జరిగిన భేటీలో పార్టీ నేతలు కాసం వెంకటేశ్వర్లు, గౌతమ్‌రావు, నందనం దివాకర్, ఉపాధ్యక్షుడు సంజయ్ ఘనాతే పాల్గొన్నారు.

మేత కోసం వెళ్తుంటే అటవీ అధికారులు దాడి చేస్తున్నారు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల మేత కోసం అడవిలోకి వెళ్తుంటే అటవీ అధికారులు తమను అడ్డుకుంటున్నారని, దాడులు చేస్తున్నారని పీసీసీఎఫ్ డోబ్రియాల్‌కు గొర్రెల పెంపకం దారులు ఫిర్యాదు చేశారు. మంగళవారం అరణ్యభవన్‌లో పాలమూరు కురుమ సంఘం ఆధ్వర్యంలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. అడవుల లోపలికి వెళ్లొద్దని, బయటే మేత వంటివి చూసుకోవచ్చని పీసీసీఎఫ్ వారికి చెప్పారు. రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లోకి వెళ్లి వంట కోసం అగ్గి రాజేయడం, ఫారెస్ట్ బఫర్ జోన్లలోకి వెళ్లే మేకలు, మనుషులపై పులులు దాడులు చేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. అడవుల్లో మేకల మేత కోసం చెట్లను కొట్టడం వంటివి చేయొద్దని సూచించారు. తాము గొర్రెలనే పెంచుతామని, మేకలు లేవని వారు సమాధానమిచ్చారు. అడవుల్లోకి వెళ్లినపుడు ఏవైనా జంతువుల దాడులు వంటివి జరిగితే తాము కేంద్రానికి, ప్రభుత్వాలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని పీసీసీఎఫ్ తెలిపారు. వర్షాకాలంలో పిడుగురాళ్ల నుంచి తాము తెలంగాణకి వస్తుంటామని, ఆంధ్ర, తెలంగాణలో ఆయా సీజన్లను బట్టి వెళ్తున్నందున తమ గొర్రెలకు మేతకు అనుమతించాలని కురుమ సంఘం నేతలు కోరారు.

- చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై హైడ్రా ప్రత్యేక దృష్టి.. ఈ ప్రాంతాల్లోని అన్ని నిర్మాణాలు కూల్చివేత
- స్థలాల కొనుగోలుపై గందరగోళంలో సామాన్య ప్రజలు
- వీరికి ఉపయుక్తంగా ఉండేలా త్వరలో అందుబాటులోకి హైడ్రా యాప్
- ఎక్కడ నిల్చుని ఓపెన్ చేస్తే ఆ ప్రాంతం వివరాలు ప్రత్యక్షం



నిల్చున్న చోటే నిగ్గుతేల్చే యాప్!

హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్‌లో ఉంచినా..

సాక్షి, హైదరాబాద్: ఏ చెరువు పరిధి ఎక్కడి దాకా ఉంది? దాని ఫుల్ ట్యాంక్ లెవల్ ఎంత వరకు? బఫర్ జోన్ ఏ మేరకు విస్తరించి ఉంది? తెలుసుకోవడం ఎలా?.. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని ఆక్రమణలపై అనునిత్యం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కొరడా ఝళిపిస్తున్న నేపథ్యంలో స్థలం, ఇల్లు, ఫ్లాట్ కొనాలని భావిస్తున్న సామాన్యుడికి వస్తున్న సందేహాలు ఇవి. బడా బాబులు, రియల్టర్లు, వ్యాపారుల మాదిరిగా వీరికి సమాచారం సేకరించే నెట్‌వర్క్ ఉండదు. దీంతో ఏమాత్రం తొందరపడి ముందడుగు వేసినా నిండా మునిగిపోతామనే భయం ప్రస్తుతం ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఔటర్' పరిధిలోని చెరువులకు సంబంధించిన సమాచారంతో ఓ యాప్ అందుబాటులోకి తీసుకురానున్నారు.

రాజధానితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న చెరువులకు సంబంధించిన సమస్త సమాచారం ఇప్పటికే హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) వద్ద ఉంది. ఈ విభాగం ప్రతి చెరువు, కుంట, ట్యాంక్‌కు ప్రత్యేక ఐడీ సైతం జారీ చేసింది. దానికి సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల లెక్కలతో పాటు వీటిని గుర్తిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్ వివరాలనూ క్రోడీకరించింది. ఈ వివరాలన్నింటినీ మ్యాపులతో సహా అధికారిక వెబ్‌సైట్ (https:// lakes. hmda. gov. in)లో అందుబాటులో ఉంచింది. అయితే ఈ వివరాలు పూర్తి సాంకేతిక పదజాలంతో ఉండటంతో సామాన్యుడికి అర్థమయ్యే పరిస్థితి లేదు. లెటిట్యూడ్, లాంగిట్యూడ్, లాటిట్యూడ్... ఇలా సాంకేతిక పరిభాష, అంకెలతో ఉన్న ఆ వివరాలను డీ కోడ్ చేయాలంటే సాధారణ ప్రజలు నిపుణుల సహాయం తీసుకోవాల్సివస్తోంది. లేనిపక్షంలో తాను ఖరీదు చేయబోతున్న ప్రాంతం వివరాల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

వివరాలన్నీ సరళంగా అందుబాటులో..

అదే సమయంలో ప్రస్తుతం హెచ్‌ఎండీఏ వద్ద అందుబాటులో ఉన్న వివరాలన్నింటినీ సరళంగా మార్చి హైడ్రా కోసం రూపొందించే ప్రత్యేక వెబ్‌సైట్‌తో పొందుపరచాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆక్రమణలు సహా వివిధ అంశాలపై ఫిర్యాదులు చేయడానికి వాట్సాప్ నంబర్, ఈ-మెయిల్ ఐడీలతో పాటు యాప్‌ను హైడ్రా అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులోనే జియో ట్యాగింగ్ డేటాను పొందుపరుస్తారు. అవసరమైతే ఈ విషయంలో గూగుల్ మ్యాప్స్ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న ఎవరైనా ఓ ప్రాంతంలో నిల్చుని యాప్‌ను ఓపెన్ చేస్తే.. ఆ ఏరియా ఏదైనా చెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల కిందికి వస్తుందా? అనేది స్పష్టంగా కనిపిస్తుంది. భవిష్యత్తులో ప్రభుత్వ భూములు, పార్కులు తదితరాలనూ ఈ యాప్‌లోకి తీసుకురావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ భావిస్తున్నారు. నగరంలో ఉన్న చెరువుల్లో సర్వే, ప్రిలిమినరీ నోటిఫికేషన్, ఫైనల్ వెరిఫికేషన్ ప్రక్రియలు పూర్తయినవి 54 ఉన్నాయి. వీటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై స్పష్టత ఉండటంతో తొలిదశలో వీటికే జియో ఫెన్సింగ్ చేయించనున్నారు.

జియో ఫెన్సింగ్‌తో పరిరక్షించనున్న హైడ్రా

→ సువిశాలంగా విస్తరించి ఉన్న నగరంలోని కొన్ని చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలపై నిఘా ఉంచడానికి డ్రోన్లు, సీసీ కెమెరాలు, గార్డుల వ్యవస్థ సైతం సరిపోదు. ఈ నేపథ్యంలో కీలకమైన వాటిని పరిరక్షించడానికి జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేయడానికి హైడ్రా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికోసం నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్‌ఆర్‌ఎస్‌ఏ), అడ్వాన్స్‌డ్ డేటా ప్రాసెసింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అడ్రిన్) సహా మరికొన్ని సంస్థలతో సంప్రదింపులు జరపనున్నారు. వీరి సహకారంతో ఉపగ్రహాల ద్వారా ఆయా చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల హద్దులను పక్కాగా గుర్తించడంతో పాటు వాటికి జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఎవరైనా ఆ పరిధిలోకి వెళ్లి పూడ్చటానికి, నిర్మాణాలు చేపట్టడానికి సహా ఏ ఇతర ప్రయత్నం చేసినా ఆ కార్యకలాపాలను జియో ఫెన్సింగ్ ఆధారంగా శాటిలైట్లు గుర్తిస్తాయి. వెంటనే ఆ సమాచారాన్ని హైడ్రా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)తో పాటు కీలక అధికారులకు అందిస్తూ అప్రమత్తం చేస్తాయి.

అతివకు అండగా..

మీ సమస్యను 8977794588కు వాట్సాప్ చేయండి



ఆడ బిడ్డ.. ఇంటి నుండి బయటికొస్తే అడుగడుగునా వంకరచూపులే. బస్టాపు మొదలు కాలేజీ, కార్యాలయం, కార్ఖానా.. ప్రదేశం ఏదైనా అవకాశం దొరికితే వెకిలి చేష్టలు, వేధింపులు.. డబుల్ మీనింగ్ డైలాగులతో టార్చర్. ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నా..సెల్‌ఫోన్‌కు అసభ్య సందేశాలు, ప్రేమ పేరుతో పలకరింపులు, వద్దని తిరస్కరిస్తే ఫొటోల మార్ఫింగ్‌లతో బ్లాక్‌మెయిలింగ్‌లు. ఇవీ.. పల్లె, పట్టణం, నగరం అనే తేడా లేకుండా నేటి మహిళను వెంటాడుతున్న అతిపెద్ద సమస్యలు. భయం, కుటుంబ పరువు ,ప్రతిష్ట, గౌరవం దృష్ట్యా అనేక మంది ఈ నిత్య వేధింపులను భరిస్తున్నారు. షీ టీమ్స్ లేదా పోలీసుల వద్దకు వచ్చి నిర్భయంగా ఫిర్యాదు చేస్తున్నవారు కొందరే. అందుకే 'సాక్షి' ఇక మీ నేస్తం అవుతోంది. ఇంటా బయట, చదివే చోట, పని ప్రదేశంలో, ప్రయాణంలో, చివరకు 'నెట్'ఇంట్లో.. ఇలా ఎక్కడ, ఎలాంటి వేధింపులు ఎదురవుతున్నా 8977794588 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలపండి. మీ సమస్యల్ని 'సాక్షి' తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీ శిఖా గోయల్ దృష్టికి తీసుకెళ్తుంది. మూడో కంటికి తెలియకుండా మీ సమస్యకు పరిష్కారం చూపుతుంది. భయం వీడండి..ధైర్యంగా ముందుకు కదలండి. వేధింపుల నుంచి విముక్తి పొందండి.

మీతో సాక్షి

నోట్: పేరు, వివరాలు గోప్యంగా ఉంచాలని కోరితే.. వారి అభిప్రాయాలను 'సాక్షి' గౌరవిస్తుంది

5, 6 తేదీల్లో హెచ్‌ఐసీసీలో 'గ్లోబల్ ఏఐ సమిట్': మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధస్సు సాంకేతికతకు ప్రపంచ రాజధానిగా హైదరాబాద్‌ను నిలబెడతామని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. అందులో భాగంగా వచ్చే నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో 'తెలంగాణ గ్లోబల్ ఏఐ సమిట్-2024'ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. అనేక క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం చూపే అపార సామర్థ్యం కృత్రిమ మేధస్సు (ఏఐ)కు ఉందన్నారు. ఏఐ ద్వారా నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనంతో మానవాళికి సేవలు అందించాలని సూచించారు. విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తల నడుమ సహకారాన్ని పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్‌బాబు ప్రకటించారు. నైపుణ్య విశ్వవిద్యాలయం, ఏఐ సిటీలో హైసియాతో తమ ప్రభుత్వం కలిసి పనిచేస్తుందన్నారు. భవిష్యత్‌లో వివిధ రంగాలపై ఏఐ ప్రభావం చూపనుండటంతో ప్రభుత్వం కూడా ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు చొరవ తీసుకోవడం హర్షణీయమని హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెళ్ల అన్నారు. గ్లోబల్ ఏఐ సమ్మిట్ నిర్వహణలో హైసియా తన వంతు పాత్రను పోషిస్తుందని చెప్పారు. టాస్క్, టీ-హబ్, టీఎస్ఐసీ, ఇతర కీలక ప్రభుత్వ సంస్థల సహకారంతో ఏఐ రంగంలో 10 వేలకు పైగా మంది విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని యోచిస్తున్నట్లు ప్రశాంత్ వెల్లడించారు.

తొలిసారి అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్

- సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహణ
- స్టార్టప్‌లకు ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారాలు కనుగొనడమే లక్ష్యం



ఐఎస్ఎఫ్-2024 కార్యక్రమాల ప్లకార్డులతో నిర్వాహకులు

రాయదుర్గం: అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌ను తొలిసారి భాగ్యనగరంలో నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు 'ఏఐ యుగంలో ఆవిష్కరణలు, వ్యవస్థాపకత' అనే అంశంపై ఈ ఫెస్టివల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో నిర్వహించనున్నట్లు హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో జరిగిన సమావేశంలో నిర్వాహకులు ప్రకటించారు. ఐఎస్ఎఫ్ కోసం ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్, కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్టార్టప్‌లకు ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారాలను కనుగొనే లక్ష్యంతో అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని ఐఎస్ఎఫ్ చైర్మన్, కన్వీనర్ జేఏ చౌదరి పేర్కొన్నారు. ఐఎస్ఎఫ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ శివమహేష్ టంగుటూరు మాట్లాడుతూ ఐఎస్ఎఫ్‌లో దేశవిదేశాలకు చెందిన 50 వేల స్టార్టప్‌లు పాల్గొంటాయని, టాప్-100 స్టార్టప్‌లు ఫైనలిస్టులుగా ఎంపికవుతాయని చెప్పారు. ఈ సమావేశంలో కలారి క్యాపిటల్ ఎండీ రాజేష్‌రాజు, ఆర్కా మీడియా వర్క్స్ వ్యవస్థాపకుడు శోభు యార్లగడ్డ, యాంట్‌హిల్ వెంచర్స్ సీఈఓ ప్రసాద్ వంగా, 'ఎండియా పార్ట్‌నర్స్' ఎండీ సతీష్ ఆంధ్రా, ఎన్‌టీటీడేటా కంట్రీ హెడ్ సంజీవ్ దేశ్‌పాండే, పేప్‌స్టోన్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీధర్ రాంపల్లి, సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ కో-ఫౌండర్ విక్రాంత్ వర్షిణే, టీ-హబ్ సీఈవో శ్రీనివాసరావు మహంకాళి పాల్గొన్నారు.

చెరువు పరిధిలో భవనం నిర్మించలేదు

నిబంధనలకు విరుద్ధమని హైడ్రా నిర్ధారిస్తే నేనే కూల్చేస్తా

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: హిమాయత్‌సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో తాను భవనం నిర్మించుకున్నట్లు వచ్చిన ఆరోపణలను ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తోసిపుచ్చారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'కొత్వాల్‌గూడ సర్వే నంబర్ 13లో నా కుమారుడి పేరున 14.14 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూములను 1999లో కొన్నాం. అన్ని విభాగాల నుంచి అనుమతి తీసుకొని 2000 సంవత్సరంలో చిన్న భవన నిర్మాణం చేపట్టాం. చుట్టూ కాంపౌండ్ వాల్ కూడా కట్టలేదు. భవన నిర్మాణంపై అప్పట్లోనే విమర్శలు వస్తే నిజనిర్ధారణ కోసం నాటి కలెక్టర్‌ను అభ్యర్థించా. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే చేసి మా భవనం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో లేదని నిర్ధారించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయాల్సిన అవసరం నాకు లేదు. ఈ నిర్మాణంపై చెప్పుడు మాటలు విని కేటీఆర్ విమర్శలు చేస్తున్నారు. హైడ్రా నుంచి ఇప్పటివరకు నాకు ఎలాంటి నోటీసులు రాలేదు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించినట్లు హైడ్రా నిర్ధారిస్తే మా నిర్మాణాన్ని మేమే కూల్చేసుకుంటాం. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా' అని మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

రాజ్యసభకు సింఘ్వీ ఏకగ్రీవ ఎన్నిక

ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న కాంగ్రెస్ నేత నిరంజన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి ఎమ్మెల్యేల కోటాలో రాజ్యసభకు కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ స్థానం కోసం రెండు నామినేషన్లు దాఖలైనప్పటికీ మరో నామినేషన్ దాఖలు చేసిన పద్మరాజన్ అనే వ్యక్తిని ఎమ్మెల్యేలు బలపర్చకపోవడంతో స్క్రూటినీలో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని మంగళవారం అసెంబ్లీలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి చేతుల మీదుగా టీపీసీసీ ఎన్నికల సమన్వయకర్త జి.నిరంజన్ అందుకున్నారు.

బుల్కాపూర్ నాలా మాయం!

▶ మొదటి పేజీ తరువాయి

పోయింది. మాజీ మంత్రి కేటీఆర్ సన్నిహితునిదిగా చెబుతున్న జన్వాడ ఫాంహౌస్ ప్రధాన గేటు, ప్రహరీ ఈ నాలాపై నిర్మించినట్లు 2020 జూన్‌లోనే ఇరిగేషన్ అధికారులు నిర్ధారించారు. సర్వే నంబర్ 301, 302, 309, 311, 313లో దాదాపు 27 ఎకరాల్లో ఈ ఫాంహౌస్ ఉంది. ఇందులో అక్రమ నిర్మాణాలతో పాటు 2.24 ఎకరాల నాలా, 11 గుంటల బఫర్ జోన్ ఉన్నట్లు ధ్రువీకరించారు. ఫాంహౌస్ తూర్పు భాగంలో, నాలా, బఫర్ జోన్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. తాజాగా నాలా ఎంత మేర కబ్జాకు గురైందనే అంశాన్ని నిర్ధారించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని, కొలతలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా ఆయా విభాగాల అధికారులు బుధవారం మరోసారి జన్వాడను సందర్శించే అవకాశం ఉందని తెలిసింది.

గతంలో రేవంత్‌పై కేసు, అరెస్టు

సీఎం రేవంత్‌రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జన్వాడ ఫాంహౌస్ సందర్శనకు వెళ్లారు. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నివసిస్తున్న ఈ ఫాంహౌస్‌పై డ్రోన్లు ఎగరేశారనే ఆరోపణలతో అప్పట్లో రేవంత్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు కూడా చేశారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఇటీవల చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో హైడ్రాను తెరపైకి తీసుకురావడం తెలిసిందే. ఇదే క్రమంలో జన్వాడ ఫాంహౌస్‌కు నోటీసులు జారీ చేయగా, హైడ్రా చర్యలను ఆపాల్సిందిగా కోరుతూ కేటీఆర్ సన్నిహితుడు బి.ప్రదీప్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో నిబంధనల మేరకు నడుచుకోవాలని కోర్టు ప్రభుత్వానికి సూచించింది.

మళ్లీ 'ప్రజాపాలన'

▶ మొదటి పేజీ తరువాయి

చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవా రం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఇక నుంచి రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింకు ఉండదని, వేర్వేరుగా రెండు కార్డులు జారీ చేస్తామని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17 నుంచి నిర్వహించే ప్రజాపాలనలో ఇదే ఎజెండాగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి అవసరమైన వివరాలు సేకరించాలని.. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణాల్లోని ప్రతి వార్డులో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయా లని ఆదేశించారు. డిజిటల్ హెల్త్ కార్డుల విషయంలో ఫ్రాన్స్‌లో ఉత్తమమైన విధానాన్ని అనుసరిస్తున్నారని ఇటీవల విదేశాల పర్యటనకు వెళ్లినప్పుడు తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని.. అక్కడ అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇకపై రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలతోపాటు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అందించే సాయానికి ఈ డిజిటల్ హెల్త్ కార్డే ప్రామాణికంగా ఉంటుందని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక కార్యాచరణ

రాష్ట్రంలో డెంగీ, చికున్‌గున్యా, ఇతర వైరల్ జ్వరాల కేసులు పెరుగుతున్న అంశంపై సమావేశంలో సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలన కోసం ఫాగింగ్, రసాయనాల స్ప్రే వంటి కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని, ఈ ప్రక్రియ ఎలా జరుగుతుందో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని సూచించారు. పనిచేయని ఉద్యోగులు, ప్రజల ఆరోగ్యం పట్ల ఉదాసీనంగా వ్యవహరించే సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లడం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. డెంగీ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులకు సూచించారు.



“ వస్తువుల పట్ల ఉండే వ్యతిరేకత మనం ఇష్టపడే వస్తువుల్లాగే మనల్ని మరో విధంగా అదుపు చేస్తుంది. కాబట్టి 'వస్తువులకు బందీ అవటం' అంటే వాటిపట్ల రాగం, ద్వేషం... రెంటినీ తెలియజేస్తుంది.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 28 ఆగస్టు 2024

మాయరోగం... మరోసారి!

అవును... మళ్ళీ మరో మాయరోగం బయటకొచ్చింది. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మంకీపాక్స్ (ఎంపాక్స్) తాజాగా విజృంభించింది. స్వీడన్ నుంచి పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ దాకా అనేక ప్రాంతాలకు విస్తరించింది. ఫలితంగా, ప్రపంచం మరోసారి ఉలిక్కిపడింది. దీన్ని ఆందోళన చెందాల్సిన అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా రెండేళ్ళలోనే రెండోసారి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకటించాల్సొచ్చింది. భారత్ సైతం ఎయిర్‌పోర్ట్‌లు, ఆస్పత్రుల్ని అప్రమత్తం చేసి, కాంగో సహా మధ్య ఆఫ్రికా దేశాల నుంచి వస్తున్న ప్రయాణికుల ఆరోగ్యంపై కన్నేసింది. మాస్కుల ధారణ, చేతుల పరిశుభ్రత, గుంపుల్లో తిరగకపోవడం లాంటి ముందుజాగ్రత్తలే శ్రీరామ రక్ష అని మంకీపాక్స్ మరోసారి గుర్తుతెచ్చింది. తరచూ తలెత్తుతున్న ఈ వైరస్‌ల రీత్యా ఔషధ పరిశోధన, ఆరోగ్య వసతుల కల్పనపై మరింత పెట్టుబడి పెట్టాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది.

ప్రపంచంపై ఎంపాక్స్ పంజా విసరడం ఇప్పటికిది మూడోసారి. అసలు 15 నెలల పైచిలుకు క్రితం ఇది ఇక ఆందోళన చెందాల్సినది కాదని డబ్ల్యూహెచ్ఓ తేల్చింది. తీరా ఇటీవల కొద్ది వారాలుగా వైరస్ పునర్ విజృంభణతో ఆగస్ట్ 14న మరోసారి అత్యవసర పరిస్థితిని ప్రకటించాల్సి వచ్చింది. దీనికి కారణం లేకపోలేదు.2023 సెప్టెంబర్ నుంచి కేసులు పెరుగుతున్నాయి. పైగా గతంలో 2022–23లో ప్రపంచాన్ని చుట్టుముట్టినప్పటితో పోలిస్తే, ఈసారి జన్యుపరంగా విభిన్నమైన వైరస్ (క్లాడ్ 1బి వేరియంట్) దీనికి కారణమవుతోంది. ఈ సాంక్రమిక వ్యాధి గతంలో ఒకరి నుంచి మరొకరికి లైంగిక సంపర్కం ద్వారానే వ్యాపించేది. కొత్త వేరియంట్ ఇప్పుడు రోగితో స్పర్శ, దగ్గరగా మాట్లాడడం, రోగి వాడిన దుస్తులు, దుప్పట్లు వాడడం ద్వారా కూడా వ్యాపిస్తున్నట్టు నిపుణుల మాట. మరణాల రేటూ మునుపటి కన్నా పెరిగింది. ఈ ఒక్క ఏడాదే 116కి పైగా దేశాల్లో 15,600కి పైగా కేసులు నమోదయ్యాయి. 500 పైచిలుకు మంది ప్రాణాలు కోల్పోయారు. ఆఫ్రికాలో నిరుటితో పోలిస్తే ఇప్పుడు మరణాలు 160 శాతం పెరిగాయి. ప్రపంచంలో దాదాపు 70 లక్షల మందికి పైగా మరణానికి కారణమైన కోవిడ్ లానే మంకీపాక్స్‌కూ జనం భయపడుతున్నది అందుకే!

ఏడాది క్రితం అత్యవసర పరిస్థితిని ఎత్తివేసినప్పుడే ఎంపాక్స్‌పై దీర్ఘకాలిక నిఘా, నియంత్రణ ప్రణాళికలు అవసరమని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. ఈ వ్యాధి సాంక్రమిక రోగ విజ్ఞానంపై ఇంకా పూర్తిగా అవగాహన లేదంటూ ప్రజారోగ్య నిపుణులు, వైరస్ శాస్త్రవేత్తలు సైతం హెచ్చరించారు. అయినా సరే ఈ రోగాన్ని కనిపెట్టే పరీక్షల్ని మెరుగుపరచడం, టీకాలు – యాంటీ వైరల్ మందులకు సంబంధించి క్లినికల్ పరీక్షలపై దృష్టి పెట్టడం, టీకాల తయారీని విస్తరించడం లాంటి చర్యలేవీ ఆచరణలో పెట్టలేదు. ఈ అంతర్జాతీయ నిర్లక్ష్యమే ఇప్పుడు శాపమైంది. ఇవాళ్టికీ మంకీపాక్స్‌కు టీకాల సరఫరా పరిమితం. నియంత్రణకు కోటి డోసుల అవసరం ఉంటే, 2.1 లక్షల డోసులే తక్షణం అందుబాటులో ఉన్నాయట. డోసులు దానం చేస్తామని యూరోపియన్ యూనియన్, అమెరికాలు వాగ్దానం చేశాయి కానీ, వ్యాక్సిన్‌లపై ఇప్పటికీ కొన్ని అధికాదాయ దేశాల గుత్తాధిపత్యమే సాగుతోంది. అత్యవసరంలో ఉన్న అనేక దేశాలకు అది పెద్ద దెబ్బ. ఆఫ్రికాలో అవసరమున్నా యూరోపియన్ దేశాల్లోనే టీకాలను మోహరించడమే అందుకు ఉదాహరణ. కోవిడ్ కాలంలో లానే ఇప్పుడూ పేదదేశాలకు సాంకేతికత బదలాయింపు జరగట్లేదు. టీకాలకై పెనగులాట తప్పట్లేదు. మహమ్మారుల కట్టడికి ఒక సమానత్వ ఒప్పందంపై ప్రపంచ దేశాలు విఫలమైతే దెబ్బతినేది ప్రజారోగ్యమే!

మన దేశంలోనూ ఈ ఏడాది మంకీపాక్స్ కేసులు బయటపడ్డాయి. ప్రస్తుతం యాక్టివ్ కేసులేవీ లేవనీ, మన దగ్గర ఇది పెద్దయెత్తున రాకపోవచ్చనీ అంచనా. అయినా అప్రమత్తత తప్పదు. కేంద్రం ఇప్పటికే ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిపి, చర్యలు ప్రారంభించింది. రోగ నిర్ధారణ వసతులతో పాటు, ఆరోగ్య బృందాల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తోంది. అక్కడితో ఆగకుండా ప్రజల్లో చైతన్యం కల్పించాలి. రాష్ట్రాలతో అన్ని రకాల కీలక సమాచారాన్ని పంచుకోవాలి. నిజానికి, ఇలాంటి వైరస్‌ల విజృంభణ వేళ వ్యవహరించాల్సిన తీరుపై కోవిడ్ విలువైన పాఠాలే నేర్పింది. ఇన్‌ఫెక్షన్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అలాగే, కేసుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలి. ప్రాథమిక అంశాలే అనిపించినా, ఇవే అతి ముఖ్యం. కోవిడ్‌లో లాగా కాక ఈసారైనా రోగ నిర్ధారణ కిట్లు, టీకాలు వర్ధమాన దేశాలకు సక్రమంగా చేరితేనే ఉపయోగం.

సరిహద్దులు దాటి సులభంగా విస్తరించే ఇలాంటి మాయదారి రోగాలను కట్టడి చేయాలంటే అన్నిచోట్లా సమస్థాయిలో ప్రయత్నాలు జరగడం కీలకం. వ్యాధి సోకిన, సోకే అవకాశం ఉన్న వర్గాలన్నిటికీ టీకాలు అందుబాటులో ఉంచి, సంరక్షణ చేపట్టేలా ఆర్థిక, విధానపరమైన అండదండలు కావాలి. సత్వర, కీలక చర్యలు చేపట్టడమే ముఖ్యమనేది కోవిడ్ నేర్పింది. అందులోనూ ఇలాంటి మాయరోగాలకు ముకుతాడు వేయాలంటే, తొలి 100 రోజుల్లోని ఆచరణే అతి ముఖ్యం. ఎప్పటికప్పుడు స్వరూప స్వభావాల్ని మార్చుకుంటున్న ఎంపాక్స్ ఆఫ్రికా సమస్య, కేసులు బయటపడ్డ కొన్ని దేశాల తలనొప్పి అనుకుంటే పొరపాటు. ఇది ప్రపంచానికే ముప్పు అని ముందు గుర్తించాలి. 'ఇది మరో కరోనా కాదు' అంటూ డబ్ల్యూహెచ్ఓ అంటున్నా, వైరస్ విజృంభణ ధోరణులు భయపెడుతున్నాయి. టీకాలు, చికిత్సలు లేకుండా ఆఫ్రికా దేశాలను వాటి ఖర్మానికి వదిలేయడం దుస్సహం. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలూ సమన్వయంతో కట్టడికి కృషి చేయాలి. అత్యవసర ఆరోగ్య పరిస్థితి అని ప్రకటించడంలోని అసలు ఉద్దేశం అదే! జంతుజాల వైరస్‌లు పదే పదే ఎందుకు తలెత్తుతున్నాయో దృష్టి పెట్టాల్సి ఉంది. విస్మరిస్తే మనకే కష్టం, నష్టం. పారాహుషార్!

ఖాతాలు ఇచ్చిన ధీమా

అభిప్రాయం



వి. అనంత నాగేశ్వరన్

ప్రధాని నరేంద్ర మోదీ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 2014 ఆగస్ట్ 15న 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' పథక ప్రకటన చేశారు. ఈ పథకానికి ఇప్పుడు పదో వార్షికోత్సవం జరుపుకొంటున్నాం. ఆర్థిక వ్యవస్థకు వెలుపలే ఉండిపోయిన కోట్లాది మందిని అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తెచ్చే ప్రతిష్ఠాత్మక, సవాలుతో కూడిన చర్యను అప్పటి కొత్త ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టింది. అందులో అది అద్భుతమైన విజయం సాధించింది. 2024 ఆగస్టు 14 నాటికి 53.13 కోట్ల మంది జన్ ధన్ యోజన లబ్ధిదారులుగా ఉండగా, వారు జమచేసిన మొత్తం రూ.2.31 లక్షల కోట్లు అయింది. ఈ లబ్ధిదారుల్లో దాదాపు ముప్పై కోట్ల మంది మహిళలు ఉండటం గమనార్హం.

అధికారం, హోదా, పలుకుబడి లేదా భౌతిక సంపద – ఏదైనా సరే, మనం వాటిని ఆశించి, సాధించే దిశగా బలంగా కృషి చేస్తే మన విజయంతో మనమే సంతోషిస్తాం. కానీ ఆ విజయానందం కొద్దికాలమే నిలుస్తుంది. తర్వాత మన మనసు మరోదానికి మారుతుంది. సాధించినది అప్పటికి ఒక ప్రమాణంగా మారిపోతుంది. ఇంకా అంతుచిక్కకుండా ఉన్నది మరో అన్వేషణకో లేదా అశాంతికో కారణం అవుతుంది. ఇది చాలామంది మనుషులకు వర్తిస్తుంది. ప్రజా విధానాల విషయంలోనూ ఇదే విధానాన్ని మనం అవలంబిస్తున్నాం. నిర్దిష్ట విధానాలు లేదా చర్యలు తీసుకోవాలని మనం గళమెత్తుతున్నాం. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఒక దీర్ఘకాలిక సమస్యను పరిష్కరిస్తే, ఇక ప్రమాణాల స్థాయి మరింతగా పెరుగుతుంది. దాంతో సాధించిన విజయానికి తగిన గుర్తింపు లేకపోవడమేగాక, వ్యతిరేక భావనతో దిగువ స్థాయిలో యథాతథ స్థితి కొనసాగుతోంది. పదో వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్న ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) అలాంటి అంశాల్లో ఒకటి.

కోట్లాది మంది భారతీయులు ఆర్థిక వ్యవస్థకు వెలుపలే ఉండటం మీద చాలాకాలం మనం విచారం ప్రకటించాం. అందుకే వారిని అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తెచ్చే ప్రతిష్ఠాత్మక, సవాలుతో కూడిన చర్యను 2014లో అప్పటి కొత్త ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టింది. అందులో అది అద్భుత విజయం సాధించింది. 2024 ఆగస్టు 14 నాటికి 53.13 కోట్ల మంది జన్ ధన్ యోజన లబ్ధిదారులుగా ఉండగా, వారు జమచేసిన మొత్తం రూ.2.31 లక్షల కోట్లు అయింది. ఈ లబ్ధిదారుల్లో దాదాపు ముప్పై కోట్ల మంది మహిళలు ఉండటం గమనార్హం.

ముందుకు జరిగిన అభివృద్ధి

"2008లో ఆర్థిక సమ్మిళితత్వం, అధికారిక గుర్తింపు రెండూ తక్కువ స్థాయిలో ఉండడాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఓ దశాబ్దం క్రితం భారత్ అత్యంత తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంది. బ్యాంకు ఖాతాల గణాంకాలు, తలసరి జీడీపీతో సంబంధాల ఆధారంగా – భారత్ పూర్తి సాంప్రదాయక వృద్ధి ప్రక్రియలపైనే ఆధారపడి ఉంటే 80 శాతం మంది వయోజనులు బ్యాంకు ఖాతా సాధించడానికి 47 సంవత్సరాలు పట్టేదన్నది ఒక స్థూల అంచనా" అని 'బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్' పరిశోధకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు 'డిజిటల్ ఆర్థిక మౌలిక సదుపాయాల రూపకల్పన: భారత్ నుంచి పాఠాలు' (బీఐఎస్ పేపర్స్ నం.106, డిసెంబర్ 2019) శీర్షికతో ఉన్న ఒక పరిశోధనా పత్రం వెలువరించారు.



'బ్యాంకింగ్‌లో లేనివారిని బ్యాంకులతో అనుసంధానించడం: 280 మిలియన్ల కొత్త బ్యాంకు ఖాతాలు ఆర్థిక ప్రాప్యత గురించి ఏం చెప్తున్నాయి?' పేరుతో సెప్టెంబర్ 2023లో మరో పరిశోధనా పత్రం వెలువడింది. దొంగతనాల ముప్పు ఉన్న ప్రాంతాల్లో జన్ ధన్ యోజన ఖాతాల వినియోగం ఎక్కువగా ఉండడంతో, వారికి సంపాదనను కాపాడుకోవడంలో అవి దోహదపడ్డాయని ఈ పరిశోధన వెల్లడిస్తోంది. సాధారణంగా అధిక వడ్డీ రేట్లు వసూలు చేసే అనధికారిక వనరుల నుంచి రుణాలు తీసుకోవడాన్ని కూడా ఇది తగ్గించింది.

కానీ ఇది తక్షణ తీర్పులిచ్చే లోకం. మినహాయింపుల స్థాయిని దాటి ఆ తీరే ఒక ప్రామాణికంగా మారింది. పీఎంజేడీవై ఖాతాలు ఎక్కువగా 'జీరో బ్యాలెన్స్' ఖాతాలేనంటూ కొందరు విమర్శకులు ఎత్తి చూపారు. వాస్తవం ఏమిటంటే, ఈ ఖాతాలన్నింటిలో మొత్తం రూ.2.31 లక్షల కోట్లు జమ అయ్యాయి. ఈ ఖాతాల వల్ల ఉపయోగం ఎంత అమూల్యమైనదో కోవిడ్ విపత్తు సమయంలో రుజువైంది. ప్రయోజనాలను నేరుగా కేంద్ర ప్రభుత్వం ఈ ఖాతాలకు బదిలీ చేసింది. మూడు ఆర్థిక సంవత్సరాల్లో (2020 నుంచి 2022 వరకు), దాదాపు 8.1 లక్షల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాల పరిణామం వల్ల కోవిడ్ విపత్తు కీలక సమయంలో నగదురహిత చెల్లింపులను ఇది సులభతరం చేసింది.

సార్వత్రిక బ్యాంకింగ్‌ను సాధ్యం చేయడంతోపాటు, వినియోగదారు అనుమతితో ఆర్థిక సంస్థకు సమాచార బదిలీలను పీఎంజేడీవై సులభతరం చేసిందని తాజా పరిశోధన ('రుణ ప్రాప్యతను సార్వత్రిక బ్యాంకింగ్ విస్తరిస్తుందా?', ఆగస్టు 2024) వెల్లడిస్తోంది. మరీ ముఖ్యంగా పీఎంజేడీవై ఖాతాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫిన్ టెక్ నేతృత్వంలో రుణ వృద్ధి పెరిగింది. చౌక, మెరుగైన ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న ప్రాంతాలలో ఈ ప్రభావాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. 'ఖాతా సంకలనం' అన్నది సార్వత్రిక బ్యాంకింగ్ వ్యక్తీకరణ. ప్రజలు మరిన్ని ఆర్థిక ఉత్పత్తులు, సేవలు పొందడానికి ఇది వీలు కల్పిస్తుంది.

మహిళలకు స్వావలంబన

మహిళలకు సొంత ఖాతాలు, వాటిలో డబ్బులతో పీఎంజేడీవై వారికి సాధికారత కల్పించింది. ఈ ఆర్థిక స్వావలంబనను అంచనా వేయడం కష్టం. కానీ ఇది ముఖ్యమైనది. సాధారణంగా భారత మహిళలు ఎక్కువగా పొదుపు చేయడానికి ఇష్టపడతారు. క్రమంగా, అది కుటుంబాల ఆర్థిక భద్రతను, జాతీయ పొదుపు రేటును పెంచుతుంది. ఇంకా, అది దేశంలో మహిళా వ్యవస్థాపకతను పెంచుతుంది. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా ద్వారా వెల్లువెత్తిన వ్యవస్థాపకతలో మహిళల భాగస్వామ్యం చాలా ప్రోత్సాహకరంగా ఉంది. అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు స్టార్టప్ ఇండియానూ; మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి స్టాండప్ ఇండియా పథకాన్నీ ప్రభుత్వం ప్రారంభించింది. పీఎం ముద్ర యోజన కింద 68 శాతం రుణాలను మహిళా పారిశ్రామికవేత్తలకు మంజూరు చేయడం జరిగింది. స్టాండప్ ఇండియా పథకం కింద 2024 మే నాటికి లబ్ధిదారుల్లో 77.7 శాతం మంది మహిళలు ఉన్నారు. 2024 జూలై 30 నాటికి, 'ఉద్యమ్', 'యూఏపీ' పథకాలలో నమోదైన దేశంలోని మహిళల యాజమాన్యంలోని 'ఎంఎస్ఎంఈ'ల (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ)ల సంఖ్య 1.85 కోట్లకు పైగా ఉంది. పీఎంజేడీవై ఖాతాలు మహిళలను సాధికారులను చేసి, స్వయం ఉపాధి/వ్యవస్థాపకతల్లో ప్రవేశించేలా వారికి దోహదపడ్డాయన్న భావన గణనీయమైనది. ఇది అధికారిక పరిశోధనకు అర్హమైనది.

ఇక వ్యతిరేక భావనల సవాళ్లనూ పరిశీలిద్దాం. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన ద్వారా ఖాతాదారులకు లభించిన ప్రయోజనాల ఆధారాల నేపథ్యంలో వాటిని పరిశీలించడం అంత కష్టమేం కాదు. పీఎంజేడీవైని ప్రారంభించడంపై దూరదృష్టితో నిర్ణయం తీసుకుని, తక్కువ వ్యవధిలో దానిని విజయవంతంగా అమలు చేయలేకపోతే గనక గత దశాబ్దపు అభివృద్ధిలో భారత్ సాధించిన విజయాలు గణనీయంగా తక్కువగా ఉండేవి.

వ్యాసకర్త ఆర్థికవేత్త;
భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మలయ తుఫాను

జస్టిస్ హేమ కమిటీ నివేదిక విడుదలైన నేపథ్యంలో, తమ కార్యనిర్వాహక సభ్యుల మీద వచ్చిన లైంగిక ఆరోపణలకు 'నైతిక బాధ్యత' వహిస్తూ అధ్యక్షుడు మోహన్ లాల్‌తో సహా మొత్తం 'అమ్మ' (మలయాళ చలనచిత్ర నటీనటుల సంఘం) కార్యనిర్వాహక వర్గం రాజీనామా చేసింది. మలయాళ సినిమాలో ఇదొక విప్లవం.

– సిద్ధార్థ్, వ్యాఖ్యాత

ప్రార్థన అందరి కోసం...



మదర్ థెరీసా గొప్పదనం. నా సోదరి ఆమెతో సన్నిహితంగా పని చేసింది. కానీ ఒకరోజు ఒక విషయం చెప్పాలనుకుంది. ఆమెతో పనిచేయడం ఎంతో ఇష్టమేగానీ, తను స్వయంగా నాస్తికురాలు. ఈ సంగతి చెప్పగానే, 'మీ విశ్వాసాన్ని మీరు కొనసాగించండి. మీ కోసం నేను ప్రార్థిస్తాను' అన్నారు మదర్. (ఆగస్ట్ 26న మదర్ థెరీసా జయంతి)

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

థాంక్యూ ఆశాజీ!



బొంబేలో నివసిస్తున్నందున, ఒక సినిమా సెలబ్రిటీ కనపడగానే ఎప్పుడూ పెద్ద ఉద్వేగానికి లోనయింది లేదు. కానీ ఇవ్వాళ ఉదయం నా విమానంలో గాయని ఆశా భోంస్లేను చూడగానే నా హృదయం ఆనందంతో ఉప్పొంగింది. లేదు, నేను ఆమెను సెల్ఫీ అడగలేదు; కానీ ఆమె పాటలకు ధన్యవాదాలు అర్పించాను.

– మనాలీ ఖుల్లర్ ష్రాఫ్, రచయిత

మొత్తం చూడగలమా?



కశ్మీర్‌లోని ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికల కోసం నామినేషన్లు వేస్తున్న తీరు చూస్తుంటే, త్వరలోనే బ్యాలెట్ పేపర్ ఒక నవల కంటే లావుగా మారేట్టుంది.

– ఆర్జే విజదన్, రేడియో హోస్ట్

మారని మనుషులు



మహిళలకు వ్యతిరేకంగా జరిగే ఘోరాలే గనక ఒలింపిక్స్‌లో ఒక పోటీగా ఉంటే, ఉత్తరప్రదేశ్ మన దేశానికి ఎన్ని బంగారు పతకాలు తెచ్చేదో!

– అభిషేక్ గోయల్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

భరోసా కల్పించాలి

వైద్యులపై దాడులు చేయడం ఇటీవలి కాలంలో పెరగడం ఆందోళనకరం. వీటికి అడ్డుకట్ట వెయ్యడం సమాజ ఆరోగ్యానికి తక్షణ అవసరం. ఈ సందర్భంగా నా వ్యక్తిగత అనుభవం చెప్తాను. డాక్టర్‌గా నా కెరీర్ ప్రారంభంలో ఒక ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో డ్యూటీ డాక్టరుగా జాయిన్ అయ్యాను. ఒకసారి ఒక స్పెషలిస్ట్ ఆపరేషన్ చేసిన తరువాత నాలుగో రోజు రోగి ప్రాణం పోయింది. రోగి బంధువులు పెద్ద ఎత్తున గొడవ చేశారు. నన్ను కొట్టబోతే ఒక రోగి బంధువు అడ్డుకున్నాడు: 'ఈ డాక్టరు మంచాయన. సిన్సియర్‌గా వచ్చి బాగా చూసుకున్నారు. ఏమీ అనవొద్దు' అని. అలాంటి టెన్షన్ ఉన్న వాతావారణంలో కూల్‌గా డ్యూటీ చెయ్యడం మానవమాత్రుడికి సాధ్యం కాదు. చేసినా అందులో క్వాలిటీ ఉండదు. కాబట్టి ఎప్పుడైనా వైద్య సేవలందించేవారికి పూర్తి భద్రతా వాతావరణం ఉండాలి. సేఫ్‌గా ఉన్నా మన్న భరోసా, ఏమైనా ప్రతికూల పరిస్థితి ఎదురైతే స్పందించి రక్షించగల వ్యవస్థ ఉందన్న నమ్మకం ఉండాలి. రోగి బంధువులకు దైవంగా కనిపించిన వైద్యుడు... దయ్యంగా కనిపించడానికి క్షణం పట్టదు. వారిని నిందించి ప్రయోజనం లేదు, వాళ్ళ మానసిక స్థితి వారిది. కాబట్టి వ్యవస్థే మారాలి.

ప్రభుత్వాలు దాడుల్ని తీవ్రంగా పరిగణించి కఠిన చట్టాలు తేవాలి. ఆరోగ్యానికి నిధులు పెంచి రోగులకు వైద్య సౌకర్యాలు మెరుగు పర్చాలి. ఆసుపత్రుల్లో అధునాతన పర్యవేక్షణ పెంచడంతో పాటు, సున్నిత ప్రాంతాల్లో విజిటర్స్‌ను పరిమితం చెయ్యాలి. ఇక డాక్టర్లు, ఇతర సిబ్బంది రోగుల పట్ల సహానుభూతితో ఉండాలి. తగు సమయమిచ్చి ఓదార్పు చూపించాలి. తోటి డాక్టర్ గానీ, ఆసుపత్రి గానీ ఒక రోగి పట్ల అమానుషంగా వ్యవహరిస్తే ఒక బాధ్యత గల వృత్తి నిపుణునిగా స్పందించి రోగి వైపు నిలబడాలి తప్పించి, కొలీగ్ పేరుతో తప్పుని అన్యాయంగా వెనకేసుకు రాకూడదు. పవిత్రమైన వైద్య వృత్తి సురక్షితమైతేనే సమాజానికి ఆరోగ్యం. సమాజంలో ఎవరి పాత్ర వారు పోషిస్తేనే అది సాధ్యం.

– డా॥ డి.వి.జి. శంకరరావు
పార్వతీపురం మాజీ ఎంపీ, విజయనగరం

మానవ తప్పిదాలే విలయ హేతువులు

సందర్భం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

కేరళలోని వయనాడ్‌లో జూలై 30న వానరూపంలో మృత్యువు చేసిన కరాళ నృత్యానికి 375 మంది మృత్యువాతపడగా మరో 400 మంది తీవ్రంగా గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

ఈ విలయం కంటే ముందు 2019 ఆగస్టులో పుతుమల ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి భారీ ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించాయి. ఇక, 2018లో కనివిని ఎరుగని విధంగా కేరళ రాష్ట్రాన్ని ముంచెత్తిన వర్షాలు, వరదలకు 433 మంది మృత్యువాత పడగా, దాదాపు 6 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయినట్లు అధికారిక లెక్కలు వెల్లడించాయి.

ఇంతకూ ఎందుకు కేరళ రాష్ట్రంలో పదేపదే ప్రకృతి ప్రకోపిస్తోంది? ఈ ప్రశ్నకు జవాబు ప్రభుత్వాలకు చెంపపెట్టుగా నిలుస్తుంది. నిజానికి ప్రకృతి తనంతట తాను ప్రకోపించదు. దాన్ని ధ్వంసం చేసినప్పుడు మాత్రమే కన్నెర్ర జేస్తుంది. మనిషి అంతులేని స్వార్థంతో ప్రకృతి సంపదను ఇష్టానుసారం దోచుకోవడానికి చేసే విధ్వంసమే ప్రకృతి గతి తప్పడానికి కారణం అవుతోంది. ఇది ఒక్క కేరళలో మాత్రమే కాదు... గత దశాబ్ద కాలంగా హిమాలయ ప్రాంతంలోని ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో సైతం ఇదే జరుగుతోంది. అందుకే అక్కడా తరచుగా భారీ వర్షాలు కురిసి కొండ చరియలు విరిగి పడుతున్నాయి. వాటి వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు జరగడం పరిపాటిగా మారింది.

బెంగళూరులోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్'కు చెందిన ప్రొఫెసర్ సీపీ రాజేంద్రన్ 'వయనాడ్‌లో ప్రకృతి ప్రకోపానికి కారణమవుతున్న అంశాలను శాస్త్రీయంగా వివరించారు. 50వ దశకం వరకు వయనాడ్‌లో 85 శాతం దట్టమైన అడవులు ఉండగా, అవి క్రమంగా క్షీణిస్తూ 2018 నాటికి 62 శాతానికి చేరుకొన్నాయి. అడవులను నరికివేసి ఆ ప్రాంతంలో విస్తారంగా తేయాకు తోటల పెంపకం ప్రారంభించారు. దాంతో అక్కడ అనేక జనావాసాలు పుట్టుకొచ్చాయి. మానవ కార్యకలాపాలు విస్తృతం అయ్యాయి. కాలుష్య కారకాల వల్ల కర్బన ఉద్గారాలు పెరిగి వాతావరణంలో వేడి అధికమైంది. ఫలితంగా, ఆగ్నేయ ప్రాంతంలోని అరేబియా సముద్రం వేడెక్కి ఒక్కసారిగా కుండపోత వానలు పడటం మొదలైంది. అడవులు ఉన్నప్పుడు వర్షపు నీటి ప్రవాహ వేగం తక్కువగా ఉండి ఒక క్రమపద్ధతిలో పల్లపు ప్రాంతానికి చేరేది. కానీ, అడవుల్ని నరకడం వల్ల ప్రవాహ ఉధృతి పెరిగిపోవడం, వర్షపునీటి సాంద్రత అధికమవడంతో... రాతి శకలాల మధ్య ఉన్న మట్టి తొందరగా కరిగిపోయి ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడుతున్నాయి. వయనాడ్ కొండప్రాంతం లేటరైట్ మృత్తిక, రాతిశకలాల మిశ్రమంతో నిండి ఉండటం వల్ల భారీ వర్షాలు, వరదనీటి తాకిడికి కొండలు పెళ్లలు ఊడిపడినట్లు పడతాయని ఎప్పటి నుంచో శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు.

పశ్చిమ కనుమల పర్యావరణ స్థితిగతుల నిపుణుల



బృందం (వెస్టర్న్ ఘాట్స్ ఎకాలజీ ఎక్స్‌పర్ట్ ప్యానెల్)కు నేతృత్వం వహించిన మాధవ్ గాడ్గిల్ 2010 నుంచి దాదాపు ఏడాదిపాటు ఆ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కేరళ నుంచి ఇటు తమిళనాడు; అటు కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, గుజరాత్ వరకు విస్తరించిన పశ్చిమ కనుమల ప్రాంతాన్ని సున్నితమైన 3 జోన్లుగా వర్గీకరించి... ఒకటవ జోన్‌లో ఉన్న వయనాడ్ ప్రాంతంలో పర్యావరణాన్ని నష్టపరిచే కార్యకలాపాల్ని నిషేధించాలని సిఫారసు చేశారు. కనుమల స్థిరత్వాన్ని దెబ్బతీసే భారీ కట్టడాల్ని నిర్మించడం శ్రేయస్కరం కాదని హెచ్చరించారు.

అయితే, అపరిమితమైన ప్రకృతి సంపద గలిగిన ఆ ప్రాంతంపై కన్నేసిన కొందరు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి మాధవ్ గాడ్గిల్ కమిషన్ నివేదికను బుట్టదాఖలా చేయాలని చూశారు. స్థానికంగా ఉన్న ప్రజల్ని రెచ్చగొట్టారు. ఆ ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు పెరిగితే స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ప్రచారం ముమ్మరం కావడంతో మెజార్టీ ప్రజల అభిప్రాయాలకు తలొగ్గిన ప్రభుత్వాలు మాధవ్ గాడ్గిల్ కమిషన్ చేసిన సూచనలకు సవరణలు ప్రతిపాదించి, పరిమితమైన వాణిజ్య కార్యకలాపాలకు అనుమతులు ఇచ్చాయి. ఫలితంగా వయనాడ్ ప్రాంతంలో మైనింగ్, క్వారీ కార్యకలాపాలు పెరిగిపోయాయి. అలాగే కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటు సజావుగా సాగిపోయింది. ఈ చర్యలన్నింటి వల్లనే కేరళ తరచుగా విపత్తులకు గురవుతోందని శాస్త్రజ్ఞులు అంటున్నారు.


దేశంలో ఎటువంటి ఉపద్రవం సంభవించినా దాని చుట్టూ రాజకీయ రంగు పులుముకోవడం సహజమైపోయింది. వయనాడ్ మృత్యు విలయంపై ఆ మరుసటి రోజునే పార్లమెంట్‌లో హోమ్ మంత్రి అమిత్‌షా 'కాలింగ్ అటెన్షన్' రూపంలో చర్చను ప్రారంభించారు. ముందుగా ఆయన భారత వాతావరణ శాఖ చేసిన హెచ్చరిక (అలెర్ట్)లను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. అదే సమయంలో పశ్చిమ కనుమలలో దాదాపు 60 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పర్యావరణం పరంగా సున్నిత ప్రాంతంగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. అందులో వయనాడ్‌లోని కనుమ ప్రాంతం కూడా ఉంది. అయితే, కేంద్రం తాజాగా ప్రకటన నేపథ్యంలో 5 రాష్ట్రాల పశ్చిమ ప్రాంతంలో విస్తరించిన ఈ కనుమలలో ఇప్పటికే జరుగుతున్న పర్యావరణ విధ్వంసకర కార్యకలాపాలను నిలుపుదల చేయాలంటే అక్కడి పరిశ్రమలను వెంటనే తరలించాలి. ఆ పరిశ్రమలలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి. పరిశ్రమల యజమానులకు తగిన పరిహారం ఇవ్వాలి. ఈ చర్యలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే జరగాలి. ఇవన్నీ జరగాలంటే.. రాజకీయ చిత్తశుద్ధి అవసరం. ప్రజల ప్రాణాలకంటే విలువైనదేదీ లేదన్న స్పృహ పాలకుల్లో కలిగినప్పుడే విపత్తుల్లో చోటుచేసుకునే ప్రాణ, ఆస్తి నష్టాలు గణనీయంగా తగ్గుతాయి.

వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి

అర్ధ నారీశ్వరుడు

వాక్కు, అర్థం లాగా నిరంతరం కలిసి (సంపృక్తమై) ఉండే ఆ సంయుక్త శరీరంలో పసిడి తీగలాగా ప్రకాశించే అర్ధ శరీరం పార్వతిదయితే, కర్పూర వర్ణంలో భాసించే సగం దేహం కైలాసనాథుడిది. ఆమె శివా, ఆయన శివుడు. అందుకే **'చాంపేయ–గౌర–అర్ధ శరీరకాయై,/ కర్పూర గౌర–అర్ధ శరీరకాయ,/ నమః శివాయై చ నమః శివాయ!'** అని శివా, శివులను ఇద్దరినీ స్తుతిస్తూ ఆరంభమౌతుంది ఆది శంకరుల అర్ధ నారీశ్వర స్తోత్రం.

ఆ శరీరంలో వామ భాగం కస్తూరి, కుంకుమల అలంకారాలలో కమనీయం. దక్షిణ భాగానికి మాత్రం చితాభస్మం



పూతే చెరగని అలంకారం. అమ్మవారు 'స్మరుడి' (మన్మథుడి)కి మరొకసారి జీవనం ప్రసాదించింది కనుక అమ్మవారు 'కృతస్మర'. అయ్యవారు పంచబాణుడిని పాల నేత్రాగ్నితో భస్మం చేసినవాడు కనుక ఆయన 'వి–కృత స్మరుడు'. **'కృత స్మరాయై, వికృత స్మరాయ,/నమశ్శివాయై చ నమశ్శివాయ'** అని ఒక చమత్కారం.

ఆమె హేమ–అంగద. బంగారు వంకీలు ధరిస్తుంది. ఆయనకు భుజంగాలే భుజాభరణాలు, కనుక ఆయన భుజగాంగదుడు. **హేమాంగదాయై, భుజగాంగదాయ,/ నమఃశివాయై చ, నమః శివాయ** అని మరొక చమత్కారం.

శరీరపు ఎడమ భాగంలో దివ్యాంబరాలు. కుడి భాగం మాత్రం దిగంబరం. ఒకవైపు కేశపాశాల సొరు పెంచే దివ్య మందార వృక్షపు పూలమాల. మరొకవైపు వెరపు కలిగిస్తూ వేలాడే కపాల మాల. అమ్మ కుంతలాలు నల్లని మబ్బు తునకల నలుపు. అయ్య జటాజూటాలది మాత్రం రాగి రంగు మెరుపు.

అలరులు కురిపిస్తూ ఆమె చేసే నృత్యం జగత్తును సృష్టి వైపు ఉన్ముఖం చేసే లలిత లావణ్య భరితమైన లాస్యం. ఆయనది ఉల్లము ఝల్లనిపించి, ముల్లోకాలనూ కంపింపజేసే సమస్త సంహారకమైన తాండవ క్రీడా విలాసం. ఆమె నిరీ శ్వర. ఆమెను శాసించగల ప్రభువులు (ఈశ్వరులు) ఎవరూ లేరు, ఒక్క మహేశ్వరుడు తప్ప! ఆయన ఎలాగూ నిఖిలేశ్వరుడు. ఉభయులకూ వందనం. **నిరీశ్వరాయై, నిఖిలేశ్వరాయ, / నమః శివాయై చ, నమః శివాయ!**

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.దశమి తె.4.08 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మృగశిర రా.7.59 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** తె.4.24 నుండి 5.56 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ఉ.11.38 నుండి 12.26 వరకు, **అమృత ఘడియలు:** ప.11.24 నుండి 1.00 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.16.

క్లుప్తంగా...

వృద్ధురాలిపై కుక్కల దాడి

తల, ముఖంపై తీవ్రగాయాలు



రంగమ్మను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

దుబ్బాక టౌన్: కుక్కలు దాడి చేయడంతో ఒక వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనపై స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలివి. పట్టణానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు ఐయ్యంగారి రంగమ్మ పట్టణంలోని రేపల్లెవాడలో గుడిసెలో ఉంటూ జీవనం సాగిస్తోంది. సోమవారం రాత్రి సమయంలో పిచ్చి కుక్కలు ఒక్కసారిగా గుడిసెలోకి చొరబడి ఆమెపై దాడి చేశాయి. రంగమ్మను మంచంపై నుండి కింద పడేశాయి. ఆపై తల, ముఖంపై చర్మం ఊడి వచ్చేలా తీవ్రంగా గాయపరిచాయి. అపస్మారక స్థితికి చేరడంతో గమనించిన స్థానికులు.. మంగళవారం ఉదయం 108కి, బాధితురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు రంగమ్మను దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన చిన్నారికి మెరుగైన వైద్యం

నాంపల్లి (హైదరాబాద్): వీధి కుక్కల దాడిలో గాయపడిన మూడేళ్ల చిన్నారికి రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగానే ఉంది. నాలుగు రోజులు గడిస్తే తప్ప ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయలేమని నిలోఫర్ వైద్యులు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలం బేగంపేట గ్రామానికి చెందిన దేవేందర్, లాస్యల కుమార్తె హన్సితను వీధి కుక్కలు కరిచి తీవ్రంగా గాయపరచడం తెలిసిందే. హన్సితను కుక్కలు తీవ్రంగా గాయపరచడంతో చిన్నారికి అధిక రక్తస్రావం జరిగిందని నిలోఫర్ వైద్యులు వెల్లడించారు.

తప్పతాగి.. తండ్రిని హతమార్చి..

డబ్బివ్వలేదని అఘాయిత్యం: తల్లి

మణుగూరు టౌన్: మద్యానికి బానిసైన కొడుకు.. అడిగిన డబ్బు ఇవ్వలేదనే కోపంతో తప్పతాగి కన్నతండ్రిని హతమార్చాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరులో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై మృతుని భార్య లక్ష్మి కథనం ప్రకారం.. పగిడేరు ఎస్టీ కాలనీకి చెందిన కొర్సా బుచ్చయ్య (80)ను పొలంలో వాటాపంచి ఇవ్వాలని కుమారుడు సూర్యనారాయణ కొన్నాళ్లుగా అడుగుతున్నాడు. ఇప్పటికే మద్యానికి బానిసైన సూర్యనారాయణ.. మంగళవారం తాగడానికి డబ్బులు ఇవ్వమని కోరగా తండ్రి నిరాకరించాడు. దీంతో ఇంటికి అర్ధ కిలోమీటర్ దూరాన ఉన్న పొలం పనులకు వెళ్లిన బుచ్చయ్య వద్దకు చేరుకుని గొడవకు దిగడమే కాక.. అతన్ని కర్రతో కొట్టి చంపాడు. విషయం తెలుసుకున్న మణుగూరు సీఐ సతీశ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

సామాజిక న్యాయంతో వీసీలను నియమించాలి

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలని ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని.. జాజుల బృందం కలిసి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ ఉస్మానియా, అగ్రికల్చర్ యూనివర్సిటీ, జేఎన్టీయూ, కాకతీయ యూనివర్సిటీల ఉపకులపతుల పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

'గోల్డెన్' బజార్!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాల వ్యాపారులు భూ లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

బంజారా, జూబ్లీహిల్స్‌కు మించి..

ప్రస్తుతం బేగంబజార్‌లో నివాస స్థలం ప్రభుత్వ రేటు ప్రారంభ ధర గజం రూ.26,500, వాణిజ్య భవనాలకైతే రూ.71,500గా ఉంది. కానీ మార్కెట్‌లో పది రెట్లు అదనపు ధరలకు విక్రయిస్తున్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత బేగంబజార్‌లో గజం భూమి ధర రూ.1–2 లక్షల మధ్య ఉండేది. హోల్‌సేల్ వ్యాపారస్తుల అవసరాల రీత్యా పెరిగిన డిమాండ్‌తో గత పదేళ్లలో ఇక్కడ స్థలాల ధరలు పదిరెట్లు పెరిగాయి. ఇటీవల 68 గజాల చిన్న స్థలం కూడా రూ.6.80 కోట్లకు అమ్ముడుపోయిందంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఐటీ కారిడార్ వంటి ఉన్నత శ్రేణి ప్రాంతాలలో పోలిస్తే బేగంబజార్‌లో వాణిజ్య సముదాయాల ధర ఎక్కువగా ఉండటం విశేషం. ఇక్కడ కమర్షియల్ భవనాల్లో స్థలం చదరపు అడుగు (చ.అ.)కు దాదాపుగా రూ.70 వేలు పలుకుతోంది. అదే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలోని వాణిజ్య సముదాయాలలో ధర చ.అ.కు రూ.20 వేలకు మించి లేదు. బేగంబజార్‌లో చిన్న స్థలంలోనైనా సరే జీ+2, అంతకు పైగా అంతస్తులతో వాణిజ్య భవనాలను నిర్మిస్తుంటారు. 150–200 చ.అడుగుల్లో ఉండే అగ్గిపెట్టెల్లాంటి షాపు అద్దె నెలకు రూ.50–60 వేలు పలుకుతుండటం గమనార్హం.

గోషామహల్‌కు ఉస్మానియా ఆస్పత్రి



సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి దామోదర రాజనర్సింహ

స్పీడ్‌పై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం

- 32 ఎకరాల్లో కొత్త ఆస్పత్రి నిర్మాణం
- పోలీస్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలం వైద్య, ఆరోగ్య శాఖకు బదిలీ
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- పాత ఆస్పత్రి భవనాన్ని హెరిటేజ్ కట్టడంగా పరిరక్షిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆసుపత్రిని గోషామహల్‌కు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. గోషామహల్‌లోని పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో ఉన్న దాదాపు 32 ఎకరాల్లో కొత్త ఆసుపత్రిని నిర్మించాలని, ఇందుకు గాను వెంటనే ఆ భూమిని వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పీడ్ (స్మార్ట్, ప్రోయాక్టివ్, ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులపై తొలిసారిగా మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. స్పీడ్ ప్రణాళికలో ఉన్న ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణంతో పాటు కొత్తగా 15 నర్సింగ్ కాలేజీలు, 28 పారా మెడికల్ కాలేజీల ఏర్పాటు, జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో భాగంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

వచ్చే 50 ఏళ్లకు తగినట్టుగా కొత్త ఆస్పత్రి

'రాబోయే 50 సంవత్సరాల అవసరాలను అంచనా వేసి దానికనుగుణంగా కొత్త ఆసుపత్రి డిజైన్‌ను రూపొందించాలి. ఆసుపత్రి నలుదిశలా రోడ్లు ఉండాలి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలి. ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలి. కేవలం కాంక్రీట్ భవంతులు, బహుళ అంతస్తులు మాత్రమే ప్రధానం కాదు. ఆహ్లాదకరమైన విశాలమైన ఖాళీ ప్రాంగణం ఎక్కువగా ఉండాలి. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, సేవలన్నీ అందుబాటులోకి రావాలి. ఇందుకు గాను అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్‌లతో డిజైన్లు తయారు చేయించాలి. గోషామహల్ స్థలాన్ని వైద్య, ఆరోగ్య శాఖకు బదిలీ చేసినందుకు గాను పోలీసు విభాగానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలి. పేట్లబురుజులో ఉన్న పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీల చుట్టూ ఉన్న స్థలాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలి. గోషామహల్‌లోని పోలీస్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్సును అక్కడకు తరలించేలా చూడాలి. రాష్ట్రంలో కొత్త ఆసుపత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. 15 నర్సింగ్ కళాశాలల భవనాలను వచ్చే ఏడాది లోగా పూర్తి చేయాలి. కళాశాలలను తాత్కాలికంగా అద్దె భవనాల్లో నిర్వహించాలి..' అని సీఎం ఆదేశించారు. ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షించే బాధ్యతను చేపడతామని, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా హెరిటేజ్ కట్టడాలు గుర్తించి పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక భవనాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ఎస్‌హెచ్‌జీలకు కొత్త భవనాలు

మహిళా స్వయం సహాయక సంఘాలకు భవనాలు లేని 22 జిల్లాల్లో కొత్త భవనాలను నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇందుకోసం ప్రతి జిల్లా సమాఖ్యకు ఎకరం భూమి కేటాయించేందుకు అంగీకరించిన సీఎం.. ముందుగా స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. శిల్పారామం పక్కన మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడెకరాల స్థలాన్ని వెంటనే బదిలీ చేయాలని, మహిళా శక్తి సంఘాలు తయారుచేసే ఉత్పత్తులను అక్కడ ఏడాది పొడవునా అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎగ్జిబిషన్ తరహాలో వివిధ రకాల ఉత్పత్తులను అక్కడ అందుబాటులో ఉంచాలని సూచించారు. వివిధ రంగాల ప్రముఖులు, జాతీయ స్థాయి నేతలు ఎవరు హైదరాబాద్‌కు వచ్చినా తప్పకుండా ఆ ప్రాంతాన్ని సందర్శించే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

వేయింగ్ మెషీన్లలో తేడా ఉంటే కఠినచర్యలే

పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పెట్రోల్ బంక్‌లతో పాటు వేయింగ్ మెషీన్లలో జరుగుతున్న మోసాలపై నిఘా పెంచాలని, పట్టుబడితే కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వేయింగ్ మెషీన్లు, పెట్రోల్ బంక్ తనిఖీలు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరం చేయాలని, దొరికితే ఎవరినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో తూనికలు, కొలతల శాఖపై ఉత్తమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో శాఖ ప్రత్యేక కార్యదర్శి డీఎస్ చౌహాన్, సహాయ కార్యదర్శి ప్రియాంక, తెలంగాణ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఈఓడీబీ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చట్టం పేరుతో వినియోగదారుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. తూనికలు, కొలతల శాఖపై వినియోగదారుల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. ప్రజలు మోసపోకుండా అధికారులు ఆయా వ్యాపారుల్లో నిరంతరం తనిఖీ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. శాఖపై జిల్లాల వారీగా అధికారులు సమీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే శాఖలో ఉన్న ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాఖా పరంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేటు ఫార్మసీలా?

మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు చేతులెత్తేయడంతో రోగులు ప్రైవేటు ఫార్మసీలకు వెళ్తూ సొంత డబ్బులతో మందులు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సహా అనేక చోట్ల మందుల కొరతపై హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మూడు నెలలకు సరిపడా మందులను బఫర్‌స్టాక్‌గా పెట్టుకోవాల్సి ఉన్నా ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రుల ఆవరణలో ప్రైవేటు ఫార్మసీలను ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రైవేటు మెడికల్ షాపులకు లాభం చేసేందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల సరఫరా నిలిపివేస్తోందని మండిపడ్డారు.

పాఠశాలల మూసివేత తగదు: ఉపాధ్యాయులు లేకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో 43 పాఠశాలలు మూతపడటంపై ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ తప్పిదంతో గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. విద్యాశాఖపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

నేటి నుంచి రుణమాఫీ కుటుంబ నిర్ధారణకు సర్వే

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీకి సంబంధించి రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణకు ప్రతి జిల్లాలో గ్రామాల వారీగా బుధవారం నుంచి మండల వ్యవసాయ అధికారి సర్వే చేస్తారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసి వాటిని నమోదు చేస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీచేశారు. అలాగే తుమ్మల అధికారులతో సమీక్ష చేశారు. ఇప్పటిదాకా తీసుకున్న చర్యలను సమీక్షించి, రైతుల వివరాల సేకరణ, బ్యాంకుల నుంచి వచ్చిన వివరాలలో తప్పుల సవరణ వేగవంతం చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, గోపీ జిల్లా వ్యవసాయాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ నాటికి 22,37,848 మంది రైతులకు రూ.2 లక్షల లోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేశామన్నారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని రైతుల కోసం యాప్ తయారు చేశామని చెప్పారు. 25, 26 తేదీల్లో అన్ని మండలాల్లో టెస్ట్ ట్రయల్ చేశామన్నారు. ప్రతి మండల వ్యవసాయ అధికారి గ్రామాల వారీగా ప్రణాళికలను తయారు చేసి, దాని ప్రకారం కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. తప్పుగా నమోదైన 1,24,604 మంది ఆధార్ వివరాలను సంబంధిత బ్యాంకులకు సరిచేయడానికి ఇచ్చామని, ఇప్పటివరకు 41,339 ఆధార్ వివరాలను సరిచేశామన్నారు.

వ్యాధుల విజృంభణపై ఏం చేస్తున్నారు?

అధికారులపై మంత్రి దామోదర ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు సరైన చర్యలు చేపట్టడం లేదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా ఎందుకు నియంత్రించలేకపోతున్నారని వారిని నిలదీశారు. బుధవారం నుంచి జిల్లాలకు వెళ్లి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ.. డెంగీ సహా సీజనల్ జ్వరాల కట్టడిపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. డెంగీ, సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రజారోగ్య సంచాలకుల ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, సంబంధితశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. డెంగీ కట్టడిపై ఉన్నతాధికారులు జిల్లాల్లో పర్యటించి నివేదిక సమర్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్, హేమంత్ వాసుదేవ రావు, డీఎంఈ డాక్టర్ వాణి పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ముగ్గురు సోదరుల మృతి

- ఒకరిని రక్షించబోయి.. మరో ఇద్దరు
- ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



అక్షయ్ (ఫైల్)



విజయ్ (ఫైల్)

ఆదిలాబాద్ రూరల్: వాగులో చేపల వేటకు వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్‌రూరల్ మండలం పొచ్చర గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన నాగుల్వార్ విజయ్(28), నాగుల్వార్ ఆకాశ్(26), నాగుల్వార్ అక్షయ్(22) ముగ్గురు అన్నదమ్ములు. తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్‌లో వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ముగ్గురూ పొచ్చర గ్రామ సమీపంలోని వాగు వద్దకు చేపల వేటకు ఉదయం వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో అక్షయ్ ప్రమాదవశాత్తు కాలుజారి వాగులో పడిపోగా... అతడిని రక్షించేందుకు ఇద్దరన్నదమ్ములూ వాగులోకి దూకేశారు. అయితే వీరికి కూడా ఈత రాకపోవడంతో ముగ్గురు వాగులో కొట్టుకుపోయారు. వీరితో పాటే అక్కడికి వెళ్లిన వీరి సమీప బంధువు కాంబ్లే శ్రీనివాస్ గ్రామస్తులకు, పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే ఈ ముగ్గురూ వాగులో కొట్టుకుపోయారు. దీంతో గజ ఈతగాళ్లను రప్పించి వీరి కోసం గాలించగా...ముందుగా విజయ్ తర్వాత ఆకాశ్, అక్షయ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ఎస్సీ గురుకుల సొసైటీలో మెడిటేషన్ తరగతులు

టీజీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని పాఠశాలల్లో మెడిటేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి వెల్లడించారు. విద్యార్థుల్లో మానసిక ఆందోళన, ఒత్తిడిని తగ్గించి చదువుపై ఏకాగ్రతను పెంచేందుకు ఈ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. ఇటీవల విద్యార్థులు ఒత్తిడితో ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్షిణి వివరించారు. మెడిటేషన్ తరగతుల నిర్వహణ కోసం బ్రహ్మకుమారీస్ సంస్థతో సొసైటీ అవగాహన కుదుర్చుకుందని, ఇందులో భాగంగా గురుకుల టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. వచ్చే నెల రెండోవారం నుంచి గురుకులాల్లో తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు.

పోలవరం ముంపుపై నేడు సాంకేతిక కమిటీ భేటీ

- ఢిల్లీలో సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా అధ్యక్షతన సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాష్ట్ర ప్రభుత్వాల అభ్యంతరాలపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో బుధవారం వోరా అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సాంకేతిక కమిటీలో సభ్యులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నీటిపారుదలశాఖ ఈఎన్‌సీలు పాల్గొంటారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరం స్పిల్‌వే 36 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించాలని, స్పిల్ వే 50 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించడం వల్ల బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల తమ రాష్ట్ర భూభాగం ముంపునకు గురవుతుందని, ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరించాలని కోరుతూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో ఆ మూడు రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌తో చర్చించి.. వారి అనుమానాలను నివృత్తి చేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సాంకేతిక కమిటీ సమావేశాన్ని వోరా మరోసారి నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో వెల్లడైన అంశాల ఆధారంగా కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి నివేదిక ఇస్తారు. ఆ నివేదిక ఆధారంగా నాలుగు రాష్ట్రాల సీఎస్‌లతో ఉన్నత స్థాయి కమిటీ సమావేశం దేబశ్రీ ముఖర్జీ ఏర్పాటు చేస్తారు.

హష్ ఆయిల్ రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

- తప్పించుకున్న మరో ఇద్దరు
- నిందితుల నుంచి రూ. 1.52 కోట్ల విలువైన 10.2 కిలోల హష్ ఆయిల్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న హష్ ఆయిల్

భూదాన్‌పోచంపల్లి: నిషేధిత హష్ ఆయిల్‌ను రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను భువనగిరి ఎస్‌ఓటీ, పోచంపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1.52 కోట్ల విలువైన 10.2 కిలోల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, హుకుంపేట మండలం కోల మామిడి గ్రామానికి చెందిన గమ్మెలి గోవిందరావు (36), హుకుంపేట మండలం రాహుల్‌పేట గ్రామానికి చెందిన కొర్ర రాంబాబు(30) ఇద్దరు స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న వీరిద్దరూ తెలిసిన వారివద్ద నుంచి తక్కువ పరిమాణంలో హష్ ఆయిల్‌ను సేకరించి చుట్టుపక్కల పట్టణాలలో విక్రయించేవారు. దీంతో అధిక ఆదాయం వస్తుండటంతో ఈసారి ఎక్కువ మొత్తంలో హష్ ఆయిల్‌ను సేకరించి హైదరాబాద్‌లో విక్రయించేందుకు మరో ఇద్దరు వ్యక్తులు చంటి, లక్ష్మీనాయుడుతో కలిసి ఈనెల 26న ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున యాదాద్రి భువనగిరి జిల్లా కొత్తగూడెం ఎక్స్‌రోడ్ వద్ద మధ్యలోనే దిగి అక్కడ నుంచి పోచంపల్లి వైపు వస్తుండగా...ముందస్తు సమాచారం మేరకు పోలీసులు వీరిని పట్టుకున్నారు. కాగా చంటి, లక్ష్మీనాయుడు అక్కడ్నుంచి పరారవ్వగా, గోవిందరావు, రాంబాబులను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బరాజ్‌లు ఎందుకు ఫెయిలయ్యాయి?

- కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్లను ప్రశ్నించిన జస్టిస్ ఘోష్ కమిషన్
- సీడీఓ ఇంజనీర్లకు క్రాస్ ఎగ్జామినేషన్



సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల వైఫల్యానికి కారణాలేమిటి? డిజైన్లకు సాంకేతిక అనుమతులిచ్చాక మళ్లీ అన్నారం, సుందిళ్ల నిర్మాణ స్థలాలను ఎందుకు మార్చారు? మారిన ప్రదేశాలకు అనుగుణంగా డిజైన్లలో మార్పులు చేశారా?' అని నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో)లో పనిచేసిన, రిటైరైన ఇంజనీర్లను జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా కమిషన్ మంగళవారం పలువురు ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. అన్నారం బరాజ్ డిజైన్లను ఎవరు సిద్ధం చేశారని మాజీ ఈఈ కె. నరేందర్‌ను ప్రశ్నించగా డిజైన్లను ఏఈఈలు తయారు చేస్తే.. వాటికి డీఈఈ, ఆపై ఈఈ అనుమతిస్తారని ఆయన తెలిపారు. భూభౌగోళిక, సైట్ సర్వే ఆధారంగా డిజైన్లు, డ్రాయింగ్‌లను సిద్ధం చేస్తామని మరో ప్రశ్నకు బదులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన కమిషన్‌కు ఎదురు ప్రశ్నలు వేయగా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

డిజైన్లలో లోపాల్లేవు: బస్వరాజ్, ఎస్‌ఈ, కాళేశ్వరం

మేడిగడ్డ బరాజ్ డిజైన్లలో లోపాల్లేవని.. ఐఎస్ కోడ్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) నిబంధనలకు లోబడి ఎల్ అండ్ టీ ఆధునిక సాఫ్ట్‌వేర్ ద్వారా తయారు చేసిందని కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్‌ఈ హెచ్.బస్వరాజ్ తెలిపారు. డిజైన్లు ప్రమాణాలకు లోబడి ఉన్నాయని నిర్ధారించాకే ఆమోదించామన్నారు. బరాజ్ నిర్మిత స్థలాన్ని పరిశీలించలేదని.. క్షేత్రస్థాయి అధికారులు ఇచ్చిన డేటా ఆధారంగా డిజైన్లు సిద్ధం చేశామని ఓ ప్రశ్నకు బస్వరాజ్ బదులిచ్చారు. అన్నారం, సుందిళ్ల నిర్మాణ స్థలాలను మార్చినప్పటికీ ప్రతిపాదిత నిర్మాణ ప్రదేశంలోనే మేడిగడ్డను కట్టారని తెలిపారు. మేడిగడ్డ బరాజ్ పునాది కింద ఇసుక కొట్టుకుపోవడంతోనే బరాజ్ కుంగిందని సీడీవో ఎస్‌ఈ ఎం. సత్యనారాయణరెడ్డి వివరించారు. బరాజ్‌లను నీటి మళ్లింపు కోసం కట్టాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా నిల్వ చేయడంతోనే విఫలమైనట్లు సీడీఓ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ దయాకర్‌రెడ్డి ఇంతకు ముందు కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో కమిషన్ దీనిపై ప్రశ్నించగా ఆయన దాటవేశారు. దీంతో కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రామగుండం ఈఎన్‌సీ ఇచ్చిన డేటా ఆధారంగా డిజైన్లు చేశామని సీడీవో మాజీ ఎస్‌ఈ రాజశేఖర్ అన్నారు.

అన్యాయాన్ని సరిచేయడానికే రీ ఇంజనీరింగ్ — పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపిన వి.ప్రకాశ్

సమైక్య పాలనలో విధ్వంసానికి గురైన తెలంగాణను పునర్నిర్మించేందుకు.. ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకే ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌ను నాటి సీఎం కేసీఆర్ చేపట్టారని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత వి.ప్రకాశ్ తెలిపారు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు మంగళవారం అఫిడవిట్ సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమైక్య పాలనలో గోదావరి పరీవాహక ప్రాంతంలో సాగునీటి సదుపాయం లేక రైతుల ఆత్మహత్యలు సహా వివిధ ఘటనల్లో 50 వేల మంది చనిపోయారని కమిషన్‌కు వివరించినట్లు ఆయన చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు లక్షిత ఆయకట్టు 16.40 లక్షల ఎకరాలు కాగా రీ ఇంజనీరింగ్ ద్వారా 37 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత గురించి కేంద్ర జలసంఘం రాసిన లేఖల్లోని వాస్తవాలను కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్, విద్యుత్‌రంగ నిపుణుడు కె.రఘు వక్రీకరించారని ఆధారాలతో సహా వివరించినట్లు ప్రకాశ్ చెప్పారు. మహారాష్ట్ర అభ్యంతరాల నేపథ్యంలో తుమ్మిడిహెట్టి బరాజ్ సాధ్యం కాదన్నారు.

రాళ్ల దాడులు, లాఠీచార్జి...
ర్యాలీ హింసాత్మకం

అట్టుడికిన కోల్‌కతా
- విద్యార్థులపై విరిగిన లాఠీ
- పోలీసులపైకి రాళ్లు, ఇటుకలు
- ఇరు వర్గాల వారికి గాయాలు
- అణచివేత అమానుషం: బీజేపీ
- మమత రాజీనామాకు డిమాండ్
- నేడు బెంగాల్ బంద్‌కు పిలుపు
- జరగనిచ్చేది లేదన్న సర్కారు
- ర్యాలీ వెనక బీజేపీ: తృణమూల్



మంగళవారం కోల్‌కతాలో ఆందోళనకారులపైకి బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

కోల్‌కతా: ఆర్‌జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో యువ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యత వహిస్తూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కోల్‌కతాలో మంగళవారం విద్యార్థులు చేపట్టిన 'నబన్నా అభియాన్ (చలో సచివాలయ ర్యాలీ)' హింసాత్మకంగా మారింది. ఇటు ఇసుక వేస్తే రాలనంత మంది విద్యార్థి నిరసనకారులు, అటు వారిని అడ్డుకునేందుకు వేలాదిగా మోహరించిన పోలీసులతో పరిస్థితి యుద్ధరంగాన్ని తలపించింది. నగరవ్యాప్తంగానే గాక సమీపంలోని హౌరాలో కూడా వారికి, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. సచివాలయానికి దారితీసే మార్గాలన్నింటినీ పోలీసులు బారికేడ్లతో దిగ్బంధించారు. వాటిని బద్దలు కొట్టుకుంటూ దూసుకెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. అడ్డుకున్న పోలీసులపై రాళ్ల వర్షం కురిపించారు. దాంతో ఖాకీలు లాఠీలకు పని చెప్పారు. గాల్లోకి కాల్పులు జరపడంతో పాటు వాటర్ క్యానన్లు, బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. రాళ్ల దాడి, లాఠీచార్జిలో ఇరువైపులా చాలామంది గాయపడ్డారు. శాంతియుత ర్యాలీపై ఇదెక్కడి అమానుషత్వమంటూ బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. మహిళలపై అకృత్యాలను అడ్డుకోవడం చేతగాని మమతా సర్కారు విద్యార్థులపై మాత్రం ప్రతాపం చూపుతోందంటూ దుయ్యబట్టింది. ''పోలీసు హింసాకాండకు బాధ్యత వహిస్తూ మమతా బెనర్జీ తక్షణం రాజీనామా చేయాలి. వైద్యురాలి హత్యలో నిజాలు వెలుగు చూసేందుకు వీలుగా పాలీ టెస్టులకు సిద్ధపడాలి'' అని డిమాండ్ చేసింది. లేదంటే రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించింది. బుధవారం 12 గంటల పాటు బెంగాల్ బంద్‌కు పిలుపునిచ్చింది. దీన్ని అధికార తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ''ర్యాలీ బీజేపీ గేమ్‌ప్లానేనని చెప్పేందుకు ఇదే నిదర్శనం. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితులను దిగజార్చేందుకే ఆ పార్టీ కంకణం కట్టుకుంది'' అంటూ మండిపడింది. బంద్ జరగనిచ్చే ప్రసక్తే లేదని మమత ముఖ్య సలహాదారు ఆలాపన్ బంధోపాధ్యాయ్ కుండబద్దలు కొట్టారు!

ఉదయం నుంచే...

విద్యార్థి సంఘమైన పశ్చిమ్ బంగా ఛాత్ర సమాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సచివాలయ ర్యాలీ తలపెట్టారు. మరోవైపు డీఏ తదితర డిమాండ్లతో రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల అసమ్మతి వేదిక 'సంగ్రామీ జౌతా మంచా' కూడా మంగళవారమే చలో సచివాలయానికి పిలుపునిచ్చింది. నిరసనకారులంతా కోల్‌కతాలో పలు ప్రాంతాల నుంచి ఒక్క ఉదుటున సచివాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. వీటిని భగ్నం చేసేందుకు ఏకంగా 6,000 మందికి పై చిలుకు బలగాలు రంగంలోకి దిగాయి. హౌరా బ్రిడ్జి, సంత్రాగచ్చి రైల్వేస్టేషన్‌తో పాటు నగరంలో పలుచోట్ల బారికేడ్లతో పోలీసులు ముందుగానే రోడ్లను దిగ్బంధించారు. బారికేడ్లపై కెక్కి దూకేందుకు ప్రయత్నించిన నిరసనకారులను నిలువరించేందుకు లాఠీచార్జీ చేయడంతో చాలామంది గాయపడ్డారు. కోపోద్రిక్తులైన నిరసనకారులు రాళ్లతో పాటు ఇటుకలు కూడా విసరడంతో 30 మంది దాకా పోలీసులు గాయపడ్డారు. ఎంజీ రోడ్, హేస్టింగ్స్ రోడ్, ప్రిన్సెప్ ఘాట్ తదితర ప్రాంతాలన్నీ ఘర్షణలకు వేదికగా మారాయి. ఈ దృశ్యాలన్నీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ''మేమేమీ చట్టాలను అతిక్రమించలేదు. శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే విచక్షణా రహితంగా కొట్టారు'' అంటూ విద్యార్థులు మండిపడ్డారు. 33 మంది మహిళలతో పాటు మొత్తం 126 మంది ఛాత్ర సమాజ్ సభ్యులను అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. వాస్తవానికి 200 పైచిలుకు మందిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

రేపిస్టులకు మమత అండ: నడ్డా

విద్యార్థుల శాంతియుత ర్యాలీపై పోలీసులు జులుం ప్రదర్శించారని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. ''మమత పాలనలో రేపిస్టులు, క్రిమినల్స్‌కు వ్యవస్థ అన్నివిధాలా అండగా నిలుస్తోంది. మహిళల భద్రత కోసం గళమెత్తడం బెంగాల్లో క్షమించరాని నేరంగా మారింది'' అంటూ ఎక్స్ పోస్టులో ఎద్దేవా చేశారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడ్డ వారిని మమత సర్కారే కాపాడుతోందని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు.

చెవిటి సర్కారు: బీజేపీ

మమతను కరడుగట్టిన నియంతగా బెంగాల్ బీజేపీ చీఫ్, కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ అభివర్ణించారు. న్యాయం కావాలంటూ ప్రజలు చేస్తున్న ఆక్రందనలు ఆమె చెవిటి సర్కారుకు విన్పించడం లేదని మండిపడ్డారు. అరాచక ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకే బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. విద్యార్థుల ర్యాలీపై పోలీసుల అణచివేతకు నిరసనగా పార్టీ కార్యకర్తలతో కలిసి లాల్ బజార్ ప్రాంతంలో బారికేడ్లను బద్దలు కొట్టేందుకు ఆయన విఫల యత్నం చేశారు. టియర్ గ్యాస్ ధాటికి స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. అరెస్టు చేసిన విద్యార్థులందరినీ బేషరతుగా విడుదల చేయాలంటూ సాయంత్రం దాకా అక్కడే బైఠాయించారు. మరోవైపు బుధవారం రాష్ట్రమంతటినీ స్తంభింపజేయడంతో పాటు సెప్టెంబర్ 6 దాకా పలు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు విపక్ష నేత సువేందు అధికారి ప్రకటించారు. బీజేపీకి చెందిన నలుగురు విద్యార్థి నేతలను మంగళవారం రాత్రి పోలీసులు మాయం చేశారని ఆయన ఆరోపించారు. వాటిని పోలీసులు ఖండించారు. వాళ్లను హత్యాయత్నం అభియోగాలపై అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

డీఎన్ఏ, ఫోరెన్సిక్ సాక్ష్యాలపై... ఎయిమ్స్ వైద్యుల అభిప్రాయం

వైద్యురాలి కేసులో సీబీఐ నిర్ణయం

కోల్‌కతా: కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసుకు సంబంధించిన డీఎన్ఏ, ఫోరెన్సిక్ సాక్ష్యాలపై ఢిల్లీ ఎయిమ్స్ వైద్య నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని సీబీఐ నిర్ణయించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ తనంత తానుగా నే ఘోరానికి పాల్పడ్డాడా, అతని వెనక ఎవరన్నా ఉన్నారా అన్నదానిపై పక్కాగా నిర్ధారణకు వచ్చేందుకు వారిచ్చే నివేదిక ఉపయోగపడొచ్చని భావిస్తోంది. సంజయ్‌కి సన్నిహితుడైన ఏఎస్సై అనూప్ దత్తా కూడా ఈ ఘోరంలో అతనికి సాయపడ్డట్టు సీబీఐ అనుమానిస్తోంది. దత్తాకు పాలి టెస్టులు చేసేందుకు కోర్టును ఇప్పటికే అనుమతి కోరింది. మరోవైపు ఘోష్ హయాంలో ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలపై తాజాగా ఈడీ కూడా మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది.

'కమిషనర్' బైక్‌పై నిందితుడు!

కోల్‌కతా: అత్యాచారం, హత్య జరిగిన రాత్రి ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ కోల్‌కతా పోలీస్ కమిషనర్ పేరిట రిజిస్టరైన బైక్‌ను వాడినట్టు తేలడం ఆందోళనకరమని బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ అన్నారు.

వైద్యుల భద్రతపై టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశం

భాగస్వామ్యపక్షాలతో విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరపాలని నిర్ణయం

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలను సిఫార్సు చేయడానికి సుప్రీంకోర్టు నియమించిన జాతీయ టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశం మంగళవారం జరిగింది. భద్రతపై ప్రొటోకాల్ రూపొందించడానికి భాగస్వామ్యపక్షాలతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో 10 మంది సభ్యులతో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. కేంద్ర కేబినెట్ సెక్రెటరీ నేతృత్వంలో జరిగిన తొలి సమావేశానికి సభ్యులందరితోపాటు కేంద్ర హోం శాఖ, ఆరోగ్య శాఖ కార్యదర్శులు సైతం హాజరయ్యారు. వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతపై చర్చించారు. తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ఇప్పటికే వివిధ భాగస్వామ్యపక్షాలతో మాట్లాడామని, తమకు దాదాపు 400 సలహాలు సూచనలు అందాయని టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఈ సందర్భంగా చెప్పారు.


ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో తగులబడుతున్న పోలీసు బైక్


రాష్ట్ర సెక్రటేరియట్ వైపు వెళ్తున్న ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు



మాయమవుతున్న... మగ క్రోమోజోమ్

ఆడా మగా కలిస్తేనే సృష్టి. మరి మగవాళ్లు అసలు ఆనవాలే లేకుండా పోతే? పురుషజాతి పూర్తిగా అంతరించిపోతే? అలాంటి సృష్టి వైపరీత్యమే దాపురించబోతోంది! కాకపోతే ఇప్పుడప్పుడే కాదు. ఓ కోటి సంవత్సరాల తర్వాత! అప్పటికల్లా మగవాళ్లలోని వై క్రోమోజోమ్ పూర్తిగా మటుమాయం కానుండటమే ఇందుకు కారణం! నిజానికి జీవ పరిణామ క్రమంలో వై క్రోమోజోమ్ క్రమంగా చిక్కిపోతూ వస్తోందట. అలా గత 30 కోట్ల ఏళ్లుగా అది ఏకంగా 95 శాతానికి పైగా కృశించిపోయినట్టు సైంటిస్టులు తేల్చడం విశేషం!! ఈ ధోరణి ఇలాగే కొనసాగితే మగవారి పుట్టుకకు కారణమయ్యే వై క్రోమోజోమ్‌ను మరో కోటి ఏళ్ల తర్వాత మనం పూర్తిగా మర్చిపోవాల్సిందేనని వాళ్లు హెచ్చరిస్తున్నారు.

1,393 జన్యువులు ఇప్పటికే మాయం

ఎక్స్, వై క్రోమోజోములు లింగ నిర్ధారణ కారకాలన్నది తెలిసిందే. అందుకే వాటిని సెక్స్ క్రోమోజోములుగా పిలుస్తారు. ఆడవాళ్లలో రెండు ఎక్స్ క్రోమోజోములు, మగవారిలో ఒక ఎక్స్, ఒక వై క్రోమోజోమ్ ఉంటాయి. వై క్రోమోజోమ్ వల్ల వృషణాలు తదితర కీలక పురుష పునరుత్పాదక అవయవాలు అభివృద్ధి చెందుతాయి. అందుకే దాన్ని మేల్ క్రోమోజోమ్‌గా, ఎక్స్‌ను ఫీమేల్ క్రోమోజోమ్‌గా పిలుస్తారు. ఫలదీకరణ వేళ రెండు ఎక్స్ క్రోమోజోములు కలిస్తే అమ్మాయి, ఎక్స్, వై క్రోమోజోములు కలయికతో అబ్బాయి పుడతారు. ఎక్స్‌తో పోలిస్తే పరిమాణంలోనే గాక జన్యువుల సంఖ్యలో కూడా వై క్రోమోజోమే చిన్నది. అందులో ఒకప్పుడు 1,438 జన్యువులుండేవట. గత 30 కోట్ల ఏళ్లలో వాటిలో ఏకంగా 1,393 జీన్స్ లుప్తమైపోయినట్టు సైంటిస్టులు గుర్తించారు. ప్రస్తుతం మిగిలి ఉన్న 45 జన్యువులు కూడా మరో కోటి ఏళ్లలో పూర్తిగా లుప్తమవుతాయని జెనెటిక్స్ ప్రొఫెసర్, సైంటిస్టు జెన్నిఫర్ మార్షల్ గ్రేవ్స్ వివరించారు. ఈ పరిశోధన వివరాలను నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్స్‌లో ప్రచురించారు.

ఆశ లేకపోలేదు...

వై క్రోమోజోమ్ అంతరించినా మగ జాతి మనుగడకు ముప్పేమీ ఉండకపోవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. దానిలోని స్థానంలో అవే లక్షణాలతో కూడిన కొత్త మేల్ క్రోమోజోమ్ అభివృద్ధి చెందే ఆస్కారం పుష్కలంగా ఉన్నట్టు జపాన్‌లోని హక్కైడో వర్సిటీ పరిశోధక బృందం చెప్పుకొచ్చింది. ''ఒక రకం చిట్టెలుకల్లో ఇలాగే జరిగింది. వై క్రోమోజోమ్ లుప్తమైపోయినా దానిలోని మేల్ జీన్స్ ఇతర క్రోమోజోముల్లోకి చేరాయి'' అని వివరించింది. కనుక వై క్రోమోజోమ్ క్షీణించినా దానికి ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేసుకునే సామర్థ్యం క్షీరదాల్లో ఉంటుందని తెలిపింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

బీఎస్పీ అధ్యక్షురాలిగా మాయావతి మరోసారి..



లక్నో: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) జాతీయ అధ్యక్షురాలిగా మాయావతి(68) మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం బీఎస్పీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, సీనియర్ ఆఫీసు బేరర్ల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రాల పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులు సైతం పాల్గొన్నారు. ఈ భేటీలో పార్టీ అధ్యక్షురాలిగా మాయావతిని ఎన్నుకున్నారు. ఆమె నాలుగుసార్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన సంగతి తెలిసిందే. మాయావతి తొలుత 2003లో బీఎస్పీ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఈ పదవిలో నిరాటంకంగా కొనసాగుతున్నారు. మంగళవారం బీఎస్పీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో పరాజయాలు ఎదురైనప్పటికీ తాము వెనుకంజ వేయడం లేదని చెప్పారు. తమ లక్ష్య సాధన కోసం రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతామని అన్నారు.

30న బీజేపీలోకి చంపయ్ సోరెన్



న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయ్ సోరెన్ బీజేపీలో చేరనున్నారని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన రాంచీలో జరిగే కార్యక్రమంలో చంపయ్ సోరెన్ అధికారికంగా కాషాయ కండువా కప్పుకుంటారని తెలిపారు. హోం మంత్రి అమిత్ షాతో చంపయ్ సోరెన్ సమావేశమైన ఫొటోను మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల బీజేపీ సహ ఇన్‌చార్జి కూడా అయిన హిమంత బిశ్వ శర్మ ఈ భేటీలో పాలుపంచుకున్నారు. జేఎంఎం (జార్ఖండ్ ముక్తి మోర్చా) నాయకత్వం తనను తీవ్రంగా అవమానించిందంటూ చంపయ్ సోరెన్ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

నాకేదైనా జరిగితే ఆర్మీ, ఐఎస్ఐలదే బాధ్యత

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ హెచ్చరిక



ఇస్లామాబాద్: తనకు ప్రాణహాని ఉందని, ఏదైనా జరిగితే ఆ బాధ్యత ఆర్మీ చీఫ్, ఐఎస్ఐ(ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్)డైరెక్టర్ జనరల్‌లదేనని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్(71) హెచ్చరించారు. వివిధ ఆరోపణలపై గతేడాది నుంచి అడియాలా జైలులో ఉన్న ఇమ్రాన్ మంగళవారం 'ఎక్స్'లో పలు వ్యాఖ్యలు చేశారు. దేశంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు, పాక్ క్రికెట్ జట్టు పదే పదే పరాజయాలను చవిచూడటానికి ప్రస్తుత ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన నిందించారు. 'నాపై ఉన్న కేసులకు సంబంధించిన వ్యవహారాలపై ఐఎస్ఐ నియంత్రణ నడుస్తోంది. మళ్లీ చెబుతున్నా.. నాకేదైనా జరగరానిది జరిగితే ఆర్మీ చీఫ్, ఐఎస్ఐ డీజీలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది'అని ఇమ్రాన్ పేర్కొన్నారు.

గందెర్‌బల్ బరిలో ఒమర్ అబ్దుల్లా

ఎన్నికల్లో పోటీ చేయరాదన్న నిర్ణయంపై యూటర్న్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి త్వరలో జరిగే ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా గందెర్‌బల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఎన్సీ మంగళవారం ఒమర్ అబ్దుల్లా సహా 32 మంది అభ్యర్థులతో కూడిన జాబితా విడుదల చేసింది. ఒమర్ గతంలో 2009, 2015 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా దక్కే వరకు ఎన్నికల్లో పోటీ చేయబోనని గతంలో ఒమర్ ప్రకటించడం తెలిసిందే. ఎన్సీ, కాంగ్రెస్ సీట్ల పంపకంపై సోమవారం ఒమర్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ.. 'అది నేను పూర్తిగా ఆలోచించకుండా తీసుకున్న తప్పుడు నిర్ణయం. అప్పటి నిర్ణయం విషయంలో నేను చాలా ఒత్తిడికి గురయ్యాను. ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇవ్వరాదని నిశ్చయించుకున్నాను''అని ఒమర్ చెప్పారు.

ప్రభుత్వాసుపత్రిలో ఘోరం

- బాలికపై సామూహిక అత్యాచారం
- రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘటన
- నిందితుల్లో ఆస్పత్రి మాజీ ఉద్యోగి

జోధ్‌పూర్: రాజస్తాన్‌లోని మహాత్మాగాంధీ ప్రభుత్వాసుపత్రిలో ఘోరం చోటుచేసుకుంది. జోధ్‌పూర్ నగరంలోని ఈ ఆస్పత్రిలో 15 ఏళ్ల బాలికపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. నిందితుల్లో ఒకరు ఈ ఆస్పత్రిలో మాజీ ఉద్యోగి కావడం గమనార్హం. జోధ్‌పూర్ సిటీ(వెస్ట్) ఏసీపీ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం బాలికను ఇంట్లో అమ్మ బాగా కోప్పడింది. దీంతో అలిగిన బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చి దగ్గర్లోని మహాత్మాగాంధీ ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది. అక్కడ ఒంటరిగా తిరుగుతున్న బాలికతో అక్కడే ఉన్న ఇద్దరు యువకులు మాటలు కలిపారు. తర్వాత బాలికను ఆస్పత్రి వెనుకభాగంలో ఆస్పత్రి బయోవ్యర్థాలను నిల్వఉంచిన డంపింగ్ యార్డ్ వద్దకు తీసుకెళ్లి గ్యాంగ్‌రేప్ చేశారు. అమ్మాయి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకుండాపోవడంతో కుటుంబసభ్యులు బాగా వెతికి చివరకు సోమవారం సూరసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఎట్టకేలకు సోమవారం సాయంత్రం గాంధీ ఆస్పత్రి సమీపంలో బాలిక జాడ కనిపెట్టారు. అమ్మాయి దొరికిందని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చాక ముందురోజు తాను ఎదుర్కొన్న భయానక ఘటనను తల్లిదండ్రులు, పోలీసులకు అమ్మాయి విడమరిచి చెప్పింది. దీంతో అమ్మాయిని ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసి నిందితుల జాడ కోసం వేట మొదలెట్టారు. ఎట్టకేలకు నిందితులను అరెస్ట్‌చేసి ప్రశ్నిస్తున్నారు. మంగళవారం ఉదయం డంపింగ్‌యార్డ్‌లోని ఘటనాస్థలికి వెళ్లి ఫోరెన్సిక్ బృందం సాక్ష్యాధారాలను సేకరించిందని ఏసీపీ చెప్పారు. '' పోలీసులు ఆస్పత్రికి వచ్చారుగానీ అసలేం జరిగిందో మాకు చెప్పలేదు. మేం అంతర్గతంగా వివరాలు రాబట్టగా నిందితుల్లో ఒకడు మా ఆస్పత్రిలో గతంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేశాడని తెల్సింది'' అని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫతాసింగ్ భాటి చెప్పారు. రాత్రిళ్లు ఆస్పత్రి పరిసరాల్లో ఎక్కడా చీకటి ఉండొద్దు. లైట్లు బిగించండి. చీకటి ప్రాంతం కనిపించొద్దు' అని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

విమర్శలు ఎక్కుపెట్టిన విపక్షాలు

బీజేపీ హయాంలో రాష్ట్రంలో ఆటవికపాలన నడుస్తోందని విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. '' ఆటవిక ఏలుబడికి తాజా ఘటన ఒక ఉదాహరణ మాత్రమే. శాంతిభద్రతల అంశం అటు ప్రజా ప్రతినిధులకు, ఇటు పోలీసులకు ఏమాత్రం పట్టట్లేదు. దీంతో నేరస్తులకు భయం లేకుండా పోయింది. ఒకప్పుడు నేరాలే జరగని జోధ్‌పూర్‌లో ఇప్పుడు బీజేపీ అస్తవ్యస్థపాలనతో నగరంలో అమ్మాయిలకు రక్షణ కరువైంది'' అని కాంగ్రెస్ నేత, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ అన్నారు. రాష్ట్రంలో అసలు శాంతిభద్రతలు అనేవే లేవని రాజస్తాన్ కాంగ్రెస్ చీఫ్ గోవింద్‌సింగ్ దోస్తారా అన్నారు.

నర్సింగ్ విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యం

- మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ఘటన
- నిందితుడి కోసం వేట

ముంబై: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యోదంతంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నవేళ మహారాష్ట్రలో ఒక నర్సింగ్ విద్యార్థిని రేప్‌కు గురైంది. ముఖంపై మత్తుమందు స్ప్రేచేసి అమ్మాయి అపస్మారక స్థితిలోకి వెళ్లాక ఆటో డ్రైవర్ రేప్‌చేసి పారిపోయిన ఘటన రత్నగిరి జిల్లా అటవీప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 19 ఏళ్ల అమ్మాయి దేవ్‌రుఖ్ పట్టణంలో నర్సింగ్ కోర్సు చేస్తోంది. సోమవారం తెల్లవారుజామున దేవ్‌రుఖ్ నుంచి రత్నగిరి పట్టణంలోని ఇంటికి వెళ్లేందుకు ఒక ఆటో ఎక్కింది. మార్గమధ్యంలో ఆటో డ్రైవర్ ముఖంపై మత్తుమందు స్ప్రే కొట్టడంతో అమ్మాయి స్పృహతప్పి ఆటోలో పడిపోయింది. దీంతో వెంటనే అమ్మాయిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి రేప్ చేసి తర్వాత చంపక్‌మైదాన్ సమీప అటవీ ప్రాంతంలో పడేసి వెళ్లిపోయాడు. స్పృహలోకి వచ్చిన అమ్మాయి తనకు జరిగిన దారుణం తెల్సి వెంటనే సోదరికి ఫోన్‌చేసి చెప్పింది. రహదారి దాకా నడిచి, తర్వాత ఎలాగోలా ఇల్లు చేరుకుంది. తర్వాత పోలీసులకు ఫిర్యాదుచేసింది. అయితే దాహంగా ఉన్నపుడు డ్రైవర్ ఇచ్చిన నీళ్లు తాగడంతో మత్తు వచ్చి స్పృహకోల్పోయానని తొలుత ఇచ్చిన ఫిర్యాదులో అమ్మాయి పేర్కొనడం గమనార్హం. అయితే ఎఫ్ఐఆర్ నమోదుచేసి రంగంలోకి దిగిన పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి ఆటో డ్రైవర్ ఆచూకీని కనిపెట్టే పనిలో పడ్డారు. ప్రస్తుతం బాధిత అమ్మాయి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోందని పోలీసులు తెలిపారు. టీనేజీ అమ్మాయికి జరిగిన అన్యాయం తెల్సి స్థానికుల్లో ఆగ్రహం కట్టలుతెంచుకుంది. సోమవారం రాత్రి ఆ మార్గంలో వెళ్లే రోడ్లను దిగ్బంధించి చాలా గంటలపాటు వాహనాల రాకపోకలను నిలిపేశారు. నిందితుడిని తక్షణం కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు.

ఏకగ్రీవంగా రాజ్యసభకు కేంద్రమంత్రులు బిట్టూ, కురియన్

న్యూఢిల్లీ: కేంద్రమంత్రులు రవనీత్‌సింగ్ బిట్టూ రాజస్తాన్ నుంచి, జార్జ్ కురియన్ మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం 3 గంటలకు ముగియడంతో మొత్తం ఏడుగురు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి తెలంగాణ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపేంద్ర కుష్వాహా (బిహార్), బీజేపీ నేతలు కిరణ్ చౌదరి (హరియాణా), మమతా మొహంతా (ఒడిశా), మానస్‌కుమార్ మిశ్రా (బిహార్)లు రాజ్యసభలోకి అడుగుపెట్టారు. 10 మంది రాజ్యసభ ఎంపీలు లోక్‌సభకు ఎన్నికకావడం, ఇద్దరు రాజీనామా చేయడంతో.. మొత్తం 12 స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చాయి. దరియాశీల్ పాటిల్ (బీజేపీ-మహారాష్ట్ర), నితిన్ పాటిల్ (ఎన్సీపీ- మహారాష్ట్ర), రామేశ్వర్ తేలి, మిషన్ రంజన్‌దాస్ (బీజేపీ- అస్సాం)లను సోమవారమే విజేతలుగా ప్రకటించారు. మొత్తం మీద 11 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్రిపురలోని ఏకైక స్థానానికి సెప్టెంబరు 3న ఎన్నిక జరగనుంది. త్రిపుర బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ భట్టాచర్జీ, సీపీఎం అభ్యర్థి సుధన్ దాస్ పోటీ పడుతున్నారు.

పుతిన్‌కు మోదీ ఫోన్

ఉక్రెయిన్–రష్యా మధ్య శాంతి యత్నాలకు మద్దతు ఉంటుందని వెల్లడి

న్యూఢిల్లీ/మాస్కో: ఉక్రెయిన్–రష్యా సంఘర్షణకు సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిష్కారం లభించాలని కోరుకుంటున్నామని, అందుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల నడుమ శాంతికి చర్చలు, దౌత్యమార్గాల్లో ముందుకు వెళ్లాలని సూచించారు. ఆయన మంగళవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ఇరు దేశాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలపై చర్చించారు. ఇటీవల జరిగిన ఉక్రెయిన్ పర్యటన విశేషాలను పుతిన్‌కు వివరించారు. ఈ మేరకు మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. పుతిన్‌తో అర్థవంతమైన చర్చ జరిగిందని పేర్కొన్నారు. భారత్–రష్యా మధ్య ప్రత్యేకమైన, విశేషమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించామని తెలిపారు. ఇరు దేశాల నడుమ ద్వైపాక్షిక అంశాలపై ప్రగతిని సమీక్షించామని వెల్లడించారు. ఉక్రెయిన్–రష్యా సంఘర్షణపై తన అభిప్రాయం తెలియజేశానని, ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనాలని తాము కోరుకుంటున్నట్లు పుతిన్‌కు వివరించానని పేర్కొన్నారు. శాంతి కోసం జరిగే ప్రయత్నాలకు మద్దతు ఉంటుందని చెప్పానని తెలిపారు. మోదీ ఈ నెల 23న ఉక్రెయిన్‌లో అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన సంగతి తెలిసిందే. భారత్‌లో పర్యటించాలంటూ జెలెన్‌స్కీని ఆహ్వానించారు.



అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సుకు మోదీ

రష్యాలోని కజన్‌లో అక్టోబర్‌లో జరిగే 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోదీ హాజరుకాబోతున్నారు. ఈ విషయాన్ని మంగళవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరిగిన చర్చలో ధ్రువీకరించారు.

81 డ్రోన్లు బాలిస్టిక్ క్షిపణులు..

ఉక్రెయిన్‌పై మళ్లీ విరుచుకుపడ్డ రష్యా

కీవ్: ఉక్రెయిన్‌పై సోమవారం 100 డ్రోన్లు, మరో 100 క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా..వరుసగా రెండో రోజు మంగళవారం మరో 81 డ్రోన్లతోపాటు బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లను ప్రయోగించింది. తాజా దాడుల్లో ఐదుగురు మృతి చెందగా మరో 16 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా దాడులకు కచ్చితంగా బదులు తీర్చుకుంటామన్నారు. రాజధాని కీవ్‌పైకి దూసుకొచ్చిన డ్రోన్లు, మిస్సైళ్లను అన్నిటినీ గాల్లోనే పేల్చేశామని, శకలాల కారణంగా అడవుల్లో మంటలు చెలరేగాయని యంత్రాంగం తెలిపింది. మంగళవారం కూడా రష్యా తమ విద్యుత్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుందని ప్రధాని డెనిస్ చెప్పారు.

కర్క్స్‌లో 500 చదరపు మైళ్ల భూభాగం స్వాధీనం: ఉక్రెయిన్

కర్క్స్ రీజియన్‌లోకి మూడు వారాల క్రితం మెరుపుదాడి చేసి చొచ్చుకుపోయిన తమ బలగాలు ఇప్పటి వరకు 500 చదరపు మైళ్ల ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాయని ఉక్రెయిన్ తెలిపింది. మరో 594 మంది రష్యా జవాన్లను బందీలుగా పట్టుకున్నామంది. కాగా, కర్క్స్‌లో తమ ఎదురు దాడుల్లో ఉక్రెయిన్‌కు చెందిన 6,600 బలగాలు చనిపోవడమో గాయపడటమో జరిగిందని రష్యా ప్రకటించుకుంది. మరో 70 యుద్ధ ట్యాంకులతోపాటు సాయుధ వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. మరో నాలుగు క్షిపణులను కూల్చివేశామంది.

గాజాలో 20 మంది పాలస్తీనియన్లు మృతి

జెరూసలేం: గాజాపై మంగళవారం ఇజ్రాయెల్ దాడిల్లో కనీసం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖాన్‌యూనిస్, డెయిల్ అల్ బలాహ్‌పై జరిగిన ఈ దాడుల్లో పలు భవనాలు నేలమట్టమయ్యాయని అధికారులు తెలిపారు. మృతుల్లో సగం మంది మహిళలు, చిన్నారులున్నట్లు చెప్పారు. టుల్కారెమ్‌లోని నూర్‌షామ్స్ శరణార్థి శిబిరంపై దాడుల్లో ఐదుగురు చనిపోయారు. ఇజ్రాయెల్ ఆంక్షలతో గాజాలో 10 లక్షల మందికి నెల రోజులుగా కనీస సాయం కూడా అందడం లేదని ఐరాస తెలిపింది.

హమాస్ చెర నుంచి బందీని కాపాడిన ఆర్మీ



హమాస్ చెరలో ఉన్న తమ పౌరుడిని మంగళవారం ఇజ్రాయెల్ ఆర్మీ కాపాడింది. గతేడాది అక్టోబర్ ఏడున గాజా సరిహద్దుల సమీపంలోని ఇజ్రాయెల్ భూభాగంపై హమాస్ మిలిటెంట్లు దాడి చేసి 1,200 మందిని చంపడం, 250 మందిని బందీలుగా పట్టుకోవడం తెలిసిందే. వారిలో క్వాయిద్ ఫర్హాన్ అల్‌కాదీ(52) అనే వ్యక్తిని గాజా కాపాడినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. హమాస్ చెర నుంచి ఇజ్రాయెల్ ఇప్పటి వరకు 8 మందిని కాపాడింది. ఇంకా 110 మంది బందీలుగా ఉన్నట్లు భావిస్తున్నారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం। 28। ఆగస్టు। 2024



వాటర్ స్పోర్ట్స్.. కయాకింగ్..
కయాకింగ్..ఓ వెరైటీ జలక్రీడ. ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాల్లో ఇది అందుబాటులో ఉంది. దీంతో ఈ జలక్రీడను నగర వాసులు ఆస్వాదిస్తున్నారు. - సిటీప్లస్‌లో..



మేము లోకల్..
నగర యువత మోడలింగ్ వైపు మొగ్గుచూపుతోంది. దీంతో అవకాశాలు పెరుగుతున్నాయి. మోడలింగ్ నుంచి కొందరు సినీరంగం..ఓటీటీ వైపు అడుగులు వేస్తున్నారు. - సిటీప్లస్‌లో..

గరిష్టం/కనిష్టం
31.0/23.0
వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రం వేళ చల్లని గాలులు వీస్తాయి.


ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టు


అన్ని ఆటలకు అనువుగా క్రీడా స్థలం

వెరైటీ స్టేడియం!

ఫ్లై ఓవర్ కింద వివిధ క్రీడలు..

- రూ.80 లక్షల వ్యయంతో కూకట్‌పల్లి నెక్సస్ మాల్ ఫ్లై ఓవర్ కింద పనులు పూర్తి
- త్వరలో ప్రారంభం
- మరో మూడు ఫ్లై ఓవర్ల కింద స్టేడియాల నిర్మాణానికి టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: సిటీలో ఓ వెరైటీ స్టేడియం అందుబాటులోకి వస్తోంది. ఇది పూర్తిగా ఇండోర్ స్టేడియం కాదు. అలాగని ఔట్‌డోర్ స్టేడియమూ కాదు. రెండింటినీ తలపించే ఈ స్టేడియాన్ని జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్‌లోని నెక్సస్ మాల్ ఫ్లై ఓవర్ కింద నిర్మించారు. చేయి తిరిగిన చిత్రకారుడి చేతిలోంచి జాలువారినట్లుగా అందాల రంగులు, హంగులతో కనబడుతున్న దృశ్యాలే మిటా అని దగ్గరకు వెళ్తే కానీ అది స్టేడియం అని, వివిధ క్రీడలకు సదుపాయం ఉందని తెలియదు. ఈ ఫ్లైఓవర్ కింద గతంలో అడ్డదిడ్డంగా వాహనాల్ని పార్కింగ్ చేస్తుండటంతో దాన్ని పార్కింగ్ ప్రదేశంగా తీర్చిదిద్దితే జిగ్‌జాగ్ పార్కింగ్ సమస్యలు తీరడంతో పాటు ఆదాయ వనరుగానూ ఉంటుందని భావించిన జీహెచ్ఎంసీ యంత్రాంగం దాదాపు మూడేళ్లక్రితం అక్కడ స్మార్ట్ పార్కింగ్ సదుపాయాలు కల్పించింది. కానీ, దానివల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. దీంతో క్రీడా స్టేడియం వైపు మొగ్గు చూపారు.

నవీ ముంబై స్ఫూర్తితో..
నవీ ముంబైలో ఓ ఫ్లైఓవర్ కిందిభాగాన్ని గ్రౌండ్‌గా మార్చి క్రికెట్ ఆడుతుండటాన్ని గుర్తించిన గత ప్రభుత్వం నగరంలోనూ అలాంటి సదుపాయాలు కల్పించాలని భావించింది. అందుకుగాను అనువైన ఫ్లై ఓవర్లను పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించిన నేపథ్యంలో స్మార్ట్ పార్కింగ్ స్థానే ఈ ఫ్లై ఓవర్ కింద వివిధ క్రీడలకు స్టేడియంగా తీర్చిదిద్దాలని అధికారులు ఆలోచించారు. కానీ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు రావడం, ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, తదితర కారణాలతో అప్పట్లో పనులు జరగలేదు. ప్రస్తుతం పనులు పూర్తయి, త్వరలో ప్రారంభం కానుంది. కేవలం క్రీడాకారులకు ఆటలు మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా దీన్ని తీర్చిదిద్దారు. టీ, కాఫీ, కూర్చుని సేదదీరే సదుపాయాలు వంటివి ఉన్నాయి.



స్టేడియం వివరాలు
వ్యయం: రూ. 80 లక్షలు
విస్తీర్ణం: 1150 చదరపు మీటర్లు
కోర్టులు: 2
మొదటి కోర్టులో: బాక్స్ క్రికెట్, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్.
రెండో కోర్టులో: స్కేటింగ్, చెస్, పరమపద సోపానం (వైకుంఠపాళి)
- వీటితోపాటు క్రీడాకారులు దుస్తులు మార్చుకునే సదుపాయం, షూ రాక్ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఇదే ప్రథమం..
ఫ్లై ఓవర్ల కింద ఇలాంటి సదుపాయాలు దేశంలోని నవీముంబై, చెన్నయ్, ఇండోర్, తదితర నగరాల్లో ఉన్నప్పటికీ రాష్ట్రంలో మాత్రం ఇదే ప్రథమం. దీని ద్వారా ఫ్లై ఓవర్ కింది ఖాళీ స్థలం ప్రయోజనకరంగా మారడంతోపాటు స్థానిక క్రీడాకారులకు దగ్గరలోనే మంచి సదుపాయంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా క్రీడల్లో ఆసక్తి ఉన్న పిల్లలకు ఇది ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. స్టేడియం వినియోగంలోకి వచ్చాక, నిర్వహణ పనుల్ని ప్రైవేటు ఏజెన్సీకిచ్చే యోచనలో ఉన్నారు.

మరిన్ని ఫ్లై ఓవర్ల కింద..
ఫ్లై ఓవర్ కింద చూడచక్కగా ఉండి ఈ స్టేడియం పలువురిని ఆకర్షిస్తుండటంతో నగరంలోని ఇతర ఫ్లై ఓవర్ల కింద సైతం ఇలాంటి స్టేడియంలు నిర్మించాలనే యోచనలో జీహెచ్ఎంసీ ఉంది. హైటెక్‌సిటీ, బాలానగర్, కైథలాపూర్‌ల వద్ద నిర్మించేందుకు ఇప్పటికే టెండర్లు కూడా ఆహ్వానించారు. అయితే ఇలాంటి వాటివల్ల జనం గుమికూడి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే అవకాశాలుంటాయని అభిప్రాయపడుతున్న వారూ ఉన్నారు. వాహనదారుల దృష్టి కూడా స్టేడియం వైపు మళ్లి ప్రమాదాలకు ఆస్కారముంటుందనే అభిప్రాయాలూ వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వాటికి తావులేకుండా జీహెచ్ఎంసీ తగిన సేఫ్టీ ఏర్పాట్లు కూడా చేయాలని కోరుతున్నారు.

'హజ్ దరఖాస్తుల' నమోదులో అంతరాయాలు

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్ర-2024 దరఖాస్తుల ప్రక్రియకు ఆన్‌లైన్ సమస్యల వల్ల తీవ్ర అంతరాయం కలుగుతోంది. దరఖాస్తు చేసుకునే యాత్రికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15న 2024 హజ్ యాత్రకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రాంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్ర హజ్ కమిటీ సర్వర్ డౌన్ ఉండడంతో దరఖాస్తులు అప్‌లోడ్ కావడం లేదని యాత్రికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర హజ్ కమిటీ యాత్రికుల సౌకర్యార్థం హజ్ హౌస్‌లో ఎనిమిది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. 16వ తేదీ నుంచి దరఖాస్తులు అప్‌లోడ్ అవుతున్నా..మధ్య మధ్యలో సర్వర్ పనిచేయడం లేదు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే వారు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు దరఖాస్తు కోసం ఓటీపీ వస్తుంది. అయితే సమయానికి ఓటీపీ రాకపోవడంతో దరఖాస్తు మధ్యలోనే ఆగిపోతుందని యాత్రికులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీ సమన్వయంతో దరఖాస్తుదారులు పడుతున్న ఇబ్బందులను గ్రహించి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో గతంలో ఉనన్నట్లు నేరుగా దరఖాస్తులు తీసుకోవాలని యాత్రికులు కోరుతున్నారు. దీనిపై హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి లియాకత్ మాట్లాడుతూ కేంద్ర హజ్ కమిటీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఒకేసారి ఎక్కువ మంది అప్‌లోడ్ చేస్తుండడం వల్ల గత వారం అంతరాయాలు ఏర్పడినట్లు పేర్కొన్నారు.

'పోష్'పై హెచ్‌సీఎస్‌సీ అవగాహన

సదస్సును ప్రారంభించిన కొత్వాల్ శ్రీనివాసరెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: పని ప్రదేశాల్లో మహిళలకు ఇబ్బందులు తొలగించేందుకు ఉద్దేశించిన లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సిఎస్‌సి) నిర్ణయించింది. వివిధ సంస్థల అంతర్గత కమిటీ సభ్యులతో దీనికి శ్రీకారం చుట్టింది. దీనికోసం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో ఉన్న సురానా హాల్‌లో మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన నగర కొత్వాల్ కొత్త కోట శ్రీనివాసరెడ్డి నగరంలో ప్రతి పని ప్రదేశం యువతులు, మహిళలకు భద్రంగా తయారు చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ మొదటి సదస్సులో దాదాపు 100 మంది మహిళలు పాల్గొన్నారు. పోష్ చట్టంపై అవగాహన కోసం రూపొందించిన 10 చిన్న వీడియోలను ఆయన ఆవిష్కరించారు. వీటిని సినిమా థియేటర్లతో పాటు బహిరంగ ప్రదేశాల్లోనూ ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ కళాశాలలో లా కోర్సుకు అనుమతి నిరాకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీలో కొనసాగుతున్న ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల లా కోర్సుకు ఈ విద్యా సంవత్సరానికి (2024-25) బార్ కౌన్సిల్ అనుమతి నిరాకరించింది. దీంతో లాసెట్-2024 కౌన్సెలింగ్ జాబితా నుంచి బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీ పేరును తొలగించారు. లా కాలేజీలో కేవలం ఒకే పర్మనెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉన్నందున బార్ కౌన్సిల్ అనుమతి నిరాకరించిన్నట్లు తెలిసింది. దీంతో ఆందోళన చెందిన లా విద్యార్థులు మంగళవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణను కలసి వినతి పత్రం సమర్పించారు. ఎల్‌ఎల్‌బీ కోర్సు రద్దు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ధర్మారపు శ్రీకాంత్, వంశీ, సందీప్, వినీత్ రెడ్డి, శ్రీను, అశోక్, శివ, సాయి, ప్రదీప్ తెలిపారు.

'భూమ్' అంతంతే..!

హెచ్ఎండీఏ పరిధిలో ఇలా

ఆర్థిక సంవత్సరం	దస్తావేజులు	రాబడి (రూ.కోట్లలో)
2016-17	2,44,158	2,228.85
2017-18	2,95,085	3,002.2
2018-19	4,13,349	3,786.52
2019-20	3,90,738	3.944.34
2020-21	2,24,533	2.825.00
2021-22	4,07,227	6,759.93
2022-23	2,83,592	6,854.71
2023-24	2,68,952	7,476.92

తగ్గుతున్న స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు..
- గత పదేళ్లుగా ఇదే పరిస్థితి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ విశ్వనగరంగా విస్తరిస్తున్నా..అంతర్జాతీయ స్థాయిలో భారీ పెట్టుబడులతో ఐటీ, ఫార్మా సంస్థలు కొత్తగా నెలకొంటున్నప్పటికి స్థిరాస్తి రంగం పరిస్థితి మాత్రం ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం కూడా ఆశించినంత స్థాయిలో స్థిరాస్తి దూకుడు లేకుండా పోయింది. గత పదేళ్ల నుండి స్థిరాస్తి క్రయవిక్రయాలు అంతంత మాత్రంగా మారాయి. కరోనా తర్వాత ఏడాది కాలం పాటు లావాదేవీలు కొంత పర్వాలేదనిపించినా..గత రెండేళ్ల నుంచి పరిస్థితి మళ్లీ స్తబ్ధంగా తయారైంది. ప్రధానంగా ఇళ్ల, ఫ్లాట్స్ విక్రయాలు బాగా పడిపోగా, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లు మాత్రం కొద్దిగా పెరిగాయి. ప్రధానంగా గృహ రుణాల వడ్డీ రేట్లు, స్థిరాస్తుల ధరలు విపరీతంగా పెరగడంతో అమ్మకాలు ఆశించినంత స్థాయిలో జరగడం లేదని తెలుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే స్థిరాస్తి రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందంటున్నారు.

ఓపెన్ ప్లాట్స్..నమోదు టాప్
- గత ఆర్థిక సంవత్సరంలో ఖాళీ స్థలాల క్రయవిక్రయాలు అత్యధికంగా జరిగినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద 2023-24 ఆర్థిక సంవత్సరం సుమారు 2,68,962 దస్తావేజులు నమోదైతే అందులో 1,33,854 (49.77%) రిజిస్ట్రేషన్లు ఖాళీ స్థలాలకు సంబంధించి కావడం విశేషం. ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు 88,195 (32.79%) జరుగగా, ఇండిపెండెంట్ గృహాలాకు సంబంధించింది మాత్రం 46,913 (17.44%) దస్తావేజులు నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- రిజిస్ట్రేషన్ల శాఖకు హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధి నుంచే భారీగా ఆదాయం సమకూరుతోంది. దస్తావేజుల నమోదు తగ్గినా..మార్కెట్ వాల్యూలు, భూముల ధరలు పెరగడం వల్ల రాబడి మాత్రం దండిగా పెరిగింది. కరోనా కాలంలో 2020-21 ఆర్థిక సంవత్సరం క్రయవిక్రయాలు మొక్కుబడిగా నమోదు కావడంతో ఆదాయం కొద్దిగా తగ్గు ముఖం పట్టినప్పటికి ఆ తర్వాత ఎగబాగుతూ వస్తోంది. మొత్తం మీద గత ఆర్థిక సంవత్సరం కేవలం స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ద్వారానే సుమారు రూ.7,476.92 కోట్ల ఆదాయం సమకూరింది. అందులో ఫ్లాట్ దస్తావేజుల నమోదుతో రూ.3875 కోట్లు (51.84%), ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌తో రూ.1,880.74 కోట్లు (25.15%), ఇండిపెండెంట్ ఇళ్ల ద్వారా 1,720.21 కోట్ల (23.01%)ఆదాయ లభించింది.
- రాష్ట్రం మొత్తం మీద 2023-24 ఆర్థిక సంవత్సరం స్థిరాస్తి క్రయవిక్రయాలతోపాటు ఇతరత్రా దస్తావేజల నమోదుతో సుమారు రూ.14,588 కోట్లు ఆదాయం సమకూరితే అందులో అత్యధికంగా 62 శాతం అంటే రూ.8 వేల 874 కోట్లు రాబడి గ్రేటర్‌లోని నాలుగు జిల్లాల నుంచే వచ్చినట్లు తెలుస్తోంది. గ్రేటర్ జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచి రూ.4 వేల 926 కోట్లు, మేడ్చల్ జిల్లా నుంచి రూ.2 వేల 531 కోట్లు, సంగారెడ్డి జిల్లా నుంచి రూ.1,417 కోట్లు సమకూరాయి.

'పర్యావరణ' గణపతికే జై కొడదాం



సుప్రీం కోర్టు తీర్పుకనుగుణంగా గణేష్ ఉత్సవాలు

- మట్టి గణపతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం
- ప్రశాంత ఉత్సవాలకు అందరూ సహకరించాలి
- సమీక్ష సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం

బంజారాహిల్స్: సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా పర్యావరణహిత గణేష్ ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, మట్టి గణపతులనే పూజించే విధంగా ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గణేష్ ఉత్సవాలు-24 సన్నాహక సమీక్షా సమావేశం మంగళవారం హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ సహకారంతో ఈ ఏడాది కూడా వినాయక చవితి వేడుకలను, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటామని వెల్లడించారు. సెప్టెంబర్ 17న నిమజ్జనం ఉంటుందన్నారు. భాగ్యనగర్ ఉత్సవ కమిటీ తరుపున, ఇతర గణేష్ ఉత్సవాల కమిటీల ప్రతినిధులు చేసిన సూచనలను పరిగణలోనికి తీసుకుంటామని, వాటిని తప్పనిసరిగా అమలు చేస్తామని వెల్లడించారు. మట్టి విగ్రహాలపై పోస్టర్లు కూడా ఆవిష్కరించామని, క్యాంపెయిన్ కూడా చేపడుతున్నామని, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎకో ఫ్రెండ్లీ ఉత్సవాలు అందరికీ మంచిదని, గణేష్ ఉత్సవ కమిటీలు కూడా ఈ విషయంలో అవగాహన కల్పించాలన్నారు. మెట్రో, ఎంఎంటీఎస్ సేవలు కూడా భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నిమజ్జనోత్సవాలను సమన్వయంతో శాంతియుత వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక మండపాలకు, గణేష్ శోభాయాత్రలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామని, మంత్రులు, ఎమ్మెల్యేలందరూ ఈ వేడుకల్లో పాల్గొంటారన్నారు. సమావేశంలో డీజీపీ జితేందర్‌రెడ్డి, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు పాల్గొన్నారు.

ఎవరెవరు ఏమి సూచనలు చేశారంటే..
- విగ్రహాల నిమజ్జనం కోసం అదనంగా క్రెయిన్లు ఏర్పాటుచేయాలని, మెకానిక్‌లు, డ్రైవర్లు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఉత్సవాల కోసం 8వేల మంది పోలీసులను బందోబస్తు కోసం నియమిస్తున్నామన్నారు.
- నిమజ్జనం జరిగే చెరువుల్లో వాటర్ లెవల్స్ తగ్గాయని, కొన్ని చోట్ల డీసిల్టింగ్ చేయలేదని, ఈ విషయాన్ని పరిగణలోనికి తీసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. గత ఏడాది 16,904 విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని, ఈ సారి పెరిగే అవకాశం ఉందన్నారు. 49 ప్రాంతాల్లో నిమజ్జనం ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.
- సైబరాబాద్ పరిధిలో గత ఏడాది 11,387 విగ్రహాలు నిమజ్జనం జరిగాయన్నారు. ఈ సారి కూడా 5 శాతం మేర పెరిగే అవకాశం ఉందని అదనపు కమిషనర్ తెలిపారు. 2467 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం వినియోగిస్తున్నామన్నారు.
- నిమజ్జనం దృష్ట్యా హుస్సేన్‌సాగర్‌లో మ్యూజికల్ ఫౌంటెన్‌ను తాత్కాలికంగా తొలగిస్తున్నామని జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్‌లలో నిమజ్జనం కోసం 23 ఫ్లాట్‌ఫాంలు ఏర్పాటుచేసి 33 క్రేన్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. 24 గంటల పాటు పనిచేసేవిధంగా శానిటేషన్ వర్కర్లను, స్వీపర్లను, 100 మినీ టిప్పర్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.
- ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ నిమజ్జనం కోసం 57 ట్రాన్స్‌ఫార్మర్లు, 22 మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. 3457 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారన్నారు. 260 మంది సిబ్బందిని తాత్కాలికంగా నియమిస్తున్నామన్నారు. స్ట్రీట్‌లైట్లు కూడా ఏర్పాటుచేస్తున్నామని వెల్లడించారు.
- రవాణా శాఖ కమిషనర్ మాట్లాడుతూ నిమజ్జనం కోసం 2023 టస్కర్లను మండపాల నుంచి విగ్రహాలను తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 70 మంది సిబ్బందిని నియమించామన్నారు.
- ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ నిమజ్జనం జరిగే చెరువుల్లో ప్రతిరోజూ వాటర్ లెవల్ మానిటరింగ్ చేస్తున్నామని, హుస్సేన్‌సాగర్‌తో పాటు సరూర్‌నగర్ చెరువులో ఎఫ్‌టీఎల్ నిర్వహణపై దృష్టిపెట్టామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం తదితరులు


ఏకీకృత పెన్షన్ విధానంతో 63 వేల మందికి లబ్ధి

దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్' వల్ల దక్షిణమధ్య రైల్వేలో 63 వేల మందికి లబ్ధి చేకూరుతుందని చీఫ్ పర్సనల్ మేనేజర్ పి.కిషోర్‌బాబు తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎస్. వివేకానంద, రైల్వే ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నూతన పెన్షన్ స్కీమ్ సభ్యులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ ఏకీకృత పెన్షన్ పథకాన్ని ఎంచుకోవచ్చని కిషోర్‌బాబు పేర్కొన్నారు. దాదాపు 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకం వల్ల లబ్ధి పొందుతారని అన్నారు. ఇందులో భాగంగా, దక్షిణ మధ్య రైల్వేలో ప్రస్తుతం పనిచేస్తున్న దాదాపు 63 వేల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. జోన్ పరిధిలోని మొత్తం పింఛన్ దారులలో 75 శాతం ఈ పథకానికి అర్హత కలిగి ఉన్నట్లు చెప్పారు. మొత్తం 5 ప్రధాన ప్రయోజనాలతో ఈ పథకం వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. హామీ ఇచ్చిన పెన్షన్, హామీ ఇచ్చిన కుటుంబ పెన్షన్, హామీ ఇచ్చిన కనీస పెన్షన్, గ్రాట్యుటీతో పాటుగా పదవీ విరమణలో ద్రవ్యోల్బణ సూచిక ఆధారంగా ఏకమొత్తం చెల్లింపులు ఉంటాయి. నూతన పెన్షన్ పథకంతో పోలిస్తే ఏకీకృత పెన్షన్ పథకం మరింత ప్రయోజనకరంగా ఉందని, ఇది హామీతో కూడిన పెన్షన్‌ను అందజేస్తుందని చీఫ్ పర్సనల్ మేనేజర్ అభిప్రాయపడ్డారు.ఈ పథకం ద్వారా సిబ్బందికి గౌరవం, ఆర్థిక భద్రత కలుగుతుందన్నారు.ఈ పథకంపైన ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌బాబు

నీళ్లు ఫుల్లు


నాగార్జున సాగర్ జలాశయం

పూర్తిగా నిండిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు
- పూర్తి నీటి మట్టానికి చేరువలో శ్రీపాద ఎల్లంపల్లి
- వచ్చే వేసవిలో కృష్ణా, గోదావరి జలాలకు బేఫికర్
- నగరానికి తాగునీటి సమస్య లేనట్లే..

ప్రధాన జలాశయాల్లో ఇలా..

ప్రధాన జలాశయం	పూర్తి స్థాయి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం	గతేడాది నీటి మట్టం (అడుగుల్లో)
నాగార్జున సాగర్	590.000	590.000	522.200
శ్రీపాద ఎల్లంపల్లి	485.560	482.734	484.931


శ్రీపాద ఎల్లంపల్లి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి తాగు నీటిని అందించే రెండు ప్రధాన జలాశయాల్లో దండిగా నీరు వచ్చి చేరింది. ఇప్పటికే కృష్ణా జలాలు సరఫరా చేసే నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారగా, గోదావరి జలాలను అందించే శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం పూర్తి నీటి మట్టానికి రెండు అడుగుల దూరంలో ఉంది. మహానగరానికి తాగు నీటి అవసరాలకు ఈ రెండు ప్రధాన జలాశయాలే ఆధారం. ఈ రెండింటి నుంచే సుమారు 75 శాతంపైగా నీటి సరఫరా ఉంటుంది. కృష్ణా తాగునీటి సరఫరా పథకం 1, 2, 3 దశల కింద నాగార్జున సాగర్ జలాశయం నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా రోజువారీ 270 ఎంజీడీల నీటిని తరలిస్తుండగా, గోదావరి నీటి సరఫరా పథకం కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 168 ఎంజీడీల సరఫరా జరుగుతోంది. అయితే గతేడాది ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరక పోవడంతో వేసవి కాలంలో రెండు జలాశయాల నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. దీంతో అత్యవసర పంపింగ్ ఏర్పాటు చేసి నీటిని తరలించి తాగునీటిని సరఫరా చేశారు.

సాగర్‌లో పూర్తి స్థాయి నీటి మట్టం
నాగార్జున సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరింది. ఎగువ కురిసిన వర్షాలకు కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున వరద పోటెత్తి నాగార్జున సాగర్ జలాశయం నిండకుండగా మారింది. సాగర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 312.040 టీఎంసీలకు చేరింది. దినసరి ఎగువ ప్రాంతం నుంచి 5.050 టీఎంసీల నీరు వచ్చి చేరుతోంది.

అతి దగ్గరలో శ్రీపాద ఎల్లంపల్లి
శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం పూర్తి నీటి మట్టానికి రెండు అడుగుల దూరంలో ఉంది. ఎగువ ప్రాంతం కడెం ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి పూర్తి స్థాయి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 17.758కి చేరింది. ఈ ప్రాజెక్టు నీటిని నగరంలోని కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్ పరిధిలోకి వచ్చే..మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, లింగంపల్లి, మియాపూర్, చందానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, అల్వాల్, మల్కాజ్ గిరి తదితర ప్రాంతాలకు గోదావరి జలాలు సరఫరా జరుగుతోంది.

చట్టపరమైన హక్కులను బలోపేతం చేయాలి



- సెక్స్ వర్కర్ల హక్కుల పై ప్రత్యేక సమావేశం..
- హక్కుల పై అవగాహన కల్పించిన జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి డా.విజయ భాస్కర్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: సామాజికంగా సెక్స్ వర్కర్ల విషయంలో జరగుతున్న అన్యాయం, వారు కోల్పోతున్న చట్టపరమైన హక్కులు తదితర అంశాల్లో అవగాహన కల్పించడమే కాకుండా వారి హక్కులు పొందేలా చూడాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి డా.విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. నగరానికి చెందిన అస్థిత్వం, దర్పణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సెంట్రల్ పార్క్ వేదికగా సెక్స్ వర్కర్లు వారి చట్టపరమైన హక్కులతో నిమగ్నమవ్వడం అనే అంశంపైన జిల్లా స్థాయి అడ్వకసీ మీటింగ్ నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి డా.విజయ భాస్కర్ రెడ్డి... 'బుద్ధదేవ్ కర్మస్కర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ కేసులో సెక్స్ వర్కర్ల సంక్షేమం, భద్రత కోసం సుప్రీం కోర్టు భారత ప్రభుత్వానికి చేసిన సిఫార్సులను వివరించారు'. వయోజన సెక్స్ వర్కర్లకు సంబంధించి చట్టపరమైన హక్కులను బలోపేతం చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తెలంగాణలో సెక్స్ వర్కర్స్ ఉద్యమం, ఎల్‌జీబీటీక్యూఐ ట్రాన్స్ ఉద్యమ ప్రయాణాలపై ట్రాన్స్ జెండర్ హిజ్రా సెక్స్ వర్కర్స్ హక్కుల కార్యకర్త రచన ముద్రబోయిన వివరించారు. కార్యక్రమంలో దర్పణ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కార్తీక్, అస్థిత్వం ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు జశకేత్ పరుచూరి, విష్ణుతేజ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి సరఫరా ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

అల్వాల్: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నేరెడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాసిక్ ప్రాంతానికి చెందిన వాల్మీకి సామగ్రిని తరలించే వాహనాన్ని నడిపేవాడు. అతను తన బంధువు బటుదేవరం చౌహాన్, అరకు ప్రాంతానికి చెందిన తిరుపతిలతో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. మహారాష్ట్ర నుండి

60 కేజీల గంజాయి స్వాధీనం

విశాపట్నం కూరగాయల మార్కెట్‌కు ఉల్లిగడ్డలను తరలించేవారు. ఉల్లిగడ్డల చాటున గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసులు, మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి వీరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 60 కిలోల గంజాయి, 1500 నగదు, 3 సెల్‌ఫోన్లు, మారుతి స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నాడెం చెరువులో మెడికల్ కాలేజ్

జనగామ ఎమ్మెల్యే పల్లా చుట్టూ బిగుస్తున్న బఫర్ జోన్ ఉచ్చు



వెంకటాపూర్ నాడెం చెరువు ఏరియల్ వ్యూ

- నాడెం చెరువు విస్తీర్ణం 61 ఎకరాలు
- 3 ఎకరాల బఫర్‌జోన్‌లో నీలిమా మెడికల్ కాలేజ్ భవన నిర్మాణాలు
- మరో రెండు ఎకరాల్లో వెలసిన 25 బహుళ అంతస్తుల భవనాలు
- భూ ఆక్రమణలపై పీఎస్‌లో ఫిర్యాదు చేసిన నీటిపారుదల శాఖ
- హైడ్రాకు ఫిర్యాదుతోపాటు కోర్టును ఆశ్రయించిన స్థానికులు

సాక్షి,సిటీబ్యూరో/ఘట్కేసర్: నగర శివారుల్లో కోట్లాది రూపాయల విలువ చేసే చెరువు భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.చెరువులు, కుంటలను రక్షించే అధికారులు ఆక్రమార్కులకు అండగా నిలుస్తున్నందునే ఈ దుస్థితి నెలకొంది. చెరువుల రక్షణకు వాల్టా చట్టం తెచ్చినా చెరువులు,కుంటల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల్లో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం, వెంకటాపూర్ సర్వే నం .81, 82, 814, 815, 816లోని 61 ఎకరాల్లో నాడెం చెరువు విస్తరించి ఉంది. చెరువు చుట్టూ సర్వేనం. 81, 82 పార్ట్, 810, 813లో 17 ఎకరాల్లో విస్తీర్ణంలో బఫర్ జోన్ ఉంది. సర్వే నంబర్ 813లోని నాడెం చెరువు బఫర్ జోన్‌లో జనగామ ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనురాగ్ యూనివర్సిటీ, నీలిమా మెడికల్ కాలేజ్ భవనంతో పాటు ఇతర భవనాలు నిర్మించారని ప్రభుత్వానికి, సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. బఫర్ జోన్‌ను సంరక్షించి జలవనరులను కాపాడాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గణేశ్‌నాయక్ కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. కేసును పరిశీలించిన హైకోర్టు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో బఫర్ జోన్ డొంక కదిలింది. హైకోర్టు ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అధికారుల అండదండలతో..

రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాడెం చెరువు బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలు వెలిశాయన్న ఆరోపణలు ఉన్నాయి. బఫర్‌జోన్‌లో నిర్మించిన 25 భవనాలతో సహా నీలిమా మెడికల్ కాలేజ్‌కు విద్యుత్ శాఖ అధికారులు మీటర్లు సైతం బిగించారు. ఆయా కాలనీల్లో ప్రభుత్వ నిధులతో రోడ్లు నిర్మించారు. నీలిమా వైద్య కళాశాల భవనాన్ని మాత్రం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారుల జాయింట్ సర్వే రిపోర్టు, హెచ్ఎండీఏ అనుమతిలోనే నిర్మించామని యాజమాన్యం పేర్కొంటోంది. కాగా హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

జలమయమవుతున్న కాలనీలు



నీట మునిగిన వైభవ్ కాలనీ (ఫైల్)

నాడెం చెరువులోని బఫర్‌జోన్‌కు సంబంధించిన ఐదు ఎకరాల్లో ఆక్రమ నిర్మాణాల కారణంగా ఏటా వర్షాకాలంలో సమీపంలోని వైభవ్, అరుంధతి కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. వర్షం పడిందంటే ఆయా కాలనీల్లో నివస్తున్న 150 కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి.

ఐదు ఎకరాల బఫర్ జోన్ అన్యాక్రాంతం..

వెంకటాపురం(కొర్రెముల)సర్వేనంబర్ 813లోని 3 ఎకరాల బఫర్ జోన్‌లో నీలిమా మెడికల్ కాలేజ్ భవనాన్ని నిర్మించగా, మరో 2 ఎకరాల్లో 25 బహుళ అంతస్తుల భవనాలు వెలిసినట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖ ఏఈ పరమేశ్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శికి లేఖ అందజేశారు. దీంతో బఫర్ జోన్‌లో భవనాలను నిర్మించిన 25



నీలిమా కాలేజ్ భవనం

మంది ఇళ్ల యజమానులకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. నీలిమా మెడికల్ కాలేజ్ భవనానికి సంబంధించి నోటీసు అందజేయడంపై రెవెన్యూ, ,గ్రామ పంచాయతీ అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సమాచారం కోరగా ఇరిగేషన్, పంచాయతీ శాఖ అధికారులు స్పందించడం లేదు.

సివిల్ కోర్టులో తేల్చుకోండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సంజీవ్‌రెడ్డి నగర్‌లోని బహల్లా ల్‌ఖాన్ గూడ సర్వే నంబర్ 102/2, 102/3లోని 1,537 చదరపు గజాల స్థలం ప్రైవేట్‌దా? ప్రభుత్వానిదా? అనేది సివిల్ కోర్టులో తేల్చుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌ను, పిల్‌ను కొట్టివేసింది. 1,537 గజాల ప్రభుత్వ ఆట స్థలాన్ని పరిరక్షించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ స్వచ్ఛ తెలంగాణ యూత్ అసోసియేషన్ 2016లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే సదరు భూమిని తాము కొనుగోలు చేశామని, ప్రైవేట్ పట్టా భూమి అంటూ అశోక్ అగర్వాల్ అదే సంవత్సరం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న హైకోర్టు తాజా తీర్పు వెలువరించింది. భూ వివాదాన్ని సివిల్ కోర్టులో తేల్చుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాస్‌రావు ధర్మాసనం ప్రభుత్వాన్ని, ప్రైవేట్ వ్యక్తులను ఆదేశించింది.

ఖైదీల హక్కులను పునరుద్ధరించాలి

చంచల్‌గూడలో ఖైదీల నిరాహారదీక్ష..

సాక్షి, సిటీబ్యూరో: చంచల్‌గూడ సెంట్రల్ జైలులోని నర్మదా బారక్‌లో ఏకాంత నిర్బంధంలో ఉంచి, కనీసం పగటి పూట కూడా బయటకు అనుమతించకుండా రోజంతా గదుల్లోనే ఉంచడాన్ని వ్యతిరేకిస్తూ అమితాబ్ బాగ్చీ, గంగాధర రావు, రాజ్‌కుమార్ తదితర రాజకీయ ఖైదీలు చంచల్‌గూడ సెంట్రల్ జైలులోని ఇతర ఖైదీలతో కలిసి మంగళవారం నుంచి నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ నేపథ్యంలో చంచల్‌గూడలో ఖైదీల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపిస్తూ, రాజకీయ ఖైదీలకు న్యాయం చేకూర్చాలని సి.డి.ఆర్.ఓ–సి.ఎల్.సి తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ గుంటి రవి ఓ ప్రకటనలో డిమాండ్‌చేశారు. సుప్రీంకోర్టు వివిధ తీర్పుల ద్వారా ఒంటరి నిర్బంధాన్ని నిషేధించిందన్నారు. జైలు అధికారులు దౌర్జన్య పోకడలు మానేసి ఖైదీలతో న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలని ఖైదీల హక్కులను గౌరవిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నాలాలో కొట్టుకువచ్చిన మృతదేహం

బంజారాహిల్స్: లిబర్టీ సమీపంలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నున్న నాలాలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభించింది. మంగళవారం సాయంత్రం ఎక్కడి నుంచో కొట్టుకువచ్చిన మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న బాడీని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వర్షాలకు నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ఈ మృతదేహం ఎక్కడి నుంచి కొట్టుకు వచ్చిందో తెలియరాలేదు.

అప్పు తిరిగి ఇవ్వ లేదని..

- చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళ
- 12 గంటల్లో ఛేదించిన పోలీసులు..



చిన్నారికి బిస్కెట్లు ఇస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

కాచిగూడ: తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వలేదని ఓ మహిళ చిన్నారిని కిడ్నాప్ చేసిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అయితే 12గంటల్లో కేసును ఛేదించిన కాచిగూడ పోలీసులు చిన్నారిని క్షేమంగా కుటుంబీకులకు అప్పగించారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూర్పు మండలం డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీ రఘు, ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఫుట్‌పాత్‌పై పార్వతమ్మ అనే యాచకురాలు తన మనవరాలు(1.5) శ్రీలక్ష్మితో కలిసి నిద్రించింది. మంగళవారం తెల్లవారుఝామున నిద్ర లేచి చూసేసరికి చిన్నారి కనిపించకపోవడంతో కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఓ మహిళ చిన్నారిని తీసుకుని ఆటోలో అఫ్జల్‌గంజ్ వైపు వెళుతున్నట్లు గుర్తించారు. దీంతో డబీర్‌పురా రైల్వే స్టేషన్ సమీపంలో సదరు మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా కిడ్నాప్ చేసింది తానేనని అంగీకరించింది. కామారెడ్డి జిల్లాకు చెందిన యాచకురాలు దాసరి మంజుల భిక్షాటన కోసం నగరానికి రాకపోకలు సాగించేదని, కిడ్నాప్‌నకు గురైన చిన్నారి శ్రీలక్ష్మి తల్లి మమత ఆమెవద్ద రూ.1500 అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతోనే మంజుల పాపను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు ఆమె మరిది మున్నాతో పాటు ఆమె ఇద్దరు బాలలు సహకరించినట్లు గుర్తించారు. చిన్నారిని ఆమె అమ్మమ్మకు అప్పగించిన పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

టాటా ఏస్ ఢీకొని ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

జీడిమెట్ల: టాటా ఏస్ వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం, రామగుండాలపల్లి గ్రామానికి చెందిన జయేందర్‌రెడ్డి కుటుంబం నగరానికి వలసవచ్చి చింతల్ మాణిక్యనగర్‌లో స్థిరపడింది. అతడి చిన్నకుమారుడు నాగేందర్‌రెడ్డి దూలపల్లిలోని ఓ ప్రైవేట్ ప్రింటింగ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం బైక్‌పై తన పిన్ని కుమారుడు జితేందర్‌రెడ్డితో కలిసి వెళ్తుండగా దూలపల్లి సాయికాంట సమీపంలో వేగంగా వచ్చిన టాటా ఏస్ వారి బైక్‌ను ఢీ కొంది. వాహనం టైర్లు నాగేందర్‌రెడ్డి మీదుగా వెళ్లడంతో అతని ఛాతి, కడుపు, ముఖానికి తీవ్ర గాయాలు కాగా వెనుక కూర్చున్న జితేందర్‌రెడ్డికి తల, ఎడమ చేతికి గాయాలయ్యాయి. వారిని జీడిమెట్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ నాగేందర్‌రెడ్డి మృతిచెందాడు. జితేందర్‌రెడ్డి ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు చెప్పారు. మృతుడి సోదరుడు నరేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

వెంగళరావునగర్: కానిస్టేబుల్‌ను కులం పేరుతో దూషించడమే కాకుండా ఆపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బోరబండకు చెందిన పి.రాకేష్ కానిస్టేబుల్‌గా హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 26న రాకేష్ తన స్నేహితులతో కలిసి కృష్ణకాంత్ పార్క్ వద్దకు వచ్చి నడుచుకుంటూ వెళ్తుండగా శివ అనే యువకుడు రాకేష్‌ను దుర్భాషలాడాడు. అతను మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించిన రాకేష్ అక్కడి నుంచి వెళుతుండగా శివతో పాటుగా కార్తీక్ అనే యువకుడు కూడా కులం పేరుతో దూషించి, అతనిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శివకుమార్ తన స్నేహితుడి సోదరుడైన నవీన్‌తో మాట్లాడుతుండగా అతని స్నేహితులు రాకేష్, రాజ్‌కుమార్‌లు కూడా అక్కడే ఉన్నారని, వారిని కూడా తాను పలకరించగా అకారణంగా తనపై దాడి చేసి గాయపరిచారని శివ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇన్సూరెన్స్ డబ్బులు రాలేదని..
వ్యాపారి ఆత్మహత్య

శామీర్‌పేట్: ఇన్సూరెన్స్ డబ్బులు రాలేదని ఓ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన రాకేష్ సిర్వీ(35), కొన్నేళ్ల క్రితం కుటుంబ సమేతంగా శామీర్‌పేట మండలం తుర్కపల్లికి వచ్చి స్థిరపడ్డాడు. మొదట్లో కిరాణ షాప్ నిర్వహించిన అతను రెండేళ్ల క్రితం తుర్కపల్లిలో సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. నాలుగు నెలల క్రితం షార్ట్ సర్క్యూట్ కారణంగా సూపర్ మార్కెట్ కాలిపోవడంతో దాదాపు రూ.కోటి నష్టం వాటిల్లింది. దీనికి తోడు ఇన్సూరెన్స్ డబ్బులు రాకపోవడంతో పెట్టుబడికి అప్పుగా ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తుండటంతో మనస్తాపానికి లోనైన రాకేష్ మంగళవారం బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొడ్డలితో దాడి

ఒకరి మృతి, విషమంగా మరొకరి పరిస్థితి



ముఖేందర్ (ఫైల్)

బాలానగర్: ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దామోదరం సంజీవయ్య కాలనీలో ఏర్పుల ముఖేందర్ (35) కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని ఇంటి సమీపంలోనే వరుసకు అన్న అయిన మధు నివసిస్తున్నాడు. రెండు కుటుంబాల మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం ముఖేందర్ పనిమీద బయటికి వెళుతుండగా అక్కడికి వచ్చిన మధు గొడ్డలితో అతడిపై దాడి చేశాడు. ముఖేందర్ కేకలు విన్న అతడి తల్లి సావిత్రి మధును అడ్డుకునేందుకు యత్నించగా ఆమెపై కూడా గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకునేలోగా మధు అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు ముఖేందర్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సావిత్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మైసమ్మగూడలో హైడ్రా కమిషనర్ తనిఖీలు



ఫాక్స్ సాగర్ చెరువు సమీపంలో స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నియోజకవర్గంలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలో మంగళవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులతో కలిసి పర్యటించారు. మైసమ్మగూడలోని పలు నాలాలు, చెరువులను పరిశీలించిన అధికారులు అనంతరం మల్లారెడ్డి కళాశాలల స్థలాల సమీపంలోని నాలాలను పరిశీలించారు. అంతకుముందు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఫాక్స్ సాగర్ చెరువు, దూలపల్లిలోని అశోకా ఎన్‌క్లేవ్ సమీపంలోని నాలాలను పరిశీలించారు. గత వారం ఫాక్స్ సాగర్ చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు మంగళవారం మరోమారు పరిశీలనలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు పలు నాలాలు, చెరువులు కబ్జాకు గురైనట్లు నిర్ధారించారు. కాగా ఇటీవలి కాలంలో దూలపల్లి, మైసమ్మగూడ పరిధిలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి సంబంధించిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించగా ప్రస్తుతం హైడ్రా అధికారులు మైసమ్మగూడలోని మల్లారెడ్డి విద్యాసంస్థల సమీపంలో పరిశీలనలు చేపట్టడంతో త్వరలోనే కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజకవర్గాల్లోనూ అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేస్తారని ప్రచారం జరుగుతోంది.

హాష్ ఆయిల్ సరఫరా ముఠా అరెస్టు

రూ.1.52 కోట్ల విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

అల్వాల్: హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1.52 కోట్ల విలువైన హాష్ ఆయిల్‌ను రాచకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాచకొండ కమిషనరేట్‌లో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గమ్మెలీ గోవిదరావు, కొర్ర రాంబాబు వ్యవసాయ కూలీలుగా పని చేసేవారు. తద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో వారు మారకద్రవ్యాల వ్యాపారం ప్రారంభించారు. పరిచయస్తుల నుంచి హాష్ ఆయిల్ సేకరించి అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు హైదరాబాద్‌కు హాష్ ఆయిల్ అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోచంపల్లి పోలీసులు, భోవనగిరి ఎస్‌ఓటి పోలీసులతో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తూ.. అనంత లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి, కుమార్తెకు గాయాలు



పంకజ్‌కుమార్ మృతదేహం

మేడ్చల్‌రూరల్: అనారోగ్యంతో ఉన్న కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి ఇంటికి తిరిగి వస్తుండగా బైక్‌ను కారు ఢీకొనడంతో తండ్రి మృతి చెందగా, కుమార్తె గాయపడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట్ మండలం, యాదారం గ్రామానికి చెందిన పంకజ్ కుమార్(31) తన కుమార్తె పూజ కుమారి అనారోగ్యంతో బాధపడుతుండటంతో సోమవారం రాత్రి బైక్‌పై తుర్కపల్లి గ్రామంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించాడు. అనంతరం ఇంటికి తిరిగివెతూ రాజీవ్ రహదారిపై మురహరిపల్లి చౌరస్తా వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో నగరం నుంచి కరీంనగర్ వైపు వేగంగా వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో పంకజ్ కుమార్, పూజ కుమారికి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. పంకజ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం ఉదయం మృతుడి మామ శివకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

సామర్థ్యాల పెంపునకు పక్కా ప్రణాళిక

- సర్కార్ బడుల్లో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- ఖైరతాబాద్ జోన్‌లో రెండేళ్లుగా 'ఎఫ్‌ఎల్‌ఎన్' కార్యక్రమం అమలు
- సెప్టెంబర్‌లో విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్ష
- మార్కుల ఆధారంగా అదనంగా గంటపాటు ప్రత్యేక శిక్షణ


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ హైస్కూల్‌లో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు..

బంజారాహిల్స్: సర్కార్ బడుల్లో చదివే విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో వారి సామర్థ్యాలు మెరుగు పరిచే విధంగా విద్యాశాఖ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు గతేడాది ఎఫ్‌ఎల్‌ఎన్, లీప్ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశారు. 2024–25 ఈ విద్యా సంవత్సరంలో కూడా వాటిని పక్కాగా అమలు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 63 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్ష నిర్వహించి కంప్యూటర్‌లో మార్కుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ మార్కుల ఆధారంగానే ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులతో సన్నద్ధం..

ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో 1–5 తరగతులకు చెందిన విద్యార్థుల కోసం ఫౌండేషన్ లెటరసీ అండర్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని రెండేళ్లుగా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో 6–10వ తరగతి విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ (లీప్) కార్యక్రమాన్ని చేపట్టారు. సెప్టెంబర్‌లో బేస్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాలపై ఈ పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా ఎందులో వెనుకబడ్డారో గుర్తిస్తారు. వారికి పాఠ్యాంశాలపై ప్రతిరోజూ గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. డిసెంబర్‌లో మరోసారి మధ్యంతర పరీక్ష ఉంటుంది. అప్పటి వరకు విద్యార్థులు ఎంతమేర నేర్చుకున్నారో పరిశీలిస్తారు. పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల పురోగతిని అంచనా వేసి నివేదికలు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ యాప్‌లో నమోదు చేస్తారు.

తనిఖీల కోసం నోడల్ అధికారులు..

ఎఫ్‌ఎల్‌ఎన్, లీప్ కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు మండల స్థాయిలో నోడల్ అధికారులు నియమించారు. షేక్‌పేట, ఖైరతాబాద్–1, ఖైరతాబాద్–2 మండలాల పరిధిలో ముగ్గురు నోడల్ అధికారులు నియమించారు. వీరు తమ పరిధిలోని పాఠశాలల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు ఎలా అమలువుతున్నాయో తెలుసుకోవడమే కాకుండా వివరాలు యాప్‌లో నమోదు చేస్తారు. ఈ రెండు కార్యక్రమాలు ఖచ్చితంగా అమలు చేసే విధంగా దృష్టిపెడతారు. పకడ్బందీగా నిర్వహించేలా ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువచ్చి చర్యలు చేపట్టేవిధంగా ఆదేశాలు జారీ అయ్యాయి. అంతేకాకుండా మండల నోడల్ అధికారులు తనిఖీలు చేసి పర్యవేక్షించాల్సి ఉంటుంది.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ పథకాలను పేదలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొనేలా ఎంఐఎం పార్టీ కృషి చేస్తుందని సోమాజీగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడ ఎంఐఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ షేక్ జాఫర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిగూడకు చెందిన ఓ వ్యక్తికి సీఎం సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కును నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఐఎం పేదల పక్షాల నిలుస్తుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు అన్వర్ సదత్, నగేష్, సల్మాన్, ఉమన్ పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

29 నుంచి బ్రహ్మోత్సవాలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్ కాలనీలోని వీరాంజనేయ భవానీశంకర్ అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్ టెంపుల్)లో ఈనెల 29 నుంచి నాలుగు రోజుల పాటు భవానీశంకర స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణమూర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా తొలిరోజు ఉదయం 9.30 నుంచే వివిధ పూజా కార్యక్రమాలను ప్రారంభించనున్నామన్నారు. ఇందులో భాగంగా రాజ శ్యామలా హోమం, వారాహి హోమం జరుగుతుందన్నారు. 31నాడు ఉదయం 10.30 గంటలకు అఘోర పాశుపతి హోమం, సెప్టెంబరు 1న ఉదయం 10 గంటలకు శ్రీసరస్వతీ హోమం, శ్రీ దక్షిణామూర్తి హోమాలు నిర్వహించనున్నామని తెలియజేశారు. అదేవిధంగా అయ్యప్పస్వామి దేవాలయంలో 30వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు అయ్యప్పస్వామి మహా కుంభాభిషేకాలు జరుగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా బొడ్రాయి పండుగ


బొడ్రాయికి ధాన్యాధివాసం పూజలు చేస్తున్న బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఉదయ్‌నగర్ బస్తీలో బొడ్రాయి పండుగ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా రెండో రోజు అయిన మంగళవారం బస్తీలో ఏర్పాటు చేయబోయే బొడ్రాయికి జలాధివాసం, ధాన్యాధివాసం, కుంకుమ, పసుపుతో అభిషేకం, పుష్పాధివాసం, ఫలాధివాసం పూజాదికాలను అర్చకులు శైష శైలాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు నిర్వహించారు. ఆఖరి రోజు బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉంటుందని ఉదయ్‌నగర్ ఉత్సవ కమిటీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నేతలు లోకరాజు, శేఖర్, రవికుమార్, విశ్వనాథం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగం విషయంలో వివాదం

- దంపతులపై దాడి
- అడ్డుపడ్డ మరో మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్: నీటి వినియోగం విషయంలో తలెత్తిన వివాదంలో దంపతులపై దాడి చేయడమే కాకుండా అడ్డువచ్చిన మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 10సీలోని విల్లానెంబర్–5లో ఎస్వీ రమణబాబు నివసిస్తుంటాడు. వీరి పక్కనే విల్లా నెంబర్–4లో తుమ్మల రవికాంత్ ఉంటున్నాడు. వీరిరువురి కుటుంబాలు నీటి అవసరాల కోసం రెండు నీటి కనెక్షన్లు ఉన్న ఒకే సంప్ నుంచి నీటిని వాడుకుంటుంటారు. ఈ నేపథ్యంలో ఇటీవల రవికాంత్ ఇంటికి తన తల్లిదండ్రులు వచ్చినప్పటి నుంచి పక్కనే ఉండే రమణబాబు కుటుంబానికి నీరు ఇవ్వడానికి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా ఈ నెల 17వ తేదీన రమణబాబుకు మరో పొరుగున ఉండే వేణుబాబు ఫోన్ చేసి పార్కింగ్ స్థలం గురించి మాట్లాడదామని రావల్సిందిగా కోరడంతో రమణబాబు అక్కడికి వెళ్లాడు. అప్పటికే వేణుబాబుతో పాటు రవికాంత్ కూడా అక్కడ ఉన్నాడు. అక్కడకు వెళ్లిన రమణబాబు పట్ల రవికాంత్ రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేస్తుండడంతో తనకు ఆరోగ్యం బాగోలేదని చెప్పి ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో అతనితో పాటు అక్కడే ఉన్న అతని భార్యపై చెప్పుతో రవికాంత్ దాడి చేశాడు. దీంతో రమణబాబు కిందపడిపోయాడు. ఆ సమయంలో రమణబాబు కార్యాలయంలో పనిచేస్తూ జీతం కోసం వేచి ఉన్న ఓ మహిళ ఈ సంఘటనను చూసి అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలోనే రవికాంత్ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు రవికాంత్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణేష్ మండపాలకు ఉచితంగా కరెంటు ఇవ్వాలి

- భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ డిమాండ్

బంజారాహిల్స్: వినాయక మండపాలకు ఎండోమెంట్ ద్వారా బిల్లులు చెల్లించి ఉచితంగా కరెంటు ఇవ్వాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ జనరల్ సెక్రటరీ రాజవర్ధన్‌రెడ్డి, సెక్రటరీ శశిధర్‌లు కోరారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో గణేష్ ఉత్సవ సన్నాహక సమావేశంలో వీరు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మండపాలకు ఉచిత కరెంటు ఇవ్వడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తులకు మరింత సులభతరం చేయాలని పోలీసులు దగ్గరుండి దరఖాస్తు ఫారాలు భర్తీ చేసి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. డీసీపీ స్థాయిలో వినాయక మండపాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా మండప నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. సెప్టెంబర్ 17న 45వ సామూహిక గణేష్ నిమజ్జనాలు జరగబోతున్నాయని, అన్ని ప్రభుత్వ శాఖలు ఈ విషయంలో ప్రచారం కల్పించాలన్నారు. అలాగే భక్తులు పిండి వంటలు చేసుకోవడానికి అదనపు రేషన్ కోటా విడుదల చేయాలన్నారు. వినాయక మండపాలకు, నిమజ్జన శోభాయాత్రకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైతే ఈ ఉత్సవాలకు అదనపు ఆకర్షణ చేకూరుతుందని, గతంలో టి.అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మండపాల్లో పూజలు నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

ఘనంగా వ్యాసపూజ, నందోత్సవ వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హరేక్రిష్ణ గోల్డెన్ టెంపుల్‌లో వ్యాసపూజ, నందోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు ఈ లోకంలో అవతరించిన 'జన్మాష్టమి' తిథి ఉత్సవాలను కొనసాగిస్తూ మంగళవారం బంజారాహిల్స్ హరేక్రిష్ణ గోల్డెన్ టెంపుల్‌లో నందోత్సవంతో పాటుగా శ్రీలప్రభుపాదులవారి 128వ జయంతిని పురస్కరించుకొని వ్యాసపూజ ఉత్సవాలను నిర్వహించారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఇంజినీర్లు

వెంగళరావునగర్: టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కోలలో గత కొన్నేళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇంజనీర్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ మెట్రో జోన్, చీఫ్ ఇంజినీర్ రూరల్ జోన్ కార్యాలయాల ప్రాంగణంలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ వర్క్‌లోడ్ పెరిగిపోతున్నందున నిబంధనలకు అనుగుణంగా ట్రాన్స్‌కోలో అదనపు పోస్టులను మంజూరు చేయడంతో పాటుగా ప్రమోషన్స్‌ను ఇవ్వాలన్నారు. దీంతోపాటుగా 2012 బ్యాచ్ ఏఈలకు ఏడీఈలుగా పదోన్నతి కల్పించాలని, 400 మంది ఏఈలను రిక్రూట్ చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రామగుండంలో నూతనంగా నిర్మించనున్న ప్లాంట్‌ను టీజీ జెన్‌కో సంస్థ ఆధ్వర్యంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత 8 నెలలుగా పెండింగ్‌లోని డైరెక్టర్ పోస్టులకు నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ నేతలు వెంకటనారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, కిశోర్‌కుమార్, వెంకటేశ్వర్, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, టీజీఈఏఈఏ నాయకులు కుమారస్వామి, నరేష్, సీనియర్ ఇంజినీర్లు దామోదర్, వెంకటరమణ, రామ్‌కోటి, బ్రహ్మారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయొద్దు

బంజారాహిల్స్: బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. మంగళవారం ఆయన బీఎస్ మక్తాలో ఆకస్మిక పర్యటన చేశారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అక్కడ పలు కార్యక్రమాలు చేసి స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా కార్మికుల హాజరును కూడా పరిశీలించారు. 100 శాతం కార్మికులు హాజర య్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.


బీఎస్ మక్తాలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

కోలాహలంగా కృష్ణాష్టమి వేడుకలు


సైఫాబాద్ సైన్స్ కాలేజీలో కృష్ణాష్టమి వేడుకలు..


బంజారాహిల్స్ రోడ్ నెం. 14 వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి అలంకరణ

బంజారాహిల్స్: కృష్ణాష్టమి వేడుకలు సైఫాబాద్ సైన్స్ కాలేజీలో మంగళవారం వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా కాలేజీలో ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో కాలేజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ విద్యార్థులకు గోకులాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కాలేజీలో అన్ని రకాల పండుగలను వైభవంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బంజారాహిల్స్‌రోడ్‌నెం. 14లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోకులాష్టమి సందర్భంగా ఆలయ అర్చకులు అద్దంకి శశికాంతాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

హైడ్రాతో ఆక్రమణదారుల్లో భయం

పంజగుట్ట: హైడ్రా ఏర్పాటుతో ఆక్రమణదారుల్లో భయం మొదలైందని, రాష్ట్రంలో ఆక్రమణకు గురైన వక్ఫ్, దేవాదాయ భూములు స్వాధీనం చేసుకునే బాధ్యతను హైడ్రాకు అప్పగించాలని ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.ఎండీ ఇస్లాముద్దీన్ మాట్లాడుతూ వేలాది ఎకరాలు రాజకీయ నాయకులు, బడాబాబులు కబ్జాలు చేశారని ఆరోపించారు. హైడ్రా వాటిని స్వాధీనం చేసుకుంటున్న తీరును తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రా పాలకులు వక్ఫ్ ఆస్తులు కాజేశారని ఆరోపించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని పెద్దలు వారే వేల ఎకరాలు కబ్జా చేశారన్నారు. చెరువుల ఆక్రమణలు తొలగిస్తున్న తరుణంలో ఓవైసీ సోదరులు భయంతో ముందు హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న ప్రభుత్వ కట్టడాలు తొలగించాలని మాట్లాడటం గమనిస్తే చెరువులో వారు నిర్మాణాలు కట్టామని ఒప్పుకున్నట్లే అన్నారు. చెరువుల ఆక్రమణల విషయంలో సొంత పార్టీ వారినే వదలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరి ఆక్రమణల నుంచి చెరువులను కాపాడతారని తమకు నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ భూములు, దేవాదాయ భూములు వేల ఎకరాల్లో ఆక్రమణల్లో ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకునే బాధ్యతను హైడ్రాకు అప్పగిస్తే ముస్లిం సమాజం మొత్తం హైడ్రాకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆలిండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీల్, సభ్యులు ఎం.కే నసీరుద్దీన్, డా.అహ్మద్, జయరాజ్, మజహర్, ఎండీ అహద్, ఇస్మాయిల్, ఎండీ రావూఫ్, తదితరులు ఉన్నారు.

చేనేత చీరలు దేశ సంస్కృతికి ప్రతిబింబం

- క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా

బంజారాహిల్స్: చేనేత చీరలు భారతదేశ సంస్కృతి, చరిత్రను ప్రతిబింబం చేస్తాయని వర్ధమాన నటి, క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చేనేత ఉత్పత్తులు కూడా డిజైనర్లు తయారు చేసిన ఉత్పత్తులకు దీటుగా విభిన్న రకాలుగా ఉంటున్నాయని ప్రతీ ఒక్కరికి మెచ్చేలా వీటిని తయారు చేస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 4వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన చేనేతకారులు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిషిత్‌షా తెలిపారు.

ఏకముఖి రుద్రాక్షలతో స్వామివారికి అలంకరణ


రుద్రాక్షల అలంకరణలో స్వామివారి

వెంకటేశ్వకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14 నందినగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి 11,116 ఏకముఖ రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ అర్చకులు శేష శైలాచార్యులు వెల్లడించారు. శ్రావణ మాసంలో వచ్చే ప్రతీ మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అర్చనలు నిర్వహించినట్లు తెలిపారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మినారాయణ, ఆయన కుమారుడు కన్నా ఫణీంద్ర ఈ పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేశవ్యాప్త పోరాటాలకు సిద్ధం

లిబర్టీ: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ప్రొఫెసర్ వి.ఎల్.రాజు స్పష్టం చేశారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని ఆయన కోరారు. దళితులు ఐక్యంగా ఉంటేనే రాజ్యాంగ హక్కులు సాధించుకుంటామన్న విషయాన్ని మర్చిపోకూడదన్నారు.

దూర విద్యా వ్యాప్తికి అంబేడ్కర్ వర్సిటీ మార్గదర్శి

- ప్రొఫెసర్ జీబీ రెడ్డి


స్మారకోపన్యాస కార్యక్రమంలో ప్రొఫెసర్ జీబీరెడ్డి తదితరులు

బంజారాహిల్స్: దేశంలో దూర విద్య వ్యాప్తికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మార్గదర్శి అని ప్రొఫెసర్ జీబీరెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన స్మారకోపన్యాస కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని 'మేధోసంపత్తి హక్కులు: దూరవిద్య, ఆన్‌లైన్ అధ్యయనంలో సమస్యలు–సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో జ్ఞానం, సత్యం, భారతీయ ఆలోచన మానవ జీవితంలోని తత్వశాస్త్రంలో భాగంగా ఉన్నాయన్నారు. దేశంలో గొప్ప పరిశోధకులు గణితం, ఖగోళ శాస్త్రం, లోహ శాస్త్రం తదితర రంగాల్లో లోతైన జ్ఞానాన్ని అందించారన్నారు. ఇది విద్యా అవసరాలకు సంబంధించి పాఠ్యాంశాలు తాజాగా ఉన్నాయని, విద్యార్థులకు బలమైన పునాదిని అందిస్తుందన్నారు. బోధనా పద్ధతులు, అధ్యాపకుల అర్హతలు, విద్యార్థుల మూల్యాంకనం తదితరాలు ప్రపంచంతో పోటీపడేలా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపయోగపడుతుందన్నారు. దూర విద్య అనేది ఒక సంస్థాగతమైన విద్యా విధానమని, ఇది కేవలం బోధనా విధానంలో మాత్రమే భిన్నంగా ఉంటుందన్నారు. ఈ వ్యవస్థ విద్యార్థి ఉన్నత విద్య కోసం రెండో అవకాశాన్ని అందిస్తుందన్నారు. దూర విద్య వెనుకబడిన పేద వర్గాలకు, మహిళలకు విశేష అవకాశాలు కల్పించిందన్నారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) గత కొన్ని సంవత్సరాలుగా లక్షలాది మంది విద్యార్థులకు ఉపాధి కల్పించిందన్నారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడే విద్యగా దూర విద్య అత్యంత వేగంగా ప్రాచుర్యాన్ని పొందిందన్నారు. రెగ్యులర్ విద్యాభ్యాసానికి దూర విద్య ఏ మాత్రం తీసిపోదన్నారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు విస్తృతంగా జరగాలని, తద్వారా సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా ఆవిష్కరణలు జరపాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్ప చక్రపాణి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గత 42 సంవత్సరాల్లో సాధించిన విజయాలను గర్వంగా చెప్పుకుంటూనే, సమాజానికి మరింత సహాయకారిగా నిలిచేలా తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. విద్యార్థి సేవల బలోపేతానికి కృషి చేస్తున్నామని, దూర విద్యలో అభ్యసించిన విద్యార్థులకు అన్ని అవకాశాలను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ సుధారాణి, డీన్లు, శాఖాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, సేవా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు భాషను బతికించండి

ప్రజావాణిలో స్నేహ భారతి అసోసియేషన్ వినతి.. 6 గ్యారంటీలు, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు


ప్రజావాణికి వస్తున్న స్నేహ భారతి అసోసియేషన్ ప్రతినిధులు

లక్డీకాపూల్: తెలుగు భాషను బతికించండంటూ మహిళా పక్షపాత సంస్థ అయిన స్నేహ భారతి అసోసియేషన్ అధ్యక్షుడు టీ.ఎస్. దాస్‌గౌడ్ ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. రాష్ట్రంలో తెలుగు భాష అమలు కోరుతూ మంగళవారం అర్జీ పెట్టుకున్నారు. తెలుగు భాషను అన్ని ఆఫీసుల్లో గ్రామ పంచాయతీ నుంచి సెక్రటేరియేట్ వరకు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. అదే విధంగా 6 గ్యారంటీల అమలు, వ్యక్తిగత సమస్యలపై ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో అర్జీలు వచ్చాయి. మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 587 దరఖాస్తులు అందాయి. వాటిలో మైనారిటీ వెల్ఫేర్ కు సంబంధించి 118, రెవెన్యూ పరమైన సమస్యలపై 94, విద్యుత్ శాఖకు సంబంధించి 88, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 48, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 47, ఇతర శాఖలకు సంబంధించి 192 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు మరిచారా..?



తార్నాక ఆర్టీసీ హాస్పిటల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన

లాలాపేట: ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదంటూ తార్నాకలోని ఆర్టీసీ హాస్పిటల్‌లో కార్మికులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, కార్మికులకు రావాల్సిన రెండు వేతన సవరణలను అమలు చేస్తామని, ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు వివిధ కారణాలతో దాదాపు 13 వేల మంది కార్మికులు వైదొలగినా వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఉన్న కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలు నుంచి డ్రైవర్లు, కండక్టర్లపై తీవ్రమైన ఒత్తిడి పెరిగిందన్నారు. జేఏసీ నాయకులు సుద్దాల సురేష్, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పట్టించుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఆయా యూనివర్సిటీలకు వీసీలను నియమించి అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు పేర్కొన్నారు. ఓయూలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ తక్కువ వేతనానికి 25 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ప్రస్తావన లేకుండా అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించడం బాధాకరమన్నారు. వర్సిటీల్లో తక్కువ వేతనానికి ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యను పరిష్కరించకుండా పర్మనెంట్ పోస్టుల భర్తీ చేస్తామని చెప్పడం దారుణమన్నారు. తమ సంగతి తేల్చాకే పర్మనెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి మొర పెట్టుకున్నారు. కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు విజయేందర్‌రెడ్డి, ఉపేందర్, వెంకటేష్, రేష్మరెడ్డి, యాదయ్య, చిరంజీవి, రమేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యావకాశాలపై సదస్సు



సదస్సులో విదేశీ ప్రతినిధులు, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్సీఈ కళాశాలలో ఉన్నత విద్యావకాశాలపై మంగళవారం సదస్సు నిర్వహించారు. హలో యూని, ఇంపీరియల్ ఎడ్యుకేషన్ సంస్థలు, కెరీర్‌గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో చేపట్టిన సదస్సులో విదేశాల్లో ఉన్నత విద్య తీరుతెన్నులు, స్కాలర్‌షిప్, ఉద్యోగ అవకాశాలపై 20 యూనివర్సిటీలకు చెందిన విదేశీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తిని ప్రోత్సహించేందుకు సదస్సు నిర్వహించామన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ టీవీ రెడ్డి, డీన్ రాజేశ్వరన్, కుమార్, నర్సింహారెడ్డి, విదేశీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కవితకు బెయిల్.. కేంద్రానికి చెంపపెట్టు'

సనత్‌నగర్: ఢిల్లీ లిక్కర్ కేసులో ఎలాంటి ప్రమేయం లేకపోయినా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అన్యాయంగా అరెస్టు చేసి 168 రోజులు జైలులో పెట్టడం బాధాకరమని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. ఓ మహిళ అని చూడకుండా రాజకీయ కక్షతో ఈ దారుణానికి ఒడిగట్టారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఈ కేసుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, దీన్ని బట్టి అన్యాయంగా, అక్రమంగా కేసులు బనాయించారనే విషయం సర్వోన్నత న్యాయస్థానం మంజూరు చేసిన బెయిల్ ద్వారా తేటతెల్లమైందన్నారు. కవితకు బెయిల్ రావడంపై యావత్ తెలంగాణ మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు చేసుకుంటున్నారన్నారు. కవితను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి మహిళా లోకాన్ని అవమానించే రీతిలో వ్యవహరించారని దుయ్యబట్టారు. ఈ కేసులో కడిగిన ముత్యంలా కవిత బయటకు వచ్చితీరుతారని చెప్పారు. ఇకముందు రాజకీయ కక్షలు మానుకోవాలని హితవు పలికారు. రాజకీయ కక్షలతో ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న కేంద్రానికి ఈ బెయిల్ మంజూరు చెంపపెట్టులాంటిదన్నారు. ఇకనైనా తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

29న బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు



అంబర్‌పేట: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలంటూ ఈ నెల 29న హలో బీసీ, చలో హైదరాబాద్ పేరిట జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. కాచిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. అగ్రకులాలకు ఒకేరోజులో పది శాతం రిజర్వేషన్లు బిల్లు ప్రవేశపెట్టారని బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని 30 ఏళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో బీసీలను బిచ్చగాళ్లను చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జనాభా లెక్కలు, జంతువులు ఇతర లెక్కలు అన్నీ ఉన్నప్పటికీ బీసీల జనాభా లెక్కలు లేకపోవడం దయనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సమస్యలపై ఈ నెల 29న జాతీయ బీసీ సదస్సు నిర్వహించి సత్తాచాటుతామన్నారు. ఆ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కోటీశ్వరి, నాయకులు నందగోపాల్, వేముల రామకృష్ణ, ఉదయ్, జోసీ తదితరులు పాల్గొన్నారు.

గతేడాది నగరంలో అధికంగా ఫ్లూ కేసులు నమోదు

హాట్ స్పాట్లుగా స్కూల్స్, పిల్లల సంరక్షణ కేంద్రాలు

జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచిస్తున్న వైద్యులు

కారణాలు, సంరక్షణపై అవగాహన తప్పనిసరి

బీ కేర్ ఫ్లూ..





చిన్నారుల్లో అధికంగా ఇన్‌ఫ్లుయేంజా వైరస్‌ల తాకిడి

వర్షాకాలంలో రోగాలు పంజా విసురుతుంటాయి. జలుబు, దగ్గుతో మొదలై వైరల్ ఫీవర్లు అస్వస్థతకు గురిచేస్తాయి. ఈ సీజన్‌లో ముఖ్యంగా చిన్నారులు అధికంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. ఇన్‌ఫ్లుయెంజా వంటి వైరస్‌ల ప్రభావం ఈ సీజన్‌లోనే అధికంగా ఉంటుంది. భారీ వర్షాలతో పాటు ముసుర్లకు నిరంతరం తడి బట్టలు, గాలిలో దుర్వాసన, ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గులు, అధిక తేమ, వైరల్ లోడ్ వేగంగా పెరగడం తదితర కారణాలు 'ఫ్లూ వైరస్' వ్యాప్తికి ఈ సీజన్ అత్యంత అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో పిల్లల్లో మార్పులకు కారణాలు తెలుసుకోవడం, ఇన్‌ఫ్లుయేంజా వైరస్‌ల వ్యాప్తిని నివారించడంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు. ఫ్లూ సోకడంతో చిన్నారుల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. దీంతో త్వరగా అనారోగ్యానికి గురవుతారు. ఈ తరుణంలో పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు ఫ్లూ వైరస్ వ్యాప్తికి హాట్‌స్పాట్‌లు మారుతుంటాయి. ఈ ప్రదేశాల్లోనే పిల్లలు ఇతరులతో సన్నిహితంగా ఎక్కువ సమయం గడుపుతారు. –సాక్షి, సిటీబ్యూరో

సాధారణంగా జ్వరం, జలుబు, దగ్గు, కండరాల నొప్పి, దద్దుర్లు, కళ్లు ఎరుపు రంగులోకి మారడం, నీళ్ల విరేచనాలు, వాంతులు తదితర సమస్యలు ఫ్లూ లక్షణాలుగా పరిగణిస్తారు. ముఖ్యంగా అప్పటికే గుండె జబ్బులు లేదా ఉబ్బసం వంటి ఇతర దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉన్న శిశువులకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.



తక్షణమే సంరక్షణ..

ఫ్లూ నివారించడానికి అత్యంత శ్రేయస్కరమైన పద్ధతి 'టీకాలు వేయడం'. ప్రతి సీజన్‌లో ఫ్లూ వ్యాక్సిన్ సదరు వైరస్‌కు చెందిన జాతులను నిర్మూలించడానికి అవసరమైన రక్షణ వ్యవస్థను వృద్ధి చేస్తుంది. ఇది పిల్లల్లో వ్యాధి సంక్రమణను తగ్గించడానికి పోరాడుతుంది. అంతేగాకుండా ఇన్ఫెక్షన్ సంక్రమణను తగ్గిస్తుంది.



- ఆర్నెళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పిల్లలకు కనీసం ఐదేళ్ల వయస్సు వచ్చే వరకు ప్రతి సంవత్సరం ఫ్లూకి నివారణగా టీకాలు తప్పనిసరిగా వేయాలి. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద పిల్లలు కూడా తీవ్రమైన ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ పొందడానికి ప్రతి సంవత్సరం టీకా తీసుకోవాలి.
- వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో పిల్లలకు మంచి పరిశుభ్రత అలవాట్లను నేర్పించడం ప్రాథమిక నియమం. ఈ అలవాట్లలో భాగంగా సబ్బు, నీటితో తరచూ చేతులు కడుక్కోవడం, హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించేలా చూసుకోవాలి. దగ్గినా లేదా తుమ్మినా టిష్యూలు, మోచేతులతో వారి నోరు, ముక్కును కప్పుకోవాలి. బయటకు వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించడం, ఫ్లూతో బాధపడుతుంటే ఇంట్లో ఒంటరిగా ఉంచడం మంచిది. ఫ్లూలు సోకకుండా ఉంచడంలో ఆరోగ్యకరమైన జీవనశైలి కీలక పాత్ర పోషిస్తోంది. పిల్లలకు పండ్లు, కూరగాయలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని అందించాలి. రోగనిరోధక వ్యవస్థలను బలోపేతం చేసేందుకు తగినంత నిద్రపోయేలా జాగ్రత్తలు తీసుకోవాలి. సీజన్ ముగిసే వరకు వెచ్చని పానీయాలు సేవిస్తుండాలి. ముఖ్యంగా ఫ్లూతో బాధపడుతున్నవారు సమూహాలకు దూరంగా ఉండాలి.



ఫ్లూ సోకినట్లయితే..

అత్యవసర పరిస్థితుల్లో.. జ్వరం, శరీర నొప్పులు తదితర లక్షణాలుంటే పిల్లల వైద్యుడు సూచించిన మెడిసిన్‌ను ఉపయోగించి ఇంట్లోనే తగ్గించుకోవచ్చు. అయితే పిల్లలకు ఎంత మోతాదులో అందించాలనేది వైద్యుల మార్గదర్శకాలను పాటించాలి. పిల్లలు ఫ్లూతో బాధపడుతున్న సమయంలో.. వైద్యులు సూచించిన విధంగా యాంటీ వైరల్ డ్రగ్స్ తీసుకుంటే అనారోగ్యం తీవ్రత, దాని వ్యవధి తగ్గుతుంది. వ్యాధి లక్షణాలు ప్రారంభమైన మొదటి 48 గంటలలోపు ఈ మందులు తీసుకుంటే ప్రభావవంతంగా పనిచేస్తాయి. సాధారణంగా వీటిని శిశువులకు, తీవ్రమైన లక్షణాలు ఉన్నవారికి లేదా ఆస్తమా వంటి సహ–అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి సూచిస్తారు. పిల్లలు పుష్కలంగా నీరు తాగడం, ఎక్కువ విశ్రాంతి తీసుకుంటే త్వరగా కోలుకుంటారు. ఒక సాధారణ ఫ్లూ నివారించగలగడమే డీ–హైడ్రేషన్. దీన్ని నివారించడంలో గోరువెచ్చని నీరు, ఎలక్ట్రోలైట్ సొల్యూషన్స్ వంటి పానీయాలు సహాయపడతాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఛాతినొప్పి, నిరంతరంగా అధిక జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. కొంతమంది పిల్లల్లో బీపీలో హెచ్చుతగ్గులు, సెన్సోరియం మారిపోవడం, మూర్ఛ రావడం వంటి తీవ్రమైన లక్షణాలు సైతం కనిపిస్తాయి.

– డాక్టర్ సునీల్ పవార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ నియోనాటాలజీ, ఫెర్నాండెజ్ హాస్పిటల్

నగరంలో నేడు..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఉదయం 11 గంటలకు భూమిపూజ జరుగుతుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు పాల్గొంటారు.
- వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 8.30గంటలకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ పంపిణీ చేస్తారు.
- రవీంద్రభారతిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల(ఆర్ఎస్ఎంఏ)ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ టాపర్స్‌కు ఉదయం 10.30గంటలకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అవార్డులను పంపిణీ చేస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

సాయుధ బలగాల త్యాగాలకు గౌరవం.. రక్షక్ ప్లస్ యోజన

– పంజాబ్ నేషనల్ బ్యాంక్

సాక్షి, సిటీబ్యూరో: సాయుధ బలగాల త్యాగాల్ని గౌరవించేందుకే తాము పీఎన్‌బీ రక్షక్ ప్లస్ ప్రత్యేక పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ శేరిలింగంపల్లి బ్రాంచ్‌కు చెందిన తమ ఖాతాదారు, ఇండియన్ ఆర్మీలో పనిచేసిన సహీద్ సుబేదార్ అకాల మరణం నేపథ్యంలో ఆయన కుమారుడు ఎం.కిరణ్ కాంత్‌కి రూ.కోటి పీఎన్‌బీ రక్షక్ ప్లస్ ఇన్సూరెన్స్ చెక్‌ను పరిహారంగా అందజేశారు. ఈ మొత్తాన్ని దివంగత సైనికోద్యోగి భార్య ఉమాదేవి ఖాతాలో జమచేశారు. ఈ సందర్భంగా జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ తమ రక్షక్ ప్లస్ పథకం ప్రయోజనాలు, విశేషాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ హెడ్ సంజయ్ మానె పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లను గుర్తించండి



ప్రజావాణిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ అధ్యక్షుడు షబ్బీర్ అలీ

లక్డీకాపూల్: ప్రైవేట్ విద్యా సంస్థలను గుర్తించినప్పుడు ప్రైవేట్ టీచర్లను ఎందుకు గుర్తించడంలేదని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వచ్చేనెల 5వ తేదీన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించే కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్లను భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ టీచర్ల సమస్యలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 వేలపైగా ఉన్న ప్రైవేట్ స్కూళ్లలో 2.50లక్షల మంది అన్ని అర్హతలు ఉండి చాలీచాలని జీతాలతో 33 లక్షల మంది విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే రెట్టింపు ఫలితాలను అందిస్తున్న ప్రైవేట్ టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఈ ప్రజా ప్రభుత్వ పాలనలోనైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ప్రణాళిక సంఘం చైర్మన్ చిన్నారెడ్డి అక్కడికక్కడే విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డితో చర్చించారు.

ఉప్పల్ కేవీ-1లో నేషనల్ స్పోర్ట్స్ మీట్

ప్రారంభించిన డిప్యూటీ సర్వేయర్ జనరల్ వరుణ్ కుమార్

ఉప్పల్: కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్) నేషనల్ స్పోర్ట్స్ మీట్ 2024–25లో భాగమైన బాలుర రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఉప్పల్‌లోని పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయ నెం.1 వేదికైంది. పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సర్వేయర్ జనరల్ జి.వరుణ్ కుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. బాలురకు సంబంధించి అండర్–14, అండర్–17, అండర్–19 కేటగిరీల్లో శనివారం వరకు 53వ జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయని పాఠశాల ప్రిన్సిపల్ ఈవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





భాషోద్యమ సారథి గిడుగు

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు



సాక్షి, సిటీబ్యూరో: నోటి మాటకు, చేతి రాతకు సంధానం కుదిరినప్పుడే భాష పోషకంగా ఉంటుందని భావించిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని కళాసంగీత నాట్యవేదికలో ఎందరో మహానుభావులు మధుస్మృతులు కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యవహారిక భాషోద్యమ సారథి, తెలుగు భాషా వైతాళికుడు గిడుగు వెంకటరామమూర్తి పంతులు అని వర్ణించారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తెచ్చి, భాషలో ఉన్న అందాన్ని తెలియజేసిన మహనీయుడు గిడుగు అన్నారు. వ్యవహారిక భాష అనగానే మన మదిలో మెదిలేది రామ్మూర్తి పంతులని తెలిపారు. నాలుగు దశాబ్దాలకుపైగా వ్యవహారిక భాషోద్యమం కోసం గ్రాంధిక వచనాలతో అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆయన భాషోద్యమం అచ్చంగా అభ్యుదయ సమాజం కోసమే అని, ప్రజల భావాలకు అనుగుణంగా భాష ఉండాలని, వాళ్ల భావాలకు, అందరికీ అర్థమయ్యే రీతిలో రాయగలగాలని, అందుకే వాడుక భాష చాలా అవసరమని గిడుగువారు వాదించారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకన్నీ, బండి శ్రీనివాస్, సంగీత నృత్యగురువు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయొద్దు

సాక్షి, సిటీబ్యూరో: నగర ప్రజలు తమ నిర్మాణాలు, కూల్చివేతల నుంచి వెలువడిన వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జీహెచ్ఎంసీ అనుమతి పొందిన అధీకృత ఏజెన్సీల ద్వారానే వాటిని తరలించాలని జీహెచ్ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది. వివరాలకు సమీపంలోని జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో సంప్రదించవచ్చని తెలిపింది.

పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు రిజిస్ట్రార్ హామీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు కేటగిరీ–2 నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హామీ ఇచ్చినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాత పద్ధతిలోనే పీహెచ్‌డీ కేటగిరీ–2కు నోటిఫికేషన్ వేసి ప్రవేశాలు చేపట్టాలని రిజిస్ట్రార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నెట్ తప్పనిసరి అనే నిబంధనను విరమించుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నేతలు రవినాయక్, అజయ్, మల్లూర్, శర్మ, అరవింద్, పవన్ పాల్గొన్నారు.

టెకీలకు భారీ జీతాల్లో హైదరాబాద్‌కు 3వ స్థానం

సాక్షి, సిటీబ్యూరో: టెక్ హబ్‌గా మారిన హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ నిపుణులకు జీతాల చెల్లింపుల్లోనూ దేశంలో ముందంజలో ఉంది. టీమ్ లీజ్ డిజిటల్ సంస్థ తాజా నివేదిక ప్రకారం అత్యధిక మొత్తంలో జీతాల చెల్లింపులకు సంబంధించి దేశంలోని టాప్ సిటీస్‌లో నగరం 3వ స్థానంలో ఉంది. ఈ విషయంలో మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, పుణె, కోల్‌కతాలను సైతం కిందకు నెట్టేసి నగరం టాప్‌లో ఉందని వెల్లడైంది. ముఖ్యంగా ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డేటా సైన్స్, డేటా ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగులకు రూ.9.5లక్షల నుంచి రూ.21.1లక్షల వరకూ వార్షిక ప్యాకేజీలు ఉన్నాయని ఈ నివేదిక తేల్చింది. బహుళజాతి కంపెనీలు తమ గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్ ఏర్పాటుకు ఎంచుకునే నగరాల్లో హైదరాబాద్ ముందుందని వెల్లడించింది. ఈ నివేదిక విడుదల సందర్భంగా టీమ్ లీజ్ డిజిటల్ ఐటి స్టాఫింగ్ బిజినెస్ హెడ్ కృష్ణ విజ్.. మాట్లాడుతూ దేశపు సాంకేతిక రంగ విస్తరణలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వచ్చే 2025 కల్లా బ్యాంకింగ్, ఫైనాన్షియల్, టెలికామ్, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు డిమాండ్ 22శాతం పెరగనున్న నేపథ్యంలో దేశంలోనే టెక్ హబ్‌గా హైదరాబాద్ తన స్థానాన్ని నిలబెట్టుకోనుందన్నారు.

ఓయూ భూముల కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూముల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కమిషనర్‌కు క్రైస్తవ జన సమితి అధ్యక్షుడు, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు ప్రేమ్‌కుమార్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అప్పట్లో నిజాం నవాబు ఉస్మానియా యూనివర్సిటీకి 1,600 ఎకరాలు కేటాయించగా లీజులు, కబ్జాలు పోను ఇప్పుడు 1200 ఎకరాలే మిగిలాయని పేర్కొన్నారు. తార్నాక, హబ్సిగూడ్, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్ కాలనీలకు ఆనుకొని ఉన్న వందలాది ఎకరాల ఓయూ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయని తెలిపారు. ఆక్రమణలకు గురైన ఓయూ భూములను హైడ్రా అధికారులు పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఒవైసీ బ్రదర్స్ అక్రమ నిర్మాణాలను కూల్చేయండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరిన బీజేపీ కార్పొరేటర్లు



సాక్షి, సిటీబ్యూరో: విద్యాసంస్థల పేరిట చెరువుల్ని కబ్జా చేసిన వారిని వదలొద్దని, చెరువులు, ఎఫ్‌టీఎల్‌లలో వెలసిన అక్రమ నిర్మాణాల్ని కూల్చివేయాలని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి నేతృత్వంలో బీజేపీ కార్పొరేటర్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. రంగనాథ్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం వారు కలిశారు. సలకం చెరువులో ఒవైసీ బ్రదర్స్ నిర్మించిన విద్యాసంస్థలు, ఆస్పత్రి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. చామకూర మల్లారెడ్డి, పల్లా రాజేశ్వరరెడ్డి, ఒవైసీ బ్రదర్స్ వారి విద్యాసంస్థల్లో పదిమందికి కూడా ఉచిత విద్యా సదుపాయం కలిపించలేదని, విద్యతో వ్యాపారం చేస్తున్న వారి నిర్మాణాల్ని కూల్చివేయాలన్నారు. అదే సందర్భంలో చదువుకుంటున్న విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాల్సిందిగా కోరగా, రంగనాథ్ సానుకూలంగా స్పందించినట్లు వారు విలేకరులకు తెలిపారు. చెరువుల రక్షణకు రంగనాథ్ చర్యల్ని స్వాగతిస్తూ ఆయనకు తమ మద్దతు ప్రకటించారు. చెరువుల్లోని విద్యాసంస్థలకు అనుమతులిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. తనను చంపినా పర్వాలేదు.. విద్యార్థులకు నష్టం కలిగించవద్దంటూ అక్బరుద్దీన్ ఉద్వేగంగా వ్యాఖ్యానించడాన్ని వారు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా తొలినాళ్లలో ఎన్‌క్రోచ్‌మెంట్స్‌పై చర్యలని హడావుడి చేసి అనంతరం సెటిల్మెంట్ చేసుకుందని ఆరోపించారు. రాజకీయాలను తాము పట్టించుకోమని, విద్యార్థులకు నష్టం కలగకుండా వ్యవహరిస్తామని రంగనాథ్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేబీఆర్ పార్కు ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోని వెలసిన నిర్మాణాలపైనా చర్యలు తీసుకోవాల్సిందిగా మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరగా, హైడ్రాకు ఆ అధికారం లేదని తెలిపారన్నారు. ఇతర కార్పొరేటర్లు తమ పరిధుల్లో చెరువుల్లో వెలసిన అక్రమ నిర్మాణాలనూ కూల్చివేయాల్సిందిగా కోరారు. బీజేపీ కార్పొరేటర్ల రాక సందర్భంగా హైడ్రా కార్యాలయం ఉన్న బుద్ధభవన్ వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

బీసీల హక్కులను కాలరాస్తే ఊరుకోం..



ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

అంబర్‌పేట: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని, దాన్ని తక్షణమే అమలు చేయకపోతే ఆ పార్టీని ప్రజాకోర్టులో శిక్షిస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. బీసీల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా కాలరాస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి డాక్టర్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌పై ఇచ్చిన హామీపై ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని ఆయన దుయ్యబట్టారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్‌మెంట్, స్కాలర్‌షిప్ కోసం నిధులు మంజూరు చేయడంలేదని ఆయన మండిపడ్డారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన విశ్వకర్మ యోజన పథకం కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు దోహద పడుతుందని అన్నారు. ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలని ఆయన కోరారు. సమావేశంలో ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీలంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, నాయకులు దివాకర్, ఈశ్వర్, సురేందర్ యాదవ్, మహేశ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం,
28, ఆగస్టు, 2024

తస్వాలో చైతూ సందడి..




సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్‌కు సంబంధించి సాంప్రదాయాన్ని కొనసాగిస్తూనే అధునాతన హంగులను సమ్మిళితం చేసుకోవడం హైదరాబాద్ నగరం ప్రత్యేకత అని ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగ చైతన్య తెలిపారు. హిమాయత్‌నగర్‌లో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన తస్వా మెన్స్‌వేర్ స్టోర్‌ను నాగచైతన్య ప్రారంభించారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్, తస్వా చీఫ్ డిజైన్ ఆఫీసర్ తరుణ్ తహిలియానీ సందడి చేశారు. నగరంతో ముడిపడి ఉన్న సాంస్కృతిక వారసత్వ విశిష్టతతో పాటు మోడ్రన్ డిజైన్స్ అందించడంలో తస్వా ప్రత్యేక వేదికగా మారిందని చైతూ అన్నారు. తస్వా బ్రాండ్ హెడ్ ఆశీష్ ముకుల్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర 'స్వరూపం'..

వస్త్ర కళాకారుల చిత్రకళా నైపుణ్యం..



సాక్షి, సిటీబ్యూరో : వస్త్ర విశేషాల పునరుజ్జీవనం... ఈ పదం వినడానికి చాలా బరువుగా ఉంటుంది. ఈ ప్రక్రియ కూడా అంతే క్లిష్టమైనది. మన భారత నేల మీద వస్త్రాలంటే కేవలం దేహానికి అచ్ఛాదన కోసం మాత్రమే కాదు. ప్రతి వస్త్ర విశేషమూ ఒక కళారీతి. మిల్లు వస్త్రాల నేపథ్యంలో అంతరించిపోతున్న మన వస్త్ర నైపుణ్యాలకు పునరుజ్జీవనం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా ఈ రోజు తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సిల్, ప్రఖ్యాత డిజైనర్ గౌరంగ్ షా సంయుక్త నిర్వహణలో స్వరూప్ ప్రదర్శన ప్రారంభమైంది. మంగళవారం నాడు హైదరాబాద్‌లోని క్రాఫ్ట్ కౌన్సిల్ భవనంలో మొదలైన ఈ ప్రదర్శన 28, 29 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగుతుంది.



చిత్రాలకు జీవం..

స్వరూప్ ప్రదర్శనలో రకరకాల వస్త్రాలపై శ్రీకృష్ణుడు, శ్రీకృష్ణుడి లీలలు ఇతివృత్తంగా చిత్రాలకు జీవం పోశారు. వస్త్రం మీద ఒక రూపాన్ని చూడాలంటే పెయింటింగ్, వీవింగ్, ఎంబ్రాయిడరీ చేయాలి. ఈ మూడు కళారూపాలను దేశంలోని రకరకాల కళారీతులతో మేళవించి చేనేత వస్త్రాలపై చిత్రించారు. లక్నో చికన్‌కారీ ఎంబ్రాయిడరీ, తెలంగాణ చేర్యాల పెయింటింగ్, కశ్మీర్ నుంచి ఢాకా వరకూ విస్తరించిన ఆరే వర్క్, ఒడిషా పటచిత్ర, శ్రీనగర్ కాలనీ వర్క్, శ్రీకాకుళం జామ్‌దాని, జైపూర్ గొట్టపత్తి.. ఇలా మనదేశంలో ప్రసిద్ధి చెందిన చిత్రకళలను మాధ్యమంగా చేసుకుని రకరకాల వస్త్రాలపై శ్రీకృష్ణుడి చిత్రాలకు రూపమిచ్చారు కళాకారులు. 'గతంలో రాజా రవివర్మ చిత్రాలను జామ్‌దానీ నేతలో వస్త్రాల మీదకు తెచ్చాను, ఇప్పుడు దేశంలోని అన్ని ముఖ్యమైన వస్త్రాలు, కళారూపాలతో శ్రీకృష్ణుడికి రూపమిచ్చాను' అని గౌరంగ్ షా తెలిపారు. 'రానున్న వినాయక చవితి కోసం గణేశుడి ఇతివృత్తంలో మరో వస్త్రకళారూపాల ప్రదర్శనకు సిద్ధమవుతున్నాను' అని చెప్పారు.

రేపటి నుంచి

ఫ్రీడమ్ ఫిల్మ్ ఫెస్టివల్

సాక్షి, సిటీబ్యూరో: స్వేచ్ఛగా మనగలగడానికి స్వేచ్ఛగా మనుగడ సాగించడానికి గొంతెత్తే అనేక భావ ప్రకటనా స్వేచ్ఛా ప్రియుల ఆలోచనలకు అద్దం పట్టే ఫ్రీడమ్ ఫిల్మ్ ఫెస్టివల్ నగరంలో జరుగనుంది. బంజారాహిల్స్‌లోని లామకాన్ కల్చరల్ సెంటర్‌లో రేపటి నుంచి ఈ పొట్టి చిత్రాల పండుగను 3 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ ఫెస్ట్‌ను తమిళనాడుకు చెందిన మరుపక్కమ్ సంస్థ ఆధ్వర్యంలో డాక్యుమెంట్రీ, షార్ట్ ఫిల్మ్స్ పండుగల నిర్వహణకు పేరొందిన ప్రముఖులు అముదన్ దీనికి సారథ్యం వహిస్తున్నారు.



హైదరాబాద్ వైబ్స్

వాటర్ స్పోర్ట్స్..

కయాకింగ్..

పర్యాటక క్రీడగా దేశంలో ప్రసిద్ధి

ఎంజాయ్ చేస్తున్న సాహస ప్రేమికులు | భాగ్యనగరంలోనూ పలుచోట్ల అందుబాటులోకి | జలక్రీడను ఆస్వాదిస్తున్న నగరవాసులు

తక్కువ వెడల్పు కాస్త ఎక్కువ పొడవు ఉండే కయాక్ లేదా పడవను రెండు వైపుల ప్యాడ్స్ ఉన్న ఒక తెడ్డును ఉపయోగించి నీటిపై కదిలించడమే కయాకింగ్. సాధారణంగా ఈ పడవపై ఒకేసారి ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు కలిసి పడవను నడిపించడమే ఈ క్రీడలోని ప్రత్యేకత. ముఖ్యంగా ఇది పర్యాటక క్రీడగా దేశంలో గుర్తింపు పొందింది. సాహస ప్రేమికులు, అడ్వెంచర్ టూరిజాన్ని ఇష్టపడే వారు ఈ కయాకింగ్‌కు ఆకర్షితులవుతుంటారు. సరస్సులు లేదా పెద్ద చెరువుల్లో వినోదించడానికి ఇదో చక్కని మార్గంగా చెప్పొచ్చు. ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ కయాకింగ్ అందుబాటులో ఉంది. దీంతో ఈ జలక్రీడను నగర వాసులు ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



ఇది చాలా కాలంగా నీటి క్రీడగా ఉంటూ వస్తున్నప్పటికీ గత దశాబ్ద కాలంగా ప్రధాన పర్యాటక క్రీడగా కూడా దేశంలో ప్రసిద్ధి చెందింది. సాహస ప్రేమికులైన పర్యాటకుల్లో చాలా మంది ఈ కయాకింగ్‌ను అనేక సార్లు ఎంజాయ్ చేసి ఉంటారు. అయితే నిన్నా మొన్నటి వరకూ దేశంలోనే ప్రధాన పర్యాటక ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాత్రమే వారికి ఈ అవకాశం దక్కేది. ఇటీవల నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో కూడా కొన్ని చోట్ల కయాకింగ్ అందుబాటులోకి వచ్చింది. ఆయా చోట్ల ఇప్పటికే నగరవాసులు ఈ జలక్రీడను ఆస్వాదిస్తున్నారు.

కోట్‌పల్లి అటవీ ప్రాంతంలో..

తెడ్డు చేతపట్టి జలాశయంలో నీటిని వెనక్కి నెట్టుకుంటూ ముందుకు సాగిపోతుంటే.. కయాకింగ్స్ ఈ అనుభూతి పొందాలంటే మాత్రం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి ప్రాజెక్టుకు పోవాల్సిందే. అటవీ ప్రాంతం మధ్యలో కనుచూపు మేరలో నీటి అలలపై తేలియాడే పడవలు కనువిందు చేస్తాయి. నిత్యం 300 నుంచి 400 మంది పర్యాటకులు ఇక్కడ బోటింగ్ చేస్తుంటారు. వారాంతాలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. గత పదేళ్లుగా ఇక్కడ బోటింగ్ కార్యకలాపాలు నడిపిస్తున్నారు. సుమారు 20 మంది లైఫ్ గార్డ్స్ అందుబాటులో ఉంటారు. లైఫ్ జాకెట్స్, ఇతర ప్రమాణాలు పాటిస్తుంటారు. ఒక్కరు ప్రయాణించే బోటుకు గంటకు రూ.250 ఫీజు వసూలు చేస్తారు. ఇద్దరు ప్రయాణించే బోటుకు రూ.400 వరకూ వసూలు చేస్తారు. ఈ రిజర్వాయర్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ తెరిచి ఉంటుంది. ఆన్‌లైన్‌లోనూ బుకింగ్ చేసుకోవడానికి వివరాలు అందుబాటులో ఉంటాయి. వికారాబాద్ పర్యాటక రంగంలో కోట్‌పల్లి బోటింగ్ పాత్ర కీలకమనే చెప్పాలి.

ప్రయాణం ఇలా..

నగరం నుంచి సుమారు 80 కిలో మీటర్ల దూరంలో ఈ ప్రాజెక్టు ఉంటుంది. హైదరాబాద్ నుంచి వికారాబాద్, తాండూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉంటాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, బేగంపేట్, లింగంపల్లి నుంచి రైలు సదుపాయం కూడా ఉంది. సొంత వాహనాల్లో వచ్చేవారు హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి చేవెళ్ల మీదుగా రావచ్చు. దీంతోపాటు శంకర్‌పల్లి మీదుగానూ రావచ్చు. ఇక్కడకు వచ్చే వారు అనంతగిరి కొండల్లో కొలువైన శ్రీ అనంత పద్మనాభస్వామి వారిని దర్శించుకుంటారు. అనంతగిరుల అందాలను ఆస్వాదిస్తారు.

నగరంలోనూ పలు చోట్ల..

ఈ వాటర్ స్పోర్ట్స్‌కు సంబంధించి నగరంలోని దుర్గం చెరువు కేంద్ర బింధువుగా మారింది. ఇక్కడ సూర్యాస్తమయ సమయాల్లో హుషారుగా సాగే కయాకింగ్ ఈవెంట్‌లో ఔత్సాహికులు పాల్గొనవచ్చు. పడవలను తిప్పుతూ సరదాగా కాసేపు గడపాలనుకునే వారికి రూ.700 రుసుముతో ఆ అవకాశం అందుబాటులో ఉంది. అలా కాకుండా ప్రొఫెషన్‌గా తీసుకుని సీరియస్‌గా కయాకింగ్ నేర్చుకోవాలనుకుంటే కూడా ఇక్కడి వాటర్ స్కూల్‌లో ప్రత్యేక కోర్సు అందుబాటులో ఉంది. ఒక్క సోమవారం మినహా వారంలోని అన్ని రోజుల్లో ఈ క్రీడ అందుబాటులో ఉంటుంది.



మరిన్ని ప్రాంతాల్లో...

అదే విధంగా నగరంలోని హుస్సేన్ సాగర్ దగ్గర ఉన్న యాచ్ క్లబ్ కూడా కయాకింగ్ ప్రియుల కోసం పడవలను అందుబాటులో ఉంచుతోంది. లక్నవరం సరస్సులో కాయక్‌ని అద్దెకు తీసుకుని, చుట్టూ నిర్మలమైన కొండలు ఉన్న సరస్సులో విహరించే అవకాశం ఉంది. అక్కడ కొన్ని క్యాంపింగ్ గ్రూపులు, స్థానికులు గంటల ప్రాతిపదికన కయాక్‌లను అద్దెకు ఇస్తారు. సాధారణంగా ఉదయం వేళలో మాత్రమే అందుబాటులో ఉంటాయి.



కయాకింగ్‌కు ఆదరణ పెరిగింది..

నాకు అడ్వెంచర్స్ అంటే చాలా ఇష్టం. గత 30 ఏళ్లుగా ట్రెక్కింగ్, బోటింగ్ చేస్తున్నాను. మన దగ్గర ఎంటర్‌టైన్‌మెంట్ అంటే ఎక్కువగా సినిమాల వరకే ఉంటాయి. అయితే ఎంతో మంచి వినోదాన్ని అందించే పర్యావరణ వింతలు, ట్రెక్కింగ్, బోటింగ్ వంటివి చాలా ఉన్నాయి. వీటిని ప్రోత్సహించేందుకు ప్రొగ్రెసివ్ తెలంగాణ సొసైటీ ఆధ్వర్యంలో కోట్‌పల్లిలో బోటింగ్ ఏర్పాటు చేశాం. దీని కోసం నా సొంత ఖర్చుతో బోట్లను కొనుగోలు చేసి ఇచ్చాను. దీని ద్వారా ఇప్పుడు కొంత మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయి. అంతే కాకుండా పరోక్షంగా వందలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఇప్పుడు ఇక్కడకు నిత్యం వేలాది మంది బోటింగ్‌కు వస్తున్నారు.

– విశ్వేశ్వరరెడ్డి, చేవెళ్ల బీజేపీ ఎంపీ

ఆరోగ్య లాభాలెన్నో..

కయాకింగ్ వల్ల అనేక రకాల ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రీడ మజిల్ స్ట్రెంగ్త్ పెంచుతుంది. ముఖ్యంగా అప్పర్ బ్యాక్, చేతులు, భుజాలు, ఛాతీ భాగంలో కండరాలు బలోపేతం అవుతాయి. ఆహ్లాదకరమైన వాతావరణం వల్ల ఒత్తిడి దూరమవుతుంది. మానసిక ఆరోగ్యానికి కూడా మేలు చేకూరుస్తుంది.

మేము లోకల్..

సినిమాలు, వెబ్ సిరీస్‌లో రాణిస్తున్న యువత | మోడలింగ్‌లో హైదరాబాదీలకు ప్రాధాన్యత | కరోనా తరువాత పెరిగిన ఫ్యాషన్ షోల సంఖ్య

నగరంలో పుష్కలంగా దొరుకుతున్న అవకాశాలు

నగర యువత మోడలింగ్ వైపు మొగ్గుచూపుతోంది. గతంలో ఫ్యాషన్ షో అంటే ముంబయి, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి మోడల్స్‌ను తీసుకురావడం సహజంగా కనిపించేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. స్థానికంగా యువత ఫ్యాషన్ రంగంలో రాణిస్తున్నారు. సామాజిక మాద్యమాల్లో ప్రముఖ తారలను ఫాలో అవుతున్నారు. వాటికి అనుగుణంగా లైఫ్‌స్టైల్‌ను మార్చుకుంటున్నారు. దీనికి తోడు అందం, అభినయం, వస్త్రధారణ, తాజా ఆవిష్కరణలతో అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్నారు. ఫలితంగా వెబ్‌సిరీస్, సినిమాల్లోనూ పుష్కలంగా అవకాశాలు లభిస్తున్నాయి. టాలెంట్ ఉంటే చాలు. అందరికీ అవకాశాలు లభిస్తాయని పలువురు మోడల్స్ పేర్కొంటున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

కరోనా తరువాత హైదరాబాద్‌లో ఫ్యాషన్ షోల సంఖ్య పెరుగుతోంది. ఈవెంట్స్‌కు ఆహ్వానాలు అందుతున్నాయి. యువత ఎవరైనా మోడల్ రంగంలోకి అడుగు పెట్టాలనుకుంటే ఇదే మంచి సమయమని సూచిస్తున్నారు. మంచి ట్యాలెంట్ ఉన్న వారికి సినిమాలు, వాణిజ్య ప్రకటనలు, వెబ్ సిరీస్, బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయడానికి పలు సంస్థలు ఆహ్వానం పలుకుతున్నాయి. నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి.



మంచి అవకాశాలు ఉన్నాయి..

లండన్‌లో మాస్టర్స్ ఇన్ బయోటెక్నాలజీ చేశాను. చదువు పూర్తి చేసుకున్నాక హైదరాబాద్‌లో సినిమాల్లో నటించాలన్న ఆసక్తితో ఆడిషన్స్‌కు వెళ్లాను. అప్పటికే కరోనా సీజన్ ముగిసింది. అక్కడ వందలాది మంది నాలాగే ఆడిషన్స్ కోసం వచ్చిన వారు ఉన్నారు. అందులో నన్ను ఎంపిక చేయడంతో నాలో కొంత కాన్ఫిడెన్స్ పెరిగింది. అక్కడి నుంచి సినిమాలు, ప్రకటనల్లో నటిస్తున్నా. ఫ్యాషన్ షోలకు ఆహ్వానం అందుతోంది. కెరీర్ బాగుంది. ప్రస్తుతానికి మూడు సినిమాలు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఓటీటీలో మరో మూడు సినిమాలు/వెబ్ సిరీస్ రిలీజ్ అయ్యాయి. అవి కాకుండా 8 ప్రకటనల్లో నటించాను. స్కిన్ కేర్ బ్రాండ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాను. గతంతో పోల్చితే తెలుగు వారికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. బయట నుంచి వచ్చి ఇక్కడ సర్వైవ్ కావడం కష్టం. తెలుగు రాదు అంటే అవకాశాలు తగ్గుతున్నాయి. నేను ఫ్యాషన్ రంగంలో ఎక్కడా ట్రెనింగ్ తీసుకోలేదు. హైదరాబాద్‌లో ట్యాలెంట్ ఉన్న వారికి తప్పనిసరిగా అవకాశాలు దక్కుతాయి. మోడలింగ్‌లో రాణించాలనే ప్యాషన్ ఉన్నవారికి ఇది మంచి సమయం.

– కృతికారాయ్, హైదరాబాద్

40 ప్రకటనల్లో నటించా..

మా సొంతూరు ఒంగోలు. హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతున్నాను. నాకున్న ఆసక్తితో మూడేళ్ల క్రితం మోడలింగ్‌లోకి వచ్చా. మోడలింగ్‌కు సంబంధించి సామాజిక మాద్యమాలను విరివిగా వాడతాను. దీంతో ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్, ప్రకటనలు, సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయి. సుమారు 40 ప్రకటనల్లో నటించాను. మూడు సినిమాలు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. అమితాబ్, రామ్‌చరణ్ వంటి ప్రముఖులతో ప్రకటనల్లో భాగస్వామిగా చేయడం సంతోషాన్నిచ్చింది. ఫ్యాషన్ షోలు ఎక్కువే పాల్గొన్నా. 2021లో మిస్ సౌత్ ఇండియాగా, మిస్ క్వీన్ తెలంగాణగా ఎంపికయ్యా.

– దీప్తి శ్రీరంగం, ఎంబీఏ విద్యార్థిని, హైదరాబాద్





1 నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్

సాక్షి, సిటీ బ్యూరో: మహానగరం మరో ప్రత్యేకమైన ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు వేదిక కానుంది. 'పాజ్ అండ్ రిఫ్లెక్ట్' పేరుతో సెప్టెంబర్ 1 నుంచి 8 వరకూ స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్, మాదాపూర్‌లో ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఢిల్లీ ఆర్ట్ మాగ్నమ్ ఆధ్వర్యంలో ఆర్ట్ క్యూరియేటర్ అన్నపూర్ణ ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఇందులో కళాకారులు ధ్రువ్ పటేల్, దుష్యంత్, రఘు, ముఖ్తార్ అహ్మద్‌లు తమ ప్రత్యేక కళాఖండాలను ప్రదర్శించనున్నారు. చిత్రకళా రంగంలో సరికొత్త కోణాన్ని కళా ప్రేమికుల ముందుకు తీసుకురానున్నారు. జీవితాన్ని ఎలా ఆనందంగా అనుభవించాలో ప్రత్యేకంగా తమ చిత్రాల్లో ప్రతిబింబించనున్నాయి. ఆదివారం ఉదయం 11 నుంచి రాత్రి 8 వరకూ ప్రవేశం ఉంటుంది.

బెంచ్ లైఫ్ చాలా స్పెషల్

నిహారిక

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ కంపెనీలో బెంచ్‌పై ఉండడం అంటే తరచూ అనిశ్చితిగా, ఏదో కోల్పోయినట్టు ఉండే ప్రదేశం కాదని, అక్కడ ఎన్నో కలలు నెరవేరే సందర్భాలు చోటు చేసుకుంటాయని సినీనటి, నిర్మాత నిహారిక కొణిదెల అంటున్నారు. కార్పొరేట్ ఉద్యోగ జీవనంలో ప్రత్యేకతను సంతరించుకున్న బెంచ్‌పై ఉండడం అనే పరిస్థితిపై తాను నిర్మాతగా రూపొందించిన 'బెంచ్‌లైఫ్' తెలుగు వెబ్‌సిరీస్ గురించి ఆమె మాట్లాడారు. బెంచ్‌పై కొత్త అనుభవాలు, స్నేహాలును తమ సిరీస్ చూపిస్తుందని చెప్పారు. ఈ సిరీస్‌లో వైభవ్ రెడ్డి, రితికా సింగ్, ఆకాంక్ష సింగ్, చరణ్ పేరి లతో పాటు సీనియర్ నటులు రాజేంద్ర ప్రసాద్, తులసి, తనికెళ్ల భరణి వంటి ప్రముఖులు కూడా నటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల నిర్మించిన ఈ సిరీస్ సెప్టెంబరు 12 నుంచి ఓటీటీ వేదిక సోనీ లివ్‌లో ప్రసారం కానుంది.




డబ్బు కట్టాం.. సీట్లు ఇవ్వాల్సిందే

కొత్త సీట్లు వస్తాయన్న ఇంజనీరింగ్ కాలేజీల మాట నమ్మి ముందే డబ్బు చెల్లించిన విద్యార్థులు

- ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో చేతులెత్తేసిన కాలేజీలు.. కట్టిన సొమ్ము తిరిగిచ్చేస్తామని హామీ..
- సీట్ల కోసమే పట్టుబడుతున్న విద్యార్థులు
- ఉన్నత విద్యామండలికి చేరిన పంచాయితీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థుల మధ్య సీట్ల పంచాయితీ ముదురుతోంది. డిమాండ్ లేని కోర్సులను రద్దు చేసుకున్న కాలేజీలు వాటి స్థానంలో కొత్త సీట్లు వస్తాయని భావించి యాజమాన్య కోటా కింద విద్యార్థుల నుంచి ముందే డబ్బు దండుకున్నాయి. కానీ కొత్త సీట్లకు ప్రభుత్వం అనుమతించకపోవడం, దీనిపై హైకోర్టుకెక్కినా కాలేజీలకు ఊరట లభించకపోవడంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. వివిధ కాలేజీల్లో దాదాపు 5 వేల మందికి ఈ తరహాలో సీట్లు ఇస్తామని యాజమాన్యాలు ఆశలు రేపాయి. అందులో టాప్ కాలేజీలే ఎక్కువగా ఉన్నాయి. దాదాపు అన్ని బ్రాంచీల్లో సీట్లు భర్తీ అయినందున ఇప్పుడు సీట్లు లేవని చెబుతున్న కాలేజీలు.. కావాలంటే కట్టిన సొమ్మును తిరిగిచ్చేస్తామని అంటున్నాయి. కానీ దీనికి విద్యార్థులు ఒప్పుకోవట్లేదు. ఇంజనీరింగ్ ప్రవేశాలు దాదాపు పూర్తికావడంతో ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఏదో ఒక బ్రాంచీలో తమకు సీట్లు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు.



స్పాట్ షురూ

స్లైడింగ్ తర్వాత 11 వేల పైచిలుకు ఇంజనీరింగ్ సీట్లు మిగిలాయి. వాటికి స్పాట్ అడ్మిషన్లు చేపట్టేందుకు వీలుగా సాంకేతిక విద్యామండలి మంగళవారం మార్గదర్శకాలు జారీ చేసింది. కాలేజీకి వచ్చిన వారిలో ర్యాంకు ప్రకారం సీట్లు ఇవ్వాలని సూచించింది. బుధవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని సూచించింది. బుధ, గురువారాల్లో కాలేజీలవారీగా ఖాళీగా ఉన్న సీట్లను పత్రికల ద్వారా వెల్లడించాలని, ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని తెలిపింది. వచ్చే నెల 3న స్పాట్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలను కాలేజీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అన్ని డాక్యుమెంట్లను సాంకేతిక విద్య విభాగానికి వచ్చే నెల 4లోగా కాలేజీలు అందజేయాల్సి ఉంది. మరోవైపు ఇప్పటికే యాజమాన్య కోటా కింద భర్తీ చేసిన సీట్లకు సెప్టెంబర్ 5 నుంచి ర్యాటిఫికేషన్ ప్రక్రియ నిర్వహించాలని ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేసింది. సీట్ల కేటాయింపును అన్ని డాక్యుమెంట్లతో వచ్చే నెల 10లోగా అప్‌లోడ్ చేయాలని సూచించింది.

మండలి వద్ద గందరగోళం

ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద మంగళవారం గందరగోళ పరిస్థితి కనిపించింది. ప్రైవేటు కాలేజీలు మోసం చేశాయని విద్యార్థులు అధికారులకు మొర పెట్టుకున్నారు. విద్యాసంవత్సరం నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని పట్టుబట్టారు. కొందరు ఆవేశంతో మాట్లాడుతూ తీవ్ర నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిణామాలతో అధికారులు అవాక్కయ్యారు. యాజమాన్యాల ప్రతినిధులతో మాట్లాడేందుకు విఫలయత్నం చేశారు. సీట్లు లేనప్పుడు ఎలా ఇవ్వగలమని కాలేజీల నుంచి సమాధానం రావడంతో నిస్సహాయత వ్యక్తం చేశారు.

అల్లు అర్జున్ ఏమైనా పుడింగా!

ఆయనకు అసలు ఫ్యాన్స్ ఉన్నారా?

- ఉన్నది మెగా ఫ్యాన్సే.. అర్జున్ తన స్థాయిని మర్చిపోయి మాట్లాడుతున్నారు
- బ్రాంచిలు, షామియానా కంపెనీల గురించి నాకు తెలియదు
- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి వ్యాఖ్యలు



తాడేపల్లిగూడెం: అల్లు అర్జున్‌కు అసలు ఫ్యాన్స్ ఉన్నారా? ఉన్నది మెగా ఫ్యాన్సే అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మెగా, అల్లు కుటుంబాల మధ్య జరుగుతోన్న వార్ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు పై విధంగా బొలిశెట్టి స్పందించారు. అల్లు అర్జున్‌కు ఫ్యాన్స్ ఉన్నట్టు తనకు తెలియదన్నారు. మెగా కుటుంబం నుంచి విడిపోయి ఎవరైనా ఫ్యాన్స్ బ్రాంచిలు, షామియానా కంపెనీలులాగా పెట్టుకుంటే మేం చెప్పలేం అని వ్యాఖ్యానించారు. ఉన్నదే మెగా ఫ్యాన్స్, ఉన్నదే చిరంజీవి ఫ్యామిలీ అని అంతే తప్ప అల్లు అర్జున్‌కు ఫ్యాన్స్ ఉన్నట్లు తనకు తెలియదన్నారు. తనకు ఫ్యాన్స్ ఉన్నారని అల్లు అర్జున్ ఊహించుకుంటున్నారేమో అని, ఆయన స్థాయి మర్చిపోయి మాట్లాడుతున్నారని, జాగ్రత్తగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. అల్లు అర్జున్‌లో చిరంజీవి, పవన్ కళ్యాణ్, రాంచరణ్ అభిమానులు వారి హీరోలను చూసుకుంటున్నారన్నారు. 'ఆయనను కాదని.. నేను పెద్ద పుడింగిని, నా కిష్టమైతే వస్తా అంటే, మానేయ్ వెళ్లిపో..ఎవడికి కావాలి? అల్లు అర్జున్‌ను రమ్మని అడిగారా? ఆయన వస్తే ఏంటి, రాకపోతే ఏంటి? 21 చోట్ల పోటీ చేస్తే 21 చోట్ల మేం నెగ్గాం' అని బొలిశెట్టి వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ ఒక చోటకు వెళితే అక్కడ కూడా ఓటమి వచ్చిందన్నారు. అల్లు అర్జున్ తండ్రి ఎంపీగా నిలబడినప్పుడే అర్జున్ నెగ్గించుకోలేకపోయారని, అందరినీ విమర్శించడం మంచిది కాదన్నారు.

రూ.150 కోట్ల భూమి 'ప్రైవేట్' స్వాధీనమా?

కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గచ్చిబౌలిలోని రూ.150 కోట్ల భూమిని ప్రైవేట్‌కు లీజుకి ఇవ్వడం.. ఆ తర్వాత దాన్ని బ్యాంక్ స్వాధీనం చేసుకోవడం.. చట్టవిరుద్ధమన్న పిటిషనర్ వాదనపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. 'రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 91లో పర్యాటక శాఖకు చెందిన రూ.150 కోట్లకుపైగా విలువైన మూడెకరాలను సప్తరిషి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 2010, జూలైలో లీజుకు ఇచ్చారు. లీజుకు తీసుకున్న భూమిని తనఖాపెట్టి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రుణం తీసుకున్నారు. రుణం చెల్లించకపోవడంతో ఆ భూమిని బ్యాంక్ స్వాధీనం చేసుకుంది. పర్యాటక శాఖకు చెందిన భూమిని స్వాధీనం చేసుకోవడం చట్టవిరుద్ధం. అసలు ఆ భూమిని లీజుకు ఇవ్వడం కూడా చెల్లదు. దీనిపై దర్యాప్తు చేయాలని సీబీఐకి వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదు. దర్యాప్తు చేసేలా సీబీఐని ఆదేశించాలి' అని కోరుతూ హైకోర్టులో సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపించారు. అనంతరం కేంద్ర టూరిజం శాఖ కార్యదర్శి, సీబీఐ, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఎండీతోపాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, మహా హోటల్స్, సప్తరిషి హోటల్స్, ఏపీ టెక్నికల్ అండ్ ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ ఆర్గనైజేషన్‌కు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

ఇక్కడే పుట్టిపెరిగినా లోకల్ కాదంటారా?

- వైద్య విద్య అడ్మిషన్లలో జీవో 33పై పిటిషనర్ల వాదనలు
- ప్రతివాదుల వాదనల కోసం విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యలో ప్రవేశాలకు సంబంధించి తెలంగాణలోనే పుట్టి పెరిగినా స్థానికులు కాదంటూ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం చట్ట విరుద్ధమంటూ పిటిషనర్లు హైకోర్టులో వాదనలు వినిపించారు. పిటిషనర్ల వాదనలు పూర్తయినా.. సమయాభావం కారణంగా ప్రతివాదులు వాదనలు వినిపించకపోవడంతో ధర్మాసనం విచారణను బుధవారానికి వాయిదా వేసింది. 'ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ నిబంధనలు 2017లోని రూల్ 3(ఏ)ను సవాల్ చేస్తూ హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహా అభినామ్‌తోపాటు మరో 13 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'నిబంధనలను ఉల్లంఘిస్తూ గత నెల 19న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 చట్టవిరుద్ధం. జీవో ప్రకారం విద్యార్థులు 9, 10తోపాటు ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలి. ఇది చట్టవిరుద్ధం. స్థానికతపై కొత్త రూల్స్ అంటూ వైద్యారోగ్య శాఖ జారీ చేసిన ఈ జీవోను కొట్టివేయాలి' అని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు డీవీ సీతారాంమూర్తి, మయూర్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపిస్తూ.. 'చాలామంది విద్యార్థులు ఇంటర్మీడియెట్‌ను ఇతర రాష్ట్రాల్లో చదివారు. వారంతా ఇక్కడే పుట్టి పెరిగినా.. 10వ తరగతి వరకు ఇక్కడే చదివినా జీవో ప్రకారం స్థానికత వర్తించదు. అదే ఆ నాలుగేళ్లు ఇక్కడే చదివి.. ఇక్కడ పుట్టకపోయినా వారికి స్థానికత వర్తిస్తుంది. ఇది రాజ్యాంగ హక్కులను కాలరాసినట్లే. వైద్య విద్య సీట్ల భర్తీలో శాశ్వత నివాసితులైన విద్యార్థులను లోకల్‌గానే పరిగణించాలని ఇదే హైకోర్టు స్పష్టం చేసింది. కౌన్సెలింగ్‌లో స్థానిక కోటా 85 శాతం సీట్ల భర్తీకి వారు అర్హులని తేల్చిచెప్పింది' అని పేర్కొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో శివసేనారెడ్డి

క్రీడాశాఖను మేటిగా తీర్చిదిద్దుతాం: భట్టి

గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): ఒలింపిక్స్‌తో పాటు జాతీయ అంతర్జాతీయ పోటీలలో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా క్రీడాశాఖను తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉద్యోగుల క్రీడా పోటీలను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించి, విద్యాసంస్థలలో క్రీడా తరగతులుండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన క్రీడా పోటీలకు హైదరాబాద్‌ను వేదికగా మార్చడానికి చర్యలు తీసుకుంటామని, క్రీడలకు అవసరమైన నిధులను కేటాయిస్తామన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి క్రీడల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనిబాలాదేవి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, టీజీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్య దర్శి సత్యనారాయణ, టీఎన్జీవో అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ పాల్గొన్నారు.

ఏడు నెలలైనా ఎదురుచూపులే

- వేతన సవరణ బాండ్ల బకాయిల చెల్లింపులో తీవ్రజాప్యం
- ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆర్టీసీలోని ఓ జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీల ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో బకాయిల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై కొందరు ఉద్యోగులు నిరసన బాట పట్టారు. వేతన సవరణ బకాయిలు, పీఎఫ్, సీసీఎస్ బకాయిలు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2015 నాటి వేతన సవరణకు సంబంధించి బాండ్ల తాలూకు బకాయిల చెల్లింపునకు వీలుగా రూ.281 కోట్లు విడుదల చేస్తున్నట్టు గత ఫిబ్రవరిలో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ, అందులో రూ.81 కోట్లు మాత్రమే విడుదల చేశారు. దీంతో దిక్కుతోచని ఆర్టీసీ అధికారులు.. వాటిని 15 వేల మంది డ్రైవర్లకు మాత్రమే సర్దుబాటు చేశారు. మిగతా 27 వేల మంది ఉద్యోగులు అప్పటి నుంచి రూ.200 కోట్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిగో అదిగో అంటూ పేర్కొనటం తప్ప ఆ మొత్తం విడుదల కావటం లేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నేత వెంకన్న, టీఎంయూ (చీలికవర్గం) నేత థామస్‌రెడ్డి, ఎంఎంయూకు చెందిన మౌలానా, బీకేయూ నేత యాదయ్య, బీడబ్ల్యూయూ నేత సురేశ్, యాదగిరిలతో కూడిన మరో జేఏసీ మంగళవారం నల్లబ్యాడ్జీల నిరసనకు శ్రీకారం చుట్టింది. ఈ జేఏసీకి చెందిన కార్మికులు డిపోల్లో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని ఆ జేఏసీ హెచ్చరించింది. గతంలో ఆర్టీసీ కార్మికుల పక్షాన జేఏసీగా ఉండి పోరాటం చేసిన అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి సహా పలువురు ఇతర సంఘాల నేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్నారు. వీరు ప్రత్యక్ష ఆందోళనలపై తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వంతో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకునే దిశలో ఉన్నారు.

ఆర్టీసీలో డీఏ క్లియర్


- అన్ని విడతల బకాయిల చెల్లింపునకు సంస్థ ఓకే

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో 'కరువు భత్యం' పూర్తిస్థాయిలో చెల్లించనున్నారు. ఈ సంవత్సరం జూలై విడత కరువు భత్యాన్ని 2.9 శాతంగా ఆర్టీసీ ఖరారు చేసింది. దీంతో బకాయిలు అంటూ లేకుండా అన్ని విడతల కరువు భత్యం ఆర్టీసీ ఉద్యోగుల వేతనంలో కలిసింది. తాజా చెల్లింపుతో కరువు భత్యం మొత్తం 46.1 శాతంగా మారింది. గతంలో ఆర్టీసీలో ఎప్పటికప్పుడు డీఏ చెల్లించే పద్ధతి ఉండేది. కానీ 2013 నుంచి కరువు భత్యం సకాలంలో సర్దుబాటు చేయకుండా పెండింగ్‌లో ఉంచుతూ వచ్చారు. 2019లో ఆర్టీసీలో 53 రోజుల పాటు సమ్మె జరిగిన సమయంలో దాదాపు ఏడు విడతల కరువు భత్యం బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. ఆ తర్వాత క్రమంగా ఒకటి రెండు విడతల బకాయిలు క్లియర్ చేస్తూ వచ్చిన ఆర్టీసీ గతేడాది చివరి నాటికి రెండు బకాయిలు తప్ప మిగతా వాటిని ప్రకటించింది. 2017 నాటి వేతన సవరణను ఇటీవల అమల్లోకి తెచ్చిన సమయంలో, ఆ వేతన సవరణ గడువు నాటికి బకాయి ఉన్న కరువు భత్యం మొత్తాన్ని ఉద్యోగుల మూలవేతనంలో కలిపేసింది. అప్పటి వరకు 82.6 శాతంగా ఉన్న కరువు భత్యంలోంచి, 2017 వేతన సవరణ గడువు నాటికి సంబంధించిన 31.1 శాతాన్ని మూలవేతనంలో కలిపింది. దీంతో 51.5 శాతం మిగిలింది. దాన్ని వేతన సవరణ లెక్కల ప్రకారం 43.2 శాతానికి న్యూట్రలైజ్ చేసింది. జూలై నెలకు సంబంధించి 2.9 శాతాన్ని తాజాగా ప్రకటించటంతో డీఏ మొత్తం 46.1 శాతానికి చేరింది. దీంతో ఇక ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ బకాయిలు అంటూ లేకపోవటం విశేషం.


ఒకే లారీలో 47 ఆవులు

- ఊపిరాడక ఆరు గోవులు మృతి
- కరీంనగర్ జిల్లా రేణికుంట టోల్‌గేట్ వద్ద పట్టివేత

తిమ్మాపూర్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న ఆవులను కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పక్కా సమాచారంతో రేణికుంట టోల్‌ప్లాజా సమీపంలో తనిఖీలు చేపట్టారు. సీఐ స్వామి, ఎస్సై చేరాలు ఓ లారీని తనిఖీ చేయగా అందులో 47 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఆరు గోవులు ఊపిరాడక మృతి చెందాయి. ఆవులను కోతకోసం హైదరాబాద్ పంపిస్తున్నారని తెలుసుకుని, ఎల్ఎండీ కాలనీలోని మృత్యుంజయాలయం ఆవరణలోని శ్రీగిరిజా గోశాలకు తరలించారు. తిమ్మాపూర్ పశువైద్యాధికారి మౌనిక ఆవులకు సెలైన్ ఎక్కించి చికిత్స అందించారు. విశ్వహిందూ పరిషత్ గో సంరక్షక్ విభాగ్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి గోవులను పెంచుకునే పలువురు రైతులకు ఆవులను అప్పగించారు. అనంతరం ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆవుల తరలింపు నియంత్రణ కోసం అలుగునూర్ చౌరస్తాలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని సీపీని కోరారు. లారీ డ్రైవర్‌ను కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.



లారీలో ఊపిరాడక మృతి చెందిన ఆవులు



అస్వస్థతకు గురైన ఆవులకు చికిత్స చేస్తున్న వెటర్నరీ డాక్టర్లు

ప్రభుత్వ పథకాలు భేష్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కితాబు

- షెడ్యూల్డ్ ప్రాంతాల అభివృద్ధికి సర్కారు కృషి చేస్తోందని వ్యాఖ్య
- ఆదివాసులు, గిరిజనులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు
- యాదాద్రీశుని దర్శించుకున్న గవర్నర్.. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో పర్యటన



ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలంలోని రామప్ప ఆలయ శిల్పాలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క తదితరులు

సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి, యాదాద్రి: షెడ్యూల్డ్ ప్రాంతాల అభివృద్ధికి, పేదలు, గిరిజనులు, ఆదివాసుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. ప్రభుత్వ పథకాలు బాగున్నాయంటూ కితాబిచ్చారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాలకు సర్కారు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇదే స్ఫూర్తి నిరంతరం కొనసాగాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో గిరిజనులు, ఆదివాసులు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మంగళవారం మూడు రోజుల రాష్ట్ర పర్యటన ప్రారంభించిన గవర్నర్.. యాదాద్రి జిల్లా పర్యటన అనంతరం రోడ్డు మార్గంలో ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. మంత్రి ధనసరి సీతక్క (అనసూయ), భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓలు ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధిపై ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ములుగు జిల్లాలో కంటైనర్ హాస్పిటల్ వినూత్నంగా ఏర్పాటు చేయడంపై మంత్రి సీతక్కను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు.

రామప్ప గుడి, కోటగుళ్ల సందర్శన

ములుగు జిల్లాకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, జాతీయ, అంతర్జాతీయ క్రీడా అవార్డు గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో జిష్ణుదేవ్ వర్మ సమావేశమయ్యారు. రామప్ప గుడి, సరస్సును సందర్శించారు. రామలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామప్ప ఆలయ నిర్మాణం, విశిష్టత, శాండ్ బాక్స్ టెక్నాలజీ, శిల్పసంపద రమణీయతను తెలుసుకున్నారు. రామప్ప దేవాలయం మహాద్భుత కట్టడమని పేర్కొన్నారు. అనంతరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల గణపేశ్వరాలయాన్ని గవర్నర్ వర్మ సందర్శించారు. తర్వాత లక్నవరం చేరుకుని రాత్రిబస చేశారు. ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు. కాగా గవర్నర్ బుధ, గురువారాల్లో వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో పర్యటించనున్నారు.

ప్రజలు బాగుండాలని యాదాద్రీశుని కోరుకున్నా

అంతకుముందు ఉదయం రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరిన గవర్నర్ తొలుత యాదాద్రికి చేరుకున్నారు. విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్ర దేవాదాయశాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల కమిషనర్ ఎం.హనుమంతరావు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో గవర్నర్‌కు అధికారులు, వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గవర్నర్ ముందుగా శ్రీస్వామివారి పుష్కరిణి వద్ద స్నాన సంకల్పం చేశారు. అఖండ జ్యోతి దీపారాధన చేసి మొక్కు టెంకాయ సమర్పించారు. తూర్పు రాజగోపురం ద్వారా ప్రధానాలయంలోనికి ప్రవేశించారు. ధ్వజ స్తంభం వద్ద మొక్కిన తర్వాత అంతరాలయంలో అర్చన పూజచేశారు. దర్శనానంతరం గవర్నర్‌కు మహా మండపంలో వేద మంత్రాలతో వేదాశ్వీరచనం చేశారు. ఆలయం కట్టడాలను పరిశీలించిన గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామి వారి మెమెంటోను అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. కలెక్టర్ హనుమంత్ కె.జెండగే, పలువురు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఆయన వెంట ఉన్నారు. కాగా తెలంగాణ ప్రజలు బాగుండాలని లక్ష్మీనరసింహస్వామిని కోరుకున్నానని గవర్నర్ దేవాలయం వెలుపల మీడియాతో చెప్పారు.

ప్రజారోగ్యానికి ఉరితాడు

పీపీపీ మోడల్ అంటూ సామాన్యులకు నాణ్యమైన వైద్యం దూరం
'ఎక్స్'వేదికగా ఏపీ సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం



సాక్షి, అమరావతి: ఏపీలో ప్రజారోగ్య రంగానికి సీఎం చంద్రబాబు సర్కారు ఉరితాడు బిగిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తోందంటూ 'ఎక్స్'వేదికగా మండిపడ్డారు. 'ఇప్పటికే స్పెషలిస్టు వైద్యులు సహా సిబ్బంది నియామకాలను నిలిపివేసి జీరో వేకెన్సీ పాలసీకి గండి కొడుతున్నారు. మరోవంక బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యశ్రీని నీరుగారుస్తున్నారు. ప్రజలు వైద్యం కోసం తిరిగి ఆస్తులు అమ్ముకునే పరిస్థితి తెస్తున్నారు'అంటూ చంద్రబాబు ప్రభుత్వ విధానాలను తూర్పారబడుతూ మంగళవారం ట్వీట్ చేశారు. 'ఈ ఏడాది కొత్తగా ప్రారంభం కావాల్సిన ఐదు మెడికల్ కాలేజీలను ఉద్దేశపూర్వకంగా మీరు నిర్లక్ష్యం చేయడం దీనికి మరో సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఏడాది ఆ కాలేజీల్లో తరగతులు ప్రారంభంకాకపోవడం మీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం'అని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. ట్వీట్‌లో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే...

విప్లవాత్మక సంస్కరణలతో పటిష్టం చేశాం..

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజారోగ్య రంగాన్ని పటిష్టం చేసేందుకు పలు విప్లవాత్మక సంస్కరణలు తెచ్చాం. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ చొప్పున మొత్తం 17 కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి రూ.8,480 కోట్లతో శ్రీకారం చుట్టాం. 2023–24లో విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కొత్త మెడికల్ కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభం అయ్యాయి. తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. 2024–25 విద్యా సంవత్సరంలో మరో ఐదు చోట్ల.. పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని కొత్త కాలేజీల్లో తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. అన్ని వసతులున్నా మీ వైఖరి కారణంగా వీటికి గ్రహణం పట్టింది చంద్రబాబూ..! కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న బీజేపీతో పొత్తులో ఉన్నా మీరు అనుమతులు తెచ్చుకోలేకపోయారు. ఇది మీ వైఫల్యంకాదా? దీంతోపాటు కొత్త కాలేజీల్లో మెడికల్ సీట్లన్నింటినీ కూడా కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూడా గాలికొదిలేశారు.

ప్రైవేట్ జపంతో సామాన్యుల నెత్తిన భారం..

మెడికల్ కాలేజీలన్నింటినీ ప్రైవేటుపరం చేసి సామాన్యుల నెత్తిన భారం మోపే విధానాల్లోకి వెళ్తున్నారు. పీపీపీ మోడల్ అంటూ ప్రైవేటు కోసం, ప్రైవేటు కొరకు, ప్రైవేటు చేత, ప్రైవేటు వల్ల నడుపుతున్న వ్యవస్థలా ప్రజారోగ్య రంగాన్ని మార్చేసి సామాన్యుడికి నాణ్యమైన వైద్యం అందుబాటులోలేని పరిస్థితి తెస్తున్నారు. ఈ విధానాలను ఇప్పటికైనా మార్చుకోండి. ఈ సంవత్సరం ఆ 5 కొత్త మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.



ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్ వద్ద కాకతీయ కళాతోరణం లేని రాజముద్రతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వరంగల్‌లో ఎల్ఆర్ఎస్ ఫ్లెక్సీపై రగడ

- కాకతీయ కళాతోరణం లేని రాజముద్రతో ఫ్లెక్సీ ప్రదర్శన
- ఇద్దరు అధికారులకు మెమోలు జారీ

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో ఈ నెల 25న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది హెల్ప్‌డెస్క్ ఎదుట ప్రదర్శించిన ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. కాకతీయ కళాతోరణం లేని రాజముద్రను ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన ఫ్లెక్సీల్లో ముద్రించడం పట్ల పెద్దఎత్తున విమర్శలువచ్చాయి. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. రాజముద్రను అధికారికంగా ఖరారు చేయకుండా ఫ్లెక్సీల్లో ఎలా ప్రదర్శిస్తారంటూ మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ట్యాగ్ చేస్తూ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఫ్లెక్సీలో తెలంగాణ అస్తిత్వ చిహ్నాలు లేకపోవడంపై మండిపడ్డారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ కాకుండా తెలంగాణ రాజముద్రగా మరో చిహ్నాన్ని ముద్రించడమేంటని ప్రశ్నించారు. కొత్త అధికార చిహ్నాన్ని ఎవరు, ఎప్పుడు ఆమోదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. చిహ్నాల మార్పు అధికారిక నిర్ణయమా లేక నిర్లక్ష్యమో చెప్పాలన్నారు. దీనిపై సీఎస్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ స్పందించారు. టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్లెక్సీలో జరిగిన తప్పులపై బల్దియా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ (సీపీ) రవీందర్, సెక్షన్ సూపరింటెండెంట్ జీవన్ కుమార్‌కు మెమోలు జారీ చేశారు. దీంతో వెంటనే ఆ ఫ్లెక్సీని తీసివేసి మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.



• జస్టిస్ హేమా కమిషన్‌లో ఉన్న కీచకుల పేర్లను బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్న మహిళలు

మాలీవుడ్ సూపర్ హిట్

అమ్మ.. రాజీనామా

కేరళ సినిమా రంగంలో భూకంపం పుట్టింది. నటీనటుల సంఘం 'అమ్మ' కార్యవర్గం పూర్తిగా రాజీనామా చేసింది. వీరిలో మోహన్‌లాల్ ఉన్నారు. గత కొన్ని రోజులుగా కేరళ సినిమా రంగంలో మహిళలపై దురాగతాలు బయటికి వస్తుండటంతో పరిశ్రమ వణుకుతోంది. కొందరు తమ పదవులకు రాజీనామాలు చేస్తుంటే మరికొందరు ముఖం చాటేస్తున్నారు. ఈ దావానలం బాలీవుడ్ వరకు పాకితే మరింత ప్రక్షాళనం జరగవచ్చు.


• దిలీప్

మలయాళ సినీ పరిశ్రమలో గొలుసుకట్టు ఘటనలు జరుగుతున్నాయి. 2017లో మలయాళ నటి భావనా మీనన్‌పై లైంగిక దాడి జరగడం (కొచ్చి శివార్లలో కారులో కొందరు వ్యక్తులు చేశారని ఆరోపణ) వెనుక సూత్రధారి మలయాళ హీరో దిలీప్ అని రేగిన కార్చిచ్చు అక్కడి ప్రభుత్వం చేత జడ్జి హేమ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేయించింది. అయితే ఆ కమిటీ రిపోర్టు ఆలస్యంగా 2024 ఆగస్టులోగాని బయటకు రాలేదు. అది వచ్చిన వెంటనే మలయాళ పరిశ్రమలో కొంతమంది మహిళలు తమ అనుభవాలను బయటకు చెప్పసాగారు. దాంతో మలయాళ పరిశ్రమ కుదుపులకు లోనవుతోంది.

నటుడు సిద్దిఖీ పై ఆరోపణ


• సిద్దిఖీ

మలయాళంలో టాప్ కేరెక్టర్ ఆర్టిస్ట్, అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ)కు జనరల్ సెక్రటరీ అయిన సిద్దిఖీ పై రేవతి సంపత్ అనే జూనియర్ ఆర్టిస్ట్ అత్యాచార ఆరోపణలు చేసింది. హేమా కమిషన్ బయటకు వచ్చాక ఆమె తన ఆరోపణలను మరోసారి మీడియా ముందుకు తెచ్చింది. '2016లో అతను కొచ్చిలోని ఒక హోటల్‌లో నా పై అత్యాచారం చేశాడు. అప్పుడు నాకు 21 ఏళ్లు ఉంటాయి. నాకు సినిమా రంగం ఆసక్తి ఉందని తెలిసి హోటల్‌కు పిలిపించి హఠాత్తుగా లైంగికదాడి చేశాడు' అని ఆమె చెప్పింది. ఈ ఆరోపణలు ఆమె 2019లో చేసినా ఇప్పుడు మళ్లీ శక్తి పుంజుకుని సిద్దిఖీని విమర్శల వలయంలో నిలబెట్టాయి. దాంతో అతడు 'అమ్మ' పదవికి రాజీనామా చేశాడు. అయితే అతడు తాజాగా ఆ జూనియర్ ఆర్టిస్టు తనపై లేనిపోని అభాండాలు వేస్తోందని కేరళ డి.జి.పికి ఫిర్యాదు చేశాడు.

కాంప్రమైజ్ - అడ్జస్ట్

ఒక నటి సినిమా చేయడానికి అంగీకరించే ముందు మలయాళ పరిశ్రమలో వినిపించే రెండు పదాలు కాంప్రమైజ్, అడ్జస్ట్. వేషం తెచ్చే ప్రొడక్షన్ మేనేజర్లు 'రాజీ పడాలని', 'సర్దుకుపోవాలని' కోరుతారు. 'సరే' అంటే వేషం. లేకుంటే లేదు. అంతటితో వదిలితే ఫరవాలేదు. కాని హేమా కమిషన్ ప్రకారం ఏ మహిళా ఆర్టిస్ట్ అయినా నో అంటే వెంటనే ఇండస్ట్రీ అంతటా వ్యాపిస్తుంది. ఆమెను 'దారి'కి తెచ్చే పని ఇండస్ట్రీ అంతా తీసుకుంటుంది. 'మా సారు (ఏ పెద్ద స్టారో దర్శకుడో ప్రొడ్యూసరో) అడిగితే కాదంటావా?' అని ఎవరూ వేషం ఇవ్వరు. పస్తులతో మాడేలా చేస్తారు. అందుకే మలయాళ హీరో పృథ్వీ రాజ్ సుకుమారన్ ముందుకొచ్చి 'మహిళలు చేసే ఏ ఫిర్యాదునైనా సీరియస్‌గా తీసుకోవాలి' అని బహిరంగంగా మాట్లాడాడు

ఫ్యాన్స్ ఆర్మీ

లైంగిక దుశ్చర్యలు ఎదుర్కొన్న మహిళలు బయటకు చెప్పేందుకు భయపడటానికి మరో కారణం ఈ పెద్ద నటులు ఫ్యాన్స్ ఆర్మీలను దాడికి పురిగొల్పుతుండటమే. ఏ హీరోను ఎవరేమన్నా వారి అభిమానులు సోషల్ మీడియాలో బూతులు జోడిస్తూ మీమ్స్ తయారు చేస్తుండటంతో బాధితులు బెంబేలెత్తుతున్నారు. కొన్నిసార్లు భౌతికంగా దాడి చేస్తారనే భయం కూడా సృష్టిస్తున్నారు. అందుకే హేమా కమిషన్ ఫ్యాన్స్‌ను కట్టడి చేయాలని ప్రభుత్వానికి ప్రత్యేకంగా సూచించింది.

తలుపు విరిగేలా బాదుతారు

'ఔట్‌డోర్ షూటింగ్‌లో అర్ధరాత్రి తాగేసి వచ్చి తలుపు విరిగేలా బాదుతారు. అందుకే ఔట్‌డోర్‌లో కుటుంబ సభ్యులను తోడు తీసుకొని వెళ్లాల్సి వస్తోంది' అని చాలామంది మహిళా ఆర్టిస్టులు హేమా కమిషన్‌కు చెప్పారు. వేషం ఇచ్చేటప్పుడే 'అడిగితే అంగీకరించాలనే' డిమాండ్‌ను ప్రొడక్షన్ మేనేజర్ చల్లగా చెప్తాడని తెలియచేశారు.



మోహన్‌లాల్ రాజీనామా

30 ఏళ్ల చరిత్ర కలిగిన 'అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్' (అమ్మ) అధ్యక్ష పదవికి నటుడు మోహన్‌లాల్ రాజీనామా చేశారు. మలయాళ పరిశ్రమలో స్త్రీలపై సాగుతున్న లైంగిక దోపిడిని జస్టిస్ హేమా కమిషన్ బయట పెట్టాక వినవచ్చిన ఆరోపణల్లో 'అమ్మ' జనరల్ సెక్రటరీ సిద్దిఖితో పాటు మరికొందరి పేర్లు ఉన్న దరిమిలా నైతిక బాధ్యత వహిస్తూ మొత్తం 17 మంది సభ్యులున్న కార్యవర్గం రాజీనామా చేసింది. హడావిడిగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ మీటింగ్‌లో కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. 'మమ్మల్ని విమర్శకు, దిద్దుబాటుకు లోను చేసినందుకు కృతజ్ఞతలు' అని రాజీనామా లేఖలో కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకూ మోహన్‌లాల్, మమ్ముట్టి తదితర సూపర్‌స్టార్లు హేమా కమిషన్ గురించి ఏమీ మాట్లాడకపోవడాన్ని 'ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్' (డబ్ల్యుసిసి) తప్పుబట్టింది. మలయాళ రంగంలోని మహిళా నటీమణులు 'అమ్మ'తో విభేదించి ఈ గ్రూపును నియమించుకున్నారు. హేమా కమిషన్ రిపోర్టును బయటపెట్టమని పోరాడింది వీరే. 'తంగలాన్' నటి పార్వతి తిరువోతు ఈ గ్రూప్‌లో చురుగ్గా పని చేస్తోంది.

మెంబర్‌షిప్‌కు వెళ్లినా

'మూడు సినిమాల్లో నటిస్తే అమ్మలో మెంబర్‌షిప్ తీసుకోవచ్చు. దానికోసం నేను ఫోన్ చేస్తే ఆ పనులు చూసే సభ్యుడు తన ఫ్లాట్‌కు రమ్మన్నాడు. నేను ఫ్లాట్‌కు వెళ్లి ఫామ్ ఫిలప్ చేస్తుంటే వెనుక నుంచి వచ్చి ముద్దు పెట్టుకున్నాడు. ఔట్‌డోర్ షూటింగ్‌లో ఒక నటుడు నా రూమ్‌కు వచ్చి తలుపు తీసిన వెంటనే మంచం మీదకు లాగే ప్రయత్నం చేశాడు. ఇంకో నటుడు రెస్ట్ రూమ్ నుంచి బయటకు వస్తున్నప్పుడూ వదల్లేదు. కావలించుకున్నాడు. 'అడ్జస్ట్' అవమని అందరూ చెప్పడమే. ఎంత అడ్జస్ట్ అవుదామని చూసినా ఇది భరించలేనంతగా ఉండటం వల్ల మలయాళ ఇండస్ట్రీ వదిలిపెట్టి చెన్నైకి మారిపోయాను' అని నటి మీను మునీర్ ఫేస్‌బుక్‌లో రాసింది. హేమా కమిషన్ బయటకు వచ్చాక ఈమె ఈ వివరాలు తెలిపింది.


• మీను మునీర్

ఎం.ఎల్.ఏ పేరు


• ముకేష్

మరోవైపు నటుడు ముకేష్ (ఇతను సి.పి.ఎం ఎం.ఎల్.ఏ) పై కూడా టెస్ జోసఫ్ అనే కాస్టింగ్ డైరెక్టర్ అమర్యాదకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేసింది. 'అతను ఔట్‌డోర్‌లో తన రూమ్ పక్కన నా రూమ్ ఉండేలా కుట్ర చేశాడు. నా రూమ్ తలుపు పదే పదే కొట్టాడు' అని ఆమె తెలియచేసింది. అయితే ముకేష్ ఇదంతా రాజకీయ కుట్ర అని అంటున్నాడు. ఈ దుమారం ఇలా ఉంటే ప్రభుత్వ చలచిత్ర అకాడెమీ ప్రస్తుత చైర్మన్, దర్శకుడు రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు రావడంతో అతనూ రాజీనామా చేశాడు. దీంతో ప్రభుత్వం సినిమా పరిశ్రమలో వస్తున్న ఫిర్యాదులపై విచారణకు 4 మహిళా ముగ్గురు పురుష ఐపిఎస్‌లతో 'సిట్' ఏర్పాటు చేసింది. ఈ 'సిట్' తనకు తానుగా ఫిర్యాదులు నమోదు చేయదని, ఫిర్యాదులను పరిశీలిస్తుందని ప్రభుత్వం చెప్పడంతో అంతా మసిపూసి మారేడు కాయ చేసే వ్యవహారంగా ఇది మిగలనుందని విమర్శలు వస్తున్నాయి.

మేము న్యాయపోరాటాలు చేయలేం

ఫిర్యాదులు చేస్తున్న మహిళలు 'మేము కేసులు పెట్టి కోర్టుల చుట్టు తిరగలేం' అని చెప్పడం గమనార్హం. 'మేం అంత పెద్దవారిని ఎదుర్కోలేం' అని వారు అంటున్నారు. మలయాళ ఇండస్ట్రీలో ఉన్న 15 మంది శక్తిమంతులు పరిశ్రమలో ఎవరో పైకి రావాలో, ఎవరు వెనుక ఉండిపోవాలో నిర్ణయిస్తున్నారని హేమ కమిషన్ తెలియచేసింది. వీరు చెప్పినట్టు వినకపోతే ఇండస్ట్రీలో మనలేని పరిస్థితి ఉందని కమిషన్ పేర్కొంది. 'స్త్రీలను ఎందుకు ఇబ్బంది పెడతారు? అని ప్రశ్నించే పురుషులను కూడా బ్యాన్ చేస్తున్నారు' అని తెలపడం విశేషం.

రాబోయే రోజుల్లో ఈ కందిరీగల తుట్టె ఏ మేరకు ఎవరిని కుట్టనుందో వేచి చూడాలి.

- ఫ్యామిలీ డెస్క్

ఈ రోజుల్లో పిల్లల పెంపకం పెద్దలకు ఓ సమస్యగా ఉంటే
తమ కెరియర్‌ను వృద్ధి చేసుకుంటూనే పిల్లలను పెంచడం
ఒంటరి తల్లులకు అతిపెద్ద సవాల్‌తో కూడుకున్నదని
దాదాపు 70 శాతం ఒంటరి తల్లిదండ్రులు
తమ ఉద్యోగావకాశాలను వదులుకోవడానికి
కారణం ఇదే అని స్పష్టం చేసింది న్యూయార్క్ కెరీర్ మైండ్స్ అధ్యయనం.
గ్లోబల్‌వైజ్‌గా టెక్ కంపెనీలలో ఉద్యోగావకాశాలను కల్పించే ఈ సంస్థ
తమ ఇంటర్వ్యూలలో పాల్గొనే సింగిల్ పేరెంట్స్
పిల్లల కోసం ఉద్యోగాలను వదులుకుంటున్నారనే విషయాన్ని స్పష్టం చేసింది.
ఒంటరి తల్లిదండ్రులు తమ కెరియర్‌ను కాపాడుకుంటూనే
పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిపుణులు సూచనలు ఇస్తున్నారు.

• సింగిల్స్.. డబుల్ రోల్

డ్యూటీఫుల్ పేరెంటింగ్



ఒంటరిగా పిల్లలను పెంచడం చాలా కష్టమైన టాస్క్. ముఖ్యంగా ఒంటరి తల్లుల్లో భావోద్వేగ సమతుల్యత తప్పనిసరి. క్రమశిక్షణలో ఉంచాలా? లేక ప్రేమ, ఆప్యాయతలను చూపాలా.. అనే కన్‌ఫ్యూజన్‌లో ఉంటారు. ఒంటరి తల్లులు అప్పటికే జీవితంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని ఉంటారు కాబట్టి క్రమశిక్షణతో పెంచాలనుకుంటారు.

కఠినమైన శిక్షణ కూడదు

నేను కరెక్ట్‌గా ఉంటేనే నా పిల్లలను బాగా పెంచగలను అనుకునే దోరణిలో పేరెంటింగ్ కూడా సవాల్‌గా తీసుకుంటున్నారు. అయితే, ఈ విధానం వల్ల తరచూ భయాందోళనకు లోనవుతుంటారు. ఫలితంగా ప్రతి చిన్న విషయంలోనూ ఉద్వేగానికి లోనవుతుంటారు. వీళ్లు తమని తాము ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలో తెలుసుకోవాలి. ఎవరి సపోర్ట్ లేకుండా 'సూపర్ ఉమన్'లాగా ఉండాలనుకోవడం అన్ని సందర్భాలలో కుదరదు. శారీరకంగానూ, మానసికపరమైన సమస్యలతోనూ ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. అందుకని, తమ పెద్దవారి మద్దతు తీసుకోవడం అవసరం. కఠినమైన క్రమశిక్షణ వల్ల మంచి కన్నా చెడే ఎక్కువ జరిగే అవకాశం ఉంది.

సమతుల్యత తప్పనిసరి

ఇంట్లో ఉన్నప్పుడు ఆఫీస్ వర్క్‌ని పిల్లల ముందుకు తీసుకురాకూడదు. సింగిల్‌గా ఉండటం వల్ల పెద్దలు ఫోన్‌లోనే ఎక్కువ సమయం గడుపుతుంటారు. దీనివల్ల పిల్లలు 'తామేదో కోల్పోతున్నాం' అనే భావనలో ఉంటారు. పిల్లలు పెద్దలను గమనిస్తుంటారు అని గుర్తుంచుకోవాలి. 'అమ్మకు నాకన్నా ఫోన్ లేదా వర్క్ అంటేనే ఎక్కువ ఇష్టం' అనే ఆలోచన పిల్లల్లో రానీయకూడదు.

అభిప్రాయాలను తీసుకోవాలి

పిల్లలు చిన్నవాళ్లు కదా అనుకోకుండా వాళ్ల అభిప్రాయాలు కూడా తీసుకోవాలి. ఇంటి నిర్ణయాల్లో వారిని పాలుపంచుకోనివ్వాలి. దీనివల్ల తమను నిర్లక్ష్యం చేయడం లేదు అనే ఆలోచన పిల్లల్లో కలుగుతుంది. ఇంట్లో ఏ మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నట్లు అనిపించినా బయట వెతుక్కుంటారు.

తమ మాటే వినాలనుకోవద్దు

ఒంటరి తల్లుల పెంపకంలో పిల్లలు ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసే అవకాశాలు ఎక్కువ. పిల్లలు నా మాట వినాలనే ఆలోచనతో పూర్తిగా పిల్లలు చెప్పినట్టు వినడం... లేదంటే తాము ఒక రూలర్‌గా ఉండాలనుకుంటారు. టీనేజ్ దశలో ఈ గ్రాఫ్ విపరీతంగా పెరిగిపోతుంది.

తల్లిగా ఉండటమే గొప్ప



ఇద్దరు అమ్మాయిలను ఒంటరితల్లిగా పిల్లలను పెంచుతూనే, తన కెరియర్‌నూ బిల్డ్ చేసుకుంటున్న బాలీవుడ్ నటి సుస్మితాసేన్ స్ఫూర్తిదాయకమైన విషయాలనూ సోషల్ మీడియా ద్వారా తెలియజేసింది. 'ప్రతి రోజూ ఒక తల్లిగా నన్ను నేను భుజం తట్టుకునే పని ఏం చేయాలనేది ముందే నిర్ణయించుకుని, అది పూర్తి చేస్తాను. నా పిల్లలకన్నా నాకు ఎక్కువ తెలుసు అనుకోను. వారి ద్వారా కూడా ప్రతిరోజూ ఏదో ఒకటి నేర్చుకుంటూ ఉంటాను. ఇలా ఉండటం వల్ల నాకు చాలా సంతోషంగా అనిపిస్తుంది. నేనొక కళాకారిణిగా కన్నా తల్లిగా ఉండటమే గొప్పగా భావిస్తాను. ఆ రోజంతా ఎన్ని పనులు చేసినా పిల్లల వద్దకు వస్తూనే అన్నీ దులిపేసుకొని వారి ముందు ప్రేమగా ఉంటాను.'

- సుస్మితాసేన్

నమ్మకం ముఖ్యం



పిల్లల అవసరాలు తెలుసుకొని సాధ్యమైనంతవరకు వాటిని పూర్తి చేయాలి. పిల్లల ఆలోచనా విధానాన్ని పంచుకునే విధానం ఇంట్లో ఉండాలి. స్నేహపూర్వకమైన వాతావరనంలో రోజులో కనీసం పది నిమిషాలైనా పిల్లల కోసం సమయం కేటాయించాలి. తమ పని గురించి చెబుతూనే పిల్లల విషయాలనూ పట్టించుకోవాలి. అప్పుడే ఏదో కోల్పోతున్నామనే భావన పిల్లల్లో కలగకుండా పెరుగుతారు.

- ప్రొఫెసర్ జ్యోతిరాజ,
సైకాలజిస్ట్, లైఫ్‌స్కిల్ ట్రెయినర్

ఈ విధానం వల్ల పిల్లలను ఎలా హ్యాండిల్ చేయాలో పెద్దవాళ్లకు తెలియడం లేదు. కానీ, పెద్దలను ఎలా హ్యాండిల్ చేయాలో పిల్లలకు బాగా తెలుసు. పిల్లలు ఇద్దరుంటే వారిద్దరినీ సమానంగా చూడాలి. వీలున్నప్పుడల్లా వారి ద్దరికీ టైమ్ కేటాయించి వారి ప్రతి అవసరాన్నీ తీర్చాలి.

లీగల్

• క్రెడిట్ కార్డ్

వసూళ్లకూ ఓ పద్ధతుంది



ప్రస్తుత కాలంలో వివిధ అవసరాల రీత్యా ఒకే వ్యక్తి సగటున నాలుగైదు క్రెడిట్ కార్డులు ఉండడం సర్వసాధారణం అయిపోయింది. ఒకటే జీతం మీద పరిమితి కలిగిన ఒక కార్డు వరకు అయితే ఇబ్బంది లేకుండా చెల్లించగలరు. కానీ అదే వ్యక్తికి నాలుగయిదు కార్డులు ఉంటే తన జీతానికి – స్తోమతకి మించి ఎన్నో రెట్లు పరిమితి కలిగిన కార్డులు ఉన్నట్టే! అయితే ఉద్యోగాలు పోవడం, వ్యాపారాలు దెబ్బ తినడం వలన క్రెడిట్ కార్డు వాడిన బకాయిలు తిరిగి చెల్లించలేని పరిస్థితులలోకి వెళ్లిపోతుంటారు చాలా మంది. దాంతో ఆ బకాయిల వసూలు కోసం బ్యాంకులు చాలా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతుంటాయి. మరీ ముఖ్యంగా ప్రైవేట్ రికవరీ ఏజెంట్లను నియమించి వారి ద్వారా వినియోగదారులను తీవ్రంగా వేధించడం, పీడించడం, ఇంటి చుట్టుపక్కల వాళ్ల దగ్గరికి వెళ్లి పరువు తీయడం వంటివి. ఈ మధ్య అయితే మొబైల్ ఫోన్ లో ఓ యాప్ ద్వారా వినియోగదారుల ఫోన్లను హ్యాక్ చేసి మరీ తెలిసిన వారందరికీ వీడియోలు ఫోటోలు మెసేజ్‌లు పంపడం వంటి చట్టవ్యతిరేక పనులకి పాల్పడుతున్నారు. అయితే బ్యాంకు వారికి అలా వేధించే హక్కు లేదు. ఎటువంటి లోను బకాయి అయినప్పటికీ నోటీసుల ద్వారా, కోర్టు కేసు ద్వారా మాత్రమే రికవరీ చేయాల్సి ఉంటుంది. అంతేకానీ పైన చెప్పిన విధమైన చట్ట వ్యతిరేక చర్యలు తీసుకోవడానికి వీలు లేదు. అలా చేసిన బ్యాంకు వారిపై పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడమే కాకుండా సివిల్ కోర్టును కూడా ఆశ్రయించవచ్చు. సివిల్ కోర్టులో ఇంజక్షన్ సూట్ వేయడం ద్వారా ఆ బ్యాంకు వారు వినియోగదారుని వేధించడానికి వీల్లేదు అని కోర్టు నుండి రక్షణ పొందవచ్చు. వివిధ బ్యాంకులు వినియోగదారులను వేధిస్తుంటే డైనమిక్ ఇంజక్షన్ ద్వారా కూడా సివిల్ కోర్టు నుండి రక్షణ పొందవచ్చు. క్రెడిట్ కార్డు వసూళ్లకు కానీ, మరి ఏ విధమైన లోన్ రికవరీ కోసం కానీ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదు అని ఆర్.బి.ఐ నిబంధనలు సైతం సూచిస్తున్నాయి. ఎవరైనా బ్యాంకు వారు మిమ్మల్ని వేధింపులకు గురిచేస్తుంటే, వెంటనే పోలీసు వారిని ఆశ్రయించటం మంచిది. కొత్త చట్టం ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఎఫ్.ఐ.ఆర్. చేయవచ్చు. అయితే అలా చేసిన మూడు రోజులలోగా పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఆ ఫిర్యాదును ధ్రువీకరించవలసి ఉంటుంది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వొకేట్

గాఢాంధకారంలో ఒక గైడ్

గాఢాంధకారంలో ఒక వెలుగు రేఖ ఎంతో ఆశను, నమ్మకాన్ని ఇస్తుంది. సంక్షోభపు చీకటి నుంచి వెలుగు దారుల వైపు అడుగులు వేయడానికి సన్నద్ధం అవుతున్న బంగ్లాదేశ్‌కు కనిపిస్తున్న వెలుగు రేఖల్లో షర్మీన్ ఒకరు. ప్రపంచానికి ఆమె పేరు అపరిచితం కావచ్చు. బంగ్లా ప్రజలకు మాత్రం సుపరిచితం. బంగ్లాదేశ్ పునర్నిర్మాణానికి రాళ్లెత్తుతున్న మేధావులు, ఉద్యమకారులలో షర్మీన్ ప్రముఖురాలు. బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్‌కు సహాయపడే ఉన్నత స్థాయి సలహాదారులలో షర్మీన్ ఒకరు....



'శాంతిభద్రతలను పునరుద్ధరించడం, ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిపించడం, సాధారణ పరిస్థితులను నెలకొల్పడం, సుపరిపాలన అందించే రోజులను తీసుకురావడానికి ప్రాధాన్యత ఇస్తాం' అంటోంది షర్మీన్.

విద్యావంతుల కుటుంబం, సామాజిక ఉద్యమాల్లో భాగమయ్యే కుటుంబంలో ఢాకాలో పుట్టింది షర్మీన్. ఆమె తండ్రి ఖాన్ సర్వర్ ముర్షీద్ ప్రఖ్యాత విద్యావేత్త, దౌత్యవేత్త, మేధావి. తల్లి నూర్జహాన్ జర్నలిస్ట్, సోషల్ యాక్టివిస్ట్. తల్లిదండ్రుల స్ఫూర్తితో ఎన్నో సంవత్సరాలుగా బంగ్లాదేశ్‌లోని సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల్లో భాగం అవుతూ వస్తుంది షర్మీన్.

సామాజిక మార్పుల కోసం శ్రమించే ఎన్నో సంస్థలతో కలిసి పనిచేసిన షర్మీన్ 'బ్రోటీ' అనే మానవ హక్కుల, ఎన్నికల పర్యవేక్షణ బృందానికి సీయీవోగా పనిచేసింది. పారదర్శకమైన, ప్రలోభాలకు వీలులేని, స్వేచ్ఛాయుత ఎన్నికలు ఈ సంస్థ లక్ష్యం. కళలు, సాంస్కృతిక వారసత్వం కోసం పనిచేసే 'ఉత్తర్‌సురీ' అనే సాంస్కృతిక కేంద్రానికి కార్యదర్శిగా పనిచేసింది.

లింగ సమానత్వం నుంచి సామాజిక సమానత్వం వరకు ఎన్నో కార్యక్రమాలతో క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ తనకు ఎంతో ఇష్టమైన సంగీతానికి మాత్రం ఎంతో కొంత సమయం కేటాయిస్తుంది షర్మీన్. 1995లో వచ్చిన 'ముక్తీర్ గాన్' అనే డాక్యుమెంటరీ గాయకులలో షర్మీన్ ఒకరు.

'ఏ భేదాలు లేకుండా ప్రజలను ఏకం చేసే శక్తి సంగీతానికి ఉంది' అంటుంది షర్మీన్.

సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం మాట ఎలా ఉన్నప్పటికీ సామాజిక ఉద్యమాలకు సంబంధించి షర్మీన్ ఎన్నోసార్లు బెదిరింపులు ఎదుర్కొన్నది. అయితే ఆమె ఎప్పుడూ వెనక్కి తగ్గింది లేదు. తన ధైర్యమే తనకు రక్షగా నిలిచింది.

తాజా విషయానికి వస్తే...

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడులను షర్మీన్ ఖండిస్తుంది. 'ఇవి మతకలహాలు కాదు. రాజకీయ ప్రేరేపిత దాడులు' అంటున్న షర్మీన్ బాధితుల తరఫున నిలబడుతుంది. వారికి ధైర్యాన్ని ఇస్తోంది.

'విషాదగతాన్ని మరచిపోదాం. బంగారు భవిష్యత్తుపై మాత్రమే దృష్టి పెడదాం' అని అన్ని వర్గాల ప్రజలకు పిలుపు ఇస్తోంది షర్మీన్.

'షర్మీన్' అనే పేరుకు ఉన్న అర్థాలలో 'గైడ్' కూడా ఒకటి.

ఇప్పుడు బంగ్లాదేశ్‌కు షర్మీన్ ఖచ్చితంగా ఒక గైడ్!

'గత ఏడాది కాలంగా మన దేశ ఆర్థిక వ్యవస్థపై మన అవగాహన తప్పుడు సమాచారం పైనే ఆధారపడి ఉంది. దాని నుంచి బయటికి రావాలి. స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపి) గురించి గత పాలకులు చెప్పినవి నిజాలు కావు. విదేశీ నిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో మన దేశంలో ప్రాథమిక, మౌలిక మార్పులు జరగబోతున్నాయని మీకు హామీ ఇస్తున్నాను' అని బంగ్లా ప్రజలను ఉద్దేశించి చెబుతోంది షర్మీన్ ముర్షిద్.

బ్యూటిప్స్



స్క్రబ్‌కు ఓటేద్దాం!

చర్మం మీద మృతకణాలను తొలగించి చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే స్క్రబ్‌ను ప్రతిసారీ మార్కెట్‌లో కొనాల్సిన పనిలేదు, ఇంట్లోనే చేసుకోవచ్చు • టేబుల్ స్పూన్ ఓట్స్, టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ పాలు, అర కప్పు నీరు తీసుకోవాలి. ఓట్స్‌ను నీటిలో ఉడికించాలి. వేడి తగ్గిన తర్వాత మిగిలిన అన్నింటినీ వేసి కలిపితే స్క్రబ్ రెడీ. ఈ ప్యాక్ వేసుకునే ముందు సబ్బుతో ముఖం, చేతులను కడిగి తుడుచుకోవాలి. ప్యాక్‌ను సమంగా పట్టించి పది లేదా పదిహేను నిమిషాల పాటు అలాగే ఉంచాలి. చర్మానికి పట్టినట్లు బిగుసుకుంటుంది. అప్పుడు వేళ్లతో వలయాకారంగా మర్దన చేయాలి. అలా పది నిమిషాల సేపు మర్దన చేసిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి • మార్కెట్‌లో దొరికే స్క్రబ్‌లాగ ఫ్రూట్ ఫ్లేవర్‌లతో కావాలనుకుంటే ఇష్టమైన పండ్ల గుజ్జును కూడా కలుపుకోవచ్చు. పొడి చర్మం వాళ్లు పుల్లటి పండ్ల జోలికి వెళ్లవద్దు.



జాతీయ ఓపెన్ చెస్ చాంపియన్ కార్తీక్ వెంకటరామన్... ప్రపంచకప్ టోర్నీకి అర్హత

ఆద్యంతం అజేయంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ జాతీయ సీనియర్ చెస్ చాంపియన్‌గా అవతరించాడు. హరియాణాలోని గురుగ్రామ్‌లో జరిగిన ఈ టోర్నీ మంగళవారం ముగిసింది. నిర్ణీత 11 రౌండ్లకుగాను కార్తీక్‌తోపాటు సూర్యశేఖర గంగూలీ (పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు), నీలేశ్ సాహా (రైల్వేస్) 9 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... కార్తీక్‌కు టైటిల్ వరించింది. కార్తీక్‌కు రూ. 6 లక్షలు ప్రైజ్‌మనీ లభించింది. అంతేకాకుండా 2025 ప్రపంచకప్ టోర్నీకి భారత్ తరఫున కార్తీక్ అర్హత సాధించాడు. సూర్యశేఖర గంగూలీ రన్నరప్‌గా నిలువగా, నీలేశ్ సాహా మూడో స్థానం దక్కించుకున్నాడు. మిత్రబా గుహ (రైల్వేస్)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో నల్లపావులతో ఆడిన కార్తీక్ 58 ఎత్తుల్లో గెలిచాడు. చిత్తూరు జిల్లాకు చెందిన కార్తీక్‌కిది రెండో జాతీయ టైటిల్. 2023లో అతను తొలిసారి జాతీయ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించాడు.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...



- మహిళల టి20 ప్రపంచకప్‌నకు భారత జట్టు ప్రకటన
- హైదరాబాద్ బౌలర్ అరుంధతి రెడ్డికి చోటు
- అక్టోబర్ 3 నుంచి యూఏఈలో మెగా టోర్నీ

అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని చేజిక్కించుకునేందుకు భారత మహిళల జట్టు సిద్ధమైంది. అక్టోబర్ 3 నుంచి యూఏఈలో జరగనున్న టి20 ప్రపంచకప్ కోసం బీసీసీఐ 15 మందితో కూడిన బలమైన జట్టును ఎంపిక చేసింది. అనుభవజ్ఞులు, యంగ్ ప్లేయర్లతో కూడిన ఈ జట్టుకు ఆల్‌రౌండర్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా... ఓపెనర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహించనుంది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు యూఏఈ వేదికగా జరగనున్న మెగా టోర్నీ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఇటీవల ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంక చేతిలో అనూహ్య పరాజయంతో రన్నరప్‌తో సరిపెట్టుకున్న భారత జట్టు నుంచి ఉమా ఛెత్రీ తప్ప మిగిలిన ప్లేయర్లందరూ టి20 ప్రపంచకప్‌నకు ఎంపికయ్యారు. షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీకి బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాల్సి ఉండగా... అక్కడ రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో వేదికను యూఏఈకి మార్చారు. ఆసియా కప్ సందర్భంగా వేలికి గాయమైన స్పిన్నర్ శ్రేయాంక పాటిల్‌తో పాటు మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న వికెట్ కీపర్ యస్తిక భాటియాను కూడా జట్టులోకి ఎంపిక చేశారు. అయితే వీరిద్దరూ ఫిట్‌నెస్ సాధిస్తేనే యూఏఈకి వెళ్లనున్నారు. టాపార్డర్‌లో స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ కీలకం కానుండగా... హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్ ఫినిషర్ల పాత్ర పోషించనున్నారు. దీప్తి శర్మ, ఆశ శోభన, రాధ యాదవ్ రూపంలో ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లు ఉండగా... రేణుక సింగ్, అరుంధతి రెడ్డి పేస్ బాధ్యతలు మోయనున్నారు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా పూజ వస్త్రకర్ జట్టులో చోటు దక్కించుకుంది. 'ఇది సమతూకమైన జట్టు. యస్తిక, శ్రేయాంక గాయాల నుంచి కోలుకొని టోర్నీ ఆరంభానికి సిద్ధమవుతారు' అని భారత మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ పేర్కొన్నారు. టోర్నీలో భాగంగా భారత జట్టు అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది.

ఆసీస్ అడ్డంకిని అధిగమిస్తేనే!

ఐసీసీ టోర్నీల్లో టైటిల్ నెగ్గలేకపోతున్న భారత జట్టు ఈసారైనా అడ్డంకులు అధిగమించి ముందడుగు వేయాలని భావిస్తోంది. 2020 టోర్నీ తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లిన భారత్...తుది పోరులో ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు మహిళల టి20 ప్రపంచకప్ నిర్వహిస్తే... అందులో ఆరుసార్లు ఆస్ట్రేలియానే జట్టు విజేతగా నిలిచిందంటే ఆ జట్టు ఆధిపత్యం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. మరి హర్మన్ బృందం చాంపియన్‌గా నిలవాలంటే ముందుగా లీగ్ దశలో ఆసీస్‌ను ఓడించాలి. తుది పోరులోనూ ఆ జట్టుపై పైచేయి సాధించాలి.

భారత టి 20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమీమా, రిచా ఘోష్, యస్తిక , పూజ, అరుంధతి రెడ్డి, రేణుక సింగ్, హేమలత, ఆశ శోభన, రాధ యాదవ్, శ్రేయాంక, సజన. **ట్రావెలింగ్ రిజర్వ్‌లు:** ఉమా ఛెత్రీ, తనూజ కన్వర్, సైమా ఠాకూర్.

ఇదిగో మన బలగం! టీమిండియా ప్లేయర్ల వివరాలు — సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఐసీసీ పీఠంపై జై షా

చైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నిక ● డిసెంబర్ 1 నుంచి బాధ్యతలు



దుబాయ్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసెంబర్ 1 నుంచి ఐసీసీ చైర్మన్‌గా జై షా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఐసీసీ చైర్మన్‌గా కొనసాగుతున్న గ్రెగ్ బార్క్‌లే మూడోసారి ఆ పదవిలో కొనసాగేందుకు విముఖత చూపించడంతో ఎన్నిక అనివార్యమైంది. అయితే జై షా మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 35 ఏళ్లకే అత్యున్నత పదవీ బాధ్యతలు దక్కించుకున్న జై షా ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా నిలిచారు. 2019 నుంచి బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగుతున్న జై షా రెండేళ్ల పాటు ఐసీసీ చైర్మన్‌గా కొనసాగుతారు. భారత్ నుంచి ఐసీసీ పీఠం దక్కించుకున్న ఐదో భారతీయుడిగా జై షా నిలిచారు. గతంలో జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్. శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 'అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికవడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఐసీసీ సభ్యదేశాలతో కలిసి క్రికెట్‌కు మరింత విస్తరించడానికి కృషి చేస్తా'అని జై షా పేర్కొన్నారు. ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షాను పలువురు అభినందించారు. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ కోచ్‌లు రాహుల్ ద్రవిడ్, కుంబ్లే, పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా శుభాకాంక్షలు తెలిపారు.


ముందున్న సవాళ్లు!

ఈ ఏడాది చివర్లో ఐసీసీ పగ్గాలు చేపట్టనున్న జై షా ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. వచ్చే ఏడాది పాకిస్తాన్ వేదికగా జరగనున్న చాంపియన్స్ ట్రోఫీలో భారత్ పాల్గొనడంపై సందేహాలు రేకెత్తుతుండగా... ఈ అంశంలో జై షా ఎలాంటి వైఖరి అవలంబిస్తారనేది కీలకంగా మారింది. జై షా ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా పాకిస్తాన్‌లో జరగాల్సిన ఆసియా కప్‌ను హైబ్రిడ్ పద్ధతిలో పాకిస్తాన్, శ్రీలంకలో నిర్వహించారు. టీమిండియా ఆడాల్సిన మ్యాచ్‌లను శ్రీలంకలో జరిగే విధంగా షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మరి ఇప్పుడు ఐసీసీ చైర్మన్‌గా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ భాగం కావడంతో దానికి తగినంత ప్రచారం నిర్వహించడం... రోజు రోజుకు ప్రభ తగ్గుతున్న టెస్టు క్రికెట్‌కు పూర్వ వైభవం తేవడం... టి20ల ప్రభావంతో ప్రాధాన్యత కోల్పోతున్న వన్డేలను మరింత రసవత్తరంగా మార్చడం ఇలా పలు సవాళ్లు జై షాకు స్వాగతం పలుకుతున్నాయి.

జొకోవిచ్ అలవోకగా...



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ టైటిల్ వేటను సెర్బియా దిగ్గజం జొకోవిచ్ అలవోక విజయంతో ప్రారంభించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 6-2, 6-2, 6-4తో రాడూ అల్బోట్ (మాల్డొవా)పై నెగ్గాడు. 2 గంటల 7 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఎనిమిది ఏస్‌లు సంధించాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోకో గాఫ్ (అమెరికా), నంబర్‌వన్ స్వియాటెక్ (పోలాండ్), రెండో సీడ్ సబలెంకా (బెలారస్) రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. కోకో గాఫ్ 6-2, 6-0తో గ్రచెవా (ఫ్రాన్స్)పై, సబలెంకా 6-3, 6-3తో ప్రిసిల్లా (ఆస్ట్రేలియా)పై, స్వియాటెక్ 6-4, 7-6 (8/6)తో రఖిమోవా (రష్యా)పై గెలిచారు.


చైనా స్విమ్మర్ యువాన్ వెయి ప్రాక్టీస్

'పారా'వీరుల క్రీడా సమరం

నేటి నుంచి దివ్యాంగుల విశ్వ క్రీడలు ● భారత్ నుంచి 84 మంది బరిలోకి

పారిస్: యావత్ క్రీడా ప్రపంచాన్ని ఏకం చేసిన సమ్మర్ ఒలింపిక్స్ ముగిసిన రెండు వారాల తర్వాత... పారిస్ వేదికగా బుధవారం నుంచి దివ్యాంగ క్రీడాకారులు పోటీపడే పారాలింపిక్స్‌కు తెరలేవనుంది. 11 రోజుల పాటు సాగనున్న ఈ క్రీడల్లో మొత్తం 4,400 మంది పారా అథ్లెట్లు పాల్గొంటున్నారు. 22 క్రీడాంశాల్లో 549 పతకాలు సాధించే అవకాశం ఉండగా... నేడు ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఘనంగా ఆరంభ వేడుకలు జరగనున్నాయి. మూడేళ్ల క్రితం టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలతో అత్యుత్తమ ప్రదర్శన చేసిన భారత్ నుంచి ఈసారి 84 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఆరంభ వేడుకల్లో జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, షాట్‌పుటర్ భాగ్యశ్రీ భారత బృందానికి పతాకధారులుగా వ్యవహరించనున్నారు. పురుషుల జావెలిన్‌త్రో ఎఫ్ 64 విభాగంలో ప్రపంచ రికార్డు హోల్డర్ సుమిత్ అంటిల్, మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్1 విభాగంలో అవని లేఖరా డిఫెండింగ్ పారాలింపిక్ చాంపియన్‌లుగా బరిలోకి దిగుతున్నారు. తెలంగాణ నుంచి జివాంజి దీప్తి మహిళల 400 మీటర్ల టి20 విభాగంలో పోటీ పడుతుంది.

సినిమా


● 'దేవర' పోస్టర్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'దేవర'. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగం సెప్టెంబరు 27న రిలీజ్ కానుంది. ఈ రిలీజ్‌కు ముప్పై రోజులు ఉన్న నేపథ్యంలో 30 డేస్ కౌంట్ డౌన్ అంటూ మంగళవారం 'దేవర' కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం.

అప్పుడు రాజమౌళి ఒక్కరికే పని ఉంటుంది - నాని



"నా సినిమా రిలీజైన వెంటనే బ్లాక్‌బస్టర్, సూపర్ హిట్ అని చెబుతుంటారు. సోషల్ మీడియాలో కూడా పాజిటివ్ టాక్ కనిపిస్తుంది. కానీ వీటిని నేను సక్సెస్‌గా భావించను. నా సినిమాలో భాగస్వామ్యులైన అందరూ సంతోషంగా ఉండాలి. ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ నా సినిమా సక్సెస్ ఇవ్వాలి. అప్పుడు నేను సక్సెస్ అని భావిస్తాను. చెప్పాలంటే.. మన నిజమైన సక్సెస్ మనకు మాత్రమే తెలుస్తుంది" అని నాని అన్నారు. 'అంటే.. సుందరానికీ!' తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నాని చెప్పిన సంగతులు.

▲ ఓ సినిమా కథ నన్ను ఎగ్జైట్ చేసి, నాకో చాలెంజ్ విసిరి, ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తుందని నాకనిపిస్తే ఆ స్క్రిప్ట్‌కు ఓకే చెబుతాను. ప్రతి సినిమాకు కొత్తదనాన్ని ప్రయత్నిస్తూనే ఉంటాను. ఇప్పుడు ఈ 'సరిపోదా శనివారం' చేశాను. ఇందులో నేను ఎల్‌ఐసీ ఏజెంట్ సూర్య పాత్రలో కనిపిస్తాను. సినిమాలో యాక్షన్ ఇరవై శాతమే ఉంటుంది. కానీ యాక్షన్ మోడ్‌తో కథ ముందుకెళ్తుంటుంది. ఈ సినిమాలోని దయా పాత్రను ఎస్‌జే సూర్యగారే చేయగలరు. ఈ క్యారెక్టర్‌తో తెలుగు ఆడియన్స్‌కు మరింత దగ్గర కావాలని ఆయన ఏడు రోజులు తెలుగులోనే డబ్బింగ్ చెప్పారు. కానిస్టేబుల్ చారులతగా ప్రియాంక నటన అలరిస్తుంది. అలాగే ఈ సినిమాలో అదితీ బాలన్ నాకు సిస్టర్‌గా నటించారు. మదర్ సెంటిమెంట్ కూడా ఉంది. ఇక సోకులపాలెంతో సూర్య, దయాల కనెక్షన్ ఏంటో సినిమాలో చూడండి. ▲ 'అంటే.. సుందరానికీ!' సినిమా పేరు విన్నన్నిసార్లు నా హిట్ సినిమాల పేర్లు కూడా వినలేదు. మనం ఓసారి చరిత్రను గమనిస్తే మంచి సినిమాలన్నీ ఆడాయి.. చెడ్డ సినిమాలన్నీ ఆడలేదు అని చెప్పడానికి ఒక్క ఆధారం కూడా లేదు. మనం ఓ చెడ్డ సినిమా చేసి సక్సెస్ కాలేకపోయామంటే ఈసారి సక్సెస్ చేసి హిట్ సాధించాలని అనుకుంటాం. మేం గతంలో మంచి సినిమానే ('అంటే.. సుందరానికీ!'ని ఉద్దేశించి) చేశాం. మళ్లీ మంచి సినిమా చేశాం. కాకపోతే 'అంటే.. సుందరానికీ!' ఓ జానర్ వాళ్లకు మాత్రమే నచ్చింది. ఆ సినిమా నిడివి దాదాపు మూడు గంటలు ఉంది. 'సరిపోదా శనివారం'ది కూడా దాదాపు మూడు గంటల నిడివి. కానీ ఈ సినిమా కథ, జానర్ వేరు. ▲ ఓ హీరోకి ఫ్లాప్ ఇచ్చిన దర్శకుడికి మళ్లీ నో చాన్స్ అనే లాజిక్ కరెక్ట్ కాదు. ఒకవేళ ఇలా అనుకుంటే ఇండస్ట్రీలో ఏ దర్శకుడికీ, ఏ హీరోకీ సినిమాలు ఉండకూడదు. మన ఇండస్ట్రీలో ఉన్న గొప్ప గొప్ప హీరోలకు, దర్శకులకు, నిర్మాతలకు ఫ్లాప్స్ ఉన్నాయి. ఈ లాజిక్ అప్లై అయితే ఇండస్ట్రీలో ఎవరికీ పని ఉండకూడదు... ఒక్క రాజమౌళికి తప్ప. నిజం చెప్పాలంటే వరుస సక్సెస్‌లు వచ్చినప్పుడు కాస్త ఉదాసీనంగా ఉంటారు. అప్పుడప్పుడూ వైఫల్యాలు చూసినవాడే మరింత కష్టపడతాడు. ఈ సినిమాలో వివేక్ మంచి రేసీ స్క్రీన్‌ప్లే రెడీ చేశాడు... సినిమా పరిగెడుతుంటుంది. నా ప్రతి సినిమా నిర్మాత బాగుండాలని కోరుకుంటాను. అందుకే దానయ్యగారు నా గురించి ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాజిటివ్‌గా మాట్లాడారు. ▲ కోవిడ్ తర్వాత ప్రేక్షకులు థియేటర్స్‌కు రావడం లేదనే చర్చలు జరుగుతున్నాయి. చెప్పాలంటే... కోవిడ్‌కు ముందు వెయ్యి కోట్ల రూపాయల కలెక్షన్స్ సాధించిన సినిమా ఒకటే ఉంది. కోవిడ్ తర్వాత మూడు సినిమాలు ఉన్నాయి. అయితే గతంలో పది సినిమాలు వస్తే ఐదారు సినిమాలు ఆడియన్స్‌కు ఫర్వాలేదనిపించేవి. కానీ ఇప్పుడు పదిలో ఒకట్రెండు సినిమాలే ఆడియన్స్‌ను అలరిస్తున్నాయి. మంచి కథలతో వస్తే... ఆడియన్స్ థియేటర్స్‌కి వస్తారు. ▲ లైఫ్‌లో మెమొరబుల్ మూమెంట్స్ అంటే సినిమాల పరంగా చాలానే ఉన్నాయి. అయితే వ్యక్తిగతంగా మాత్రం నా కొడుకు అర్జున్ పుట్టిన క్షణం నా ఫేవరెట్ మెమొరబుల్ మూమెంట్.

శివ కార్తికేయన్ సినిమాకి సై?


● శ్రీలీల

కోలీవుడ్ నుంచి శ్రీలీలకు మళ్లీ కాల్ వెళ్లిందా అంటే తమిళ పరిశ్రమలో అవుననే మాట వినిపిస్తోంది. ఇంతకు ముందు కూడా శ్రీలీలకు తమిళంలో అవకాశాలు వచ్చాయని వార్తలు ప్రచారం అయ్యాయి. అయితే ఈసారి ప్రచారంలో ఉన్న వార్త నిజం అని కోలీవుడ్ అంటోంది. శివ కార్తికేయన్ హీరోగా నటించనున్న ఓ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటించనున్నారన్నది ఆ వార్త సారాంశం. 'గురు, ఆకాశం నీ హద్దు రా' వంటి చిత్రాలతో దర్శకురాలిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సుధ కొంగర తెరకెక్కించనున్న చిత్రంలోనే శివ కార్తికేయన్, శ్రీలీల నటించనున్నారని సమాచారం. ఈ ఇద్దరూ పాల్గొనగా ఫొటోషూట్ కూడా జరిగిందట. త్వరలో అధికారికంగా ప్రకటిస్తుందట చిత్రబృందం. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో సూర్య హీరోగా నటించాల్సి ఉండగా ఆయన తప్పుకున్న నేపథ్యంలో శివ కార్తికేయన్‌ని తీసుకున్నారట. సూర్యతో 'పురనానూరు' అనే టైటిల్‌తో తెరకెక్కించనున్నట్లు పేర్కొన్నారు. మరి.. శివ కార్తికేయన్‌తో అనుకుంటున్నది ఈ చిత్రమేనా? అనే విషయం తెలియాల్సి ఉంది.

దసరాకి మా నాన్న...


● సుధీర్‌బాబు

దసరాకి వస్తా అంటున్నాడు నాన్న. ఫ్యామిలీ మొత్తాన్ని ఎంటర్‌టైన్ చేస్తానని కూడా అంటున్నాడు. సుధీర్‌బాబు హీరోగా రూపొందిన తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వి సెల్యులాయిడ్స్, సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమా షూట్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్య క్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని దసరాకి విడుదల చేయనున్నామని మంగళవారం చిత్రబృందం ప్రకటించింది. ''తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో మనసులను హత్తుకునే విధంగా రూపొందించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. ఫ్యామిలీ ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించే పండగల్లో దసరా ఒకటి. అందుకే కుటుంబ సమేతంగా చూడదగ్గ మా చిత్రాన్ని ఈ పండగకి విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఆర్ణ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

కుటుంబంతో కలిసి చూసే సినిమా ఇది - రాజ్ తరుణ్


● మనీషా కంద్కూర్, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ హీరో హీరోయిన్లుగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'భలే ఉన్నాడే!'. మారుతి టీమ్ సమర్పణలో జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''కుటుంబం అంతా కలిసి కూర్చొని చూసే సినిమా 'భలే ఉన్నాడే!'. సినిమాలో మంచి ఎమోషన్స్ ఉన్నాయి. శివ సాయితో కలిసి పని చేసిన తర్వాత నేను నేర్చుకోవాల్సింది ఇంకా ఉందనిపించింది. మారుతిగారితో ఓ సినిమా చేయాలన్న నా ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది. నిర్మాత కిరణ్ గారు బాగా సపోర్ట్ చేశారు. శేఖర్ చంద్ర మంచి మ్యూజిక్ ఇచ్చారు'' అన్నారు. ''ఈ సినిమా టైటిల్‌కు రాజ్ తరుణ్ పర్‌ఫెక్ట్ యాప్ట్. రాజ్ తరుణ్ క్యారెక్టరైజేషన్ గురించి సినిమాలో చూడండి. ఈ సినిమాలో చాలా హెల్దీ కామెడీ ఉంది'' అన్నారు జె. శివసాయి. ''మంచి సినిమా తీశామనే నమ్మకం ఉంది. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు కిరణ్.

నాన్‌స్టాప్ నవ్వులు


● 'జనక అయితే గనక' పోస్టర్

సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ నిర్మించిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించారు. సందీప్ బండ్ల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. పెళ్లయినప్పటికీ పిల్లలు వద్దనుకుంటాడు హీరో (సుహాస్). కారణం ఖర్చులు పెరుగుతాయన్నది అతని భయం, అతడ్ని పిల్లలు ప్లాన్ చేయమని కుటుంబ సభ్యులు బలవంతపెట్టినా ఎలాగోలా సర్దిచెబుతున్నట్లుగా ట్రైలర్‌లో ఉంది. ఇక తన భార్య గర్భవతి అని తెలిశాక ఆ హీరో ఎవరిపై కేసు పెడతాడు? అనే విషయాలను తెలుసుకోవాలంటే సినిమాలో చూడాల్సిందే అని చిత్రబృందం పేర్కొంది. ''మధ్య తరగతి తండ్రికి ఉండే కష్టాలను అందరం చూస్తుంటాం. సందీప్ తాను చూసిన సంఘటన ఆధారంగా ఈ కథ తయారు చేశాడు. నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది'' అని 'దిల్' రాజు అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
14	7
81,712	25,018

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,779	▲	54
డోజోన్స్	41,217	▼	23
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,345	▲	18
డాక్స్	18,682	▲	65
షాంఘై	2,849	▼	7
నికాయ్	38,288	▲	178

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
71,762	▼	280
బంగారం (99.5 స్వచ్ఛత)		
71,475	▼	279
వెండి (కేజీ)		
85,962	▼	229

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.55	84.55
£	బ్రిటన్ పౌండ్		109.54	112.13
€	యూరో		92.64	95.05
¥	జపాన్ ఎన్ (100)		57.35	58.65
AUS	ఆస్ట్రేలియా డాలర్		56.00	57.98
S$	సింగపూర్ డాలర్		62.11	66.59
SAR	సౌదీ రియాల్		21.48	23.02
UAE D	యూఏఈ దిర్హామ్		21.96	23.74
¥	చైనా యువాన్		10.90	12.73

భారత్‌లో ఎప్పటికీ చిన్నకార్లదే హవా

మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్.సి.భార్గవ

న్యూఢిల్లీ: చిన్న కార్లకు డిమాండ్ ఒకట్రెండేళ్లలో తిరిగి పుంజుకుంటుందని వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా స్పష్టంచేసింది. 'భారత ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో తక్కువ ధరలో లభించే చిన్న కార్లు అవసరమని విశ్వసిస్తున్నాం. డిమాండ్‌లో తాత్కాలిక ఎదురుదెబ్బ తమ కంపెనీ వ్యూహాన్ని మార్చబోదు' అని మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్.సి. భార్గవ మంగళవారం స్పష్టం చేశారు. కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఇప్పటికీ స్కూటర్ యజమానులుగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. సురక్షిత, సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాలను వారు కోరుకుంటున్నారని భార్గవ చెప్పారు. భారత్‌లో పెద్ద, విలాసవంత వాహనాలు మాత్రమే ఉంటే సరిపోదని ఆయన నొక్కిచెప్పారు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాలలో విక్రయాలు, సేవా నెట్‌వర్క్‌ను కంపెనీ మరింత బలోపేతం చేస్తోందని వెల్లడించారు. తద్వారా మారుతీ ప్రయోజనాలు పెద్ద వ్యక్తులకు మాత్రమే పరిమితం కావని అన్నారు.

ఆరు ఈవీ మోడళ్లు..

కంపెనీ నుంచి ఆరు ఎలక్ట్రిక్ మోడళ్లు 2030-31 నాటికి భారత్‌లో రంగ ప్రవేశం చేస్తాయని భార్గవ వెల్లడించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. కొన్ని నెలల్లోనే తొలి ఈవీ అడుగుపెట్టనుంది. ఈ కార్లను యూరప్, జపాన్‌కు ఎగుమతి చేస్తాం. ఎలక్ట్రిక్ వాహనాలు కానటువంటి వాహనాల కాలుష్యం, చమురు వినియోగాన్ని తగ్గించడానికి హైబ్రిడ్ కార్లు తప్పనిసరిగా అవసరం. ఉత్పత్తి చేయగల, కస్టమర్ అవసరాలకు అనుగుణంగా ఉండే ప్రతి ఒక్క ఈవీకి భారీ మార్కెట్ ఉంది. 2030-31 నాటికి 40 లక్షల యూనిట్లకు తయారీ సామర్థ్యం పెంచుకుంటాం. 7.5-8 లక్షల యూనిట్లు ఎగుమతి చేస్తాం. 2024-25లో 3 లక్షల యూనిట్లు ఎగుమతులు జరగొచ్చు. హరియాణాలో 10 లక్షల యూనిట్ల సామర్థ్యంతో రూ.18,000 కోట్లతో ఏర్పాటుకానున్న ప్లాంటులో 2025-26లో ఉత్పత్తి ప్రారంభమవుతుంది..



సూపర్ మైక్రోకు హిండెన్‌బర్గ్ సెగ



● అక్రమాల ఆరోపణలతో షేర్ 8% పతనం

న్యూయార్క్: యూఎస్ టెక్నాలజీ ఎక్స్ఛేంజీ నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ సూపర్ మైక్రో కంప్యూటర్ అకౌంటింగ్ అక్రమాలకు పాల్పడినట్లు షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ తాజాగా ఆరోపించింది. దీంతో నాస్‌డాక్‌లో ఈ షేరు ప్రీట్రేడింగ్‌లో 8 శాతంవరకూ పతనమైంది. రాత్రి 11.20 ప్రాంతంలో 2.7 శాతం క్షీణించి 547 డాలర్ల వద్ద కదులుతోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-8-2024	
విశాఖ	505-00
చిత్తూరు	508-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495-00
విజయవాడ	495-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	475-00
వరంగల్	477-00
రిటైల్ ధర	5.35

టీవీఎస్ సరికొత్త

జూపిటర్ 110

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ సరికొత్త జూపిటర్ 110 స్కూటర్‌ను ప్రవేశపెట్టింది. ధర హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో రూ.77,100 ఉంది. నాలుగు వేరియంట్లు, ఆరు రంగుల్లో లభిస్తుంది. 113.3 సీసీ సింగిల్ సిలిండర్ 4 స్ట్రోక్ ఇంజన్ పొందుపరిచారు. పూర్తి డిజిటల్ కలర్ ఎల్‌సీడీ స్పీడోమీటర్, స్టార్ట్ స్టాప్ ఫంక్షన్, ఎమర్జెన్సీ బ్రేక్ వార్నింగ్, డ్యూయల్ హెల్మెట్ స్పేస్, ఇన్ఫినిటీ ల్యాంప్స్, టర్న్ సిగ్నల్ ల్యాంప్ రెస్ట్, బాడీ బ్యాలెన్స్ టెక్నాలజీ, పేటెంటెడ్ ఈజీ సెంటర్ స్టాండ్, ఫాలో మీ హెడ్‌ల్యాంప్ ఇతర హంగులు. ఐగో అసిస్ట్‌తో 10 శాతం అధిక మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది. టీవీఎస్ జూపిటర్‌కు 65 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.



హైదరాబాద్‌లో స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న టీవీఎస్ ప్రతినిధులు వైభవ్ శేఖర్, విశాల్ విక్రమ్ సింగ్ (కుడి)

ఎయిర్‌టెల్ కస్టమర్లకు యాపిల్ కంటెంట్

ఇరు సంస్థల మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ: టెలికం సంస్థ ఎయిర్‌టెల్ కస్టమర్లకు ఈ ఏడాది ఆఖరు నుంచి యాపిల్ టీవీప్లస్, యాపిల్ మ్యూజిక్ కంటెంట్ అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ఇరు సంస్థలు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం ఎయిర్‌టెల్‌కు చెందిన వింక్ యాప్ ప్రీమియం యూజర్లకు యాపిల్ మ్యూజిక్ అందుబాటులో ఉంటుంది. అలాగే ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ కస్టమర్లు ప్రీమియం ఎయిర్‌టెల్ వైఫై, పోస్ట్‌పెయిడ్ ప్లాన్లపై యాపిల్ టీవీప్లస్ ద్వారా హాలీవుడ్ కంటెంట్‌ను పొందవచ్చు. మరోవైపు, మ్యూజిక్ విభాగం నుంచి భారతి ఎయిర్‌టెల్ నిష్క్రమించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరికొద్ది నెలల్లో వింక్ మ్యూజిక్ యాప్‌ను మూసివేయనున్నట్లు, ఉద్యోగులందరినీ ఎయిర్‌టెల్‌లోకి తీసుకోనున్నట్లు వివరించాయి. వింక్ మూసివేత విషయాన్ని ఎయిర్‌టెల్ ప్రతినిధి ధ్రువీకరించారు. 2014లో ప్రారంభమైన వింక్ మ్యూజిక్ యాప్‌నకు దాదాపు 10 కోట్ల మంది సబ్‌స్క్రయిబర్స్ ఉన్నారని అంచనా.



యాపిల్ సీఎఫ్‌వోగా కేవన్ పరేఖ్



యాపిల్ కొత్త చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసరుగా (సీఎఫ్‌వో) ప్రవాస భారతీయుడు కేవన్ పరేఖ్ (52) నియమితులయ్యారు. 2025 జనవరి 1 నుంచి ఆయన బాధ్యతలు చేపడతారు. ప్రస్తుతం సీఎఫ్‌వోగా వ్యవహరిస్తున్న లూకా మేస్త్రీ ఇకపై కార్పొరేట్ సర్వీసెస్ టీమ్స్ బాధ్యతల్లో కొనసాగుతారు.

ఈ ఆఫర్ ఓ తుఫాన్

రూ. 12 కోట్ల రీసోర్స్‌ఫుల్ ఆటోమొబైల్ ఐపీవోకు రూ. 4,800 కోట్ల విలువైన బిడ్స్ దాఖలు

దేశీ ప్రైమరీ మార్కెట్లలో తాజాగా ఒక విచిత్రమైన రికార్డ్ నమోదైంది. కేవలం రూ. 12 కోట్ల సమీకరణకు ఒక చిన్నతరహా సంస్థ పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. అయితే కనీవినీ ఎరుగని రీతిలో రూ. 4,800 కోట్ల విలువైన బిడ్స్ దాఖలయ్యాయి. ఢిల్లీకి చెందిన ఈ కంపెనీ ఏం చేస్తుందయ్యా అంటే యమహా ద్విచక్ర వాహన డీలర్. అదికూడా రెండు ఔట్‌లెట్లను మాత్రమే కలిగి ఉంది. 2018లో ఏర్పాటైన సంస్థ 8 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2023 డిసెంబర్ 28న సెబీకి దాఖలు చేసిన ఐపీవో ప్రాస్పెక్టస్ వివరాలివి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

కొద్ది రోజులుగా దేశీ స్టాక్ మార్కెట్లు సాధిస్తున్న రికార్డుల బాటలో ప్రైమరీ మార్కెట్లు సైతం దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. దీంతో చిన్న, మధ్యతరహా కంపెనీల(ఎస్ఎంఈలు) ఐపీవోలకూ ఇటీవల భారీ డిమాండ్ నెలకొంటోంది. వెరసి తాజాగా ఐపీవోకు వచ్చిన రీసోర్స్‌ఫుల్ ఆటోమొబైల్ ఏకంగా 419 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. సాహ్నీ ఆటోమొబైల్ బ్రాండుతో యమహా డీలర్‌గా వ్యవహరిస్తున్న కంపెనీ మోటార్ సైకిళ్లు, స్కూటర్ల విక్రయాలు, సర్వీసింగ్ చేపడుతోంది.

ఇన్వెస్టర్ల నుంచి హెవీ రష్

ఈ నెల 22న ప్రారంభమై 26న ముగిసిన రీసోర్స్‌ఫుల్ ఆటోమొబైల్ ఐపీవోలో భాగంగా 9.76 లక్షల షేర్లను ఆఫర్ చేసింది. అయితే 40.76 కోట్ల షేర్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ. 12 కోట్ల సమీకరణకు తెరతీస్తే రూ. 4,800 కోట్ల విలువైన బిడ్స్ లభించాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కేటగిరీలో 316 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 496 రెట్లు చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. ఇష్యూకి తొలి రోజు 10.4 రెట్లు, రెండో రోజు 74 రెట్లు అధికంగా స్పందన లభించింది. చివరి రోజుకల్లా బిడ్డింగ్ తుఫాన్ సృష్టించింది. షేరుకి రూ. 117 ధరలో మొత్తం 10.25 లక్షల షేర్లను ఆఫర్ చేసింది. తద్వారా రూ. 12 కోట్ల సమీకరణకు తెరతీసింది. చిన్న, మధ్యతరహా కంపెనీల కోసం ఏర్పాటు చేసిన బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ద్వారా సాహ్నీ ఆటోమొబైల్ లిస్ట్‌కానుంది.



విపరీత ధోరణులు...

ప్రధానంగా ఎస్ఎంఈ విభాగంలోని ఐపీవోలకు గత 12 నెలల కాలంలో పలు మార్లు భారీ డిమాండ్ ఏర్పడింది. గత డిసెంబర్ నుంచి ఇప్పటివరకూ చూస్తే 10 ఎస్ఎంఈ ఐపీవోల బిడ్డింగ్‌లో విపరీత ధోరణులు నెలకొన్నాయి. వీటిలో టాప్-5 ఎస్ఎంఈ ఐపీవోలు ఉమ్మడిగా రూ. 59 కోట్ల సమీకరణకు తెరతీయగా.. ఏకంగా రూ. 65,000 కోట్ల విలువైన బిడ్స్‌ను దక్కించుకున్నాయి. ఇక అత్యధికంగా సబ్‌స్క్రయిబ్ అయిన టాప్-10 ఇష్యూలకు 733 నుంచి 2014 రెట్లు వరకూ బిడ్స్ దాఖలుకావడం విశేషం!



ఎస్ఎంఈలకు కనిపిస్తున్న అనూహ్య డిమాండ్ అసంబద్ధమని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రధాన పెట్టుబడుల వ్యూహకర్త వీకే విజయకుమార్ పేర్కొన్నారు. లిస్టింగ్ లాభాల కోసం ఇన్వెస్టర్లు నాణ్యతా సంబంధ విషయాలను సైతం విస్మరిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. అధిక సబ్‌స్క్రిప్షన్ లాభాల లిస్టింగ్‌కు దారి చూపనున్నట్లు తెలియజేశారు. లిస్టింగ్ తదుపరి నెలకొనే డిమాండ్ ప్రభావం చూపనున్నట్లు వివరించారు. అయితే మధ్యకాలంలో ఇలాంటి రష్ కనుమరుగయ్యే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

నిపుణులేమన్నారంటే?

నియంత్రణ సంస్థలు హెచ్చరిస్తున్నప్పటికీ వేలంవెర్రి కొనసాగుతున్నట్లు తెలియజేశారు. ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ద్వారా లిస్టయ్యే కంపెనీల ఖాతాలను మరింత అప్రమత్తంగా ఆడిటింగ్ చేయమంటూ గత వారాంతాన సెబీ హోల్‌టైమ్ డైరెక్టర్ అశ్వనీ భాటియా చార్టర్డ్ అకౌంటెంట్ల(సీఏలు)కు సూచించడం గమనార్హం.

25,018 సరికొత్త శిఖరంపై నిఫ్టీ



సెన్సెక్స్ @ డబుల్ హ్యాట్రిక్

ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం లాభ, నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. పశ్చిమాసియా, ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, క్రూడాయిల్ ధరల పెరుగుదలతో ఇన్వెస్టర్లు రికార్డు స్థాయికి చేరువలో మెటల్, కన్జూమర్ డ్యూరబుల్, ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాలు స్వీకరించారు. ఉదయం సెన్సెక్స్ 81,388 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 81,601 -81,919 శ్రేణిలో ట్రేడైంది. చివరికి 14 పాయింట్లు పెరిగి 81,712 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌కు ఇది ఆరో రోజు లాభాల ముగింపు. వరుసగా తొమ్మిదో రోజూ లాభాలు కొనసాగించిన ఎన్ఎస్ఈ నిఫ్టీ ఏడు పాయింట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి 25,018 వద్ద స్థిరపడింది. ఒక దశలో 62 పాయింట్లు లాభపడి ఆల్‌టైం హై స్థాయి (25,078)కి అయిదు పాయింట్ల దూరంలో 25073 గరిష్టాన్ని అందుకుంది. టెలికమ్యూనికేషన్, ఐటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, హెల్త్‌కేర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.58%, 0.50 % చొప్పున పెరిగాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఆటో కంపెనీల 'స్క్రాప్' ఆఫర్
జీల్-సోనీ పిక్చర్స్... చేయి చేయి!

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

టాప్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌కు మార్గం!

ఇంటర్న్‌షిప్‌నకు ఉద్యోగ సాధనలో ప్రాధాన్యం పెరుగుతోంది. ఇంటర్న్‌షిప్ ద్వారా వాస్తవ నైపుణ్యాలు సొంతమవుతాయని కంపెనీలు భావిస్తున్నాయి. అందుకే ఈ శిక్షణ పొందిన వారికి నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో విద్యార్థులు కాలేజీలో ఉండగానే ఇంటర్న్‌షిప్ ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. కానీ.. ఈ అవకాశం అందరికీ లభించడంలేదు. ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్రం తాజా బడ్జెట్‌లో.. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పేరిట కొత్త పథకాన్ని ప్రకటించింది! ఈ నేపథ్యంలో.. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ వివరాలు, అర్హతలు, ఇంటర్న్‌షిప్‌తో లభించే ప్రయోజనాలు తదితర వివరాలు..

» కొత్తగా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు శ్రీకారం
» నెలకు రూ.5వేలు చొప్పున స్టయిఫండ్
» ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం
» త్వరలోనే అందుబాటులోకి ప్రత్యేక వెబ్‌సైట్

నేటి జాబ్ మార్కెట్‌లో ఉద్యోగ సాధనలో నైపుణ్యాల ఆవశ్యకతను గుర్తించిన ఏఐసీటీఈ.. బీటెక్‌లో కనీసం రెండు ఇంటర్న్‌షిప్‌లు చేసే విధంగా మార్గదర్శకాలు రూపొందించింది. ఇతర కోర్సుల విషయంలోనూ ప్రాక్టికల్ స్కిల్స్, ఇంటర్న్‌షిప్ ఎంతో ఆవశ్యకంగా మారుతున్నాయి. ఇలాంటి వారికి తాజాగా ప్రకటించిన పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ మేలు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ వాస్తవ నైపుణ్యాలు, ఇండస్ట్రీ రెడీ స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ అవసరమవుతున్న విషయం తెలిసిందే. ఇంజనీరింగ్, టెక్నికల్ విభాగాలే కాకుండా.. సైన్స్, ఆర్ట్స్ కోర్సుల్లోనూ వీటి ఆవశ్యకత పెరుగుతోంది. అయితే టెక్నికల్ కోర్సులతో పోల్చితే సాంప్రదాయ కోర్సులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు తక్కువే. ఇండస్ట్రీ వర్గాలు సైతం ఈ విషయంలో పెద్దగా ఆసక్తి చూపడంలేదు.

అయిదేళ్లలో కోటి మందికి

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ద్వారా రానున్న అయిదేళ్లలో కోటి మంది యువతకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. తద్వారా స్కిల్ గ్యాప్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు. ఆయా కోర్సుల వారికి క్షేత్ర నైపుణ్యాలు లభించి ఉద్యోగ సాధనలో ముందంజలో నిలుస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నెలకు రూ.5వేల స్టయిఫండ్

పీఎం ఇంటర్న్‌షిప్‌కు సంబంధించిన పూర్తి స్థాయి మార్గదర్శకాలు మరికొద్ది రోజుల్లోనే వెలువడనున్నాయి. ప్రస్తుతమున్న సమాచారం ప్రకారం- ఈ స్కీమ్‌కు ఎంపికైన వారికి ప్రతి నెలా రూ.5వేలు చొప్పున సంవత్సరానికి రూ.60 వేలు స్టయిపెండ్ అందిస్తారు. దీంతోపాటు మరో ఆరువేలను ఏక మొత్తం సాయంగా ఇస్తారు.

టాప్-500 సంస్థల్లో

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ మరో ప్రత్యేకత.. టాప్-500 సంస్థల్లో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించడం. ఈ సంస్థలు ఎంపికైన వారికి ఇంటర్న్‌షిప్ వ్యవధిలో కచ్చితంగా 50 శాతం సమయాన్ని వాస్తవ నైపుణ్యాలు అందించే విధంగా ఆన్ జాబ్ ట్రైనింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఫలితంగా అభ్యర్థులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకునే సమయానికి ఎంప్లాయబిలిటీ స్కిల్స్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

అర్హతలు

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు కలిగిన యువతను అర్హులుగా పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్న్‌షిప్ దరఖాస్తు సమయానికి ఎలాంటి ఉద్యోగంలో ఉండకూడదు. అదేవిధంగా ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదువుకున్న వారు ఈ స్కీమ్‌కు అర్హులు కారని స్పష్టం చేశారు. అంటే.. సాధారణ కళాశాలల్లో చదువుకున్న యువత, ఇంటర్న్‌షిప్ అవకాశాలు పొందలేని నిరుద్యోగులకు నైపుణ్యం శిక్షణ ఇచ్చేందుకు ఈ స్కీమ్‌ను రూపొందించారని తెలుస్తోంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తేనున్నారు. ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించనున్నారు. యువత ఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే.. ఆ దరఖాస్తులను సంస్థలు పరిశీలించి ఎంపిక ప్రక్రియ చేపడతాయి. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి ఇంటర్న్ ట్రైనీగా నియామకం ఖరారు చేస్తాయి. ఏడాది నుంచి రెండేళ్ల వ్యవధిలో ఈ ట్రైనింగ్ నిర్వహించే అవకాశం ఉంది.

స్కిల్స్ సొంతం

ఇంటర్న్ ట్రైనీగా పని చేయడం ద్వారా పలు నైపుణ్యాలు సొంతమవుతాయి. డొమైన్ స్కిల్స్‌తోపాటు ఇంటర్ పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్ స్కిల్స్, టీం వర్కింగ్ కల్చర్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ వంటివి లభిస్తాయి. అదే విధంగా టీమ్ మెంబర్స్, లీడర్స్‌తో చర్చించగలిగే నైపుణ్యం అలవడుతుంది.

ఇంటర్న్‌షిప్ సమయంలో ఇలా

ఇంటర్న్‌షిప్ అవకాశం అందుకున్న అభ్యర్థులు విధుల్లో చక్కటి పని తీరు చూపే ప్రయత్నం చేయాలి. తమకు కేటాయించిన విభాగం, విధులకు సంబంధించి టీమ్ సభ్యులతో కలిసి పనిచేసే చొరవ చూపాలి. ఏదైనా సందేహం ఎదురైతే.. బిడియం లేకుండా టీమ్ లీడ్ లేదా ఇతర సీనియర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ఇంటర్న్‌షిప్ సమయంలో సదరు సంస్థ ఉద్యోగి మాదిరిగానే పూర్తి అంకిత భావంతో పనిచేయాలి. ఇలా చేస్తేనే ఇంటర్న్‌షిప్ ఉద్దేశం నెరవేరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

శాశ్వత కొలువుల అవకాశం

ఇంటర్న్ ట్రైనీగా లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే.. శాశ్వత కొలువుకు మార్గంగా కూడా మలచుకోవచ్చు. ఇంటర్న్ ట్రైనీగా చేరిన అభ్యర్థులు శిక్షణ సమయంలో చూపే ప్రతిభ, మెరుగైన పనితీరు ఆధారంగా అదే కంపెనీలో పూర్తిస్థాయి కొలువు సొంతం చేసుకోవచ్చు. సంస్థల్లో ఇంటర్న్ ట్రైనీలుగా చేరిన ఎంతో మంది ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థులు శిక్షణ సమయంలో చూపిన ప్రతిభ ఆధారంగా అదే సంస్థల్లో ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ అందుకుంటున్నారు.



ఇంటర్న్‌షిప్ ప్రయోజనాలు

- ఇంటర్న్ ట్రైనీగా..నూతన నైపుణ్యాలు, రియల్ టైమ్ ఎక్స్‌పోజర్ పొందే అవకాశం.
- ఇంటర్ పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్ స్కిల్స్, టీం వర్కింగ్ కల్చర్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు పొందొచ్చు.
- సదరు రంగంలో ఏర్పడుతున్న తాజా పరిణామాల గురించి తెలుసుకునే అవకాశం.
- సమస్యకు తమ స్థాయిలోనే పరిష్కారం కనుగొనే విధంగా అనలిటికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ పెంచుకోవచ్చు.



సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీలో 12 పోస్టులు

న్యూఢిల్లీలోని సాహిత్య అకాడమీలో డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 12.
» పోస్టుల వివరాలు: డిప్యూటీ సెక్రటరీ(జనరల్-అడ్మిన్)-01, డిప్యూటీ సెక్రటరీ(జనరల్-సేల్స్)-01, రీజనల్ సెక్రటరీ-02, అసిస్టెంట్ ఎడిటర్-01, పబ్లికేషన్ అసిస్టెంట్-01, సబ్ ఎడిటర్(ఇంగ్లిష్)-01, ప్రోగ్రామ్ అసిస్టెంట్-01, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2-01, ప్రూఫ్ రీడర్ కమ్ జనరల్ అసిస్టెంట్-01, జూనియర్ క్లర్క్-01, మల్టీ టాస్కింగ్ స్టాఫ్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా జర్నలిజం, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు డిప్యూటీ సెక్రటరీ పోస్టుకు రూ.67,700 నుంచి రూ.2,08,700, అసిస్టెంట్ ఎడిటర్ పోస్టుకు రూ.56,000 నుంచి రూ.1,77,500, పబ్లికేషన్ అసిస్టెంట్, సబ్ ఎడిటర్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.35,400 నుంచి రూ.1,12,400, స్టెనోగ్రాఫర్, పీఆర్ కమ్ జనరల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.25,000 నుంచి రూ.81,100.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెక్రటరీ, సాహిత్య అకాడమీ, రవీంద్ర భవన్, 35 ఫిరోజ్‌షా రోడ్, ఢిల్లీ-110001 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 16.09.2024.
» పని చేయాల్సిన ప్రదేశాలు: ఢిల్లీ, బెంగళూరు, ముంబై.
» వెబ్‌సైట్: https://sahitya-akademi.gov.in

సీఎస్‌బీ, బెంగళూరులో 122 సైంటిస్ట్-బి పోస్టులు

బెంగళూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డు.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 122.
» పోస్టుల వివరాలు: క్రాప్ సైన్సెస్-1, 2, 3-74, వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్-03, నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్-1, 2-20, అగ్రికల్చర్ ఎకనామిక్స్ అండ్ అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్-05, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్-10, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్-07, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ-03.
» విభాగాలు: ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, ఫాం మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, యానిమల్ న్యూట్రిషన్, ప్లాంట్ పాథాలజీ, సెరికల్చర్, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. ఐసీఏఆర్ ఏఐసీఎఫ్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ (పీహెచ్‌డీ)-2024 స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
» వయసు: 05.09.2024 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.56,000 - రూ.1,77,500.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.



ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 22.08.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.09.2024.
» వెబ్‌సైట్: https://csb.gov.in

ఎన్‌పీసీఐఎల్‌లో 279 స్టైపెండరీ ట్రైనీ పోస్టులు

రావత్‌బాట రాజస్తాన్ సైట్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)లో స్టైపెండరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 279.
» పోస్టుల వివరాలు: కేటగిరి-2 స్టైపెండరీ ట్రైనీ ఆపరేటర్-153, కేటగిరీ-2 స్టైపెండరీ ట్రైనీ మెయింటైనర్-126.
» విభాగాలు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెషినిస్ట్/టర్నర్, వెల్డర్.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి(సైన్స్ సబ్జెక్టుల్లో) సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 11.09.2024 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.09.2024.
» వెబ్‌సైట్: https://www.npcil.nic.in

బీఈఎంఎల్, బెంగళూరులో 100 గ్రూప్-సి పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్).. ఒప్పంద ప్రాతిపదికన గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 100
» పోస్టుల వివరాలు: ఐటీఐ ట్రెయినీ-56, ఆఫీస్ అసిస్టెంట్ ట్రెయినీ-46.
» విభాగాలు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్.
» అర్హత:పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60%మార్కులతో ఐటీఐ, డిప్లొ మా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 37 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.09.2024.
» వెబ్‌సైట్: https://www.bemlindia.in



జూరాలకు కృష్ణమ్మ పరవళ్లు

- 2.03లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 45 క్రస్టు గేట్ల ఎత్తివేత.. నేడు శ్రీశైలం గేట్లు తెరిచే అవకాశం

ధరూరు: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. మంగళవారం రాత్రి 9 గంటలకు ప్రాజెక్టుకు 2,03,000 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 45 క్రస్ట్‌గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. సుంకేశుల నుంచి వచ్చే వరదతో కలిసి మొత్తం 2,13,429 క్యూసెక్కుల నీరు శ్రీశైలం వైపు వెళుతోంది. వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే బుధవారం మరోసారి శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు తెరిచే అవకాశం ఉంది.

జూరాల నుంచి విడుదల అవుతున్న కృష్ణా జలాలు

ఆర్భాటం ఎక్కువ పరిష్కారం తక్కువ

ప్రజావాణిలో అర్జీలు ఇస్తున్నా.. పరిష్కారం కాక ఆవేదనలో జనం

వక్ఫ్‌బోర్డు ఇచ్చిన భూమి కబ్జాపై నాలుగు వారాలుగా..



ఈయన పేరు మహ్మద్ యూసుఫ్. వనపర్తి జిల్లా పెద్దమందడి... వీపనగండ్ల మండలం పులగార్చర్ల గ్రామం. అరవై ఏళ్ల కింద అప్పటి రాష్ట్ర ప్రభుత్వం యూసుఫ్ తండ్రికి 38 గుంటల సాగుభూమిని కేటాయించింది. తండ్రి, తర్వాత పిల్లలు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కౌలు పేరిట కొంత కాలం ఈ భూమిని తీసుకుని, తర్వాత రెవెన్యూ అధికారుల సాయంతో అక్రమంగా తన పేరిట రికార్డుల్లోకి ఎక్కించుకున్నారు. వాస్తవానికి అది వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వచ్చే భూమి. దాని విక్రయం, పేరు మార్పిడికి వీలుండదు. అయినా అక్రమంగా పని కానిచ్చేశారు. దీనిపై యూసుఫ్ గత నెలలో ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, ఆ తర్వాత రమ్మని అధికారులు చెప్పారు. కానీ ఇప్పటివరకు మెసేజ్ ఏదీ రాకపోవడంతో.. నాలుగు వారాలుగా ప్రజాభవన్ చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు.

రికార్డులు తారుమారు చేసి భూమిని లాగేశారు



ఈ వృద్ధుడి పేరు శేగ్యం కొమరెల్లి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కర్కాల గ్రామం. ఆయనకు 2.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ధరణి పోర్టల్ వచ్చాక కొత్త పాస్ పుస్తకాలు జారీ అయ్యాయి. 2020 వరకు రైతుబంధు సొమ్ము కూడా అందింది. 2021 నుంచి రైతుబంధు రాకపోవడంతో రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలన జరిపిన అధికారులు అసలు కొమరెల్లి పేరిట భూమే లేదని చెప్పారు. కొందరు రెవెన్యూ అధికారుల సాయంతో రికార్డులు మార్చేసి, భూమిని తమ పేరిట మార్చుకున్నట్టు గుర్తించిన కొమరెల్లి.. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ప్రజావాణిలో వినతులు ఇచ్చినా స్పందన రాలేదని.. 71 ఏళ్ల వయసులో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆయన వాపోతున్నారు.

రుణమాఫీ జాబితాలో 'నో డేటా ఫౌండ్'..



ఈ రైతు పేరు కందాల నర్సింహారెడ్డి. సూర్యాపేట జిల్లా మల్లారెడ్డిగూడెం. ఆయన తండ్రి వెంకటరెడ్డి పేరిట ఏడాదిన్నర క్రితం రూ.1.03 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నారు. ఆ రుణం మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే.. 'నో డేటా ఫౌండ్' అని చూపిస్తోందని చెప్పారు. దీనిపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం రాలేదు. మంగళవారం ఉదయం ప్రజాభవన్‌కు వచ్చి వినతిపత్రం సమర్పించారు. కానీ అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని ఆయన చెప్తున్నారు. రుణం తీసుకున్న వారి జాబితాలోనే పేరు లేకపోవడంతో.. ఎవరిని కలవాలో అర్థంకాని పరిస్థితి నెలకొందని ఆయన వాపోయారు.

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం నామమాత్రంగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజాభవన్‌కు వచ్చి దరఖాస్తులు చేసుకుంటున్నా.. తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదంటూ ప్రజల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలకు ఇక్కడ్నుంచి ప్రత్యేక చొరవతో పరిష్కారమార్గం చూపుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, కానీ తాము ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకుంటున్నా ఫలితం ఉండటం లేదని దరఖాస్తు చేసుకున్నవారు వాపోతున్నారు. అధికారులు ప్రజాభవన్‌లో తీసుకుంటున్న అర్జీలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత శాఖలకు పంపుతున్నా.. ఆ తర్వాత ఏమవుతోందన్నది పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీనితో సమస్యల పరిష్కారం అటకెక్కుతోందని.. అసలు తమ అర్జీ ఏ స్థాయిలో ఉంది? దాని పరిస్థితి ఏమిటన్నది ఎవరూ చెప్పలేకపోతున్నారని పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాభవన్‌తోపాటు జిల్లా కలెక్టరేట్లలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఇప్పటివరకు 5,23,940 అర్జీలు రాగా.. అందులో 4,31,348 పరిష్కరించామని, 92,592 పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అర్జీలు 60 వేలు. అయితే ఇక్కడ అందిన అర్జీలను దిగువకు పంపించడమే తప్ప.. వాటిలో ఎన్ని పరిష్కారం అయ్యాయన్న వివరాలు లేకపోవడం గమనార్హం.



తొలిరోజు మాత్రమే సీఎం హాజరు

పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం తొలిరోజున మాత్రమే సీఎం రేవంత్ పాల్గొన్నారు. తర్వాత మరోసారి ఎప్పుడూ హాజరుకాలేదు. కొన్నివారాల పాటు పలువురు మంత్రులు వచ్చారు. తర్వాత మంత్రి సీతక్క హాజరవుతూ వచ్చారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రెండున్నర నెలల పాటు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రద్దు చేసింది. తిరిగి ప్రారంభించాక మంత్రులెవరూ రావడం లేదు. ప్రస్తుతం మంగళ, శుక్రవారాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి వస్తున్నారు. ప్రభుత్వ శాఖల నుంచి మొదట్లో కార్యదర్శులు, హెచ్‌ఓడీలు పాల్గొనగా.. ఇప్పుడు కేవలం సెక్షన్ ఇన్‌చార్జులు మాత్రమే హాజరవుతున్నారు. ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి మంగళ, శుక్రవారాల్లో సగటున 8 వందల చొప్పున అర్జీలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించినవే అందులో అధికంగా ఉంటున్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి.

జాడలేని పర్యవేక్షణ

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా, అలాంటిదేమీ కనిపించడం లేదు. అధికారులు స్వీకరిస్తున్న అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తర్వాత అర్జీదారుకు ఎస్సెమ్మెస్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత శాఖలకు ఆ అర్జీని చేరవేయడం, అక్కడ దశలవారీగా పరిశీలన, పరిష్కారం చేసే క్రమం అంతా అర్జీదారుకు సమాచారం ఇవ్వాలి. కానీ ఇలాంటి సమాచారమేదీ అందడం లేదని, తమ అర్జీ పరిస్థితి ఏమిటో అర్థంకావడం లేదని పలువురు అర్జీదారులు ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి వాపోతున్నారు.

వీరు ఉత్తమ టీచర్లు

పెసర ప్రభాకర్‌రెడ్డి, తాడూరి సంపత్‌కుమార్‌లను వరించిన జాతీయ పురస్కారాలు



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ప్రభాకర్‌రెడ్డికి స్వీట్లు తినిపించి ఆనందం పంచుకుంటున్న కుటుంబ సభ్యులు



సంపత్‌కుమార్ రూపొందించిన ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి (ఫైల్)

గంభీరావుపేట (సిరిసిల్ల)/తిరుమలాయపాలెం: రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు 2024కుగాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌లను ఈ పురస్కారాలు వరించాయి. అలాగే ఏపీ నుంచి కృష్ణా జిల్లా గుడివాడలోని ఎస్పీఎస్ మున్సిపల్ హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావు, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఉరందూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు సురేశ్ కునాటి ఈ పురస్కారాలు అందుకోనున్నారు. దేశవ్యాప్తంగా 50 మంది ఉపాధ్యాయులను ఈ పురస్కారాలకు ఎంపిక చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంగళవారం ఢిల్లీలో జాబితా విడుదల చేసింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపింది. అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, వెండి పతకాలు, రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందించనున్నట్లు వివరించింది.

సైన్స్ ప్రదర్శనలకు గైడ్ టీచర్‌గా..

పెద్దపల్లి జిల్లా హన్మంతుపేట గ్రామానికి చెందిన సంపత్‌కుమార్ 2001 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. పెద్దపల్లి జిల్లా చందనాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో అనేక సైన్స్ ప్రదర్శనలకు గైడ్ టీచర్‌గా వ్యవహరించి విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు అందుకోవడంలో కృషి చేశారు. జనవరి 2022లో బదిలీపై రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చారు. తన ఉపాధ్యాయ వృత్తి ముగిసేలోగా 100 మంది గ్రామీణ విద్యార్థులను ఇన్నోవేటర్‌లుగా మార్చాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు 53 మందిని ఇన్నోవేటర్‌లుగా మార్చారు.

ఏజెన్సీ నుంచి జాతీయ స్థాయికి...

ఏజెన్సీ ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లా (పూర్వ ఖమ్మం జిల్లా) బయ్యారం మండలం ఇర్సులాపురం గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 28 ఏళ్లపాటు ఏజెన్సీ ప్రాంతాలైన గుండాల, గార్ల, బయ్యారం, అశ్వాపురం, కామేపల్లి పాఠశాలల్లోనే ఆయన విధులు నిర్వర్తించారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన చేపట్టేందుకు బోధనోపకరణాలు రూపొందించేలా 2014లో స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా చేరారు. ఎస్‌సీఈఆర్‌టీకి నాలుగు పుస్తకాలను రాయడంతోపాటు ఓపెన్ విద్యావిధానంలో పదో తరగతికి నాలుగు పాఠ్యపుస్తకాల తయారీలోనూ పాలుపంచుకున్నారు.

కంటి నుంచి మెదడు కణితి తొలగింపు

ఏఐజీ వైద్యుల ఘనత. దేశంలోనే తొలిసారి



న్యూరో ఎండోస్కోపీ ద్వారా శస్త్రచికిత్స నిర్వహిస్తున్న డాక్టర్లు

సాక్షి, హైదరాబాద్: కనుగుడ్డు చుట్టూ ఉన్న ప్రదేశం నుంచి న్యూరో ఎండోస్కోపీ ద్వారా మెదడులోని కణితిని తొలగించి ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) వైద్యులు చరిత్ర సృష్టించారు. ఇలాంటి శస్త్రచికిత్స జరగడం దేశంలోనే తొలిసారని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా మెదడులోని కణితిని తొలగించేందుకు తలపై కొంత కోత పెట్టాల్సి ఉంటుంది. కానీ, ఇందుకు విరుద్ధంగా ఎలాంటి కోత లేకుండానే కంటి చుట్టూ ఉన్న ప్రదేశం నుంచి ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. దీన్ని ఎండోస్కోపిక్ లాటరల్ ట్రాన్స్ ఆర్బిటల్ విధానం అంటారని వైద్యులు వివరించారు. ఈ ప్రక్రియతో తక్కువ గాయంతో పాటు త్వరగా కోలుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. శస్త్రచికిత్సకు సంబంధించి వివరాలను ప్రఖ్యాత న్యూరో సర్జన్ డా.అభిరామచంద్ర గబ్బిటా మంగళవారం మీడియాతో పంచుకున్నారు. ఇది న్యూరోసర్జరీ రంగంలో అద్భుతమైన మైలు రాయి అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐజీ చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి, న్యూరోసర్జన్ డాక్టర్ సుబోధ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కోవిడ్ నాసికా టీకా అభివృద్ధి

సాక్షి, హైదరాబాద్

ఆస్ట్రేలియాకు చెందిన గ్రిఫిన్ యూనివర్సిటీతో కలిసి ముక్కు ద్వారా వేసుకొనే కోవిడ్ టీకాను అభివృద్ధి చేసినట్లు ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) తెలిపింది. ఈ వ్యాక్సిన్ చాలా సురక్షితమైనదని పేర్కొంది. కోడాన్ డీ ఆప్టిమైజేషన్ టెక్నాలజీలో తాము నిష్ణాతులమని, కోవిడ్‌పై యుద్ధంలో ఇదొక మైలురాయని ఐఐఎల్ ఎండీ డాక్టర్ ఆనంద్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కారణంగా ఇప్పటికీ ప్రతి వారం సుమారు 1,700 మరణాలు సంభవిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

ఏసీబీ పేరిట ఫేక్ కాల్స్

- బెదిరింపులపై సమాచారం ఇవ్వాలని సీవీ ఆనంద్ సూచన



సాక్షి, హైదరాబాద్: ఏసీబీ అధికారుల పేరిట కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ తెలిపారు. 'మీపై ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేయకుండా ఉండాలంటే మేం చెప్పినట్టు డబ్బులు ఇవ్వాలి' అని సదరు వ్యక్తులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఫేక్ కాల్స్‌ను నమ్మవద్దని, ఏసీబీ అధికారులెవరు ఇలాంటి ఫోన్ కాల్స్ చేయరని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి బెదిరింపులను ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు ఎవరూ నమ్మవద్దని సీవీ ఆనంద్ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇలాంటి ఫేక్ ఫోన్ కాల్స్ వస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, లేదంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఫేక్ ఫోన్‌కాల్స్ ఘటనపై వరంగల్ ఏసీబీ యూనిట్ అధికారుల ఫిర్యాదుతో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా శ్రీరామ్

సాక్షి, హైదరాబాద్

జర్నలిస్ట్, రచయిత కర్రి శ్రీరామ్‌ను మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాంట్రాక్ట్ పద్ధతిలో రెండేళ్ల పాటు ఈ పదవిలో శ్రీరామ్ కొనసాగుతారని తెలిపింది. ఈ విషయంలో ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఐ అండ్ పీఆర్ ఈవో ప్రత్యేక కార్యదర్శి ఎం.హనుమంతరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాగుబడి

మఖ కార్తె: ఆగస్టు 30 వరకు
పుబ్బ కార్తె: 31 నుంచి



సూపర్ ఫ్రూట్ పెపినో!

సూపర్ ఫ్రూట్‌గా పేరొందిన పెపినో అత్యంత అధిక పోషక విలువలు కలిగిన పండు. కుకుంబర్ మాటకు స్పానిష్ భాషలో అర్థం పెపినో.తియ్యని పండు. షుగర్ వ్యాధిగ్రస్తులు తినదగినదేనట. అందుకే దీన్ని స్వీట్ కుకుంబర్, మెలన్ పియర్ అని కూడా పిలుస్తారు. అలాగని ఇది చప్పగా ఉండే కీర దోస లాంటిది కాదు.

పెపినో.. సొలనే సియా కుటుంబానికి చెందిన 2 వేల ఏళ్ల చరిత్ర గల పంట. టొమాటో, బంగాళ దుంప, వంగ తదితర కూరగాయలు ఈ కుటుంబంలోనివే. పెపినో పుట్టిల్లు దక్షిణ అమెరికాలోని పెరు, చిలీ దేశాలు. ఉష్ణమండలపు పంట. అయితే, పెపినో అధిక ఉష్ణాన్ని తట్టుకోలేదు. ముఖ్యంగా దీని పుప్పొడి అధిక వేడికి దెబ్బతింటుంది. ఆస్ట్రేలియా, చిలి, కొలంబియా, పెరు, ఈక్వడార్, స్పెయిన్, ఇజ్రేల్, న్యూజిలాండ్, తుర్కియే, అమెరికా తదితర దేశాల్లో సాగులో ఉంది.

పెపినో టొమాటో మాదిరిగానే తీగ జాతి లక్షణాలున్న మొక్క. ఒక మీటరు ఎత్తు పెరుగుతుంది. నేల మీద నాటితే నుంచి 8 అడుగుల ఎత్తు పెరుగుతుంది. ట్రెల్లిస్ లేదా ఊత కర్ర అవసరం. పూర్తిగా ఎండలో పెట్టకూడదు. పాలీహౌస్‌లు/షేడ్‌నెట్ హౌస్‌లు లేదా పాక్షిక నీడలో పెట్టాలి. చిన్న నిమ్మకాయ సైజులో కాయలు గుత్తులుగా కాస్తాయి. ఇంటిపంటలు / మిద్దెతోటల్లో సాగుకు కూడా అనువైనది. సేంద్రియ పదార్థం పుష్కలంగా ఉండే నీరు నిలవని ఆమ్ల నేలలు (పిహెచ్ 5.5-6.8) దీని సాగుకు అనుకూలం. చౌడును కొంతమేరకు తట్టుకుంటుంది. సారవంతం కాని నేలల్లోనూ పెరుగుతుంది. కొమ్మ కత్తిరించి నాటితే పెరుగుతుంది.

ఈ పండులో అద్భుతమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. యాంటీఆక్సిడేటివ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలున్నాయి. సుగర్ తక్కువగా కలిగి ఉంటుంది కాబట్టి షుగర్ వ్యాధిగ్రస్తుల ఆహారంలో భాగమైంది. మెటబాలిజమ్‌కు దోహదపడే అనేక మినరల్స్ ఉండటం వల్ల ఎముక పుష్టికి ఉపయోగకరం. ఫ్లావనాయిడ్స్, ఫెనాల్ కలిగి ఉండటం వల్ల రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఈ పండ్ల రసంలో కేన్సర్‌ను అరికట్టే గుణాలున్నాయి. బరువును తగ్గిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. మద్యపానంతో దెబ్బతిన్న కాలేయాన్ని బాగు చేస్తుంది. సలాడ్లలో కలుపుకొని తినొచ్చు. స్మూతీస్‌లో కలుపుకోవచ్చు. ముక్కలు కోయకుండానే పండు మొత్తాన్నీ నోట్లో పెట్టుకొని తినొచ్చు. విత్తనాలు చాలా చిన్నగా ఉంటాయి కాబట్టి ఇబ్బంది పెట్టవు. ఫ్రూట్ సలాడ్లలో ఇతర పండ్లతో కలిపి తీసుకోవచ్చు. జుకిని, బెల్ పెప్పర్స్‌తో కలిపి కూడా వాడుకోవచ్చు.



కొత్త పంట

ఉష్ణమండల ప్రాంతాల్లోని నేలల్లో సాగుకు అనువైనది. ఎండను ఇష్టపడే పంట. 24 డిగ్రీల కన్నా అధిక ఉష్ణోగ్రత అవసరం. అయితే, పూత, పిందె దశల్లో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేదు. పెపినో వంగడాన్ని బట్టి పండ్లు కోతకు వచ్చే సమయం ఆధారపడి ఉంటుంది. పిందె పడిన తర్వాత కొన్ని రకాలు 30 రోజుల్లో, మరికొన్ని రకాలు 60 రోజుల్లో పూర్తి సైజు పండుగా పెరిగి పక్వానికి వస్తాయి.

30 నుంచి నెల్లూరు జిల్లాలో జ్ఞానశోధాయాత్ర

పల్లెసృజన
pallesrujana.org
honeybee.org
nifindia.org

గ్రామీణులు, రైతులు, వృత్తికళాకారులు తదితరుల జీవన విధానాన్ని అధ్యయనం చేస్తూ వారి దైనందిన జీవితంలో ఆవిష్కరణలను వెలుగులోకి తెచ్చే కృషిలో భాగంగా పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ చిన్న శోధాయాత్ర (జ్ఞానయాత్ర)లు నిర్వహిస్తుంటుంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందనూతల నుంచి ఆగస్టు 30న 49వ చిన్న శోధాయాత్ర ప్రారంభమై.. సెప్టెంబర్ 1న మావిల్లదొరువులో ముగుస్తుంది. గ్రామీణ జీవితాన్ని పాదయాత్ర ద్వారా పరిశీలిస్తూ, చర్చించటంలో ఆసక్తి గల యువతీ యువకులు కూడా ఈ 45 కిలోమీటర్ల జ్ఞాన యాత్రలో పాల్గొనవచ్చని పల్లెసృజన వ్యవస్థాపకులు బ్రిగేడియర్ పోగుల గణేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 29 లోగా పేర్లు నమోదు చేయించుకోవటం తప్పనిసరి. ఇతర వివరాలకు... 98660 01678, 99666 46276.

కదిలే నిలువు తోట!

నగరాల్లో జనసాంద్రత పెరిగిపోతున్నకొద్దీ అపార్ట్‌మెంట్లలో జీవించే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ప్రతి మనిషీ రోజుకు 400 గ్రాముల వరకు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తినాలి అని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఇటీవల సూచించింది. ఈ మేరకు కూరగాయలు, ఆకుకూరల వినియోగాన్ని పెంచాలనుకుంటే.. బయట మార్కెట్‌లో దొరికే గ్రీన్స్ రసాయనాలమయంగా మారాయని అందరికీ తెలిసిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో కొద్దిపాటి స్థలంలోనే ఎక్కువ మొక్కల్ని సేంద్రియంగా సాగు చేసుకోవలసిన అవసరం వచ్చింది. ఈ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ వాసులకు ఉపయోగపడే వర్టికల్ గార్డెన్ స్ట్రక్చర్‌ను బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) రూపొందించింది.





నిలువు తోట ప్రత్యేకతలు ఏమిటి?

- నిలువెత్తు ఉండే ఈ వర్టికల్ ఐరన్ స్ట్రక్చర్‌లో కొన్ని మనకు ఇష్టమైన కూరగాయలు, పూలు, ఔషధమొక్కలు సాగు చేసుకునేలా చిన్నపాటి కుండీలను అమర్చారు.
- దీనిలో మూడు భాగాలున్నాయి. 1. బేస్ ఫ్రేమ్ 2. మెయిన్ సెంట్రల్ సపోర్టు 3. కుండీలు/గ్రో బ్యాగ్‌లు పెట్టుకోవటానికి వీలుగా రింగ్‌ల ఏర్పాటు.
- నిలువెత్తు ఇనుప చట్రంలో 4 అంతస్తులుగా కుండీలు/గ్రో బ్యాగ్‌లు ఏర్పాటు చేసుకునేలా ఈ ఇనుప నిలువు తోట వ్యవస్థను రూపొందించారు.
- హెవీ డ్యూటీ నైలాన్ స్వివెల్ చక్రాలు దీని అడుగున ఏర్పాటు చేశారు. నిలువు తోటలో అన్ని కుండీలకు ఎండ తగిలే విధంగా సులువుగా అటూ ఇటూ తిప్పడానికి వీలుగా ఉండేందుకు ఈ చక్రాలు ఉపయోగపడతాయి.

పంటకు తగిన కుండీ

- ఏయే పంటలకు ఎంత పెద్ద కుండీ అవసరమనే విషయంపై ఆధారపడి కుండీలు/గ్రో బ్యాగ్‌ల సైజును నిర్ణయించారు.
- మిరప, టొమాటో, బఠాణీ, జుకిని, ఫ్రెంచ్ బీన్స్, వంగ వంటి మొక్కలు నాటుకోవటానికి 12×10 (12 అంగుళాల చుట్టుకొలత, 10 అంగుళాల ఎత్తు) సైజు గుండ్రటి కుండీలకు ఈ వర్టికల్ గార్డెన్ స్ట్రక్చర్‌లో చోటుకల్పించారు.
- పాలకూర, తోటకూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు పెంచుకోవటానికి దీర్ఘచతురస్రాకారంలో ఉండే కుండీలకు అవకాశం కల్పించారు. పొడవు 26 × వెడల్పు 8 × ఎత్తు 6 అంగుళాల సైజులో కొన్ని.. పొడవు 20 × వెడల్పు 10 × ఎత్తు 7 అంగుళాల సైజులో మరి కొన్ని ట్రేలు పెట్టుకోవచ్చు.
- 2 అడుగుల ఎత్తు వరకు పెరిగే (టొమాటో, మిరప, వంగ వంటి) కూరగాయ మొక్కలను కింది రెండు దొంతర్లలో నాటుకోవాలి. టొమాటోను పూర్తిగా అడుగున కుండీల్లో పెంచాలి.
- అడుగు ఎత్తు పెరిగే ఆకుకూరల కోసం పై భాగంలో ఉండే రెండు వరుసల్లో విత్తుకోవాలి.
- వర్టికల్ గార్డెన్ స్ట్రక్చర్ పైన 5 లీటర్ల ప్లాస్టిక్ కంటెయినర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో నుంచి మొక్కలకు నీటిని అందించేందుకు డ్రిప్ లేటరల్స్, మైక్రో ట్యూబులు, డ్రిప్పర్లను ఏర్పాటు చేశారు. ఆటోమేటిక్‌గా మొక్కలన్నిటికీ నీరందించవచ్చు లేదా రోజ్ క్యాన్‌తోనూ నీరు పోసుకోవచ్చు.
- 1:1:1 నిష్పత్తిలో మట్టి/కోకోపీట్, కంపోస్టు (వంటింటి వ్యర్థాల కంపోస్టు లేదా సిటీ కంపోస్టు)/పశువుల ఎరువు, ఇసుక కలిపి కుండీల్లో నింపుకొని మొక్కలు, విత్తనాలు వేసుకోవచ్చు.
- నెలకోసారి మొక్కకు 100 గ్రాముల వర్మీకంపోస్టు వేయాలి.
- ఐఐహెచ్ఆర్ రూపొందించిన ఆర్క ఫెర్మెంటెడ్ కోకోపీట్‌ను నింపి (మట్టి లేకుండా), పోషక ద్రావాలను అందించటం ద్వారా సాయిల్‌లెస్ పద్ధతిలో పంటలు పండించుకోవచ్చు.



ఇంటి పంట

- నీటిని తగినంతే ఇవ్వాలి. ఎక్కువ ఇస్తే మొక్కలకు హాని జరుగుతుంది. మట్టిలేని సేద్యంలో అయితే కోకోపిట్ పైన తేమ లేకపోతేనే నీరు ఇవ్వాలి. తేమ ఉంటే ఇవ్వకూడదు. అధిక నీరు బయటకు వెళ్లిపోయే ఏర్పాటు చేసుకోవడం చాలా ముఖ్యం.
- ఐఐహెచ్ఆర్ తయారు చేసిన అర్కసస్య పోషక్ రస్ అనే రెండు రకాల ద్రావణాలను 5 ఎం.ఎల్. చొప్పున లీటరు నీటిలో కలిపి.. కూరగాయ మొక్కకు 200 ఎం.ఎల్. చొప్పున పోస్తే చాలు. పోషకాల లోపం రాదు.
- ఆకుకూర మొక్కలకు అయితే 3.5 ఎం.ఎల్.ను లీటరు నీటికి కలిపి ట్రేకి 200 ఎం.ఎల్. పోస్తే చాలు.
- మొక్కలు నాటిన/విత్తిన 10 రోజుల నుంచి 30 రోజుల వరకు వారానికి రెండు సార్లు పోయాలి. ఆ తర్వాత వారానికోసారి ఇవ్వాలి.
- పురుగులు కనిపిస్తే వేళ్లతో తీసెయ్యటం మేలు. వేప నూనె 2 ఎం.ఎల్./లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ఐఐహెచ్ఆర్ తయారుచేసిన నీమ్ సోప్‌ను 7-10 గ్రా./లీ. నీటికి బాగా కలిపి పిచికారీ చేయాలి.
- అర్క వర్టికల్ గార్డెన్ స్ట్రక్చర్‌ను తయారు చేసి ప్రజలకు విక్రయించేందుకు ఐఐహెచ్ఆర్ 6 సంస్థలకు లైసెన్స్ ఇచ్చింది. వీటిలో బెంగళూరుకు చెందిన ఒక సంస్థ కూడా ఉంది. వివరాలకు... gayathri@ tealagro.com

సైలేజ్ గడ్డి తెలుసు కదా... ఫిష్ సైలేజ్ తెలుసా?

- చేపల వ్యర్థాలతో ఫిష్ సైలేజ్ (చేప ద్రావణం) ఉత్పత్తి
- చేప ద్రావణాన్ని సులభంగా తయారు చేసుకోవచ్చు. చాలా ఏళ్లు నిల్వ చేసుకొని వాడుకోవచ్చు
- ఆక్వా మేతల్లో ఫిష్ మీల్‌కు బదులుగా వాడొచ్చు లేదా పంటలకు ద్రవ రూప ఎరువుగా వాడొచ్చు
- చేప వ్యర్థాల పునర్వినియోగంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించటంతో పాటు ఆదాయం పొందొచ్చు
- తక్కువ పెట్టుబడితో చిన్న స్థాయిలోనూ చేప ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు
- షిష్ సైలేజ్ ఉత్పత్తి ప్రమాణాలపై ఎఫ్.ఎ.ఓ. సరికొత్త మాన్యువల్ విడుదల.. స్వయం ఉపాధికి దిక్సూచి..

పచ్చిగడ్డిని ప్రత్యేక పద్ధతిలో మగ్గబెట్టి పోషకాలతో కూడిన సైలేజ్ గడ్డిని తయారు చేయటం మనకు తెలుసు. కానీ, చేపల వ్యర్థాలతో కూడా ఇదే మాదిరిగా ఫిష్ సైలేజ్‌ని తయారు చేసుకోవచ్చని మీకు తెలుసా?

చేపలను ముక్కలు కోసిన తర్వాత మిగిలే వ్యర్థాలను పారేయటం వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ వ్యర్థాలను ఒక పద్ధతి ప్రకారం పులియబెట్టటం ద్వారా పోషకాలతో కూడిన ఫిష్ సైలేజ్‌ను లేదా చేప ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు.

చేపలు, రొయ్యల బలపాల(పెల్లెట్ల) మేత తయారీలో చేపల పొడి (ఫిష్ మీల్)కి బదులు అంతకన్నా మేలైన చేప ద్రావణాన్ని వాడొచ్చు. నాణ్యమైన చేప ద్రావణాన్ని ఆక్వా మేతల తయారీలో కలపవచ్చు.

నాణ్యత కొంచెం తక్కువగా ఉన్న చేప ద్రావణాన్ని పంటల పెరుగుదలకు ఉపయోగపడే సేంద్రియ ద్రవరూప ఎరువుగా వాడుకోవచ్చని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) సూచించింది.

చేప వ్యర్థాలతో ఫిష్ సైలేజ్ తయారీ, వినియోగంలో మెళకువలతో ఎఫ్.ఎ.ఓ. సవరించిన మార్గదర్శకాలతో కూడిన మాన్యువల్‌ను తాజాగా విడుదల చేసింది.

చేప ద్రావణం మన రైతులకు తెలిసిందే అయినా.. చిన్న తరహా పరిశ్రమ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఫిష్ సైలేజ్‌ని తయారు చేసుకోవటంలో మెళకువలు అర్థం చేసుకోవటానికి ఈ మాన్యువల్‌లో పొందుపరిచిన అంశాలు ఉపయోగపడతాయని 'సాక్షి సాగుబడి' ఆశిస్తోంది.

చేపల్లో 30-70% వ్యర్థాలే!

పోషకాల గనులైన చేపల దేహంలో మనుషులు తినటానికి ఉపయోగపడే భాగాలు పోగా మిగిలే వ్యర్థాలు ఇవి చేప రకాన్ని బట్టి 30% నుంచి 70% వరకు ఉంటాయి. చేపల్ని భారీ సంఖ్యలో ప్రాసెసింగ్ చేసే కంపెనీల్లో అయితే, ఈ వ్యర్థాలను ప్రత్యేక యంత్రాల ద్వారా ఫిష్ మీల్ (చేపల పొడి)ని తయారు చేస్తారు. అయితే, చిన్న తరహా ప్రాసెసింగ్ యూనిట్లలో ఖరీదైన ఈ యంత్రాలను ఏర్పాటు చేయటం కుదరదు. అలాంటప్పుడు, పెద్దగా పెట్టుబడి అవసరం లేకుండానే, చేపల వ్యర్థాలను ఫిష్ సైలేజ్ లేదా చేపల ద్రావణంగా మార్చుకోవటానికి వీలుందని ఎఫ్.ఎ.ఓ. చెబుతోంది. ఈ ద్రావణాన్ని దీర్ఘకాలం నిల్వ పెట్టుకొని వాడుకోవటానికి వీలుంది. నాణ్యమైన చేప ద్రావణాన్ని ఆక్వా/జంతువుల బలపాల మేతల తయారీలో వినియోగించటం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.

పంటలకు 5-10% చేప ద్రావణం

చేప ద్రావణం నాణ్యత పశువుల దాణాలో వాడదగినదిగా లేనిపక్షంలో దాన్ని నిక్షేపంగా పంటల పెరుగుదలకు సేంద్రియ ద్రవ రూప ఎరువుగా వాడొచ్చు. నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియంతో పాటు మొక్కల పెరుగుదలకు కావాల్సిన అనేక సూక్ష్మ పోషకాలు కూడా చేప ద్రావణంలో పుష్కలంగా ఉంటాయని ఎఫ్.ఎ.ఓ. తెలిపింది. నీటితో పాటు చేప ద్రావణాన్ని 5-10% మేరకు కలిపి కాలువ ద్వారా పారించవచ్చు లేదా డ్రిప్ ద్వారా ఇవ్వొచ్చని ఎఫ్.ఎ.ఓ. చెబుతోంది. చేప ద్రావణంలో పోషకాలు ముడిపదార్థాన్ని బట్టి మారుతూ ఉంటాయి. చేప వ్యర్థాల్లో ఎముకలు ఎక్కువగా ఉంటే.. ద్రావణంలో ఫాస్ఫరస్, మెగ్నీషియం పాళ్లు ఎక్కువగా ఉంటాయి.

దాణాల్లో ఎలా వాడాలి?


చేప ద్రావణంలో 80% నీరు, 15% మాంసకృత్తులు, 4% వరకు బూడిద ఉంటాయి. ఫిష్‌మీల్ కన్నా సులువుగా జీర్ణమవుతుంది. పోషకాల సాంద్రత గల చేప ద్రావణాన్ని పశువులకు దాణాతో కలిపి మేపవచ్చు. పందుల పెరుగుదలకు చాలా మంచిది. ఆక్వా తదితర ఎక్స్‌ట్రూడర్ బలపాల మేత తయారీలో ఫిష్‌మీల్‌ను 5-15% వాడుతుంటారు. దీనికి బదులుగా కొంత మేరకు చేప ద్రావణాన్ని వాడొచ్చు. పంటల పెరుగుదల కోసం ద్రవ రూప ఎరువుగా వాడొచ్చు.

ఫిష్ సైలేజ్ అంటే?

చేపల్లో నుంచి మనుషులు తినే భాగాలను వేరు చేసిన తర్వాత.. తల, తోక పేగులు, మొప్పలు, పొలుసులు వంటి వ్యర్థాలు మిగిలిపోతాయి. వీటిని ఫార్మిక్ యాసిడ్ వంటి చిక్కటి ఆర్గానిక్ యాసిడ్‌ను కలిపి పులియబెట్టవచ్చు. ఈ యాసిడ్లు అందుబాటులో లేకపోతే పులిసిన పెరుగును కలిపి కూడా చేప వ్యర్థాలను పులియబెట్టవచ్చు. ఈ బాక్టీరియా కల్చర్ ఆర్గానిక్ యాసిడ్ (లాక్టిక్ యాసిడ్)ని ఉత్పత్తి చేసి, చేప వ్యర్థాల ఉదజని సూచిక (పి.హెచ్.)ను తగ్గిస్తుంది. ఎంజైమ్‌లు ఈ వ్యర్థాలలోని ప్రొటీన్లను పెప్‌టైడ్లు, అమినో యాసిడ్లుగా విచ్ఛిన్నం చేస్తాయి. ఈ ప్రక్రియ ద్వారా కొద్ది రోజుల్లోనే చేప ద్రావణం తయారవుతుంది. పోషకాలతో కూడిన ఈ ద్రావణం పైన కొంత మేరకు చేప నూనె కూడా తయారవుతుంది.

ఏళ్ల పాటు నిల్వ

ఫిష్ సైలేజ్ లేదా చేప ద్రావణంలో ఉండే పోషకాల కూర్పు, ప్రొటీన్లు (మాంసకృత్తులు) చేపల పొడిలో పోషకాల మాదిరిగా అప్పటికే విచ్ఛిన్నమై సులభ గ్రాహ్యంగా ఉంటాయి. చేప ద్రావణం ఉత్పత్తి ప్రక్రియ చాలా సులభం. పెద్దగా పెట్టుబడి అవసరం ఉండదు. తయారైన చేప ద్రావణాన్ని చాలా ఏళ్ల పాటు నిల్వ చేయవచ్చు. ఇది ద్రవరూపంలో ఉంటుంది కాబట్టి స్టోరేజ్ ట్యాంకులలో పోయటం, రోడ్డు/సముద్ర మార్గంలో రవాణా చేయటం సులభం. చేప వ్యర్థాలను బయట పారేస్తే తలెత్తే పర్యావరణ సమస్యలను నివారించటంతో పాటు ఆదాయ మార్గంగా కూడా ఫిష్ సేలేజ్ తయారీ దోహదపడుతుంది. వ్యర్థాల పునర్వినియోగం ద్వారా ఆదాయం పొందటం అన్న మాట. దీన్నే 'సర్క్యులర్ ఎకానమీ' అంటారు.



చిన్న ముక్కలు మేలు

చేప ద్రావణం నాణ్యంగా ఉండాలంటే తాజా చేప వ్యర్థాలను ఉపయోగించాలి. మిక్సీ/గ్రెండర్‌లో వేసి 1 మిల్లీమీటరు సైజు ముక్కలు చేస్తే త్వరగా ద్రావణం తయారవుతుంది. పెద్ద ముక్కలైతే ద్రావణం నాణ్యత దెబ్బతింటుంది.

బాక్టీరియల్ కల్చర్‌ను కలిపి మురగబెట్టాలి. చేప వ్యర్థాలను చిన్న చిన్న ముక్కలుగా చేసిన తర్వాత.. ఆ ముక్కలకు మిగల పండిన పండ్ల ముక్కలను (లేదా ఏదైనా ఇతర తీపి పదార్థాన్ని) కలపాలి. చేప ముక్కలు, పండ్ల ముక్కలు చెరి సగం ఉండేలా కలపాలి. పండ్ల ముక్కల్లో సుగర్ కనీసం 10% ఉండాలి. ఈ సుగర్ ఎక్కువగా ఉంటే, పండ్ల ముక్కలను చేప ముక్కలతో సమానంగా కాకుండా కొంత తక్కువగా వేసుకోవాలి.

పిహెచ్ 4.4 ఉండాలి

చేప ముక్కలతో పాటు సుగర్ కోసం పండ్ల ముక్కలకు బదులు మొలాసెస్‌ను వాడొచ్చు. మొలాసెస్‌లో 50-75% వరకు సుగర్ ఉంటుంది. కాబట్టి, చేప ముక్కల బరువులో 10-15% బరువున్న మొలాసెస్ కలిపితే చాలు.

మొత్తంగా చూస్తే.. చేప ముక్కలు, పండ్ల ముక్కలు లేదా మొలాసెస్‌లకు పులియబెట్టడానికి బాక్టీరియా కల్చర్ (ఈ కల్చర్‌ను ముందే తయారు చేసుకోవాలి) లేదా పెరుగును కలపాలి. ఇవన్నీ కలిపిన తర్వాత ఆ మిశ్రమంలో సుగర్ 5%కు మించకుండా ఉంటే పులియబెట్టే ప్రక్రియ సజావుగా సాగుతుంది. చేప ద్రావణాన్ని తరచూ కలియతిప్పుతూ ఉండాలి. దీని పిహెచ్ (పెరుగు పిహెచ్ మాదిరిగా) 4.4 ఉండాలి. ప్రొటీన్లు విచ్ఛిన్నమై ద్రావణంగా మారాలంటే ఉష్ణోగ్రత 5-40 డిగ్రీల సెల్షియస్ మధ్యలో ఉండాలి. మన వాతావరణంలో కొద్ది రోజుల్లోనే చేప ద్రావణం తయారవుతుంది. ఎముకలు, ముళ్లు మిగిలిపోతే వాటిని తీసివేసి, ద్రావణాన్ని నిల్వచేసుకోవాలి. చేప ద్రావణం పై భాగాన చేప నూనె తేలుతూ ఉంటుంది. దాన్ని ద్రావణం నుంచి వేరు చేసి నిల్వ చేసుకోవాలి. నిల్వ చేసిన చేప ద్రావణం పిహెచ్ కూడా ఎప్పుడూ 4.4 ఉండాలి. కొన్నాళ్లకు తగ్గే అవకాశం ఉంది. తగ్గినప్పుడు మిగలపండిన పండ్ల వ్యర్థాలను కలిపితే పి.హెచ్. మళ్లీ పెరుగుతుంది.

బాక్టీరియా కల్చర్

ద్రావణాన్ని తయారు చేసుకునేందుకు చేప ముక్కలకు కలిపే బాక్టీరియా కల్చర్‌ను మనమే తయారు చేసుకోవచ్చు. అర లీటరు నీరు, అర కేజీ మిగలపండిన పండ్ల ముక్కలు (లేదా మొలాసెస్), 25-50 గ్రాముల (1.5 నుంచి 3 టేబుల్ స్పూన్ల) ఉప్పు.. వీటిని కలిపి 30-35 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలో రెండు రోజులు మురగబెట్టాలి.

గాలిలో నుంచి సూక్ష్మ జీవులను తీసుకొని బాక్టీరియా కల్చర్ సిద్ధమవుతుంది. దీని పిహెచ్ 4.0 ఉండాలి. ఈ బాక్టీరియా కల్చర్‌కు బదులు పెరుగును కూడా వాడుకోవచ్చు.

బిజినెస్ రీల్

సూది రహిత కోవిడ్ వ్యాక్సిన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యాక్సిన్ల తయారీలో ఉన్న ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ (ఐఐఎల్).. ముక్కు ద్వారా ఇచ్చే సూది రహిత కోవిడ్–19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం ఆస్ట్రేలియాకు చెందిన గ్రిఫిత్ యూనివర్సిటీ భాగస్వామ్యం తీసుకున్నట్టు ఐఐఎల్ మంగళవారం తెలిపింది. ఈ లైవ్ అటెన్యుయేటెడ్ వ్యాక్సిన్ అభివృద్ధికి కోడాన్ డీఆప్టిమైజేషన్ టెక్నాలజీని వినియోగించినట్టు వివరించింది. 'కోవిడ్–19 ముప్పు ఇంకా ముగియలేదు. ఇది ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వారానికి 1,700 మందిని చంపుతోంది. ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు బూస్టర్ టీకాలు వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కోరింది' అని ఐఐఎల్ తెలిపింది.

రాణా షుగర్స్‌పై సెబీ వేటు

ప్రమోటర్లు, ఇతర అధికారులపైనా నిషేధం

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా రాణా షుగర్స్‌తోపాటు.. కంపెనీ ప్రమోటర్లు, ఇతర అధికారులపై నిషేధ బాణాన్ని సంధించింది. నిధుల అక్రమ మళ్లింపు కేసులో సెక్యూరిటీల మార్కెట్ల నుంచి రెండేళ్ల నిషేధంసహా.. రూ. 63 కోట్లమేర జరిమానాలు సైతం విధించింది. ఈ జాబితాలో కంపెనీ ప్రమోటర్, ఎండీ ఇందర్ ప్రతాప్ సింగ్ రాణా, చైర్మన్ రంజిత్ సింగ్ రాణా, వీర్ ప్రతాప్ రాణా, రాజ్బన్స్ కౌర్ తదితరులున్నారు. వీరంతా రెండేళ్లపాటు ఏ లిస్టెడ్ కంపెనీలోనూ కీలక యాజమాన్య పదవులు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తిగతంగా వీరందరికీ రూ. 3 నుంచి రూ. 7 కోట్ల మధ్య జరిమానాలు విధించింది.

ప్రాంతీయ భాషల్లో ఎయిరిండియా కస్టమర్ సపోర్ట్ సేవలు

ముంబై: విమానయాన సంస్థ ఎయిరిండియా తెలుగు సహా ఏడు ప్రాంతీయ భాషల్లో కస్టమర్ సపోర్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తమిళం, మలయాళం, కన్నడ, బెంగాలీ, మరాఠీ, పంజాబీ వీటిలో ఉన్నాయి. ఇప్పటికే ఇంగ్లీష్, హిందీలో సంస్థ ఈ సేవలను అందిస్తోంది. భాషను మాన్యువల్‌గా ఎంచుకోవాల్సిన అవసరం లేకుండా యూజర్ మొబైల్ నెట్‌వర్క్‌ను బట్టి ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ (ఐవీఆర్) సిస్టం ఆటోమేటిక్‌గా వ్యవహరిస్తుందని సంస్థ పేర్కొంది. దీనితో రెస్పాన్స్ సమయం తగ్గుతుందని వివరించింది. ప్రాంతీయ భాషల్లో సేవలు ఉదయం 8 గం. నుంచి రాత్రి 11 గం.ల వరకు ప్రతిరోజూ అందుబాటులో ఉంటాయి.

టాటా టెక్నాలజీస్ షేర్ల విక్రయం

3 శాతం వాటా అమ్మకం

న్యూఢిల్లీ: ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ టీపీజీ రైజ్ క్లయిమేట్ ఎస్ఎఫ్ పీటీఈ తాజాగా టాటా టెక్నాలజీస్‌లో 2.99 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 1,014.16 సగటు ధరలో 1.2 కోట్ల షేర్లను ఆఫ్‌లోడ్ చేసింది. తద్వారా రూ. 1,230 కోట్లు అందుకుంది. బీఎస్ఈ గణాంకాల ప్రకారం కాప్తాల్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్ 0.99 శాతం వాటా, హెడ్జ్ ఫండ్ ఘిసాలో మాస్టర్ 0.77 శాతం వాటా చొప్పున కొనుగోలు చేశాయి. తాజా లావాదేవీ తదుపరి టాటా టెక్నాలజీస్‌లో టీపీజీ రైజ్ వాటా 9 శాతం నుంచి 6 శాతానికి క్షీణించింది.

టాటా టెక్నాలజీస్ షేరు బీఎస్ఈలో 4.8 శాతం జంప్‌చేసి రూ. 1,099 వద్ద ముగిసింది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్–సోనీ పిక్చర్స్..

చేయి చేయి!

ఆరు నెలల విలీన వివాదపరిష్కారానికి నిర్ణయం ● అన్ని క్లెయిమ్‌ల ఉపసంహరణకు అంగీకారం



న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీల్) – సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా మంగళవారం కీలక నిర్ణయాన్ని తీసుకున్నాయి. విఫలమైన 10 బిలియన్ల డాలర్ల విలీన ఒప్పందం విషయంలో గత ఆరు నెలలుగా తమ మధ్య కొనసాగుతున్న సుదీర్ఘ కార్పొరేట్ వివాదాన్ని పరిష్కరించుకున్నాయి. ఈ విషయంలో ఒకదానిపై మరొకటి అన్ని క్లెయిమ్‌లను ఉపసంహరించుకోవడానికి అంగీకరించినట్లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ (ఎస్ఐఏసీ) ఆర్బిట్రేషన్ ప్రక్రియలో జీల్ అలాగే కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ –సీఎంఈపీఎల్ (సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా– కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్.. వినియోగ ఫేసింగ్‌కు సంబంధించిన గుర్తింపు. ఇది జపాన్‌లోని సోనీ గ్రూప్ కార్పొరేషన్‌కు అనుబంధ సంస్థ) ఈ మేరకు ''సమగ్ర నగదు రహిత సెటిల్‌మెంట్''ను కుదుర్చుకున్నట్లు సంయుక్త ప్రకటన పేర్కొంది. దీనిప్రకారం ఎన్‌సీఎల్‌టీసహా అన్ని న్యాయవేదికలపై కొనసాగుతున్న క్లెయిమ్‌లను పరస్పరం ఉపసంహరించుకోనున్నాయి. ఆయా అంశాలను సంబంధిత నియంత్రణ అధికారులకు తెలియజేస్తాయి.

జీల్ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు 12% అప్

తాజా పరిణామం నేపథ్యంలో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ షేర్లు మంగళవారం దాదాపు 12 శాతం పెరిగాయి. బీఎస్ఈలో ఈ షేరు ధర 11.45 శాతం జంప్ చేసి రూ.150.85 వద్ద స్థిరపడింది. ఒక దశలో 14.25 శాతం పెరిగి రూ.154.65ని తాకింది. ఎన్ఎస్ఈలో కంపెనీ షేర్లు 11.61 శాతం పెరిగి రూ.150.90కి చేరాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,488.81 కోట్లు పెరిగి రూ.14,489.44 కోట్లకు చేరుకుంది.

ఇక ఎవరిదారి వారిది..

తాజా పరిష్కార ఒప్పంద ప్రకారం ఇకపై రెండు సంస్థల్లో ఎవరికి ఎవరిపై ఎటువంటి క్లెయిల్‌లు ఉండబోవు. అభివృద్ధి చెందుతున్న మీడియా, వినోద రంగాలపై భవిష్యత్ వృద్ధి అవకాశాలపై స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాయి. అన్ని వివాదాల ఖచ్చితమైన ముగింపు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది.

నేపథ్యం ఇలా..

★ 2021 డిసెంబర్ 22న రెండు సంస్థలూ విలీన సహకార ఒప్పందం (ఎంసీఏ)పై సంతకాలు చేశాయి.

★ ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ 2023 ఆగస్టు 10న 10 బిలియన్ డాలర్ల మీడియా సంస్థను సృష్టించగల సోనీ గ్రూప్–, బంగ్లా ఎంటర్‌టైన్‌మెంట్ (బీఈపీఎల్)తో జీల్ విలీన పథకాన్ని ఆమోదించింది.

★ ఈ ఏడాది జనవరిలో ఒప్పందం రద్దుచేసి, అటు తర్వాత రెండు రోజుల్లో సోనీ సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌ను ఆశ్రయించింది. జీల్ విలీన షరతులను పాటించకపోవడం దీనికి కారణంగా పేర్కొంది. ఇందుకుగాను 90 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 748.7 కోట్లు) ముగింపు రుసుమును క్లెయిమ్ చేసింది.

★ అయితే ఈ వాదనను జీల్ దీనిని ఆర్బిట్రేషన్ సెంట్రల్‌లో తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రతిపాదిత విలీనాన్ని అమలు చేయాలని కోరుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ)ని జీల్ ఆశ్రయించింది. అయితే అటు తర్వాత ఈ అభ్యర్థనను ఉపసంహరించుకుంది.

★ తరువాత 2024 మేలో జీల్ కూడా ఎంసీఏని రద్దు చేసింది. రెండు సోనీ గ్రూప్ సంస్థలు– సోనీ పిక్చర్స్ లిమిటెడ్, బంగ్లా ఎంటర్‌టైన్‌మెంట్‌ల నుండి 90 మిలియన్ డాలర్ల టెర్మినేషన్ రుసుమునూ కూడా డిమాండ్ చేసింది.

★ ఒప్పందం ముగిసిన తర్వాత, రెండు కంపెనీలు స్వతంత్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అయితే జీల్ ఆర్థిక అడ్డంకులను ఎదుర్కొంటోంది. పలు చర్యల ద్వారా దీనిని అధిగమించడానికి ప్రయత్నిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.118 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

విలీన ఒప్పందం	ఎన్‌సీఎల్‌టీ ఆమోదం	రద్దుకు సోనీ నిర్ణయం	రద్దుకు జీల్ నిర్ణయం
2021 డిసెంబర్ 22	2023 ఆగస్టు 10	2024 జనవరి 22	2024 మే 24

క్యాథే కార్గో భారత్‌లో విస్తరణ



హాంగ్‌కాంగ్: కార్గో సేవల్లో ఉన్న హాంకాంగ్ సంస్థ క్యాథే కార్గో భారత్‌లో విస్తరించాలని నిర్ణయించింది. ఓపెన్ స్కై విధానం భారత్‌కు సానుకూల ఫలితాలను అందిస్తుందని కంపెనీ కార్గో డైరెక్టర్ టామ్ ఓవెన్ తెలిపారు. ఓపెన్ స్కై పాలసీ ప్రకారం భారత ప్రభుత్వం అనేక విదేశీ కార్గో క్యారియర్‌లను అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల నుండి ఆపరేట్ చేయడానికి అనుమతిస్తుంది. తద్వారా వస్తువుల రవాణాను వేగవంతం చేస్తుంది. భారత్‌లో వివిధ నగరాల నుంచి సరుకు రవాణా చేపడతామని ఓవెన్ అన్నారు. ఒకే విమానాన్ని భారత్‌లోని వివిధ నగరాల మీదుగా (కో–టెర్మినలైజేషన్) హాంగ్‌కాంగ్‌కు నడుపుతామని చెప్పారు. భారత ఆర్థిక వృద్ధిపై కంపెనీ ఉత్సాహంగా ఉందని, ఇక్కడి మార్కెట్లో మరింత వృద్ధి చెందేందుకు చాలా ఆసక్తిగా ఉన్నామని ఆయన అన్నారు. మార్కెట్ అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచుతామని చెప్పారు.

భారత్‌లో అద్భుత వృద్ధి..

ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్ కాంపోనెంట్స్, ఎలక్ట్రానిక్స్, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల దేశం నుంచి పెరుగుతున్నాయని, ఇక్కడి మార్కెట్‌లో అవకాశాల విషయంలో తమ కంపెనీ చాలా ఆశాజనకంగా ఉందని ఓవెన్ అన్నారు. భారతదేశ వృద్ధి అంశంలో స్వల్ప, దీర్ఘకాలంలోనూ ఆశాభావంతో ఉన్నామని వివరించారు. 10 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థలో అద్భుత వృద్ధి, వేగవంతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి జరిగిందన్నారు. లాజిస్టిక్స్ వ్యాపారంలో నిమగ్నమైన మొత్తం శ్రామిక శక్తి నైపుణ్యాన్ని ఆయన గుర్తు చేశారు. 'భారత్ చాలా సారవంతమైనది. ఉత్పాదక దేశం కూడా. తాజా కూరగాయలు, పూలు భారత్ నుండి ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు తరలించడంలో పెద్ద అవకాశాలు ఉన్నాయి. కార్గో సేవలను విస్తరించేందుకు ఇండిగో, ఇతర ప్యాసింజర్ క్యారియర్‌లతో చర్చలు జరుపుతున్నాం' అని అన్నారు.

సీఈవోకు ఎసాప్స్‌పై పేటీఎంకు సెబీ నోటీసులు



న్యూఢిల్లీ: సీఈవో విజయ్ శేఖర్ శర్మకు ఎసాప్స్ (ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్) ఇవ్వడంపై ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు స్టాక్ ఎక్స్చేంజీలకు పేటీఎం బ్రాండ్ మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలియజేసింది. అయితే ఇది కొత్త పరిణామం కాదని, ఈ విషయంలో తాము సెబీకి ఎప్పటికప్పుడు విషయాలను తెలియజేస్తూనే ఉన్నామని వివరించింది. ఇప్పటికే సంబంధిత వివరాలన్నీ తమ ఆర్థిక ఫలితాల్లో వెల్లడించామని వన్97 కమ్యూనికేషన్స్ పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సర ఆర్థిక ఫలితాల ప్రకారం 2022లో శర్మకు పేటీఎం 2.1 కోట్ల ఎసాప్స్‌ను కేటాయించింది. లీగల్ టీమ్ అభిప్రాయం మేరకు ఎసాప్స్ కేటాయింపనేది నిర్దిష్ట నిబంధనలకు లోబడే ఉన్నట్లు, 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సర ఫలితాలపై దీని ప్రభావమేమీ ఉండదని వన్97 తెలిపింది.


బీఎస్ఈలో మంగళవారం పేటీఎం షేరు 3% పెరిగి రూ. 546 వద్ద క్లోజయ్యింది. ఒక దశలో ఏకంగా 4.50% మేర పెరిగి రూ. 554 స్థాయిని కూడా తాకింది.

క్యాపిటల్‌మైండ్ 'మ్యూచువల్ ఫండ్'కు సెబీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడానికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సూత్రప్రాయ అనుమతులు ఇచ్చినట్లు పెట్టుబడుల నిర్వహణ సేవల సంస్థ క్యాపిటల్‌మైండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్లడించింది. పోర్ట్‌ఫోలియో మేనేజర్‌గా కంపెనీ ప్రస్తుతం 1,150 మంది క్లయింట్ల కోసం రూ. 2,200 కోట్ల పైగా విలువ చేసే అసెట్స్‌ను (ఏయూఎం) నిర్వహిస్తోంది. పటిష్టమైన పోర్ట్‌ఫోలియో పనితీరు, స్థిరమైన పెట్టుబడుల ప్రవాహం కారణంగా కార్యకలాపాలను ప్రారంభించినప్పటి నుంచి ప్రతి ఆర్థిక సంవత్సరం తమ ఏయూఎం రెట్టింపయినట్లు క్యాపిటల్‌మైండ్ సీఈవో దీపక్ షెనాయ్ తెలిపారు. దీంతో కేవలం ఏడేళ్ల కన్నా తక్కువ వ్యవధిలోనే తమ క్లయింట్ల కోసం రూ. 1,000 కోట్ల మేర సంపదను సృష్టించగలిగామని పేర్కొన్నారు. సెబీ తుది అనుమతుల నిబంధనలకు లోబడి త్వరలోనే క్యాపిటల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని ఏర్పాటు చేస్తామని షెనాయ్ చెప్పారు. 2024 మార్చి 31 నాటి గణాంకాల ప్రకారం దేశీయంగా 74.6 కోట్ల మంది పాన్ కార్డ్‌హోల్డర్లు ఉండగా మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ల సంఖ్య కేవలం 4.5 కోట్లే ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ విభాగంలో వ్యాపార వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నట్లు వివరించారు.



భారత్ బయో నుంచి ఓరల్ కలరా టీకా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ తాజాగా నోటి ద్వారా వేసే కొత్త తరం కలరా టీకా ''హిల్‌కాల్''ను (బీబీవీ131) ఆవిష్కరించింది. హిల్‌మ్యాన్ ల్యాబొరేటరీస్ నుంచి లైసెన్సుతో దీన్ని అభివృద్ధి చేసినట్లు మంగళవారమిక్కడ వ్యాక్సిన్ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా తెలిపారు. దీని తయారీ, మార్కెటింగ్‌కి దేశీయంగా ఔషధ రంగ నియంత్రణ సంస్థ డీసీజీఐ నుంచి అనుమతులు పొందినట్లు వివరించారు. హైదరాబాద్, భువనేశ్వర్‌లోని ప్లాంట్లలో ఈ టీకాలను ఉత్పత్తి చేయనున్నట్లు కృష్ణ చెప్పారు. వార్షికంగా 20 కోట్ల డోసుల వరకు ఉత్పత్తి చేసే సామర్థ్యాలు ఉండగా, ప్రాథమికంగా హైదరాబాద్ ప్లాంటులో 4.5 కోట్ల డోసులను ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏడాది పైబడిన వారికి పద్నాలుగు రోజుల వ్యవధిలో దీన్ని రెండు డోసులుగా వేస్తారు. కలరా కొత్త స్ట్రెయిన్ నుంచి కూడా రక్షణ కల్పించడంతో పాటు ప్రస్తుత మున్న టీకాలతో పోలిస్తే ఈ వేక్సిన్ వ్యయాలు కొంత తక్కువగానే ఉండవచ్చని కృష్ణ పేర్కొన్నారు. ముందుగా కలరా విస్తృతి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో పంపిణీ కోసం యూనిసెఫ్ వంటి అంతర్జాతీయ ఏజెన్సీలకు దీన్ని సరఫరా చేయనున్నట్లు కృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఓరల్ కలరా టీకాలకు (ఓసీవీ) ఏటా 100 మిలియన్ డోసులకు పైగా డిమాండ్ ఉండగా, కేవలం ఒకే సంస్థ వీటిని సరఫరా చేస్తోందని, దాదాపు 40 మిలియన్ డోసుల కొరత ఉంటోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హిల్‌కాల్ అందుబాటులోకి రావడం వల్ల 2030 నాటికి కలరాను దాదాపుగా నిర్మూలించాలన్న లక్ష్య సాకారానికి ఊతం లభించగలదని చెప్పారు. వివిధ దశల క్లినికల్ ట్రయల్స్‌లో ఇది సురక్షితమైనదిగా నిరూపితమైనట్లు కృష్ణ వివరించారు. కలరాబారిన పడి మరణించే వారి సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. కార్యక్రమంలో భారత్ బయోటెక్ జేఎండీ సుచిత్ర ఎల్లా, ప్రముఖ వేక్సినాల జిస్ట్ యాన్ హోమ్‌గ్రెన్ తదితరులు పాల్గొన్నారు.

నెమ్మదించనున్న ఎస్ఎఫ్‌బీల రుణ వృద్ధి..

- ఈసారి 25–27 శాతానికి పరిమితం
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిన్న ఫైనాన్స్ బ్యాంకుల (ఎస్ఎఫ్‌బీ) రుణ వృద్ధి 25–27 శాతానికి నెమ్మదించే అవకాశం ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇది 28 శాతంగా నమోదైంది. రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఎస్ఎఫ్‌బీలు విభాగాలవారీగా, భౌగోళికంగా కార్యకలాపాలను విస్తరిస్తుండటమనేది రుణ వృద్ధి మెరుగుపడటానికి దోహదపడగలదని నివేదిక పేర్కొంది. మూలధన నిల్వలు బాగానే ఉన్నప్పటికీ తక్కువ వ్యయాలతో డిపాజిట్లను సేకరించడంలో ఎస్ఎఫ్‌బీలు సవాళ్లు ఎదురుకాగలవని వివరించింది. దీంతో రుణ వృద్ధికి అవసరమయ్యే నిధుల సమీకరణకు అవి ప్రత్యామ్నాయ, డిపాజిట్‌యేతర వనరులను అన్వేషిస్తాయని పేర్కొంది. సంప్రదాయ బద్ధమైన సూక్ష్మరుణాలతో పాటు తనఖాలు, అన్‌సెక్యూర్డ్ రుణాలు మొదలైన కొత్త మార్గాల్లో రుణ వృద్ధిని మెరుగుపర్చుకునేందుకు అవి ప్రయత్నిస్తాయని నివేదిక తెలిపింది. కొత్త అసెట్స్ విభాగాల్లో రుణ వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం 40 శాతం వరకు ఉండొచ్చని, సంప్రదాయ విభాగాల్లో ఇది 20 శాతంగా ఉండొచ్చని సంస్థ సీనియర్ డైరెక్టర్ అజిత్ వెలోనీ తెలిపారు.

మరిన్ని విశేషాలు..

- గత అయిదేళ్లలో నెట్‌వర్క్‌పరంగా చూస్తే ఎస్ఎఫ్‌బీల బ్రాంచీల సంఖ్య ఈ ఏడాది మార్చి నాటికి రెట్టింపై 7,400కి చేరింది.
- తూర్పు రాష్ట్రాల్లో శాఖల సంఖ్య అత్యధికంగా ఉంది. 2019 మార్చి నాటికి మొత్తం శాఖల్లో తూర్పు రాష్ట్రాల్లో 11 శాతం ఉండగా ప్రస్తుతం ఇది 15 శాతానికి పెరిగింది. ప్రస్తుతం సగానికి పైగా శాఖలు, గణనీయంగా వృద్ధి అవకాశాలున్న గ్రామీణ, సెమీ–అర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయి.
- గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం బ్యాంకింగ్ రంగానికి పూర్తి భిన్నంగా, ఎస్ఎఫ్‌బీల్లో రుణ వృద్ధికన్నా అధికంగా డిపాజిట్ వృద్ధి 30 శాతం స్థాయిలో నమోదైంది.
- మొత్తం డిపాజిట్లలో 30 శాతం వాటా ఖరీదైన బల్క్ డిపాజిట్లదే ఉంది. 2022 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ఇది 22 శాతమే. చౌకగా ఉండే కరెంట్–సేవింగ్స్ డిపాజిట్ల వాటా 35 శాతం నుంచి 28 శాతానికి తగ్గింది. ఎస్ఎఫ్‌బీలు టర్మ్ డిపాజిట్లపై ఆధారపడటం ఇకపైనా కొనసాగనుంది. ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తే సెక్యూరిటైజేషన్ క్రమంగా ప్రాచుర్యంలోకి వస్తోంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగంలో లావాదేవీలు రూ. 6,300 కోట్లుగా ఉండగా 2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 9,000 కోట్లకు చేరాయి. మొత్తం అయిదు ఎస్ఎఫ్‌బీలు ఇప్పటివరకు ఈ మార్గంలో నిధులను సమీకరించాయి.

నిధుల వినియోగానికి వేదాంతా రెడీ!

బ్యాలన్స్‌షీట్, మూలధన పటిష్టతకు సై




న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ఇటీవల సమీకరించిన నిధుల వినియోగానికి సన్నాహాలు చేస్తోంది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్), షేర్ల విక్రయం(ఓఎఫ్ఎస్), డివిడెండ్ల ద్వారా రూ. 30,000 కోట్లు సమకూర్చుకుంది. వీటిని బ్యాలన్స్ షీట్‌తోపాటు.. మూలధన పటిష్టతకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మేషనల్ ప్రాజెక్ట్స్ అభివృద్ధికి సైతం వెచ్చించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తద్వారా సమీప భవిష్యత్‌లో 10 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 83,800 కోట్లు) నిర్వహణ లాభ(ఇబిటా) ఆర్జనకు దారి ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలియజేశాయి. ఇందుకు వీలుగా ఇతర కంపెనీల కొనుగోళ్లను సైతం పరిశీలించనున్నట్లు వివరించాయి.

నిధుల సమీకరణ తీరిదీ

క్విప్ ద్వారా వేదాంతా రూ. 8,500 కోట్లు సమీకరించగా.. గ్రూప్ కంపెనీ హిందుస్తాన్ జింక్ ఓఎఫ్ఎస్ ద్వారా రూ. 3,200 సమకూర్చుకుంది. మరోవైపు రెండో మధ్యంతర డివిడెండ్ మార్గంలో రూ. 5,100 కోట్లు అందుకుంది. వీటికి ప్రస్తుత రూ. 13,000 కోట్ల నగదు నిల్వలు(రిజర్వులు) జత కలవడంతో రూ. 30,000 కోట్లమేర ఆర్థిక నిధి(వార్ చెస్ట్) ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. కంపెనీ మరోసారి ఈ ఏడాది(2024–25) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 54 శాతం జంప్‌చేసి రూ. 5,095 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా(క్యూ4తో పోలిస్తే) రెట్టింపునకుపైగా ఎగసింది. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధిక అల్యూమినా ఉత్పత్తిని సాధించింది. వ్యవస్థాగత మార్పులు తదితరాల ద్వారా ఉత్పత్తి వ్యయాలను 20 శాతం తగ్గించుకుంది. 2024 జూన్30 కల్లా కంపెనీ రుణ భారం రూ. 61,300 కోట్లుగా నమోదైంది.

యస్ బ్యాంక్ డిపాజిట్స్ 20.8% జూమ్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలో ఉన్న యస్ బ్యాంక్ మొత్తం డిపాజిట్స్ గతేడాదితో పోలిస్తే జూన్ త్రైమాసికంలో 20.8 శాతం దూసుకెళ్లి రూ.2,65,072 కోట్లకు చేరాయి. కరెంట్ అకౌంట్ సేవింగ్స్ అకౌంట్ (కాసా) రేషియో 29.4 నుంచి 30.8 శాతానికి పెరిగింది. 2023–24లో నూతనంగా సుమారు 17 లక్షల కాసా ఖాతాలు తోడయ్యాయని బ్యాంక్ తెలిపింది. కాగా, యస్ బ్యాంక్ రిటైల్ అసెట్స్, డెట్ మేనేజ్‌మెంట్ కంట్రీ హెడ్‌గా సుమిత్ బాలి నియమితులయ్యారు. ఫైనాన్షియల్ మార్కెట్స్ విభాగం కంట్రీ హెడ్ అమిత్ సురేకను బ్యాంక్ తొలగించింది.

ఆటో కంపెనీల 'స్క్రాప్' ఆఫర్



- స్క్రాపేజీ సర్టిఫికెట్ ఉంటే కొత్త వాహనాలపై 3% వరకు డిస్కౌంటు
- వాణిజ్య, ప్యాసింజర్ వాహనాలకు పరిమిత కాలం వర్తింపు
- వాహన కంపెనీలతో కేంద్ర మంత్రి గడ్కరీ భేటీ

న్యూఢిల్లీ: పండుగ సీజన్ సందర్భంగా అమ్మకాలు పెంచుకోవడంపై వాహనాల తయారీ సంస్థలు మరింతగా దృష్టి పెడుతున్నాయి. ఇందులో భాగంగా పాత వాహనాలను తుక్కుగా మార్చిన స్క్రాపేజీ సర్టిఫికెట్ సమర్పిస్తే కొత్త వాహనాలపై 1.5–3 శాతం వరకు డిస్కౌంటు ఇవ్వాలని పలు ప్యాసింజర్, కమర్షియల్ వాహనాల తయారీ సంస్థలు నిర్ణయించాయి. కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఆటోమొబైల్ సంస్థల సమాఖ్య సియామ్ మంగళవారం సమావేశం అయిన మీదట ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం మెర్సిడెస్ బెంజ్ ఇండియా ప్రస్తుత ఆఫర్లతో పాటు ఫ్లాట్‌గా రూ. 25,000 డిస్కౌంట్ కూడా ఆఫర్ చేస్తున్నట్లు వివరించింది. 'సమావేశం సందర్భంగా వాహనాల ఆధునీకరణ ప్రాధాన్యతపై మంత్రి చేసిన సూచనలపై పలు వాణిజ్య వాహనాల తయారీ సంస్థలు, ప్యాసింజర్ వాహనాల తయారీ సంస్థలు సానుకూలంగా స్పందించాయి. సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ (స్క్రాపేజీ సర్టిఫికెట్)పై పరిమిత కాలం పాటు డిస్కౌంట్లు ఇచ్చేందుకు అంగీకరించాయి' అని ప్రకటన పేర్కొంది.

ఏడాది నుంచి రెండేళ్ల వరకు..

ప్రకటన ప్రకారం కమర్షియల్ వాహనాల తయారీ సంస్థలు రెండేళ్ల పరిమిత కాలానికి డిస్కౌంట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండగా, ప్యాసింజర్ వాహనాల తయారీ సంస్థలు ఏడాది పాటు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు ఈ డిస్కౌంట్లు ప్రోత్సాహకాలుగా పని చేయగలవని ప్రభుత్వం పేర్కొంది. రహదారులపై మరింత సురక్షితమైన, సమర్ధమంతమైన వాహనాలు వచ్చేందుకు ఇది దోహదపడగలదని వివరించింది. మారుతీ సుజుకీ ఇండియా, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హ్యుందాయ్ మోటర్ ఇండియా, కియా మోటర్స్, టయోటా కిర్లోస్కర్ మోటర్, హోండా కార్స్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్, రెనో ఇండియా, నిస్సాన్ ఇండియా, స్కోడా ఫోక్స్‌వ్యాగన్ ఇండియా సంస్థలు కొత్త కారు ఎక్స్ షోరూం ధరలో 1.5 శాతం లేదా రూ. 20,000 వరకు (ఏది తక్కువైతే అది) డిస్కౌంటు అందించనున్నాయి. ఇందుకోసం గత 6 నెలల వ్యవధిలో స్క్రాప్ చేసిన ప్యాసింజర్ వాహనానికి సంబంధించిన సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. అటు టాటా మోటర్స్, వోల్వో ఐషర్ కమర్షియల్ వెహికల్స్, అశోక్ లేల్యాండ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఫోర్స్ మోటర్స్, ఇసుజు మోటర్స్, ఎస్ఎంఎల్ ఇసుజు సంస్థలు 3.5 పైగా టన్నుల కమర్షియల్ కార్గో వాహనాల ఎక్స్ షోరూం ధర్లపై 3 శాతం మేర డిస్కౌంటు ఆఫర్ చేయనున్నాయి. బస్సులు, వ్యాన్లకు కూడా ఇదే స్కీమును పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. స్క్రాప్ చేసిన వాహన వివరాలు 'వాహన్ సిస్టమ్'కి అనుసంధానిస్తారు. నిర్దిష్ట మోడల్స్‌పై కంపెనీలు స్వచ్ఛందంగా మరిన్ని డిస్కౌంట్లు ఆఫర్ చేయొచ్చు. పలు ఆటో కంపెనీ దిగ్గజ చీఫ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJFINSV	1,727.60	2.46
SBILIFE	1,837.00	2.27
MARUTI	12,478.00	1.91
HDFCLIFE	737.7	1.66
LT	3,700.10	1.6

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	943.8	-2.04
TITAN	3,560.00	-1.93
HINDUNILVR	2,767.00	-1.92
GRASIM	2,702.05	-1.26
COALINDIA	531.75	-1.18

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,883
ఎన్ఎస్ఈ	1,15,234
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,34,110
ఎఫ్ఐఐ	+ 1,504
డీఐఐ	- 604

ముడిచమురు... (బ్యారల్)



నైమెక్స్ లైట్ స్వీట్	75.61	$ 77.42
బ్రెంట్	78.77	$ 80.36

ఇదిగో మన బలగం!

మహిళల టి20 ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన ● హర్మన్ సారథ్యంలో 15 మంది సభ్యుల బృందం

గత కొంతకాలంగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత మహిళల క్రికెట్ జట్టు... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టోర్నీల్లో మాత్రం స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతోంది. మెగా టోర్నీల్లో మంచి ఆరంభాలు లభించినా... చివరి దశకు వచ్చేసరికి ఒత్తిడిని తట్టుకోలేక రిక్త హస్తాలతో వెనుదిరుగుతోంది. ఆ అడ్డంకిని అధిగమించి ముందడుగు వేసి ప్రపంచ చాంపియన్‌గా అవతరించేందుకు మన మహిళల జట్టుకు మరో అవకాశం వచ్చింది. అక్టోబర్ 3 నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈ టోర్నీ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహించనున్న ఈ జట్టులో అనుభవానికి, యువతరానికి సమాన ప్రాధాన్యత కల్పించారు. పురుషుల జట్టు సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... ఇటీవల టి20 ప్రపంచ కప్ సాధించగా... ఇప్పుడదే బాటలో మహిళల జట్టు కూడా జగజ్జేతగా నిలవాలని అభిమానులు ఆశిస్తున్నారు. మెగా టోర్నీకి ఎంపిక చేసిన మన ప్లేయర్ల బలాబలాలను ఒకసారి పరిశీలిస్తే... అంతర్జాతీయ టి20ల్లో 173 మ్యాచ్‌లు ఆడిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అందరికంటే సీనియర్ కాగా.. వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న స్మృతి మంధాన 141 మ్యాచ్‌ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. వీరిద్దరి తర్వాత స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 117 మ్యాచ్‌లు ఆడగా.. జెమీమా రోడ్రిగ్స్ 100 మ్యాచ్‌లు ఆడింది. ఇక అండర్–19 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు విజేతగా నిలవడంలో ప్రధాన పాత్ర పోషించిన విధ్వంసక ఓపెనర్ షఫాలీ వర్మతో పాటు వికెట్ కీపర్ రిచా ఘోష్ కూడా కీలకం కానున్నారు. మొత్తం 10 జట్లు పాల్గొంటున్న ప్రపంచకప్‌లో... ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, శ్రీలంకతో కలిసి భారత్ గ్రూప్ 'బి' నుంచి పోటీ పడనుంది. మెగా టోర్నీలో భాగంగా అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో హర్మన్ బృందం తొలి మ్యాచ్‌లో తలపడనుంది. అనంతరం అక్టోబర్ 6న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో ఆడుతుంది. జట్టులో స్పిన్నర్లకు కొదవ లేకున్నా... పేస్ ఆల్‌రౌండర్ల లోటు కనిపిస్తోంది. శ్రేయంక పాటిల్, యస్తికా భాటియాను ఎంపిక చేసినా... గాయాల నుంచి పూర్తిగా కోలుకుంటేనే వీరిద్దరు జట్టుతో కలిసి యూఏఈ బయలుదేరుతారు. ఇక ట్రావెల్ రిజర్వ్‌లుగా తనూజ కన్వర్, ఉమా ఛెత్రీ, సైమా ఠాకూర్ ఎంపికయ్యారు. ...సాక్షి క్రీడా విభాగం



హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్)	
మ్యాచ్‌లు	173
పరుగులు	3426
అత్యధిక స్కోరు	103
సగటు	28.08
సెంచరీలు	1
అర్ధ సెంచరీలు	12
వికెట్లు	32



స్మృతి మంధాన	
టి20 మ్యాచ్‌లు	141
పరుగులు	3493
అత్యధిక స్కోరు	87
సగటు	28.86
అర్ధ సెంచరీలు	26



షఫాలీ వర్మ	
టి20 మ్యాచ్‌లు	81
పరుగులు	1948
అత్యధిక స్కోరు	81
సగటు	25.63
అర్ధ సెంచరీలు	10



జెమీమా రోడ్రిగ్స్	
టి20 మ్యాచ్‌లు	100
పరుగులు	2074
అత్యధిక స్కోరు	76
సగటు	30.50
అర్ధ సెంచరీలు	11



రిచా ఘోష్	
టి20 మ్యాచ్‌లు	55
పరుగులు	860
అత్యధిక స్కోరు	64
సగటు	28.66
అర్ధ సెంచరీలు	1



దయాలన్ హేమలత	
టి20 మ్యాచ్‌లు	23
పరుగులు	276
అత్యధిక స్కోరు	47
సగటు	16.23
వికెట్లు	9



యస్తికా భాటియా	
టి20 మ్యాచ్‌లు	19
పరుగులు	214
అత్యధిక స్కోరు	36
సగటు	16.46



దీప్తి శర్మ	
టి20 మ్యాచ్‌లు	117
పరుగులు	1020
అత్యధిక స్కోరు	64
సగటు	23.72
అర్ధ సెంచరీలు	2
వికెట్లు	131



పూజ వస్త్రకర్	
టి20 మ్యాచ్‌లు	70
వికెట్లు	57
అత్యుత్తమ ప్రదర్శన	4/13
సగటు	21.24
ఎకానమీ	6.36



ఆశా శోభన	
టి20 మ్యాచ్‌లు	3
వికెట్లు	4
ఉత్తమ ప్రదర్శన	2/18
సగటు	20.50
ఎకానమీ	7.45



రేణుక సింగ్	
టి20 మ్యాచ్‌లు	47
వికెట్లు	50
అత్యుత్తమ ప్రదర్శన	5/15
సగటు	22.02
ఎకానమీ	6.40



అరుంధతి రెడ్డి	
టి20 మ్యాచ్‌లు	29
వికెట్లు	21
అత్యుత్తమ ప్రదర్శన	2/19
సగటు	34.66
ఎకానమీ	7.92



రాధ యాదవ్	
టి20 మ్యాచ్‌లు	80
వికెట్లు	90
ఉత్తమ ప్రదర్శన	4/23
సగటు	19.62
ఎకానమీ	6.55



శ్రేయాంక పాటిల్	
టి20 మ్యాచ్‌లు	12
వికెట్లు	16
ఉత్తమ ప్రదర్శన	3/19
సగటు	18.75
ఎకానమీ	7.14



సజన సజీవన్	
టి20 మ్యాచ్‌లు	9
పరుగులు	30
అత్యధిక స్కోరు	11
సగటు	10.00

సుమిత్ తొలి రౌండ్‌లోనే...

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. ప్రపంచ 40వ ర్యాంకర్ టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 73వ ర్యాంకర్ సుమిత్ 1–6, 3–6, 6–7 (6/8)తో ఓడిపోయాడు. 2 గంటల 20 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ రెండు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. తొలి రౌండ్‌లో ఓడిన సుమిత్‌కు 1,00,000 డాలర్లు (రూ. 83 లక్షల 90 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. యూఎస్ ఓపెన్‌లో ఆడటం ద్వారా సుమిత్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆడాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లో ఓడిపోయిన సుమిత్ ఫ్రెంచ్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లో నిష్క్రమించాడు.



అడిలైడ్ స్ట్రయికర్స్‌తో స్మృతి మంధాన

మహిళల బిగ్‌బాష్ టి20 లీగ్‌లో భారత స్టార్

సిడ్నీ: భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన మహిళల బిగ్ బాష్ టి20 లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో అడిలైడ్ స్ట్రయికర్స్ తరఫున బరిలోకి దిగనుంది. చాన్నాళ్లుగా స్మృతి సేవల కోసం ప్రయత్నిస్తున్న అడిలైడ్ ఫ్రాంచైజీ ఎట్టకేలకు టీమిండియా స్టార్‌ను దక్కించుకుంది. లీగ్‌లో కొత్తగా తీసుకొచ్చిన విదేశీ ప్లేయర్ల నిబంధనల ప్రకారం సీజన్ ఆరంభానికి ముందు గత సీజన్ చాంపియన్ అడిలైడ్ జట్టు స్మృతిని సొంతం చేసుకుంది. స్మృతి డబ్ల్యూబీబీఎల్‌లో ఇప్పటివరకు బ్రిస్బేన్ హీట్, సిడ్నీ థండర్, హోబర్ట్ హరికేన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించింది. అక్టోబర్ 27 నుంచి డబ్ల్యూబీబీఎల్ సీజన్ ప్రారంభం కానుండగా... తొలి దశ పోటీలకు స్మృతి అందుబాటులో ఉండకపోవచ్చు. అదే సమయంలో భారత జట్టు న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ ముగిశాక అడిలైడ్ స్ట్రయికర్స్‌తో స్మృతి చేరనుంది. 'స్మృతి కోసం చాలా రోజులుగా ప్రయత్నిస్తున్నాం. ఎట్టకేలకు ఆమె మా బృందంలో చేరింది. క్షణాల్లో ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌లను లాగేసుకోవడంలో స్మృతిది అందెవేసిన చేయి. మహిళల ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున ఆమెతో కలిసి ఆడటాన్ని ఎంతో ఆస్వాదించా' అని అడిలైడ్ జట్టు కెప్టెన్ తాలియా మెక్‌గ్రాత్ పేర్కొంది.



దులీప్ ట్రోఫీకి సిరాజ్ దూరం

ముంబై: టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ పోటీలకు దూరమయ్యాడు. సిరాజ్‌తో పాటు మరో పేసర్ ఉమ్రాన్ మాలిక్ కూడా అనారోగ్యం కారణంగా దేశవాళీ టోర్నీ మొదటి దశ మ్యాచ్‌ల్లో ఆడటం లేదు. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు విశ్రాంతి కొనసాగించడంతో అతడు కూడా దులీప్ ట్రోఫీకి అందుబాటులో ఉండటం లేదు. ఈ మేరకు జాతీయ సెలెక్షన్ కమిటీ సవరించిన జట్లను మంగళవారం ప్రకటించింది. 'సిరాజ్, ఉమ్రాన్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. దులీప్ ట్రోఫీ ఆరంభ సమయానికి వారు కొలుకునే అవకాశాలు తక్కువే. జడేజా విశ్రాంతిని పొడిగించాం. దీంతో అతడిని భారత్ 'బి' జట్టు నుంచి తప్పించాం' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. సిరాజ్, ఉమ్రాన్ స్థానంలో నవ్‌దీప్ సైనీ, గౌరవ్ యాదవ్‌లను ఎంపిక చేశారు. టి20 ప్రపంచకప్ విజయం అనంతరం పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన జడేజా.. టెస్టు క్రికెట్‌లో కీలకం కానుండటంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)ని దృష్టిలో పెట్టుకొని అతడికి విశ్రాంతిని పొడిగించినట్లు సమాచారం. సెప్టెంబర్ 5–8 వరకు బెంగళూరు వేదికగా భారత్ 'ఎ' జట్టుతో భారత్ 'బి'.. అనంతపురం వేదికగా భారత్ 'సి'తో భారత్ 'డి' జట్లు తలపడనున్నాయి.



గుకేశ్ ఏడో 'డ్రా'

సెయింట్ లూయిస్: సింక్‌ఫీల్డ్ కప్ అంతర్జాతీయ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద వరుసగా ఏడో 'డ్రా' నమోదు చేశారు. టాప్ సీడ్, ప్రపంచ మూడో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 60 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఇయాన్ నిపోమ్‌నిషి (రష్యా)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 19 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్) ఐదు పాయింట్లతో ఒంటరిగా అగ్రస్థానంలో ఉన్నాడు. నాలుగు పాయింట్లతో కరువానా రెండో స్థానంలో నిలిచాడు. 3.5 పాయింట్లతో గుకేశ్, మాక్సిమ్ లాచెర్ (ఫ్రాన్స్), నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్), వెస్లీ సో (అమెరికా), ప్రజ్ఞానంద సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.



అహ్మదాబాద్‌కు రెండో విజయం

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో కొత్త జట్టు అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్ జట్టు రెండో విజయం అందుకుంది. యు ముంబా టీటీ జట్టుతో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అహ్మదాబాద్ జట్టు 9–6 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి మ్యాచ్‌లో మనుశ్ షా (అహ్మదాబాద్) 2–11, 9–11, 11–8తో మానవ్ ఠక్కర్ చేతిలో ఓడిపోయాడు. రెండో మ్యాచ్‌లో రీత్ రిష్యా (అహ్మదాబాద్) 5–11, 11–8, 11–7తో సుతీర్థ ముఖర్జీపై నెగ్గింది. మూడో మ్యాచ్‌లో మనుశ్–బెర్నాడెట్ జాక్స్ ద్వయం 11–4, 11–8, 11–8తో మానవ్–మరియా జియావో జోడీని ఓడించింది. నాలుగో మ్యాచ్‌లో లిలియన్ బార్డెట్ (అహ్మదాబాద్) 5–11, 11–9, 9–11తో ఖాద్రీ అరునా చేతిలో ఓటమి చవిచూశాడు. ఐదో మ్యాచ్‌లో బెర్నాడెట్ జాక్స్ 9–11, 11–4, 11–6తో మరియా జియావోపై గెలిచి అహ్మదాబాద్‌కు విజయాన్ని ఖరారు చేశాడు. ఎనిమిది జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ప్రస్తుతం అహ్మదాబాద్ జట్టు 24 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. నేడు జరిగే మ్యాచ్‌లో గోవా చాలెంజర్స్‌తో దబంగ్ ఢిల్లీ జట్టు తలపడుతుంది.





ప్రమాదంలో అఫ్గాన్ ఉనికి

తాలిబన్లతో చర్చలే పరిష్కారం • హక్కుల కార్యకర్త మెహబూబా

2021 ఆగస్టు 15. భారత్, దక్షిణ కొరియా వంటి పలు దేశాలు స్వాతంత్య్ర సంబరాలు జరుపుకుంటున్న వేళ. అఫ్గానిస్తాన్‌లో మాత్రం ప్రజాస్వామ్యం కుప్పకూలింది. దేశం మరోసారి తాలిబన్ల హస్తగతమైంది. వారి మూడేళ్ల అరాచక పాలనలో అత్యంత భారీ మూల్యం చెల్లించుకున్నది, ఇంకా చెల్లించుకుంటున్నదీ మహిళలే. అడుగడుగునా ఆంక్షల నడుమ సర్వ హక్కులూ కోల్పోయారు. ఇదిలాగే కొనసాగితే దేశ ఉనికికే ప్రమాదమంటున్నారు అఫ్గాన్ హక్కుల కార్యకర్త మహబూబా సిరాజ్. పరిస్థితిని మెరుగు పరిచేందుకు అంతర్జాతీయ సమాజం తాలిబన్లతో చర్చించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే...

మళ్లీ అవే అణచివేతలు...

1996 నుంచి 2001 దాకా తాలిబన్లు తొలిసారి అధికారం చేపట్టినప్పుడు అఫ్గాన్‌లో అత్యంత అరాచకం తాండవించింది. మహిళలపై అత్యంత కఠినమైన ఆంక్షలు! విద్య, ఉపాధి అవకాశాల్లేవు. ఒంటరిగా గడప దాటొద్దు. ముఖం పూర్తిగా కప్పుకోకున్నా కొరడా దెబ్బలు, బహిరంగ ఉరి శిక్షలు! తాలిబన్ల పునరాగమనంతో అఫ్గాన్ మహిళల పరిస్థితి మళ్లీ దయనీయంగా మారింది. ఆంక్షలు ఇంకా పెరిగాయి. ఇస్లాంలో, అల్లా దృష్టిలో స్త్రీ పురుషులిద్దరూ సమానమే. దాన్ని తోసిరాజని మహిళలను ఇలా అణచివేయడం ఏం ధర్మమో అర్థం కాదు!

రాచరిక నేపథ్యం...

75 ఏళ్ల మెహబూబా సిరాజ్ రాజ కుటుంబీకురాలు. 1880 నుంచి 1901 దాకా అఫ్గాన్‌ను పాలించిన అబ్దుర్ రెహ్మాన్ ఖాన్ వంశీకురాలు. హజారా తెగ ఊచకోత రెహ్మాన్ హయాంలో జరిగిందే. నియంతృత్వ పాలనతో కర్కోటకునిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. తనపై తాలిబన్ల కీలుబొమ్మ అన్న ఆరోపణలకు ఆ వారసత్వమే కారణమని వాపోతారామె. ఆమె 26 ఏళ్ల పాటు అమెరికాలో గడిపి 2003లో అఫ్గాన్ తిరిగి వెళ్లారు. దేశంలో మహిళలు, బాలికల హక్కుల కోసం కృషి చేస్తున్నారు. అఫ్గాన్ విమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటివి నిర్వహిస్తున్నారు. గృహ హింసకు గురవుతున్న మహిళలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. గతేడాది నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఇటీవలే ఫిన్లండ్ ఇంటర్నేషనల్ జెండర్ ఈక్వాలిటీ అవార్డు అందుకున్నారు.

చర్చలే పరిష్కారం..

ఈ అరాచకం ఇలాగే కొనసాగితే అఫ్గాన్ ఉనికే ప్రమాదంలో పడుతుంది. తాలిబన్లతో చర్చించాలన్నందుకు నన్ను వారి లాబీయిస్టునంటూ విమర్శిస్తున్నారు. ఎవరితో సమస్యో వాళ్లతో కనీసం మాట్లాడకపోతే పరిష్కారం ఎలా సాధ్యం? మా ముందున్నవి రెండే మార్గాలు. పరస్పరం చంపుకోవడం ఒకటైతే, కూర్చుని చర్చించుకోవడం రెండోది. పోరే శరణ్యమంటే అకారణంగా చచ్చిపోతాం. అందుకే చర్చలంటున్నాను. తాలిబన్లు తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు నేను దేశంలో లేను. ఈసారి ఎందుకుంటున్నానని ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే ఇక్కడి మహిళలకు నా అవసరముంది. మాకిప్పుడు ప్రపంచంలోని ప్రతి మహిళ మద్దతూ అవసరం. అంతర్జాతీయ సమాజం ముందుకొచ్చి మాకు సాయపడాలి.

భవిష్యత్తుపై ఆశ..

శరణార్థులు, వలసదారులు యూరప్‌ను రంగులమయం చేస్తున్నారు. అయినా ముస్లింలంటే పాశ్చాత్య దేశాలకు భయమెందుకో అర్థం కాదు. ఒకనాటి అఫ్గానిస్తాన్ విభిన్న జాతులు, సంప్రదాయాలతో కూడిన అందమైన కళాఖండం. ఆ పాత అఫ్గాన్ తిరిగి రావాలంటే దేశం వీడిన వాళ్లంతా తిరిగి రావాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

70 వేల మంది విద్యార్థులపై బహిష్కరణ కత్తి

కెనడా ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ విధానాల్లో మార్పులు

వర్క్ పర్మిట్ గడువు ముగిసిన విదేశీ విద్యార్థులు బయటికే

గడువు పెంచాలని విద్యార్థుల ఆందోళనలు.. నిరసన ర్యాలీలు

టొరంటో: కెనడాలో వలసలపై పరిమితి విధించడమే లక్ష్యంగా ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ విధానాల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు విదేశీ విద్యార్థులో గుబులు రేపుతున్నాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి 70 వేల మంది విదేశీ విద్యార్థులు కెనడాను వదిలేసి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వారంతా ఆందోళన బాటపట్టారు. తమను బయటకు వెళ్లగొట్టడం సమంజసం కాదంటూ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విదేశీ విద్యార్థులు శిబిరాలు ఏర్పాటు చేసుకొని, నిరసన దీక్షలకు దిగుతున్నారు. ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్, ఒంటారియో, మనిటోబా, బ్రిటిష్ కొలంబియా తదితర ప్రావిన్స్‌ల్లో దీక్షలు, ర్యాలీలు జరుగుతున్నాయి. కెనడాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో సింహభాగం భారతీయులే ఉన్నారు. కొత్త జీవితం నిర్మించుకోవాలని ఎన్నో ఆశలతో కెనడాలో అడుగుపెట్టిన వీరంతా ఇప్పుడు దినదినగండంగా బతుకున్నారు.

స్పందన శూన్యం

స్టడీ పర్మిట్లు, వర్క్ పర్మిట్ల సంఖ్యను భారీగా కుదించాలని, పర్మనెంట్ రెసిడెన్సీ నామినేషన్లను కనీసం 25 శాతం తగ్గించాలని జస్టిన్ ట్రూడో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ విధానాల్లో ఈమేరకు ఇటీవలే మార్పులు చేసింది. 70 వేల మంది విదేశీ విద్యార్థుల వర్క్ పర్మిట్ల గడువు ఈ ఏడాది ఆఖరు నాటికి ముగిసిపోతుంది. వాటిని పొడిగించే అవకాశం కనిపించడం లేదు. దాంతో వారంతా బయటకు వెళ్లక తప్పదు. దాంతో దేశవ్యాప్తంగా విదేశీ విద్యార్థులు ఆందోళన ప్రారంభించారు. వర్క్ పర్మిట్ల గడువు పెంచాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. దీనిపై మాట్లాడడానికి ప్రభుత్వ అధికారులు ఇష్టపడడం లేదు. ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్ శాసనసభ భవనం ఎదుట గత మూడు నెలలుగా ఆందోళనలు, ర్యాలీలు జరుగుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



విదేశీ కార్మికులపైనా పరిమితి

విదేశాల నుంచి విద్యార్థులు భారీగా వచ్చిపడుతుండడంతో కెనడాలో మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పెరుగుతోంది. హౌసింగ్, ఆరోగ్య సంరక్షణతోపాటు ఇతర సేవలు అందరికీ అందడం లేదు. అందుబాటులో ఉన్న వనరులు సరిపోని పరిస్థితి. అందుకే విదేశాల నుంచి వలసల తగ్గింపుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముఖ్యంగా విద్యార్థుల రాకను చట్టబద్ధంగానే అడ్డుకుంటోంది. రాబోయే రెండేళ్లపాటు ఇంటర్నేషనల్ స్టూడెంట్ పర్మిట్ అప్లికేషన్లను పరిమితంగానే జారీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది కేవలం 3.60 లక్షల స్టడీ పర్మిట్లకు అనుమతి ఇవ్వనున్నట్లు అంచనా. గత ఏడాది కంటే ఇది 35 శాతం తక్కువ కావడం గమనార్హం. పోస్టు–గ్రాడ్యుయేట్ వర్క్ పర్మిట్ల కోసం విదేశీ విద్యార్థులెవరూ దరఖాస్తు చేసుకోవద్దని కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ సూచించారు. తక్కువ వేతనాలకు తాత్కాలికంగా పనిచేసుకోవడానికి వచ్చే విదేశీ కార్మికుల సంఖ్యపై పరిమితి విధించబోతున్నట్లు కెనడా ప్రధానమంత్రి కెనడా జస్టిన్ ట్రూడో సోమవారం వెల్లడించారు.

విదేశీ విద్యార్థులపై ఆస్ట్రేలియా పరిమితి

- 2025 నుంచి ఏడాదికి 2.70 లక్షల మందికే అనుమతి

కాన్‌బెర్రా: అంతర్జాతీయ విద్యార్థులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఉన్న ఆస్ట్రేలియా విదేశీ విద్యార్థుల సంఖ్యను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. కోవిడ్–19కు పూర్వస్థితికి వలసలను కట్టడి చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. 2025 నుంచి ప్రతిఏటా 2,70,000 మంది విదేశీ విద్యార్థులను మాత్రమే అనుమతిస్తామని మంగళవారం ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి యూనివర్సిటీకి నిర్దీత కోటాను పెడతామని వెల్లడించింది. దీనివల్ల వృత్తి విద్యాసంస్థలు, శిక్షణ సంస్థలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడనుంది. ఇది ఆర్థిక విధ్వంసమని పలు యూనివర్సిటీలు ప్రభుత్వ నిర్ణయంపై ధ్వజమెత్తాయి. ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆస్ట్రేలియాలో 7,17,500 మంది విదేశీ విద్యార్థులు ఉన్నారు. కోవిడ్ సమయంలో ఉన్నత విద్యారంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొందని ఆస్ట్రేలియా విద్యాశాఖ మంత్రి జాసన్ క్లార్ అంగీకరించారు. కోవిడ్‌కాలంలో ఆస్ట్రేలియా విదేశీ విద్యార్థులందరినీ స్వదేశాలకు పంపించి వేసింది. ప్రస్తుతం కోవిడ్‌పూర్వకాలంతో పోలిస్తే 10 శాతం మంది విదేశీ విద్యార్థులు ఆస్ట్రేలియా వర్సిటీల్లో అధికంగా ఉన్నారని క్లార్ అన్నారు. వృత్తి విద్య, శిక్షణ సంస్థల్లో అయితే విదేశీ విద్యార్థుల సంఖ్య ఏకంగా 50 శాతం అధికంగా ఉందన్నారు. విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చి నాణ్యత లేని విద్యను అందిస్తున్నారని, ఆంగ్ల భాషలో ఏమాత్రం ప్రావీణ్యం లేని విద్యార్థులనూ చేర్చుకుంటున్నారని, ఆస్ట్రేలియాలో పని చేసుకునేందుకు వచ్చినవారికి విద్యార్థుల ముసుగులో ఆశ్రయం కల్పిస్తున్నారని క్లార్ ఆరోపించారు. 2025 నుంచి ప్రభుత్వ యూనివర్సిటీల్లో 1,45,000 మంది విదేశీ విద్యార్థులను మాత్రమే చేర్చుకుంటామని తెలిపారు. అలాగే ప్రైవేటు యూనివర్సిటీల్లో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను 30 వేలకు పరిమితం చేస్తామని, వృత్తివిద్య, శిక్షణ సంస్థల్లో 95 వేల మందికి పరిమితం చేస్తున్నట్లు వివరించారు.



రాజ్‌కోట్‌లో రహదారిపైకి భారీగా చేరిన వరద నీరు

గుజరాత్‌లో కుండపోత వానలు

వివిధ ఘటనల్లో ఏడుగురు మృతి

- నర్మద సహా పొంగి ప్రవహిస్తున్న నదులు
- 15 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

అహ్మదాబాద్: గుజరాత్‌లో వరుసగా మూడో రోజు మంగళవారం కూడా భారీ వర్షాలు కొనసాగాయి. లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధానికి గురికావడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలోని 96 జలాశయాలు నిండుకుండల్లా మారాయి. మరో 19 రిజర్వాయర్లు ప్రమాదస్థాయికి చేరువలో ఉన్నాయి. వడోదర సమీపంలోని విశ్వామిత్రి నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో వడోదరలోని 15 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదల్లో చిక్కుకున్న మరో 300 మందిని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. వడోదర నగరంలోని చాలా ప్రాంతాల్లోకి మోకాలి లోతు వరద చేరుకుంది. సర్దార్ సరోవర్ డ్యామ్ 30 గేట్లలో సోమవారం 23 గేట్లను ఎత్తి వరదను దిగువకు విడుదల చేశారు. దీంతో, భరూచ్‌లోని గోల్డెన్ బ్రిడ్జి వద్ద నర్మదా నది ప్రమాద స్థాయిని దాటి 27 అడుగుల స్థాయిలో ప్రవహిస్తోంది. వర్షాల సంబంధించిన ఘటనల్లో సోమవారం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో వార్షిక సరాసరి వర్షపాతంలో దాదాపు 100 శాతం ఇప్పటికే నమోదైందని వాతావరణ విభాగం తెలిపింది. కచ్, సౌరాష్ట్రతోపాటు దక్షిణ గుజరాత్‌లో వార్షిక సరాసరి వర్షపాతంలో 100 శాతానికి పైగా కురిసిందని వివరించింది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గురువారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం తెలిపింది. రాజ్‌కోట్ నగరంలో నాలుగు గంటల వ్యవధిలో 142 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొంది.

2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

- 10 కోట్ల మందిని చేర్చడమే లక్ష్యం
- ప్రధాని మోదీ సభ్యత్వం రెన్యువల్ ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించనున్న జేపీ నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చేనెల రెండో తేదీ నుంచి బీజేపీ జాతీయస్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుకానుంది. ప్రధాని మోదీ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయడం ద్వారా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలున్న జమ్మూ కశ్మీర్, హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్ మినహా దేశవ్యాప్తంగా 10 కోట్ల మందిని చేర్చుకునేలా పార్టీ ప్రణాళిక రచించింది. సభ్యత్వ నమోదు తొలి దశ సెప్టెంబర్ 25తో ముగుస్తుంది. అక్టోబర్ 1 నుంచి 15 దాకా రెండో దశ కొనసాగుతుందని పార్టీ నేత వినోద్ తావ్డే మీడియాకు వెల్లడించారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో పోటీచేసేందుకు అక్టోబర్ 16 నుండి 31 వరకు ఎన్‌రోల్ చేసుకుంటారు. పార్టీలో ఆరేళ్లుగా కొనసాగుతున్నవారు మళ్లీ తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని మీడియా, సామాజిక మాధ్యమాలకు దగ్గర చేసేందుకు బీజేపీ వినోద్ తావ్డే కన్వీనర్‌గా ఓ జాతీయ కమిటీని నియమించింది. ఇందులో పార్టీ సీనియర్ నేతలు రేఖ వర్మ, దుష్యంత్ గౌతమ్, అతుల్ గార్గ్ దగ్గుబాటి పురందేశ్వరి కో–కన్వీనర్లుగా ఉన్నారు. బీజేపీ కేంద్ర మంత్రులు, బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మొదలు ఎంపీలు, ఎమ్మెల్యేల దాకా ముఖ్యనేతలంతా కలిసి ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కావడానికి కృషిచేయనున్నారు.

చోరీ చేశాడని.. కారం దట్టించారు!

అరారియా(బిహార్): దొంగతనం చేశాడని ఓ వ్యక్తిని తాళ్లతో బంధించి..అతడి మల ద్వారంలోకి మిరప కారం జొప్పించారు. బిహార్‌లోని అరారియాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పోలీసులు నిందితుల్లో ఒకరిని గుర్తించి, అరెస్ట్ చేశారు. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. ఇస్లామియానగర్‌కు చెందిన కొందరు దొంగతనం చేశాడంటూ ఓ వ్యక్తిని తాళ్లతో నిర్బంధించారు. అతడి ప్యాంటు విప్పి, బలవంతంగా ముందుకు వంచారు. ఒక వ్యక్తి అతడి మల ద్వారంలో మిరప కారం పోసి, పెన్సిల్‌తో లోపలికి కూరాడు. అక్కడే ఉన్న కొందరు ఈ వ్యవహారాన్ని వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది పోలీసుల కంటబడింది. దర్యాప్తు చేపట్టి మహ్మద్ సిఫత్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతడే బాధితుడి ప్యాంటు బటన్లను విప్పి, మోకాళ్ల వరకు కిందికి లాగాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, మిగతా వారి కోసం గాలింపు చేపట్టారు. ఘటనపై ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ స్పందించారు. రాష్ట్రంలో తాలిబన్ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు.

ఉగ్ర చీఫ్‌ను వదిలేసిన బంగ్లాదేశ్!

ఢాకా: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది అన్న చందంగా.. బంగ్లాదేశ్‌లో మొదలైన రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం చివరకు హసీనా షేక్ ప్రభుత్వాన్నికుప్పకూల్చి చివరకు భారత్‌లో ఉగ్రముప్పును పెంచింది. అల్‌ఖైదా అంతర్జాతీయ ఉగ్రసంస్థతో సంబంధాలున్న అన్సరుల్లా బంగ్లా టీమ్(ఏబీటీ) ఉగ్రసంస్థ చీఫ్ జషీముద్దీన్ రహ్మానీని పెరోల్ మీద బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సోమవారం వదిలేయడమే ఇందుకు ప్రధాన కారణం. ఏబీటీతో సంబంధాలున్న చాలా మంది ఉగ్రవాదులను భారత దర్యాప్తు సంస్థలు గతంలో అరెస్ట్‌చేయడం తెల్సిందే. భారత ప్రభుత్వం ఇప్పటికే నిషేధించిన 'అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్(ఏక్యూఐఎస్)'సంస్థకు ఏబీటీ అనుబంధ సంస్థగా ఉంది. బంగ్లాదేశ్‌లో హసీనా హయాంలో 2015లో ఏబీటీని నిషేధించారు. తర్వాత ఇది అన్సార్ అల్ ఇస్లామ్ పేరుతో మళ్లీ పుట్టుకురాగా 2017లో దానినీ నిషేధించారు.

రైల్వే బోర్డు చైర్మన్‌గా సతీశ్ కుమార్

న్యూఢిల్లీ: రైల్వే బోర్డు చైర్మన్‌గా సతీశ్ కుమార్ నియమితులయ్యారు. ఈ పదవి చేపడుతున్న తొలి దళితుడు ఆయనే. సెప్టెంబరు ఒకటిన సతీశ్ బాధ్యతలు చేపడతారు. రైల్వే బోర్డు చైర్మన్, సీఈవోగా సతీష్ కుమార్ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదముద్ర వేసిందని కేంద్రం మంగళవారం వెల్లడించింది.

సత్తా చాటుతున్న నవ్‌జ్యోత్

- 77 పేటెంట్లతో చండీగఢ్ వర్సిటీ విద్యార్థి రికార్డు



చండీగఢ్: చండీగఢ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదువుతున్న నవ్‌జ్యోత్ సింగ్ నేటి తరానికి ఆదర్శంగా మారాడు. ఒకవైపు తరగతులు, పరీక్షలకు హాజరవుతూనే మరోవైపు నూతన ఆవిష్కరణల్లో తలమునకలై ఉన్నాడు. ఒకటీ రెండూ కాదు..ఏకంగా 77 అంశాల్లో పేటెంట్లను సొంతం చేసుకున్నాడు. నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లకు సంబంధించిన పలు ఆవిష్కరణలు ఇందులో ఉన్నాయి. లూధియానాకు చెందిన నవ్‌జ్యోత్ సింగ్ తండ్రి ఆర్మీలో అధికారి. ఇతడి ఆవిష్కరణలకు చండీగఢ్ యూనివర్సిటీ పూర్తి స్థాయిలో చేయూత అందిస్తోంది. ప్రతిష్టాత్మక బరోడా అచీవర్ అవార్డు, చండీగఢ్ యూనివర్సిటీ బెస్ట్ రీసెర్చర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నాడు. పలు జాతీయ, అంతర్జాతీయ ఆవిష్కరణల పోటీల్లో తన సత్తా చాటాడు. గ్లోబల్ ఆవిష్కరణల సూచీలో 40వ స్థానంలో ఉన్న భారత్‌ను టాప్ ర్యాంకుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమంటున్నాడు నవ్‌జ్యోత్ సింగ్..!

కాల్ చేస్తే కట్ చేయొచ్చు

ఆఫీసు ముగిశాక యాజమాన్యం ఫోన్‌కాల్స్‌కు చెక్

ఆస్ట్రేలియాలో 'రైట్ టు డిస్‌కనెక్ట్' నిబంధన

సిడ్నీ: ఆఫీసులో పని ముగించుకొని, ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో యాజమాన్యం నుంచి ఫోన్లు, మెసేజ్‌లు వస్తే ఎలా ఉంటుంది? చాలా చిరాకు కలుగుతుంది కదా! ఆస్ట్రేలియాలో ఇలాంటి చిరాకు ఇకపై ఉండదు. ఎందుకంటే 'రైట్ టు డిస్‌కనెక్ట్' నిబంధన అమల్లోకి వచ్చింది. పని వేళలు ముగించుకొని ఇంటికెళ్లిన ఉద్యోగులకు యాజమాన్యాలు అనవసరంగా ఫోన్ చేస్తే జరిమానా విధిస్తారు. యాజమాన్యాలు ఫోన్లు, మెసేజ్‌లు చేస్తే ఉద్యోగులు స్పందించాల్సిన అవసరం లేదు. మాట్లాడకపోతే శిక్షిస్తారేమో, ఉద్యోగం పోతోందేమో అనే భయం కూడా అవసరం లేదు. ఆఫీసు అయిపోయాక యాజమాన్యం ఫోన్ చేస్తే ఫెయిర్ వర్క్ కమిషన్(ఎఫ్‌డబ్ల్యూసీ)కు ఫిర్యాదు చేయొచ్చు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో యాజమాన్యం నుంచి ఫోన్ వస్తే ఉద్యోగులు స్పందించాల్సి ఉంటుంది. సరైన కారణం లేకుండా ఫోన్‌కాల్‌ను తిరస్కరించకూడదు. ఎఫ్‌డబ్ల్యూసీ నిబంధనలు అతిక్రమిస్తే యాజమాన్యాలకు 94 వేల డాలర్లు, ఉద్యోగులకు 19 వేల డాలర్ల జరిమానా విధిస్తారు. ఆఫీసులో పని ముగిశాక తమకు ఫోన్ చేయవచ్చా? లేదా? అనేది నిర్ణయించుకొనే అధికారాన్ని ఉద్యోగికి కట్టబెట్టారు. ఆస్ట్రేలియాలో ఆఫీసు టైమ్ అయిపోయిన తర్వాత కూడా ఉద్యోగులు పని చేయడం మామూలే. ఒక్కో ఉద్యోగి ప్రతిఏటా సగటున 281 గంటలు అధికంగా ఆఫీసులో పని చేస్తున్నట్లు గత ఏడాది ఒక సర్వేలో వెల్లడయ్యింది. ఈ ఓవర్‌టైమ్ పనికి అదనపు వేతనం ఉండదు.



అమెరికాతో అణుఒప్పందం చర్చలకు సిద్ధం

- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ప్రకటన



దుబాయ్: అమెరికాతో అణు ఒప్పందంపై చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ తాజాగా ప్రకటించారు. దీంతో డొనాల్డ్ ట్రంప్ హయాంలో అర్ధంతరంగా నిలిచిపోయిన అణు కార్యక్రమ ఒప్పందంపై మళ్లీ ఆశలు చిగురించాయి. అయితే ఒప్పందం విషయంలో అమెరికాను పూర్తిగా నమ్మడానికి లేదని ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌ను హెచ్చరించారు. ఇరాన్, అమెరికా అణు ఒప్పందంలో ఏళ్ల తరబడి మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ దేశ పాలకుడు ఇరాన్‌లో పర్యటించిన మరుసటి రోజే ఖమేనీ వ్యాఖ్యానించడం గమనార్హం. ఇరాన్ పాలనలో ముఖ్య అంశాలన్నింటినీ తన పరిధిలోనే ఉంచేసుకున్న ఖమేనీ.. అమెరికాతో చర్చల్లో పెజెష్కియాన్ మాట నెగ్గనిస్తారో లేదో వేచిచూడాల్సిందే. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలంటే యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని బాగా తగ్గించుకోవాలని అమెరికాతో పాటు భద్రతామండలి సభ్య దేశాలు, ఐరోపా సమాఖ్య డిమాండ్ చేశాయి. ఈ మేరకు 2015లో ప్రాథమిక ఒప్పందం కుదిరినా 2018లో ట్రంప్ ఏకపక్షంగా ఆ ఒప్పందం నుంచి వైదొలగడం తెల్సిందే. దీంతో అనాటి నుంచి చర్చల్లో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. అణ్వస్త్ర తయారీకి 90 శాతం శుద్ధి చేసిన యురేనియం కావాలి. ఇరాన్ ఇంతవరకు 60 శాతం శుద్ధి సామర్థ్యాన్ని సంతరించుకుంది. అణ్వాయుధ తయారీకి ఉపకరించే యురేనియంను ఉత్పత్తి చేసే దశకు చేరుకునేందుకు ఇరాన్ తన కార్యకలాపాలు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) కంటపడకుండా జాగ్రత్త పడుతోంది. అందుకోసం భూగర్భ అణుకేంద్రాల్లో నిఘా కెమెరాలను తొలగిస్తోందన్న అపవాదు ఉంది. దీనిపై ఐఏఈఏ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేయడం తెల్సిందే.



కన్నా.. ఈ బొమ్మలే మనకు తోడూ నీడ

బిడ్డను చంకనెత్తుకుని బొమ్మల కర్ర భుజానేసుకుని వీధివీధి తిరిగి బొమ్మలమ్ముకుంటూ పొట్టపోసుకునే ఓ తల్లి అలసి సొలసి ఇలా ఆ బొమ్మల నీడనే బిడ్డను ఉంచి తాను విశ్రాంతి తీసుకుంటోంది. తిరుపతి తుడా కార్యాలయం వద్ద ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



అమ్మకు తోడే ఆటవిడుపు

బడి నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చిన్నారులెవరైనా కాసేపు ఆడుకోవాలని చూస్తారు. కానితమ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అమ్మ పడుతున్న కష్టాన్ని గుర్తించిన ఈ చిన్నారులు మాత్రం బుద్ధిగా హోంవర్కులు పూర్తి చేసుకుని అమ్మ నడుపుతున్న పూల కొట్టు వద్దకు వచ్చి అమ్మకు కాసేపు విశ్రాంతి ఇచ్చి పూలు విక్రయిస్తున్నారు. గుంటూరు అమరావతి రోడ్డులో ఈ దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



బతుకు'బొమ్మ'

బతుకుదెరువు కోసం ఉత్తరాది రాష్ట్రాల నుంచి వలస వస్తున్న చిరువ్యాపారులు బొమ్మలు విక్రయిస్తూ పూట గడుపుకొంటున్నారు. ఒంగోలు నగరంలోని కలెక్టరేట్, నెల్లూరు బస్టాండ్, మినీ స్టేడియం, కర్నూలు రోడ్ బైపాస్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కనే విమానాల బొమ్మలను ఆకర్షణీయంగా ఉంచి కొనుగోలుదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు

సీమకు అ'న్యాయం'

కర్నూలుకు మంజూరైన నేషనల్ లా యూనివర్సిటీ అమరావతికి మార్పు

- కర్నూలులో హైకోర్టు కాకుండా బెంచ్ ఏర్పాటు చేస్తామన్న మంత్రి టీజీ భరత్
- జ్యుడీషియల్ సిటీ కోసం కర్నూలులో 273 ఎకరాలు కేటాయించిన జగన్ ప్రభుత్వం
- నేషనల్ లా యూనివర్సిటీకి 100 ఎకరాలు, రూ.వెయ్యి కోట్ల నిధులు
- ఇప్పటికే లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏపీఈఆర్సీ, సీబీఐ కోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు
- వీటన్నింటినీ అమరావతికి తరలించేందుకు సిద్ధమైన ప్రభుత్వం

అనుకున్నంతా అవుతోంది. రాయలసీమకు మరోమారు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు నిర్ణయం అటకెక్కుతోంది. కర్నూలుకు మంజూరైన లా యూనివర్సిటీతోపాటు అక్కడ ఇప్పటికే కొలువుదీరిన వివిధ న్యాయ సంస్థలను అమరావతికి తరలించేందుకు చంద్రబాబు సర్కారు సిద్ధమైంది. సీఎం నిర్ణయాలు, మంత్రుల ప్రకటనలు చూస్తే రాయలసీమకు మరోసారి తీవ్ర అన్యాయం చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టు స్పష్టమవుతోంది.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు



మార్చి 14న లా యూనివర్సిటీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'సీమ'కు న్యాయం చేసిన వైఎస్ జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇచ్చిన మాట మేరకు ఎన్ని అవాంతరాలు ఎదురైనా రాయలసీమకు న్యాయం చేయాలనే సంకల్పంతో లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏపీఈఆర్సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు కర్నూలులో స్థాపించారు. ఇవన్నీ కర్నూలు కేంద్రంగానే ఇప్పుడు పనిచేస్తున్నాయి. హైకోర్టు సైతం కర్నూలులో ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్), రైల్వే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, ఏసీబీ కోర్టు, కో–ఆపరేటివ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్, ఎండోమెంట్ ట్రిబ్యునల్‌తో పాటు 43 అనుబంధ కోర్టులు ఏర్పాటయ్యేవి. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చి ఉంటే న్యాయపరమైన చిక్కులు అధిగమించి హైకోర్టుతో పాటు ట్రిబ్యునల్స్ ఏర్పాటు కూడా జరిగి ఉండేది.

జ్యుడీషియల్ సిటీకి 273 ఎకరాల కేటాయింపు

కర్నూలులో జగన్నాథగట్టుపై జ్యుడీషియల్ సిటీ ఏర్పాటుకు జగన్ ప్రభుత్వం 273 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో నేషనల్ లా యూనివర్సిటీ, జ్యుడీషియల్ అండ్ లీగల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు వంద ఎకరాలు కేటాయించింది. రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేసింది. మంత్రివర్గ ఆమోదం తర్వాత సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో దీనికి శంకుస్థాపన కూడా చేశారు. రాష్ట్రానికి ఒక నేషనల్ లా యూనివర్సిటీకి మాత్రమే కేంద్రం అనుమతిస్తుంది. నిజానికి.. ఇప్పటికే వైజాగ్‌లో లా యూనివర్సిటీ ఉంది. నాటి సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పలుమార్లు కేంద్రంతో సంప్రదించి జిల్లాకు లా యూనివర్సిటీ మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు.

కర్నూలులో యూనివర్సిటీకి మంగళం

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైకోర్టు ఏర్పాటు సాధ్యం కాదని 'సీమ' ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ప్రతినిధులతో సమావేశమయ్యారు. అమరావతిలో నేషనల్ లా యూనివర్సిటీని బీసీఐ ఏర్పాటు చేయనుందని చంద్రబాబు తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఇప్పుడు దీనిపైనే న్యాయవాదుల్లో, రాజకీయ పార్టీల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. కర్నూలుకు మంజూరైన నేషనల్ లా యూనివర్సిటీని అటకెక్కించి, అమరావతిలో ఏర్పాటు చేయనున్నారనే చర్చ నడుస్తోంది. అయితే, అమరావతిలో బీసీఐ ఆధ్వర్యంలో నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటు జరుగుతోందని.. కర్నూలుకు, దీనికి సంబంధం లేదని కొందరు అంటున్నా ప్రభుత్వం మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ అమరావతిలో బీసీఐ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేస్తే కర్నూలులో యూనివర్సిటీ సంగతేంటని 'సీమ' వాసులు ప్రశ్నిస్తున్నారు. ఒకే రాష్ట్రంలో రెండు లా యూనివర్సిటీలు ఎక్కడా లేవు. అలాంటిది మూడు నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటు అసాధ్యమని న్యాయవాదులు అంటున్నారు. దీన్నిబట్టి చూస్తే కర్నూలులో యూనివర్సిటీకి మంగళం పాడినట్టేనని స్పష్టం చేస్తున్నారు.

ఇవి కూడా అమరావతికే!?

మరోవైపు.. ఇటీవలే సొంత భవనంలో కొలువుదీరిన ఏపీఈఆర్‌సీతో పాటు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టులను కూడా కర్నూలు నుంచి అమరావతికి తరలించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రకటించారు. దీన్నిబట్టి చూస్తే కర్నూలులో హైకోర్టు ఏర్పాటుచేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తేలిపోయింది.

అందరి కాంక్ష 'కర్నూలులో హైకోర్టు'

కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు బీజేపీ, జనసేన కూడా గతంలో మద్దతు పలికాయి. మంత్రి టీజీ భరత్ తండ్రి, బీజేపీ నేత, రాయలసీమ హక్కుల వేదిక అధ్యక్షుడు టీజీ వెంకటేశ్ కూడా పలు సందర్భాల్లో కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఏర్పాటు కోరుతూ కర్నూలు న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు వంద రోజులకు పైగా రిలే దీక్షలు, ఆందోళనలు చేపట్టారు. రాయలసీమ జిల్లాల ప్రజలు, ప్రజాప్రతినిధులు 'రాయలసీమ గర్జన' పేరుతో కర్నూలులో పెద్దఎత్తున ఉద్యమించారు. కానీ.. ఇప్పుడు మంత్రి టీజీ భరత్ ప్రకటన, నేషనల్ లా యూనివర్సిటీ తరలింపు, అనుబంధ న్యాయసంస్థలు తరలిస్తారనే ప్రచారం నేపథ్యంలో ఇక్కడి అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు రాజకీయ పార్టీలు నోరు మెదపడం లేదు.

అమరావతికి తరలించడం దుర్మార్గం



అమరావతిలో లా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైందంటే కర్నూలులో ఏర్పాటు చేయడం లేదని స్పష్టమవుతోంది. కర్నూలు యూనివర్సిటీ సంగతేంటో చెప్పాలి. రాష్ట్రానికి రెండో నేషనల్ లా యూనివర్సిటీ ఎక్కడా ఇవ్వరు. వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో అది సాధ్యమైంది. కేబినెట్ దీనికి ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. నిధులు మంజూరు చేశాం. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టు రాయలసీమ హక్కు. ప్రతిసారి ఇలా సీమకు అన్యాయం చేయడం దారుణం. గత ప్రభుత్వం ఏం చేసినా దానిని వ్యతిరేకించడమే ఈ ప్రభుత్వ అజెండానా? 'సీమ'కు అన్యాయం జరిగితే తీవ్రస్థాయిలో ఉద్యమం తప్పదు.

– బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థిక శాఖ మాజీ మంత్రి

హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందే



హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని మంత్రి టీజీ భరత్ చెప్పడం ఆమోద యోగ్యం కాదు. 2017లో హైకోర్టు కోసం ఉద్యమించాం. అప్పుడు చంద్రబాబు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. కుదరదు హైకోర్టు కావాలన్నాం. జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో హైకోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. అయితే, న్యాయపర చిక్కులతో సాధ్యం కాలేదు. ఇప్పుడు హైకోర్టు ఏర్పాటు చేయకపోవడంతో పాటు లోకాయుక్త, హెచ్‌ఆర్సీ, ఏపీఈఆర్‌సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు కూడా అమరావతికి తరలించే యోచనలో ప్రభుత్వం ఉంది. సీమ వాసుల కాంక్ష మనోభావాలను గౌరవించి కర్నూలు హైకోర్టు ఏర్పాటు చేయాలి.

– రామిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యుడు, అనంతపురం

బాధితుల కోసం పనిచేస్తున్నాం.. మీడియా కోసం కాదు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: అన్యాయానికి గురైన మహిళల కోసం తాము పనిచేస్తున్నామే తప్ప మీడియాలో చూపించే కథనాల కోసం కాదని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. కమిషన్ ఆఫీసుకు వస్తే తాము ఏం చేస్తున్నామో, ప్రభుత్వం తమను ఎన్ని ఇబ్బందులు పెడుతుందో తెలుస్తుందని పేర్కొంటూ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మహిళల అనుమతి లేకుండా వారి హక్కులకు భంగం కలిగించేలా కొన్ని మీడియా మాధ్యమాల్లో కథనాలు ప్రసారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోప్యంగా పరిష్కరించాల్సిన వారి సమస్యలను అన్యాయంగా బయటపెడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నాయని, మైనర్ బాలికల మీద అత్యంత అమానుషంగా అత్యాచారం చేసి చంపేసి వారి మృతదేహాలు కూడా దొరకని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ వసతి గృహాల్లో, ప్రభుత్వ ఆఫీసుల్లో మహిళలపై వేధింపులకు దిగుతున్నారని తెలిపారు. వాటన్నింటిపైనా మహిళా కమిషన్ స్పందించి చర్యలు తీసుకుంటుందని, కానీ వాళ్లు తమ వద్దకు రావడంలేదనే అక్కసుతో ఓ వర్గం మీడియా వారి వ్యక్తిగత జీవితాలను బజారుకీడ్చే విధంగా వ్యవహరిస్తోందన్నారు. మహిళల వ్యక్తిగత జీవితాలను బజారుకు ఈడ్చేలా కథనాలు వండి వార్చడం ఇప్పటికైనా ఆపాలని, లేకపోతే మహిళల్లో తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య రామ్మోహనరావు



పటమట (విజయవాడపశ్చిమ): విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. కాకపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సాధించిన విజయాలను తెలియజేసే నమూనాలు, పలు అంశాలతో కూడిన ప్రదర్శనను మంగళవారం ×కాస్మోక్రాయిజ్ పేరుతో నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన రామ్మోహనరావు ప్రదర్శనను ప్రారంభించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పంపిన తొలి ఉపగ్రహం ఆర్యభట్ట నుంచి ఇటీవల పంపిన చంద్రాయన్-3 వరకు అద్భుతమైన విజయాలను సాధించిందన్నారు. విద్యార్థులు అబ్దుల్‌కలామ్‌లా శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, హిందూహైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో అద్భుతమైన విజయాలను అందుకోవడానికి ఈ విధమైన కార్యక్రమాలు అండగా ఉంటాయని వివరించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి అధ్యక్షత వహించారు. ఇస్రో బృంద సభ్యులు ఎం.అనీల్, ఎం. శ్రీనివాసరావు, పీ శ్రీనివాసరావు, ఎస్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తక్కువ ధరకే గ్యాస్

- ఇంటింటికీ మీటర్ల ఏర్పాటు
- ఏజీపీ ప్రథమ్ గ్యాస్ ఎండీ అఖిలేష్ గుప్త

తిరుపతి అర్బన్: త్వరలో తక్కువ ధరకే గ్యాస్ అందిస్తామని ఏజీపీ ప్రథమ్ గ్యాస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అఖిలేష్ గుప్త తెలిపారు. శ్రీసిటీ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తిరుపతిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 90శాతం పైప్‌లైన్ వర్క్స్ పనులు పూర్తిచేశామని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులకు విద్యుత్ సరఫరా తరహాలో వారి ఇంటికి మీటర్లు ఏర్పాటు చేస్తామని.. వాడకాన్ని బట్టి యూనిట్ లెక్కన ధరలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ముందుగా శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలకు, ఉద్యోగుల వాహనాలకు, వారి గృహ అవసరాలకు సహజవాయును అందిస్తున్నామని చెప్పారు. రెండో దశగా రాష్ట్రంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు అందిస్తామని పేర్కొన్నారు. రూ.3500 కోట్లతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని వివరించారు. రీజనల్ హెడ్ గౌతమ్ ఆనంద్ విధివిధానాలను తెలియజేశారు.

జీతాలు ఇవ్వాలని మద్యం షాపుల సిబ్బంది ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలివ్వకపోవడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఏఐటీయూసీ, ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోషియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, సెక్యూరిటీ సిబ్బందిపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. 2 నెలలుగా వీరికి జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది.

రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల్లో పనిచేస్తోన్న 15,000 మంది సిబ్బందికి, వారిపైన ఆధారపడిన కుటుంబాలకు అన్యాయం చేయకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు మంజూరు చేయాలని కోరుతూ డీఆర్వో పుల్లయ్యకు వినతిపత్రమిచ్చారు.

దివ్యాంగ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కోర్టు అధికారుల ఒత్తిడి తట్టుకోలేకే అని వెల్లడి



పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం కోర్టులో అటెండర్‌గా పనిచేస్తున్న సుంకర సత్యనారాయణ అనే దివ్యాంగ ఉద్యోగి (అంధుడు) ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుడైన బాధితుడు పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాను పని చేసే కార్యాలయంలో అధికారుల నుంచి ఒత్తిడి తట్టుకోలేక తాను శుక్రవారం చీమలమందు తాగి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు బాధితుడు తెలిపారు. దీనిపై పిఠాపురం పట్టణ పోలీసులను వివరాలు అడగ్గా... విషయం తెలుసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేశామని ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు. బాధితుడిని 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు మంగళవారం పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

అన్నవరం ప్రసాదానికి ఎఫ్‌ఎస్ఎస్ఏఐ గుర్తింపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదానికి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు కల్పించింది. ఈ మేరకు గుర్తింపు పత్రాన్ని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ చేతుల మీదుగా ఎంపీ కార్యాలయంలో మంగళవారం అవిష్కరించారు. ఈ సర్టిఫికెట్ జారీలో ప్రత్యేక కృషి చేసిన జేఎన్‌టీయూకే ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ రవీంద్ర పాల్గొన్నారు.

ఇల్లు కూల్చేసిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా

నరసరావుపేట: గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కారణంతో చిలకలూరిపేట మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల ఏడుకొండలు ఇల్లు కూల్చి కులం పేరుతో దూషించిన టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాధితులు ధర్నా చేశారు. నిందితులకు వత్తాసు పలుకుతున్న చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణ మాట్లాడుతూ యడవల్లి గ్రామంలో ఎరుకల కులానికి చెందిన ఏడుకొండలు ఇంటిని పొక్లెయిన్‌తో కూల్చి అనంతరం ఇంటి శిథిలాలను ట్రాక్టర్‌లో వేసుకుని ఊరు చివర ఉన్న వాగులో పడేసిన తన్నీరు గోవిందరాజు అతని బంధువులను ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద వెంటనే అరెస్టు చేయాలని కోరారు. నిందితుల ఫిర్యాదు మేరకు బాధిత కుటుంబంపైనే రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ నమోదు చేసిన తప్పుడు కేసు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు, కేఎన్‌పీఎస్ నాయకులు

ఘటనపై బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, నిందితులతో రాజీ చేసుకోవాలని రూరల్ ఎస్ఐ బాధితులను బెదిరించాడని తెలిపారు. బాధితులపై అక్రమ కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేఎన్‌పీఎస్ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్న ప్రసాద్, కొయ్యలమూడి జయమ్మ, బయ్యవరపు సతీష్, నాగిపోగు శ్రీనివాసరావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, ప్రజాకళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, రాణితో పాటు వివిధ గ్రామాల్లోని ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

రేపు కర్నూలులో విద్యుత్ శాఖ రాష్ట్ర స్థాయి సదస్సు

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఈ నెల 29న కర్నూలులో కీలకమైన సదస్సు నిర్వహిస్తోంది. స్టేట్ కో–ఆర్డినేషన్ ఫోరం ఫర్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్ రూపకల్పనకు ఈ సదస్సు ఏర్పాటవుతోంది. సదస్సుకు ఎనర్జీ సెక్రటరీ విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, తిరుపతి, వైజాగ్, విజయవాడ డిస్కమ్‌ల సీఎండీలు, పలువురు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

ఎన్‌ఆర్ఐ కోటాలో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ఎన్‌ఆర్ఐ కోటాలో పలు కోర్సులకు దరఖాస్తులను రెండవ సారి ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు మంగళవారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గానూ బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌ఆర్ఐ కోటాలో ఈ నెల 28 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

యూపీఎస్‌తో ఉద్యోగులకు ఆర్థిక భద్రత

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): కేంద్ర ప్రభుత్వ యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్)తో ఉద్యోగులకు ఆర్థిక భద్రత లభిస్తుందని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. మంగళవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్ 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి అమలులోకి వస్తుంది. ఈ పథకం ద్వారా ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక భద్రత లభిస్తుంది. కార్మిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక నిపుణులతో విస్తృత సంప్రదింపులు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఈ పాలసీని రూపొందించింది. దీని ద్వారా విజయవాడ డివిజన్‌లో 14 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి కలుగుతుంది' అని చెప్పారు.

క్లుప్తంగా...

ఆలయ సిబ్బంది నిజాయితీ

పెళ్లి వారు మరిచిపోయిన బంగారు ఆభరణాలు తిరిగి అందజేత



రాజశేఖర్‌కు బంగారపు వస్తువులను అందజేస్తున్న ఉద్యోగి

ద్వారకాతిరుమల: ఓ పెళ్లి బృందం దేవస్థానం సత్రం గదిలో మరచిపోయిన బంగారు వస్తువులు.. ఆలయ సిబ్బంది నిజాయితీ కారణంగా తిరిగి వారికి దక్కాయి. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం రాళ్లకుంటకు చెందిన రాజశేఖర్ కుమారుడి వివాహం ఈ నెల 23న ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో జరిగింది. పెళ్లివారు కొండపైన ధర్మఅప్పారాయ నిలయం (120 గదులు) సత్రంలో రూములు అద్దెకు తీసుకుని ఉన్నారు. వివాహం అనంతరం ఒక గదిలో వజ్రాలు పొదిగిన బంగారపు నల్లపూసల గొలుసు, బంగారపు ఉంగరం, బంగారపు చెవి దిద్దెలను మరచిపోయి వెళ్లిపోయారు. అక్కడ పనిచేసే సిబ్బంది వాటిని ఆలయాధికారులకు అందించగా, వారు పెళ్లివారికి సమాచారమిచ్చారు. మంగళవారం సత్రం వద్దకు వచ్చిన రాజశేఖర్‌కు అక్కడి గుమస్తా కొప్పిశెట్టి సాయి బంగారపు వస్తువులను అందజేశారు. ఆలయ సిబ్బంది నిజాయితీని పలువురు అభినందించారు.

ఆదివాసీల హక్కులకు భంగం కలిగిస్తే సహించబోం

ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

జలుమూరు: ఆదివాసీల జోలికి వస్తే తాము సహించబోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. ఆదివాసీల హక్కులకు భంగం కలిగించేలా 'హరే రామ హరే కృష్ణ' సంస్థ వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని జలుమూరు మండలం ఎస్టీ మాకివలస గ్రామాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. స్థానిక ఆదివాసీలు తమ సమస్యలను ఆయనకు వివరించారు. 'నాలుగు తరాలుగా మా తాతముత్తాతల నుంచి ఇక్కడే పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఆ భూమిని ప్రైవేటు వ్యక్తులు స్వాధీనం చేసుకోవడానికి చూస్తున్నారు. గ్రామానికి కేటాయించిన శ్మశాన వాటికను కూడా ఆక్రమించారు. చావనైనా చస్తాం.. కానీ గ్రామాన్ని, భూములను వదిలి ఎక్కడికీ వెళ్లే ప్రసక్తే లేదు' అని ఆదివాసీలు చెప్పారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ఎస్టీ కమిషన్‌పై ఉందన్నారు. ఈ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పును సమీక్షించండి

సుప్రీంలో మాజీ ఎంపీ హర్షకుమార్ పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ చేయవచ్చునంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ కాంగ్రెస్ మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పంజాబ్ ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చుతూ న్యాయవాది అరుణ్ గుప్త మంగళవారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆర్టికల్ 341 బీసీ, ఎస్సీలు, ఎస్టీల గురించి చెబుతుందని, బీసీలు వారి వారి వృత్తుల పరంగా కేటగిరీ చేయడంలో ఇబ్బంది ఉండదని, ఎస్సీల్లోనే 40పైగా ఉన్న కులాలు కేటగిరీలు చేయడం కష్టమని పిటిషన్‌లో తెలిపారు. ఆర్టికల్ 341 సవరించకుండా వర్గీకరణను కోర్టులు చేయలేవని పేర్కొన్నారు.

'అల' మహానగరంలో!

మహానగరాలకు ముంపు ముప్పు

- తీర ప్రాంతాల్లో పెరుగుతున్న సముద్ర మట్టాలు
- దేశంలోని 15 నగరాల్లో ప్రమాద ఘంటికలు
- విశాఖ, యానాంలకూ తప్పని ముంపు భయం
- సెంటర్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి

దేశంలోని తీర ప్రాంతాల్లోని 15 నగరాలు ముంపు ముంగిట్లో ఉన్నాయి. సముద్ర మట్టాలు అంతకంతకూ పెరుగుతుండటంతో ఈ నగరాలు సాగర గర్భంలో కలిసిపోతాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని విశాఖ నగరం ఈ 15 నగరాల్లో ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ(సీఎస్‌టీఈపీ) ఇటీవల తీర ప్రాంత నగరాల్లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. చెన్నై, ముంబై, తిరువనంతపురం, కొచ్చి, మంగళూరు, విశాఖపట్నం, కోజికోడ్, హల్దియా, కన్యాకుమారి, పనాజీ, పూరి, ఉడిపి, పారాదీప్, తూత్తుకూడి, యానాం నగరాల్లో కొన్ని దశాబ్దాలుగా సముద్ర మట్టాలు గణనీయంగా పెరుగుతున్నట్లు అధ్యయనంలో తేలింది. రానున్న దశాబ్దాల్లో ఈ పెరుగుదల మరింత వేగంగా ఉండొచ్చని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

దేశంలోని తీర ప్రాంత నగరాలు ముంపు ముంగిట్లో ఉన్నాయి. మరికొన్ని దశాబ్దాల్లో ఈ నగరాలు సాగర గర్భంలో కలిసిపోనున్నాయి. గ్రీన్ హౌస్ ఉద్గారాల కారణంగా సముద్ర నీటిమట్టాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. మున్ముందు ఈ పెరుగుదల మరింత వేగంగా ఉండొచ్చని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే గనక జరిగితే ముంబై, చెన్నై నగరాలతో పాటు మన విశాఖ, యానాం వంటి నగరాలనూ సముద్రం ముంచెత్తుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది.



2100 నాటికి ఇలా ఉండొచ్చు!

ఈ శతాబ్దం చివరి వరకూ సముద్ర మట్టాలు పెరుగుతూనే ఉంటాయని అధ్యయనంలో స్పష్టమైంది. ముంబై మహా నగరంలో అత్యధిక పెరుగుదల ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 2100 నాటికి ముంబైలో 76.2 సెంటీ మీటర్ల మేర సముద్ర మట్టం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పనాజీలో 75.5 సెంటీమీటర్లు, ఉడిపిలో 75.3, మంగళూరులో 75.2, కోజికోడ్‌లో 75.1, కొచ్చిలో 74.9, తిరువనంతపురంలో 74.7 సెంటీమీటర్ల మేర సముద్ర మట్టాలు పెరుగుతాయని లెక్కలు సూచిస్తున్నాయి. సముద్ర మట్టం పెరుగుదలతో ఈ నగరాల్లో 2040, 2060, 2080, 2100 సంవత్సరానికి ముంపునకు గురయ్యే ప్రాంతాలు పెరుగుతాయని తేలింది. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, ఆర్థిక కార్యకలాపాలు వాతావరణ మార్పులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ గ్రీన్‌హౌస్ వాయువులను తీవ్ర స్థాయిలో విడుదల కావడం ఇందుకు ప్రధాన కారణంగా అధ్యయనంలో తేలింది.

10 శాతం ఎక్కువ భూమి మునిగిపోయే నగరాలు

సముద్ర మట్టాలు పెరగడం వల్ల 2040 నాటికి ముంబై, యానాం, తూత్తుకుడిలో 10 శాతం కంటె ఎక్కువ భూమి మునిగిపోవచ్చని ఈ అధ్యయనంలో తేలింది. పనాజీ, చెన్నైలలో 5 నుంచి 10 శాతం భూమి మునిగిపోయే అవకాశం ఉంది. కొచ్చి, మంగళూరు, విశాఖపట్నం, హల్దియా, ఉడిపి, పారాదీప్, పూరిలలో ఒకటి నుంచి 5 శాతం భూమి మునిగిపోవచ్చని అంచనా. 2100 సంవత్సరం నాటికి ఇది ఇంకా పెరిగే పరిస్థితి కనబడుతోంది. ముంబై, చెన్నైలతో పోల్చితే మంగళూరు, హల్దియా, పారాదీప్, తూత్తుకుడి, యానాంలో గ్రీన్ హౌస్ ఉద్గారాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని స్పష్టమైంది. వాతావరణ మార్పుల వల్ల నీరు, వ్యవసాయం, అడవులు, ఆరోగ్యం తదితర రంగాలకు హాని ఏర్పడింది. జీవవైవిధ్యంతో పాటు పర్యాటకానికి కీలకమైన బీచ్‌లు, బ్యాక్ వాటర్స్, మడ అడవులు మరింత ప్రమాదంలో ఉన్నట్లు తేలింది. సముద్ర మట్టాలు పెరగడం వల్ల ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

'నాన్‌వెజ్'

శాకాహారులకు మాంసాహార తరహా రుచులు

- సీ వీడ్‌తో మత్స్య ఉత్పత్తులు..
- సోయాతో చికెన్, ఎగ్, ప్రాన్స్ వంటకాలు
- మష్రూమ్‌తో మటన్ ఉత్పత్తులు
- వీటికి ఫంక్షన్స్‌లో పెరుగుతున్న ఆదరణ
- మలేషియా నుంచి దిగుమతి.. హైదరాబాద్, రాజమండ్రిలో అవుట్‌లెట్స్



సాక్షి, అమరావతి: చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్.. ఇవన్నీ ఇప్పుడు శాకాహారులు ఇష్టపడే వంటకాల జాబితాలో చేరిపోయాయి. ఫంక్షన్లలో విస్తృతంగా వీటి వంటకాలు తయారు చేసేస్తున్నారు. పామరుల నుంచి పండితుల వరకు అందరికీ వీటిని వడ్డించేస్తున్నారు. అతిథులు సైతం లొట్టలేసుకుంటూ 'మాంసహారం' భుజిస్తున్నారు. ఇదెంటా అని ఆశ్చర్యపోతున్నారా.. అయితే మీరు 'శాకాహారుల కోసం మాంసాహార రుచులు' సంగతి తెలుసుకోవాల్సిందే..

మాంసాహారం తిన్నట్టుగానే..



స్వతహాగా మాంసాహార ప్రియుడిని. ఓ ఫంక్షన్‌లో వెజ్ ఉత్పత్తులతో తయారు చేసిన మాంసాహార వంటకాలను చూసి ఆశ్చర్యపోయా. చూడ్డానికి మాంసాహార వంటకాలు మాదిరిగానే ఉన్నాయి. కానీ మాంసాహార వంటకం వాసన రాలేదు. – ఏ.ధనుంజయ్, బీఎం, పంజాబ్ నేషనల్ బ్యాంక్, రాజమహేంద్రవరం

రుచి చూశారు.. తెలుగు వారికి పరిచయం చేశారు

రాజమహేంద్రవరానికి చెందిన ఎం. గాయత్రి ఎమ్మెస్సీ పూర్తి చేసి న్యూట్రీషియన్ కోర్సుల్లో ప్రావీణ్యత సంపాదించింది. సొంతంగా తన కాళ్లపై తాను నిలబడాలన్న సంకల్పంతో భర్త సురేష్‌తో కలిసి శ్రీమీనాక్షి ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించారు. వ్యాపార పరంగా ఓ సారి మలేషియా వెళ్లినప్పుడు ఈ వేగన్ ఫుడ్స్‌ను వీరు రుచిచూశారు. అచ్చం మాంసాహార ఉత్పత్తులను తలపించేలా ఉన్న వీటిని మన ప్రాంత ప్రజలకు పరిచయం చేయాలన్న తలంపుతో సంసార బ్రాండింగ్ పేరుతో మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. మలేషియా నుంచి నేరుగా దిగుమతి చేసుకొని మార్కెటింగ్ చేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో పెళ్లిళ్లు, వివిధ రకాల ఫంక్షన్స్‌లో ఈ ఉత్పత్తులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నెలకు కనీసం 2 నుంచి 3 టన్నుల వరకు మార్కెటింగ్ చేస్తున్నారు. కనీసం ఏడాది పాటు నిల్వ ఉండే ఈ ఉత్పత్తులను రాష్ట్రవ్యాప్తంగా మార్కెటింగ్ చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నారు.

ఇది పూర్తి శాఖాహారమే కానీ..



సముద్ర గర్భంలో లభించే సీ వీడ్‌తో పాటు సోయాబీన్స్, మష్రూమ్స్, బీట్ రూట్, పచ్చి బఠానీ వంటి వెజిటేరియన్స్‌తో వివిధ రకాల మాంసాహార ఉత్పత్తులు సిద్ధం చేస్తున్నారు. సీ వీడ్‌తో వివిధ రకాల చేపలు, సోయాతో చికెన్ బాల్స్, ప్రాన్స్, ఎగ్స్, మష్రూమ్స్‌తో మటన్ తయారు చేస్తున్నారు. బీట్‌రూట్స్‌తో నాన్ వెజ్ రోల్స్, పచ్చి బఠానీతో వివిధ రకాల కట్‌లెట్స్ ఇంకా చెప్పుకుంటే మటన్ కీమా, చికెన్ కీమా, కుజంబూ ఫిష్, స్కాంబ్లెడ్ ఫిష్, మష్రూమ్ బాల్, ప్రాన్స్ తొక్కు, వెజ్ లివర్, వెజ్ నగెట్, వెజ్ యాంకోవిస్, చికెన్ బర్గర్ పాటీ, మటన్ బర్గర్ పాటీ, ఫిష్ బాల్స్, మష్రూమ్ స్లైస్ ఇలా ఎన్నో ఎన్నో ఉత్పత్తులు రెడీ అవుతున్నాయి. వీటితో వివిధ రకాల కర్రీలతోపాటు స్పైసీగా, ఫ్రైడ్‌గా కూడా తయారు చేసుకోవచ్చు. కొవ్వు పదార్థాలు ఏమాత్రం లేని ఈ ఉత్పత్తుల్లో ఫైబర్, ప్రొటీన్స్‌కు కొదవలేదని, పైగా ఇవి టాక్సిక్ ఉత్పత్తులని నిపుణులు పేర్కొంటున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్, ఐవోసీఎల్ మధ్య ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్, ఐవోసీఎల్ ఈడీ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) మధ్య మంగళవారం హైడ్రాలిక్, లూబ్రికెంట్ ఆయిల్, గ్రీజుల సరఫరాపై ఎంవోయూ జరిగింది. స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం సమావేశ మందిరంలో 2024 నుంచి 2029 వరకు ఐదేళ్ల కాలపరిమితితో కూడిన అవగాహన ఒప్పందంపై ఇరు సంస్థల ఉన్నతాధికారులు సంతకాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీ, ఐవోసీఎల్ లూబ్స్ ఈడీ ఆర్.ఉదయ కుమార్ స్టీల్‌ప్లాంట్ సీజీఎం వర్క్స్ యు.శ్రీధర్, జీఎం సోమరాజు, ఐవోసీఎల్ సీజీఎం ఆర్.సుందర నారాయణన్, జీఎంలు ఎస్‌వీఎస్ మూర్తి, జయశంకర్‌ల సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అవసరాలను తీర్చడానికి లూబ్రికెంట్లను అభివృద్ధి చేసిన ఐవోసీఎల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఐవోసీఎల్ ఈడీ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఒప్పందాన్ని మైల్ స్టోన్ డేగా అభివర్ణించారు

కుప్పంను పట్టించుకోకపోవడం దారుణం

సీఎం చంద్రబాబుపై మాజీ ఎంపీ చింతామోహన్ ధ్వజం

కుప్పం: నలభై ఏళ్ల ఎమ్మెల్యేగా, 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు, తన సొంత నియోజకవర్గం కుప్పంను పట్టించుకోకపోవడం దారుణమని తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. చిత్తూరు జిల్లా, కుప్పంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడూ అమరావతి, పోలవరం తప్ప కుప్పంపై దృష్టి సారించరా? అని ప్రశ్నించారు. శ్రీకాకుళంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని కొన్ని రోజులు క్రితం చంద్రబాబు చెప్పారని, అయితే ఆయన సొంత నియోజకవర్గంలో 30 ఏళ్లుగా నిరుద్యోగులు నిత్యం రైలులో బెంగళూరుకు వెళ్లి కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారని, వీళ్ల పరిస్థితి ఆయనకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

12 మంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల తొలగింపు

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని సర్వజన ఆస్పత్రిలో పని చేస్తున్న 12 మంది స్టాఫ్ నర్సులను విధుల నుంచి తొలగిస్తూ వైద్య ఆరోగ్య శాఖ రాజమండ్రి రీజినల్ డైరెక్టర్ పద్మశశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్వజన ఆస్పత్రిలో పని చేసేందుకు 2023 నవంబర్ నుంచి 12 మంది స్టాఫ్ నర్సులను ఆర్‌డీ కాంట్రాక్టు పద్ధతిన ఎంపిక చేశారు. అప్పటి నుంచి వీరు ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారి నియామక సమయంలో కోవిడ్‌లో పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రకటించటంతో వీరంతా కోవిడ్‌లో పలు ఆస్పత్రుల్లో సేవలందించామని నకిలీ అనుభవ ధృవపత్రాలను సృష్టించి దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తుల్లో పొందుపర్చిన నకిలీ అనుభవ ధృవపత్రాల వ్యవహారాన్ని గమనించిన ఆర్డీ వీరందరినీ విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,910 మంది స్వామివారిని దర్శించుకోగా 30,320 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.26 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేద్దాం..

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలో సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌లు పేర్కొన్నారు. కాణిపాకం ఈవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ద్వారకాతిరుమలలో కృష్ణాష్టమి శోభ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్యక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం నేత్రపర్వంగా జరిగాయి. కొండపైన గోసంరక్షణశాలలో, అలాగే ఆలయ తూర్పు ప్రాంతంలోని సప్తగోకులంలో పెద్ద ఎత్తున భక్తులు గోవులకు పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్లు పండుగను వైభవంగా జరుపనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ

సింహాచలం: సింహాచల క్షేత్రంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై వేంచేపుచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు.

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా శ్రీలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు.

ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.70.96 లక్షలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ కానుకల ద్వారా రూ.70,96,186 ఆదాయం లభించినట్లు ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు. జూన్ 10 నుంచి ఈనెల 27 వరకూ మొత్తం 77 రోజులకు గాను ఈ మేరకు ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.



రేపు ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ ట్రెయినీ కెమిస్ట్‌గా శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలో పనిచేసేందుకు పురుషులు, తిరుపతి యంగ్ ఇండియా శాఖలో పనిచేసేందుకు 21–32 ఏళ్ల మధ్య వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు, టీసీఎల్‌లో పనిచేసేందుకు 21–32 వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు కావాలన్నారు. విద్యార్హత 10 నుంచి డిగ్రీ చదివి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గురువారం ఉదయం 10గంటలకు విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్సు కాపీలు, ఆధార్ కార్డు, రెండు ఫోటోలతో హాజరు కావాలన్నారు.

శ్రీ పద్మావతిలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల లో ఎంబిబిఎస్ 2024 –25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు ఆరుగురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ చేతులమీదుగా వీరు అడ్మిషన్ పత్రాలను అందుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ 26వ తేదీ నుంచి ఆల్ ఇండియా కోట అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు.

30న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయాధికారి టి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదేని డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10గంటలకు ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. మూడు ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్ల నందు సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి వకృత్వ పోటీలకు ఎంపిక

ఉప్పలగుప్తం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలానికి చెందిన భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంగ్లిష్ వకృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో శిరంగు శృతి, కుంపట్ల చాతుర్య ప్రథమ స్థానంలో నిలిచారు. వారు వచ్చే నెల సెప్టెంబర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

గొల్లపాలెం పాఠశాలకు మూడోసారి ప్రతిభా పురస్కారం

కాజులూరు: స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రీడా ప్రతిభా పురస్కారానికి కాకినాడ జిల్లా గొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల మరోసారి ఎంపికైనట్టు పీడీ జి.సునీల్‌కుమార్ తెలిపారు. గతేడాది స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయిలో 40 మంది, జాతీయ స్థాయిలో ఇద్దరు క్రీడాకారులు మెరిట్‌లో రాణించినందుకు ఈ పురస్కారం వచ్చిందన్నారు. గత మూడేళ్లుగా తమ పాఠశాల వరుసగా అవార్డు సాధిస్తుందన్నారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: హోమియో ఆసుపత్రిలో యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. యోగాలో పోస్టు గ్రాడ్యుయేషన్ లేదా డిప్లమా చేసి అనుభవం ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 83282 75475 నంబరులో సంప్రదించాలన్నారు.

స్పౌజ్ కేటగిరీకీ కొత్త భాష్యం చెబుతున్న విద్యాశాఖ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియలో విద్యాశాఖ రోజుకో కొత్త నిబంధన పేరుతో ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఏపీఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌స్థాయిలో నిర్వహించనున్న సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహణపై మంగళవారం విద్యాశాఖ డైరెక్టర్ నిర్వహించిన వెబ్ ఎక్స్‌లో భాగంగా స్పౌజ్ కేటగిరీపై కొత్త నిబంధనలు విధించడం తగదన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్‌కు కౌన్సిలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్‌లకు మంగళవారం వైద్య కళాశాల అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు ఎలాట్ చేశారు. వైద్య కళాశాలలో డీఎంఎల్టీ, ఎనస్థీషియా టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియాలజి టెక్నీషియన్, తదితర కోర్సుల్లో చేరేందుకు గత నెల 30న దరఖాస్తులకు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. సుమారు వంద సీట్ల కోసం 600 మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించారు.


ఏయూలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి చర్యలు


విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్శిటీలోని అన్ని విభాగాల్లో బోధన పటిష్టతకు అవసరమైన గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించుకోడానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్స్‌కు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. టీచింగ్ కొరత లేకుండా చూస్తామని, ఎక్కడా కూడా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఆపిన గెస్ట్ ఫ్యాకల్టీలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

వందేళ్లకుపైగా చరిత్ర..
లక్షల తీర్పులు

1919లో మూసీ ఒడ్డున వెలసిన హైకోర్టు

- భారీ గుమ్మటాలతో ఆకట్టుకునేలా నిర్మాణం
- గులాబీ, తెలుపు గ్రానైట్‌లతో భవనం రూపకల్పన
- మూడు ప్రభుత్వాలకు న్యాయాలయంగా సేవలు
- హైకోర్టు తరలింపు నేపథ్యంలో ప్రత్యేక కథనం






హైకోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్

సాక్షి, హైదరాబాద్: మూసీనది ఒడ్డున ఠీవిగా నిల్చున్న అద్భుత కట్టడం.. భారీ గుమ్మటాలతో చూడగానే ఆకట్టుకునేలా నిర్మాణం.. వందేళ్లకు పైగా చరిత్ర. ఎందరో గొప్ప మేధావులు న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా పని చేసిన భవనం. అక్కడి నుంచి సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందిన వారూ అనేకమే. కోట్లాది మందికి న్యాయాన్ని అందించిన సజీవ సాక్ష్యం. గులాబీ, తెలుపు గ్రానైట్‌లతో రూపుదాల్చిన విశాల భవంతి. నాటి నిజాం ప్రభుత్వానికి, ఉమ్మడి ఏపీ సర్కార్‌కు, ప్రత్యేక తెలంగాణ సర్కార్‌కు ఉన్నత న్యాయస్థానంగా నగరం నడిబొడ్డున సేవలందించిన భారీ కట్టడం. ఈ హైకోర్టును బుద్వేల్‌కు తరలించాలని కొందరు.. వద్దు ఇక్కడే కొనసాగించాలని మరికొందరు.. ఈ వాదనల నేపథ్యంలో కొద్దికాలం క్రితం బుద్వేల్‌లో కొత్త హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దాదాపు 105 ఏళ్ల క్రితం పురుడుపోసుకున్న హైకోర్టు భవనంపై ప్రత్యేక కథనం.

హైకోర్టు ఏర్పాటు ఇలా...

ఆంగ్లేయుల పాలనలో రూపొందించిన అనేక నిబంధనలు నిజాం ప్రభుత్వం అధీనంలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఇతర ప్రాంతాల్లో బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విధంగా ఇక్కడ కూడా కోర్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలుత పత్తర్‌ఘట్టీలో హైకోర్టును నెలకొల్పారు. 1908లో వచ్చిన వరదల తర్వాత లాల్‌బాగ్‌లో ఉండే ఆస్మాన్ ఝా నవాబ్ నివాస గృహంలోకి మార్చారు. 1912లో నగరంలో కలరా వ్యాధి రావడంతో పబ్లిక్ గార్డెన్స్ హాల్‌కు, అక్కడి నుంచి సాలార్‌జంగ్ బహదూర్ నివాసానికి తరలించారు. అక్కడ స్థలం సరిపోక ఇబ్బందిపడాల్సి వచ్చింది. దీంతో సైఫాబాద్‌ని సర్తాజ్జంగ్ నవాబ్ ఇంటికి మార్చారు.



హైకోర్టు భవనానికి రూపకల్పన...

1915, ఏప్రిల్ 15న ప్రస్తుత హైకోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. జైపూర్‌కు చెందిన శంకర్‌లాల్ ఆర్కిటెక్ట్‌గా, మెహర్ అలీఫజల్ ఇంజనీర్‌గా వ్యవహరించారు. శంషాబాద్ వద్ద గగన్‌పహాడ్‌లోని కొండలను తొలిచి, ఇండో ఇస్లామిక్ శైలిలో పాతబస్తీలోని మూసీనది ఒడ్డున నిర్మించారు. 1919, మార్చి 31న భవన నిర్మాణం పూర్తయింది. మూసీపై నయాపూల్ వంతెన పక్కన హైకోర్టు భవనం ఠీవిగా కొలువుదీరింది. నిజాం కాలం నాటి 18,22,750 సిక్కాల వ్యయంతో 9 ఎకరాల్లో నిర్మించిన ఈ భవనాన్ని 1920, ఏప్రిల్ 20న ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1956, నవంబర్ 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా మార్చారు. ఆ తర్వాత పలు అవసరాల నిమిత్తం కొత్త భవనాలు నిర్మిస్తూ వచ్చారు. హైస్ మహల్, నది మహల్, కుతుబ్ షాహీ నిర్మాణాల శిథిలాలపై ఈ చారిత్రక, వారసత్వ హైకోర్టు భవనాన్ని నిర్మించారు.

ప్రత్యేక రాష్ట్రం తర్వాత...

2014, జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా.. ఒకే భవనంలో ఏపీ, తెలంగాణ హైకోర్టులు కొనసాగుతూ వచ్చాయి. 2018, డిసెంబర్ 26న రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయడంతో 2019, జనవరి 1న ఏపీ హైకోర్టు అమరావతికి తరలివెళ్లిపోయింది. తర్వాత ఈ భవనం పూర్తిగా తెలంగాణ హైకోర్టుకు కేటాయించారు.

ముఖ్యాంశాలు...


- నిజాం కాలంలో మొదటి ప్రధాన న్యాయమూర్తి: నిజామత్ జంగ్
- స్వాతంత్ర్యానికి పూర్వం జడ్జీల నియామకం చేసింది: నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్
- 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత హైకోర్టుకు తొలి సీజే: జస్టిస్ కోకా సుబ్బారావు
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర హైకోర్టు తొలి సీజే: జస్టిస్ కల్యాణ్ జ్యోతి సేన్‌గుప్తా
- పూర్తిస్థాయిలో తెలంగాణ హైకోర్టు రూపకల్పన (ఏపీ హైకోర్టు తరలిన) తర్వాత తొలి సీజే: జస్టిస్ టీబీ రాధాకృష్ణన్
- 2019లో నిర్మాణం వందేళ్లు పూర్తి చేసుకుంది
- 1948 నుంచి 1950 వరకు ఇక్కడ సుప్రీంకోర్టు బెంచ్ కూడా పనిచేసింది. ఉర్దూ అధికారిక భాష కావడంతో ఇక్కడ ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు.
- ప్రధాన భవనంలో 32 కోర్టు హాళ్లు, 38 చాంబర్లు ఉంటాయి.

జడ్జీల సంఖ్య పెరిగిందిలా...

ప్రస్తుత హైకోర్టు భవనం ప్రారంభించే నాటికి ఉన్న న్యాయమూర్తులు	6
1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత హైకోర్టు న్యాయమూర్తులు	12
1970లో న్యాయమూర్తుల సంఖ్య	32
1987లో న్యాయమూర్తుల సంఖ్య	36
2014లో న్యాయమూర్తుల సంఖ్య	61
విభజన సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య	24
2021లో న్యాయమూర్తుల సంఖ్య	42



నాటి హైకోర్టు



	శాశ్వత న్యాయమూర్తులు	అదనపు న్యాయమూర్తులు
ఉండాల్సింది	32	10
ప్రస్తుతం ఉన్నది	24	3

3 ప్రాంతాల్లో గంజాయి పట్టివేత...

కొత్తగూడెం, భద్రాచలంలో 49.11 కేజీలు, ధూల్‌పేటలో 1.215 కేజీలు స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: భద్రాచలం, కొత్తగూడెం, హైదరాబాద్ జిల్లాల్లో నిర్వహించిన తనిఖీల్లో 50 కిలోలకుపైగా గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ధూల్‌పేటలోని మాచిపురాలో దినేశ్‌సింగ్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు సోదాలు నిర్వహించగా అతని వద్ద 1.215 కేజీల గంజాయి పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ కేసులో శోభన్‌రావు, సోహెల్ అనే వ్యక్తులూ నిందితులుగా ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. ఈ దాడిలో సీఐ గోపాల్, ఎస్సై విష్ణు గౌడ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. భద్రాచలం ఆర్డీవో కార్యాలయం సమీపంలో షేక్ యూసుఫ్ అనే వ్యక్తి 4.11 కేజీల గంజాయిని బైక్‌పై తీసుకు వెళుతున్నారనే విషయం తెలుసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బైక్‌ను వెంబడించి పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో కొత్తగూడెంలో గంజాయిని కారులో తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 45 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. షేక్ యూసుఫ్, సదా వెంకట దుర్గారావు, శ్రీహరిలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ గణేశ్ తెలిపారు. ఈ గంజాయి సీలేరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తూ ఉండగా ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. గంజాయి పట్టుకున్న వారిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేశ్, భారీ బాలు, సుధీర్, వెంకట్, హరీశ్, హనుమంతరావు, విజయ్ ఉపేందర్ పాల్గొన్నారు. సిబ్బందిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేశ్ అభినందించారు.

ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్లకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి.సుదర్శన్ రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు సీఈవో లోకేశ్ కుమార్, డిప్యూటీ సీఈవో సత్యవాణి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి పథకం పనులు నత్తనడక: కేటీఆర్

- ఎస్‌ఆర్‌డీపీ పనులపై ప్రభుత్వ పర్యవేక్షణ కరువైంది

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా గత ప్రభుత్వం చేపట్టిన స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఆర్‌డీపీ) పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కోరారు. ఎస్ఆర్‌డీపీ కింద హైదరాబాద్‌లో 42 ప్రాజెక్టులను చేపట్టి 36 ప్రాజెక్టులను పూర్తి చేసిందని తెలిపారు. మిగతా పనులను ఈ ఏడాదిలో పూర్తి చేయాల్సి ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌డీపీ కింద చేపట్టిన పనులపై ఎనిమిది నెలలుగా పర్యవేక్షణ లేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించడం లేదని మండిపడ్డారు. పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు ఇప్పటికే ఆమోదించిన మూడో దశ ఎస్ఆర్‌డీపీ పనులను ప్రారంభించాలన్నారు. గత ప్రభుత్వంలో ఆమోదించిన మూసీకి ఇరువైపులా ఎక్స్‌ప్రెస్ హైవే, కేబీఆర్ పార్కు కింద టన్నెళ్లు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ వంటి పనులు ఉన్నాయని చెప్పా. హైదరాబాద్ ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నగరాభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం వద్దని విజ్ఞప్తి చేశారు.

మంకీపాక్స్‌పై సర్కారు అలర్ట్

- అనుమానిత కేసులుంటే వివరాలివ్వాలని ఆదేశం
- వ్యాధి సోకిన వ్యక్తిని ఐసోలేషన్‌లో ఉంచాలని స్పష్టీకరణ
- ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసిన గాంధీ, ఫీవర్ ఆసుపత్రులు
- మరోవైపు రాష్ట్రాన్ని వణికిస్తున్న డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు
- ఈ ఏడాది ఇప్పటివరకు 5,372 డెంగీ కేసులు నమోదు



సాక్షి, హైదరాబాద్: మంకీపాక్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకాన్ని అప్రమత్తం చేసింది. ఈ మేరకు రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ సోమవారం మార్గదర్శకాలు జారీచేసింది. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వెన్నునొప్పి, చలి, అలసట, చర్మంపై పాపుల్స్‌గా మారే మాక్యులోపాపులర్ దద్దుర్లు వంటివి ఉంటే అనుమానిత కేసులుగా పరిగణిస్తారు. మంకీపాక్స్ సాధారణంగా రెండు నుండి నాలుగు వారాల వరకు ఉండే వ్యాధి. పిల్లలలో ఎక్కువగా సంభవిస్తాయి. మంకీపాక్స్ కేసు మరణాలు పిల్లల్లో ఎక్కువగా ఉంటాయి. గత 21 రోజులలో మంకీపాక్స్ ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ఏ వ్యక్తి అయినా తీవ్రమైన దద్దుర్లతో బాధపడుతుంటే అనుమానించాలని పేర్కొంది. వారితో కలిసివున్న వారిని కూడా గుర్తించాలి. మంకీ పాక్స్ అనేది మశూచి రోగుల్లో కనిపించే లక్షణాలతో ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మంకీపాక్స్ వ్యాప్తిని అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. తద్వారా మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి అవగాహన, వేగంగా కేసులను గుర్తించడం, ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలు అవసరమని పేర్కొంది. ఆ మేరకు రాష్ట్రంలో చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

అనుమానిత కేసులు గుర్తిస్తే గాంధీకి పంపాలి

మంకీ పాక్స్ సోకిన రోగులను ఐసోలేషన్‌లో ఉంచాలి. మెడికల్ కాలేజీలు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంకీ పాక్స్‌కు సంబంధించిన రోగుల కోసం ఐసోలేషన్ బెడ్‌లను కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటికే గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను కేటాయించిన సంగతి తెలిసిందే. అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు జిల్లా వైద్యాధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశాలిచ్చారు. అనుమానిత కేసులు ఉన్నట్లు గుర్తిస్తే చికిత్స కోసం గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి పంపాలి. అలాగే హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ద్వారా వచ్చే అంతర్జాతీయ అనుమానిత ప్రయాణీకులుంటే వారిని రంగారెడ్డి డీఎంహెచ్‌వోతో సమన్వయం చేసుకొని గాంధీ ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. కాగా 1970లో డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మంకీపాక్స్ మొదటి మానవ కేసు నమోదైంది.

వణికిస్తున్న డెంగీ

రాష్ట్రంలో డెంగీ విస్తరిస్తోంది. గతేడాది కంటే ఇప్పుడు అధికంగా సీజనల్ వ్యాధులు సంభవిస్తున్నాయని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు రాష్ట్రంలో 1.42 కోట్ల ఇళ్లను వైద్య బృందాలు సందర్శించాయి. 4.40 కోట్ల మందిని స్క్రీనింగ్ చేశారని ఆయన తెలిపారు. అందులో 2.65 లక్షల మంది జ్వరం బారిన పడినట్లు రవీంద్ర నాయక్ వెల్లడించారు. వర్షాల కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దోమల సంతానోత్పత్తి పెరిగి డెంగీ విజృంభిస్తుందని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు మొత్తం 81,932 మంది రక్త నమూనాలను పరీక్షించగా, అందులో 5,372 మందికి డెంగీ సోకినట్లు వెల్లడించారు. పాజిటివిటీ 6.5 శాతంగా ఉందని వెల్లడించారు. డెంగీ హైరిస్క్ జిల్లాల్లో హైదరాబాద్ 1,872 కేసులతో మొదటిస్థానంలో ఉంది. సూర్యాపేట 471, మేడ్చల్ మల్కాజిగిరి 426, ఖమ్మం 375, నల్లగొండ 315, నిజామాబాద్ 286, రంగారెడ్డి 232, జగిత్యాల 185, సంగారెడ్డి 160, వరంగల్ జిల్లాల్లో 110 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ పది జిల్లాలను రాష్ట్రంలో హైరిస్క్ జిల్లాలుగా ప్రకటించారు.

చికున్‌గున్యా కేసుల్లోనూ హైదరాబాద్ టాప్

మరోవైపు చికున్‌గున్యా కేసులు కూడా నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 2,673 మంది రక్తనమూనాలను పరీక్షించగా, 152 మందికి చికున్‌గున్యా ఉన్నట్లు గుర్తించారు. పాజిటివిటీ రేటు 5 శాతంగా ఉండటం గమనార్హం. చికున్‌గున్యా హైరిస్క్ జిల్లాలుగా హైదరాబాద్ 61 కేసులతో మొదటిస్థానంలో ఉంది. వనపర్తి 17, మహబూబ్‌నగర్ జిల్లాలో 19 నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా కోసం 23.19 లక్షల మంది నుంచి రక్తనమూనాలను సేకరించి పరీక్షించగా, అందులో 191 మలేరియా కేసులు నమోదయ్యాయి. పాజిటివిటీ రేటు 0.008 శాతంగా నమోదైంది. రాష్ట్రంలో టీ-హబ్ ల్యాబ్స్ పనిచేస్తున్నాయి. వాటిల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. 53 బ్లడ్‌బ్యాంకులు అవసరమైన బ్లడ్ యూనిట్లతో సిద్ధంగా ఉన్నాయని డీహెచ్ రవీంద్రనాయక్ తెలిపారు. మొత్తం 33 జిల్లాల్లో 108 అంబులెన్సులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. అవసరమైన మందులన్నీ ఆసుపత్రుల్లో ఉన్నాయన్నారు.

కట్టడిలో వైఫల్యం...

సీజనల్ వ్యాధులను కట్టడి చేయడంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలం కావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వైద్య నిపుణులు చెప్తున్నారు. దోమల నియంత్రణకు ఇతర శాఖలను సమన్వయం చేయటంలో వైఫల్యం చెందిందని విమర్శిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో దోమలు పెరిగాయని చెప్తున్నారు. వానాకాలం మొదలయ్యే సమయానికి ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలి. కానీ అవేవీ చేయలేదు. పైగా కీలకమైన సమయంలో బదిలీలు జరగడం, అవి కూడా సక్రమంగా నిర్వహించకపోవడంతో వైద్య సిబ్బంది ఆందోళనలు చేయాల్సి రావడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై దృష్టిసారించలేకపోయారు. మరోవైపు పారిశుధ్యం లోపించిందని అంటున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయలేదని, నివారణ చర్యల పట్ల ప్రచారం చేయలేదని మండిపడుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో మందుల కొరత నెలకొందనీ, సాధారణంగా సీజనల్ వ్యాధులకు ముందే అన్ని ఆసుపత్రుల్లో బఫర్ స్టాక్ ఉంచుకోవాలని సూచిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ కూడా పూర్తిస్థాయిలో జరగడంలేదనీ, నిల్వ నీటిల్లో స్ప్రేయింగ్ చేయడంలేదని వైద్యనిపుణులు ఆరోపిస్తున్నారు.

లోతైన విశ్లేషణ.. విజయానికి మార్గం

భారత దేశ చరిత్ర

ప్రస్తుత పోటీ పరీక్షలకు సంబంధించి జయాపజయాల్లో జనరల్ స్టడీస్ కీలకపాత్ర పోషిస్తోంది. జనరల్ స్టడీస్ (జీఎస్)లోని ప్రధాన అంశాల్లో చరిత్ర ఒకటి. గ్రూప్–1 ప్రిలిమ్స్, గ్రూప్–2 తదితర పరీక్షల్లో హిస్టరీ నుంచి 25 – 30 ప్రశ్నలు తప్పనిసరిగా వస్తున్నాయి. జనరల్ స్టడీస్‌లోని మిగిలిన సబ్జెక్టులతో పోలిస్తే హిస్టరీ పరిధి విశాలమైంది.

ప్రిపరేషన్ ప్లాన్

ప్రధాన నియామక పరీక్షల సిలబస్‌లలో చరిత్రకు సంబంధించి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రత్యేక దృష్టితో చదవాలని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారతదేశ చరిత్ర మూడింటికీ సమాన ప్రాధాన్యమిస్తూ ప్రిపరేషన్ కొనసాగించాలి. మిగిలిన విభాగాలతో పోలిస్తే ఆధునిక భారతదేశ చరిత్ర నుంచి రెండు లేదా మూడు ప్రశ్నలు అధికంగా వస్తున్నాయి.

సన్నద్ధతలో భాగంగా గత ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలి. ముఖ్యంగా ఇటీవల నిర్వహించిన వివిధ పరీక్షల్లోని ప్రశ్నల సరళిని తెలుసుకోవాలి. ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో గుర్తించడం ద్వారా కీలక అంశాలకు అధిక సమయం కేటాయించి తగినట్లుగా పునశ్చరణ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. దీంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

ప్రశ్నల సరళి: చరిత్రలో సాధారణంగా రెండు రకాలుగా ప్రశ్నలు అడుగుతున్నారు.

ఎ. నేరుగా అడిగే ప్రశ్నలు: వీటినే ఏక పద సమాధాన ప్రశ్నలు లేదా ఫ్యాక్ట్ బేస్డ్ ప్రశ్న లుగా పేర్కొనవచ్చు.

ఉదా (1): మొదటిసారిగా 'గోత్రా' అనే పదాన్ని ఏ వేదంలో ప్రస్తావించారు?
1) సామవేదం 2) రుగ్వేదం
3) అధర్వణ వేదం 4) యజుర్వేదం
సమాధానం: 2

ఉదా (2): నలంద విశ్వ విద్యాలయ స్థాపకుడుఎవరు?
1) నలందుడు 2) అశోకుడు
3) హర్షవర్ధనుడు 4) కుమార గుప్తుడు
సమాధానం: 4

ఇలాంటి ప్రశ్నలకు సమాధానం గుర్తించాలంటే విషయ పరిజ్ఞానం ఉంటే సరిపోతుంది.

బి. ఇన్ డైరెక్ట్‌గా అడిగే ప్రశ్నలు: వీటిని కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు అంటారు.

ఉదా (1): కిందివాటిలో బుద్ధుడి బోధనలు ప్ర ధానంగా దేనికి సంబంధించినవి?
1) భగవంతుడిపై విశ్వాసం
2) క్రతువులు నిర్వహించడం
3) ఆలోచన, ప్రవర్తనల్లో శుద్ధత
4) విగ్రహారాధన
సమాధానం: 3

ఉదా (2): దాదాబాయి నౌరోజీకి సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
ఎ. భారతదేశంలో బ్రిటిషర్ల ఆర్థిక దోపిడీని బట్టబయలు చేయడం
బి. భారత ప్రాచీన గ్రంథాల ఆధారంగా భారతీయుల్లో ఆత్మ విశ్వాసాన్ని పునరుద్ధరించడం
సి. సాంఘిక దురాచారాలు రూపుమాపడానికి కృషి చేయడం
డి. పార్శీ మత అభివృద్ధికి కృషి చేయడం
1) ఎ మాత్రమే 2) ఎ, బి
3) ఎ, బి, సి 4) డి మాత్రమే
సమాధానం: 3

ఉదా (3): జూన్ 3, 1947 మౌంట్ బాటన్ ప్రణాళికలో లేని అంశం?
1) సమాఖ్య ప్రభుత్వ నిర్మాణం
2) రాజ్యాంగ నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలు
3) బ్రిటిషర్ల నుంచి భారతీయులకు అధికార మార్పిడి
4) దేశంలో జరుగుతున్న మత ఘర్షణలను నిరోధించడం
సమాధానం: 4

ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలంటే సబ్జెక్ట్ పట్ల పూర్తి అవగాహన ఉండాలి. బిట్స్ రూపంలో ఉండే మెటీరియల్‌ను కాకుండా విషయంపై పూర్తి అవగాహనను కలిగించే, లోతైన అధ్యయనానికి ఆస్కారముండే ప్రామాణిక పాఠ్య పుస్తకాలను చదవాలి. ఒక అంశాన్ని చదివేటప్పుడే దాన్నుంచి ఏయే కోణాల్లో ప్రశ్నలు వచ్చే అవకాశముందో అంచనా వేసుకుంటూ చదవడం ద్వారా మంచి ఫలితం ఉంటుంది.

సుమారు అయిదు వేల ఏళ్ల చరిత్ర... అనేక పోరాటాలు... ఎన్నో ముఖ్యమైన సంఘటనలు... సమాజంపై ప్రభావం చూపిన వ్యక్తులు తదితర అంశాలతో కూడిన చరిత్రను అధ్యయనం చేస్తూ ఉంటే ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది. అభ్యర్థులకు హిస్టరీ పట్ల మక్కువ పెరగడానికి ప్రధాన కారణమిదే. విశాల పరిధి ఉన్నప్పటికీ చదివేటప్పుడు ఎంతో కుతూహలాన్ని కలిగిస్తూ సులభంగా అర్థమయ్యే స్వభావం హిస్టరీకి ఉంది. దీంతో నాన్ ఆర్ట్స్ అభ్యర్థులు కూడా చరిత్రపై సులువుగా పట్టు సాధించగలుగుతున్నారు. తద్వారా మంచి మార్కులు సాధిస్తున్నారు.

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

భారతదేశ చరిత్రను మూడు భాగాలుగా విభజించారు. అవి: ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారతదేశ చరిత్ర. ఈ మూడు విభాగాల్లోనూ తప్పనిసరిగా, తరచుగా ప్రశ్నలు వచ్చే పాఠ్యభాగాల గురించి తెలుసుకుందాం...

ప్రాచీన భారతదేశ చరిత్ర

ప్రాచీన భారతదేశ చరిత్రలో సింధూ, వేద నాగరికత, జైన, బౌద్ధ మతాలు, మౌర్యులు, గుప్తులపై ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి. మిగిలిన పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు అరుదుగానే వస్తున్నాయి. కాబట్టి ప్రాచీన భారతదేశ చరిత్రపై అవగాహన కోసం శిలాయుగాల నుంచి గుప్తుల అనంతర యుగం వరకు చదివినప్పటికీ పైన పేర్కొన్న అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలి. గతంలో ఈ విభాగం నుంచి వచ్చిన కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం..

1. సింధూలోయ నాగరికతను మొదటగా కనుగొన్న పురావస్తు శాస్త్రవేత్త?
1) చార్లెస్ మాసన్ 2) జాన్ మార్షల్
3) అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్
4) మార్టిమర్ వీలర్
సమాధానం: 1

2. డబ్బును రుణంగా ఇవ్వడమనే భావనను తొలిసారిగా ప్రస్తావించిన గ్రంథం ఏది?
1) అధర్వణ వేదం 2) యజుర్వేదం
3) గోపథ బ్రాహ్మణం 4) శతపథ బ్రాహ్మణం
సమాధానం: 4

3. అలెగ్జాండర్ భారతదేశంపై దండయాత్ర చేసిన సంవత్సరం?
1) క్రీ.పూ. 327 2) క్రీ.పూ. 303
3) క్రీ.పూ. 302 4) క్రీ.పూ. 298
సమాధానం: 1

4. కవిరాజుగా పేరుగాంచిన వారెవరు?
1) మొదటి కుమార గుప్తుడు
2) మొదటి చంద్రగుప్తుడు
3) చంద్రగుప్త విక్రమాదిత్య
4) సముద్ర గుప్తుడు
సమాధానం: 4

5. హర్షుని కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న దురాచారం?
1) పరదా పద్ధతి 2) బాల్య వివాహాలు
3) కులాంతర వివాహాలపై నిషేధం
4) సతీ సహగమనం
సమాధానం: 2



మధ్యయుగ భారత చరిత్ర

హర్షుడి అనంతర కాలం నుంచి మొగలులు, శివాజీ వరకు ఉన్న మధ్యయుగ భారత చరిత్రలో ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అంశాలు.. తొలిమధ్య యుగం, ఢిల్లీ సుల్తానత్, భక్తి ఉద్యమాలు, విజయనగర సామ్రాజ్యం మొదలైనవి. మిగిలిన అంశాలపై ప్రశ్నలు అరుదుగా ఉంటాయి.

1. చోళుల పాలనలోని విభాగమైన పెద్ద గ్రామాన్ని ఏమని పిలిచేవారు?
1) కుర్రమ్ 2) కొట్టమ్
3) నాడు 4) తణియార్
సమాధానం: 2

2. చాళుక్యుల చిత్రకళ లభిస్తున్న ప్రాంతం?
1) అజంతా 2) ఐహోల్
3) ఎల్లోరా 4) హంపి
సమాధానం: 2

3. గజనీ మహమ్మద్‌తోపాటు వచ్చిన ముస్లిం పండితుడు?
1) ఇబన్ బతూతా 2) ఆల్బెరూనీ
3) అమీర్ ఖుస్రో 4) ఫెరిష్టా
సమాధానం: 2

4. ఇక్తాదారీ వ్యవస్థను ప్రారంభించిన సుల్తాన్ ఎవరు?
1) బాల్బన్ 2) ఐబక్
3) ఇల్‌టుట్ మిష్ 4) అల్లావుద్దీన్ ఖిల్జీ
సమాధానం: 3

5. హిందూస్థానీ సంగీతాన్ని అధికంగా ప్రభావితం చేసింది?
1) అరబ్ – పర్షియన్ సంగీతం
2) పర్షియన్ సంగీతం
3) యూరోపియన్ సంగీతం
4) మధ్యాసియా సంప్రదాయాలు
సమాధానం: 2

6. రామానుజుడు బోధించినది?
1) అహింస 2) భక్తి 3) జ్ఞానం 4) వేదాలు
సమాధానం: 2

7. వివాహ పన్నును ఉపసంహరించుకున్న విజయనగర రాజు?
1) శ్రీకృష్ణ దేవరాయలు
2) రెండో దేవరాయలు
3) అచ్యుత రాయలు 4) సదాశివ రాయలు
సమాధానం: 1

ఆధునిక భారత చరిత్ర

ఈ విభాగంలో స్వాతంత్రోద్యమానికి అధిక ప్రాధాన్యమిస్తూ చదవాలి. అధిక ప్రశ్నలు వచ్చే అవకాశమున్న విభాగం కూడా ఇదే. రాజకీయాధికార సాధన, పరిపాలన, బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు, సామాజిక, మత సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమం మొదలైనవాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ విభాగం నుంచి అధికంగా అభ్యర్థుల అవగాహనను పరిశీలించేవిధంగా ప్రశ్నల కూర్పు ఉంటుంది. కింది ప్రశ్నలు గమనించండి..

1. గాంధీజీ ఎరవాడ జైలులో 1932లో దేనికి వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేశారు?
1) రామ్‌సే మెక్డోనాల్డ్ కమ్యూనల్ అవార్డు
2) సత్యాగ్రాహిలపై బ్రిటిషర్ల అణచివేత
3) గాంధీ – ఇర్విన్ ఒప్పంద ఉల్లంఘన
4) కలకత్తాలోని మతకలహాలు
సమాధానం: 1

2. హంటర్ కమిషన్‌ను దేనిపై విచారణకు నియమించారు?
1) జలియన్ వాలాబాగ్ దుర్ఘటన
2) ఖిలాఫత్ ఆందోళన
3) బార్డోలీ సత్యాగ్రహం
4) చౌరీ–చౌరా సంఘటన
సమాధానం: 1

3. బంకించంద్ర 'ఆనంద్‌మఠ్' రచించిన సంవత్సరం?
1) 1895 2) 1892 3) 1885 4) 1882
సమాధానం: 4

4. 1873లో 'సత్యశోధక్ సమాజ్'ను స్థాపించిందెవరు?
1) లోకహిత వాది 2) ఆర్.జి. భండార్కర్
3) జ్యోతిబా పూలే 4) రామానంద తీర్థ
సమాధానం: 3

5. భారత్‌లో మిలిటెంట్ జాతీయవాదానికి ఎవరిని ఆద్యుడిగా భావిస్తారు?
1) వి.డి. సావర్కర్ 2) భాయ్ రాంసింగ్
3) భగత్‌సింగ్ 4) వాసుదేవ బల్వంత్ ఫాడ్కే
సమాధానం: 4

6. జాతీయోద్యమంలో అతి తక్కువగా పాల్గొన్న వర్గం ఏది?
1) పెట్టుబడి దారులు 2) రాజ్యాధినేతలు
3) ప్రభుత్వాధికారులు 4) రైతులు
సమాధానం: 2

7. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పు సుల్తాన్‌కు వ్యతిరేకంగా పోరాడింది?
1) ఆంగ్లేయులు, కర్ణాటిక్ నవాబ్, హైదరాబాద్ నిజాం
2) ఆంగ్లేయులు, మరాఠాలు, హైదరాబాద్ నిజాం
3) ఆంగ్లేయులు, మరాఠాలు, కర్ణాటిక్ నవాబ్
4) ఆంగ్లేయులు, హైదరాబాద్ నిజాం, మైసూర్ రాజా
సమాధానం: 2

ఉద్యోగాలు

ఇంజనీర్స్ లిమిటెడ్‌లో 77 పోస్టులు

ఢిల్లీలోని ఇంజినీర్స్ లిమిటెడ్ (ఈఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 77.
» పోస్టుల వివరాలు: ఇంజనీర్–02, ఆఫీసర్–01, సైంటిఫిక్ ఆఫీసర్–01, ఆర్కిటెక్ట్–02, డిప్యూటీ మేనేజర్–33, మేనేజర్–24, సీనియర్ మేనేజర్–12, డిప్యూటీ జనరల్ మేనేజర్–02.
» విభాగాలు: కెమికల్, మెకానికల్, సివిల్, లైబ్రరీ, ఫైనాన్స్, ఆర్కిటెక్చర్, ఎలక్ట్రికల్, మెటలర్జీ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, బీఈ/బీటెక్ (మెటలర్జికల్/ మెకానికల్/ఎలక్ట్రికల్/సివిల్), పీజీ (బీఎస్సీ), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: ఆఫీసర్ పోస్టుకు 28 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 47 ఏళ్లు, మిగతా పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు మేనేజీరియల్ పోస్టులకు రూ.70,000 నుంచి రూ.2,80,000, మిగతా పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» దరఖాస్తులకు చివరితేది: 04.09.2024.
» పనిచేయాల్సిన ప్రదేశాలు: ఢిల్లీ, గురుగ్రామ్, ముంబై, చెన్నై, వడోదర, కోల్‌కతా.
» వెబ్‌సైట్: www.engineersindia.com

రైట్స్ లిమిటెడ్, గుర్‌గావ్‌లో 11 పోస్టులు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్ లిమిటెడ్)లో రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 11.
» పోస్టుల వివరాలు: గ్రూప్ జనరల్ మేనేజర్–07, డిప్యూటీ జనరల్ మేనేజర్–04.
» విభాగాలు: సివిల్, ఐటీ, మెకానికల్, ఫైనాన్స్, హెచ్ఆర్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: గ్రూప్ జనరల్ మేనేజర్ పోస్టుకు 53 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 41 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» దరఖాస్తులకు చివరితేది: 06.09.2024.
» వెబ్‌సైట్: https://www.rites.com

ఉక్త లేఖనం కలిగించే ప్రయోజనం?

తెలుగు బోధన పద్ధతులు

ఏపీ విద్యాశాఖ ప్రకటించిన టెట్ + టీఆర్‌టీ – 2014 ప్రకటనలో అన్ని రకాల ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టిని సారించాలి. ఎందుకంటే డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయరాదు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్ తెలుగు అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని విస్తృతంగా చదవాలి. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సిద్ధమయ్యే అభ్యర్థులు విధిగా బీఎడ్ తెలుగు అకాడమీని సేకరించుకొని చదవాలి. గత టెట్, డీఎస్సీ పరీక్షల్లో తెలుగు అకాడమీ పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు ఇచ్చారు. కాబట్టి ఆయా అంశాలను పరిశీలిస్తూ అధ్యయనం చేయాలి. ఇప్పుడు డీఎడ్ తెలుగు అకాడమీలోని 'భాషా నైపుణ్యాలు' అధ్యాయంలో వచ్చే ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. 'భాష ఆలోచనలకు ఆకృతి' అన్నదెవరు?
1) అరిస్టాటిల్ 2) విలియం జేమ్స్
3) జాన్సన్ 4) మాక్స్‌ముల్లర్

2. భాషా సాధానికి నాలుగు మూలస్తంభాలు అని వేటిని పిలుస్తారు?
1) మాతృభాష లక్ష్యాలు
2) బోధన నైపుణ్యాలు
3) కనీస అభ్యసన స్థాయిలు
4) భాషా నైపుణ్యాలు

3. భాష నేర్చుకోవడానికి ప్రథమ సోపానం?
1) శ్రవణం 2) భాషణం
3) పఠనం 4) లేఖనం

4. 'వాచిక చర్య' అని దేన్నంటారు?
1) శ్రవణం 2) భాషణం
3) పఠనం 4) లేఖనం

5. 'వాచిక చర్య' అంటే?
1) తనలో తాను మాట్లాడుకోవడం
2) ఎదుటివారికి ఉపదేశించడం
3) ఎదుటివారితో మాట్లాడటం
4) పరస్పరం మాట్లాడుకోవడం

6. ఉపాధ్యాయుడు బాలగేయాలు, అభినయ గేయాల ద్వారా ఏ నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తాడు?
1) పఠనం 2) లేఖనం
3) శ్రవణం 4) భాషణం

7. అర్థం కంటే లయ ప్రధానమైనవి?
1) శిశు గేయాలు 2) అభినయ గేయాలు
3) కథా కథన గేయాలు 4) అన్నీ

8. 'చెమ్మ చెక్క – చారడేసి మొగ్గ అట్లు పోయంగా – ఆరగించంగా' – ఇది ఏ రకమైన గేయం?
1) అభినయ గేయం
2) బాల గేయం 3) కథాత్మక గేయం
4) నాటకీకరణ గేయం

9. వాచికాభినయంతోపాటు, ఆంగికాభినయం కూడా ఉండే గేయాలను ఏమంటారు?
1) బాల గేయాలు 2) శిశు గేయాలు
3) కథా గేయాలు 4) అభినయ గేయాలు

10. ఏదైనా ఒక అంశంపై కనీసం రెండు, మూడు నిమిషాలైనా ఎలాంటి తడబాటు లేకుండా సొంత వాక్యాల్లో, ధారాళంగా మాట్లాడటాన్ని ఏమంటారు?
1) వక్తృత్వం 2) లిఖిత రచన, వాచక చర్య
3) ఉక్త రచన 4) 1, 3

11. ఒక విద్యార్థి నన్నయ బిరుదు కవిబ్రహ్మ అని చెప్పాడు. అతడు చేసిన దోషమేమిటి?
1) ఉచ్చారణ దోషం 2) భాషా దోషం
3) భావ దోషం 4) సాహిత్య దోషం

12. విద్యార్థులు సంధి సరిగా చేయకపోవడం, వైరి సమాసాలు కూర్చడం అనేవి?
1) ఉచ్చారణ దోషం 2) భాషా దోషాలు
3) భావ దోషాలు 4) లేఖన దోషాలు

13. ఒక విద్యార్థిని సభలో 'స్త్రీ మహిళా జాతిని తక్షణమే ఉద్ధరించాలి' అని ఉపన్యసించింది. ఆ విద్యార్థిని చేసిన దోషం?
1) ఉచ్చారణ దోషం 2) భావ దోషం
3) భాషా దోషం 4) ప్రసంగ దోషం

14. ఉపాధ్యాయుడు విద్యార్థుల ఉచ్చారణ దోషాలను ఎప్పుడు సరిచేయాలి?
1) ప్రాథమిక దశ 2) ప్రాథమికోన్నత దశ
3) ఉన్నత దశ 4) మాధ్యమికోన్నత దశ

15. ఒక విద్యార్థి 'జ్ఞానం' అనే పదానికి బదులు 'గ్యానం' అని పలికాడు. అది ఏ రకమైన దోషం?
1) భాషా దోషం 2) భావ దోషం
3) అవగాహన లోపం
4) ఉచ్చారణ దోషం

16. ఒక విద్యార్థి 'భారతం' అనే పదాన్ని 'బారతం' అని పలికాడు. అది ఏ రకమైన ఉచ్చారణ దోషం?
1) అల్ప ప్రాణానికి మహా ప్రాణం
2) మహా ప్రాణానికి అల్పప్రాణం
3) అనునాసికాల తారుమారు ఉచ్చారణ
4) అచ్చు – హల్లుల తారుమారు ఉచ్చారణ

17. ఒక విద్యార్థి సంయుక్తాక్షరాలను, ద్విత్వాక్షరాలుగా ప్రయోగించాడు. అందువల్ల ఏర్పడిన దోష పదం?
1) అశోకుడు – అసోకుడు
2) పచ్చిపులుసు – పక్షి పులుసు
3) జ్ఞానం – గ్యానం
4) హరిశ్చంద్రుడు – హరిచ్చంద్రుడు



18. ఒక విద్యార్థి 'పచ్చిపులుసు' అనే పదాన్ని 'పక్షి పులుసు' అని పలికాడు. అది ఏ రకమైన ఉచ్చారణ దోషం?
1) అల్ప ప్రాణాన్ని మహాప్రాణంగా పలకడం
2) అంతస్థాల తారుమారు ఉచ్చారణ
3) సంయుక్తాక్షరాన్ని–ద్విత్వాక్షరంగా పలకడం
4) ద్విత్వాక్షరాన్ని–సంయుక్తాక్షరంగా పలకడం

19. వేటి సహాయంతో విద్యార్థులు తమ ఉచ్చారణను వారే స్వయంగా తెలుసుకొని, సరిదిద్దుకోనేలా చేయవచ్చు?
1) భాషా ప్రయోగశాల 2) లింగ్వా ఫోన్
3) మైక్రోఫోన్ 4) 1, 2

20. విద్యార్థుల జ్ఞానం సంపాదనకు ఎక్కువగా తోడ్పడేది?
1) శ్రవణం 2) భాషణం
3) పఠనం 4) లేఖనం

21. దీన్ని 'వర్ణ సమామ్నాయ పద్ధతి' అంటారు?
1) ప్రాచీన అక్షర పద్ధతి
2) నవీన అక్షర పద్ధతి
3) వాక్య పద్ధతి 4) పద పద్ధతి

22. ఒక్క గుక్కతో ఒకసారి అర్థవంతంగా ఉచ్ఛరించగల పద సముదాయాన్నేమంటారు?
1) చూపుమేర 2) పలుకుమేర
3) నయనమితి 4) వాఙ్మయనమితి

23. ఒకే సమయంలో చూస్తున్న శబ్ద స్థానానికి, పలుకుతున్న శబ్ద స్థానానికి మధ్య ఉన్న అంతరాన్నేమంటారు?
1) చూపు పలుకుమేర అంతరం
2) పురోగమన అంతరం
3) తిరోగమన అంతరం
4) చూపుమేర – పలుకుమేర అంతరం

24. 'చూపుమేర – పలుకుమేర' అంతరాన్ని ఇలా కూడా పిలుస్తారు?
1) వాఙ్మితి 2) వాఙ్మయనమితి
3) నయనమితి
4) పురోగమన వాఙ్మయనమితి

25. 'గంభీర పఠనం' అని దేన్నంటారు?
1) మౌన పఠనం 2) ప్రకాశ పఠనం
3) క్షుణ్న పఠనం 4) విస్తార పఠనం

26. విద్యార్థులు గ్రంథాలయంలో చేసే పఠనానికి ఉపయుక్తమైన జంట?
1) ప్రకాశ – మౌన పఠనం
2) క్షుణ్న – మౌన పఠనం
3) విస్తార – మౌన పఠనం
4) క్షుణ్న– విస్తార పఠనం

27. ఒక అంశంలోని భాషా విశేషాలు, భావ విశేషాలు అన్నీ సమగ్రంగా తెలుసుకొంటూ చదవడాన్నేమంటారు?
1) ప్రకాశ పఠనం 2) విస్తార పఠనం
3) మౌన పఠనం 4) క్షుణ్న పఠనం

28. 'గానటబీసటగా వివిధ విషయాలను చదవడం కంటే విషయమొక్కటే అయినా క్షుణ్నంగా చదవడం మేలు' అని ఎవరన్నారు?
1) నాష్ 2) బేకన్
3) రాస్ 4) బి.ఎన్.ఝా

29. లిపి రూపంలోని భావాలను నమిలి జీర్ణం చేసుకోగలిగిన పఠనమే?
1) ప్రకాశ పఠనం 2) మౌన పఠనం
3) క్షుణ్న పఠనం 4) విస్తార పఠనం

30. 'జడప్రాయంగా ఉన్న అమితజ్ఞానం కంటే చైతన్య రూపంలో ఉన్న పరిమిత జ్ఞానం మిన్న' అనే సూక్తి వర్తించే పఠనం?
1) ప్రకాశ పఠనం 2)మౌన పఠనం
3) క్షుణ్న పఠనం 4) విస్తార పఠనం

31. శబ్దార్థాలను స్థూలంగా గ్రహిస్తూ పఠించే విధానం?
1) ప్రకాశ పఠనం 2) మౌన పఠనం
3) క్షుణ్న పఠనం 4) విస్తార పఠనం

32. విద్యార్థుల భావానికి, విషయానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ చేసే పఠనం?
1) క్షుణ్న పఠనం 2) విస్తార పఠనం
3) మౌన పఠనం 4) ప్రకాశ పఠనం

33. విద్యార్థులు చేసే పఠన దోషాలను సవివరంగా క్రోడీకరించిన వారు?
1) రైబర్న్ 2) మెంజిల్
3) బ్రూనర్ 4) బల్లార్డ్

34. 'భాషకు సహజ రూపం భాషణమైతే దాని ప్రతిబింబం'?
1) పఠనం 2) లేఖనం
3) శ్రవణం 4) అన్నీ

35. వాగ్రూపమైన భాషకు ఒక స్థిరమైన రూపాన్ని కల్పించడాన్నేమంటారు?
1) లేఖనం 2) పఠనం
3) భాషణం 4) శ్రవణం

36. 'లింపతి' అంటే?
1) వర్ణాలు కూర్చడం
2) మాటలను కూర్చడం
3) వర్ణాలను పూయడం
4) పదాలు, వాక్యాలను కూర్చడం

37. 'రాత నేర్పడం అనేది చాలా కష్టమైన చర్య' అని ఎవరి అభిప్రాయం?
1) రైబర్న్ 2) మాంటిసోరి
3) ఫ్రాన్సిస్ బేకన్ 4) రస్సెల్

38. విద్యార్థులు వంగి రాసేటప్పుడు లేఖనోపకరణాన్ని బొటనవేలు, చూపుడు వేలు మధ్య ఎంత కోణంలో ఉంచి రాయాలి?
1) 35° కోణం 2) 45° కోణం
3) 90° కోణం 4) 42° కోణం

39. 'డిక్టేషన్' అంటే?
1) ఉక్త రచన 2) మేలుబంతి రచన
3) ఉక్త లేఖనం 4) దృష్ట లేఖనం

40. 'నిరంతరం పఠనం ద్వారా రచయిత విషయం సంపూర్ణ స్వరూపాన్ని చూడగలుగుతాడు? రచన ప్రక్రియతో సిద్ధహస్తుడవుతాడు' అని ఎవరన్నారు?
1) రాస్మన్‌రాస్ 2) ఫ్రాన్సిస్ బేకన్
3) జి.బి.షా 4) రైబర్న్

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 2
5) 3	6) 4	7) 1	8) 2
9) 4	10) 4	11) 3	12) 2
13) 3	14) 1	15) 4	16) 2
17) 4	18) 4	19) 4	20) 3
21) 1	22) 2	23) 4	24) 2
25) 1	26) 3	27) 4	28) 1
29) 3	30) 3	31) 4	32) 2
33) 2	34) 2	35) 1	36) 3
37) 1	38) 4	39) 3	40) 2

గత టెట్, డీఎస్సీ ప్రశ్నలు

1. ఒక్క గుక్కలో ఒకసారి అర్థవంతంగా ఉచ్ఛరించగలిగే పద సముదాయాన్ని ఏమంటారు?
1) పురోగమన వాఙ్మయ సమితి
2) తిరోగమన వాఙ్మయ సమితి
3) నయనమితి 4) వాఙ్మితి

2. పఠన లేఖనాల్లో పఠనం శబ్దాంశం అని అంటారు. ఐతే లేఖనం?
1) శబ్దాంశం 2) కారకాంశం
3) లక్షణాంశం 4) ప్రేరణాంశం

3. విరామకాల సద్వినియోగానికి ఉపకరించేది?
1) క్షుణ్న పఠనం 2) విస్తార పఠనం
3) దృష్ట లేఖనం 4) దూర శ్రవణం

4. ఉక్త లేఖనం కలిగించే ప్రయోజనం?
1) లేఖనంలో సమత 2) రాతలో స్పష్టత
3) రాతలో భంగిమ 4) లేఖనంతో వేగం

5. నిలువు గీతలు, అడ్డగీతలు, ఏటవాలు గీతలు, అర్థ చంద్రాకార గీతలు, వృత్తాలు మొదలైన వాటిని మొదట నేర్పి ఆ తర్వాత రాత నేర్పే విధానం?
1) ప్రాచీనం 2) అత్యంత ప్రాచీనం
3) ఆధునికం 4) పురాకృతం

6. విద్యార్థులకు లేఖనాన్ని నేర్పడానికి తెలుగు వర్ణాల్లో దాగి ఉన్న అనేక రకాల గీతలను ముందుగా రాయించాలి. ఇలాంటి పద్ధతిని ఏమని పిలుస్తారు?
1) ఆధునిక పద్ధతి 2) సాంప్రదాయ పద్ధతి
3) అక్షర పద్ధతి 4) అనుకరణ పద్ధతి

7. వీటిలో గ్రహణ శీలాలు?
1) భాషణం, లేఖనం 2) శ్రవణం, పఠనం
3) పఠనం, భాషణం 4) శ్రవణం, లేఖనం

8. మౌఖిక భాషకు స్థిరత్వం కల్పించేది?
1) వాచికం 2) పఠనం
3) లేఖనం 4) శ్రవణం

9. గ్రంథాలయాలు, పఠనాలయాల్లో విజ్ఞానాన్ని వినోదాన్ని పెంచుకోవడానికి స్వయంకృషితో చేసే పఠనం?
1) విస్తార పఠనం 2) ప్రకాశ పఠనం
3) క్షుణ్న పఠనం 4) మౌన పఠనం

సమాధానాలు

1) 4	2) 2	3) 2	4) 4
5) 3	6) 1	7) 2	8) 3
9) 1			

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సులభంగా అయస్కాంతీకరణం చెందే పదార్థమేది?

అయస్కాంతత్వం

పదార్థాలను అయస్కాంతాలు, అనయస్కాంతాలు అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అయస్కాంత పదార్థాలు ఇతర పదార్థాలను తమవైపు ఆకర్షించుకునే లేదా వికర్షించుకునే ధర్మాన్ని కలిగి ఉంటాయి. అనయస్కాంత పదార్థాలకు ఈ ధర్మం ఉండదు.

- అయస్కాంత పదార్థాల ధర్మాలపై తొలిసారిగా (16వ శతాబ్దంలో) శాస్త్రీయ పరిశోధన చేసినవారు విలియం గిల్‌బర్ట్.
- 16వ శతాబ్దం తర్వాత అనేక మంది శాస్త్రవేత్తలు అయస్కాంత పదార్థాల ధర్మాలపై అధ్యయనం చేశారు. వీరిలో ముఖ్యమైనవారు.. వెబర్, ఈవింగ్, కూలుంబ్, మైకెల్ ఫారడే, మేడం క్యూరీ.

మొదటిసారిగా అయస్కాంత ధర్మాన్ని టర్కీ దేశంలోని ఆసియా మీనార్ అనే ప్రదేశంలో ఉన్న 'మెగ్నీషియా' అనే గ్రామం వద్ద కనుగొన్నారు. అందువల్ల అయస్కాంతత్వాన్ని 'మాగ్నెటిజం' అని, అయస్కాంత పదార్థాన్ని 'మాగ్నెట్' అని పిలుస్తారు. స్వేచ్ఛగా వేలాడదీసిన ఒక అయస్కాంత పదార్థం ఎల్లప్పుడూ భూమి ఉత్తర, దక్షిణ దిశలను సూచిస్తూ ఆగిపోతుంది. దీన్ని 'దిశాధర్మం' అంటారు. ఈ ధర్మం ఆధారంగా చైనీయులు తొలిసారిగా నావికా దిక్సూచీని తయారు చేశారు. దీన్ని నౌకాయానం, విమానయానంలో ఉపయోగిస్తారు. అమెరికా సమీపంలోని అట్లాంటిక్ మహాసముద్రంలో మూడు దీవులున్నాయి. ఈ మూడింటినీ కలిపి 'బెర్ముడా ట్రయాంగిల్' అంటారు. ఈ ప్రదేశంలో అత్యంత బలమైన అయస్కాంత పదార్థాలు నిక్షిప్తమై ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

అయస్కాంత పదార్థాల ధర్మాలు:

1. ప్రతి అయస్కాంత పదార్థంలో దాని రెండు చివరల వద్ద ఎలక్ట్రాన్‌లు క్రమ పద్ధతిలో అమరి ఉంటాయి. ఈ రెండు చివరల వద్ద అయస్కాంతత్వం నిక్షిప్తమై ఉంటుంది. వీటిని అయస్కాంత ఉత్తర, దక్షిణ ధ్రువాలుగా పేర్కొంటారు.
2. ఒక అయస్కాంత ధ్రువానికి ఉన్న ఆకర్షణ లేదా వికర్షణ బలాన్ని దాని 'ధ్రువసత్వం' అంటారు. దీన్ని 'm' అనే అక్షరంతో సూచిస్తారు. ప్రమాణాలు: ఆంపియర్-మీటర్.
3. అయస్కాంతం మధ్యబిందువు వద్ద ఎలక్ట్రాన్‌లు క్రమరహితంగా ఉంటాయి. అందువల్ల ఇక్కడ అయస్కాంతత్వం ఉండదు. కాబట్టి అయస్కాంత మధ్య బిందువుల వద్ద ఉండే ధ్రువాల సంఖ్య శూన్యం. అయస్కాంత మధ్య బిందువు వద్ద కొన్ని రంధ్రాలు చేసినా.. దాని అయస్కాంతత్వంలో ఎలాంటి మార్పు ఉండదు.
4. ఒక అయస్కాంత పదార్థాన్ని అనేక చిన్నచిన్న ముక్కలుగా విభజించవచ్చు. ప్రతి చిన్న ముక్క రెండు అయస్కాంత ధ్రువాలను కలిగి ఉంటుంది. అది పరిపూర్ణమైన అయస్కాంతంలా పనిచేస్తుంది. అందువల్ల ఒక అయస్కాంతాన్ని ముక్కలుగా కోసి దానిలోని అయస్కాంత ధ్రువాలను వేరుచేయడం వీలుకాదు. అంటే ఒంటరి అయస్కాంత ధ్రువాలు ఉండవు. ఈ ధ్రువాలు ఎల్లప్పుడూ ఒకదానికొకటి సమానంగా, జంటగా ఉంటాయి.
5. ఒక అయస్కాంతంలోని రెండు ధ్రువాల ను కలుపుతూ గీసిన ఊహాత్మక రేఖను 'అక్షీయరేఖ' అంటారు. దీని మధ్య బిందువు ద్వారా లంబంగా వెళ్లే మరో సరళరేఖను మధ్యగత లంబరేఖ (Equatorial Line) అంటారు.
6. ప్రతి అయస్కాంత పదార్థంలో దానిమధ్య బిందువు నుంచి ఉత్తర, దక్షిణ ధృవాలు సమానమైన దూరంలో ఉంటాయి. ఈ రెండు ధ్రువాల మధ్య ఉండే దూరాన్ని అయస్కాంత పొడవు (2*l*) అంటారు. ఈ అయస్కాంత పొడవు దాని జ్యామితీయ పొడవులో 5/6 వంతు మాత్రమే ఉంటుంది.
7. గది ఉష్ణోగ్రత (25°C) వద్ద ఉన్న అయస్కాంత పదార్థాన్ని వేడిచేసినా, సుత్తితో కొట్టినా, కొంత ఎత్తు నుంచి స్వేచ్ఛగా దృఢమైన తలంపైకి జారవిడిచినా లేదా దాని ద్వారా ఏకాంతర విద్యుత్‌ను ప్రవహింపజేసినా దాని అయస్కాంత ధర్మాలను కోల్పోయి అనయస్కాంత పదార్థంగా మారుతుంది. దీన్ని అనయస్కాంతీకరణం అని అంటారు.
8. సజాతి ధ్రువాలు వికర్షించుకుంటాయి. విజాతి ధ్రువాలు ఆకర్షించుకుంటాయి.
   గమనిక: ఒకే రకమైన రెండు అయస్కాంత పదార్థాలను వాటి సజాతి ధ్రువాలు ఎదురెదురుగా ఉండేవిధంగా కొంతకాలం పాటు బంధించి ఉంచితే.. ఆ సజాతి ధ్రువాల మధ్య ఉండే వికర్షణ బలం వల్ల అవి తమ అయస్కాంతత్వాన్ని క్రమంగా కోల్పోయి అనయస్కాంత పదార్థాలుగా మారుతాయి.

- అయస్కాంతాలను ఎక్కువగా వాటి వికర్షణ ధర్మం ఆధారంగానే పరీక్షిస్తారు. ఇదే సరైన పరీక్ష.

అయస్కాంత భ్రామకం:

ఒక అయస్కాంతం పొడవు, దాని ధ్రువసత్వాల లబ్ధాన్ని 'అయస్కాంత భ్రామకం (M)' అంటారు.

$M = 2l \times m$

ప్రమాణం = ఆంపియర్-మీటర్²

అయస్కాంతీకరణ పద్ధతులు

ఒక అనయస్కాంత పదార్థాన్ని అయస్కాంత పదార్థంగా మార్చడాన్ని 'అయస్కాంతీకరణం' అంటారు. దీనికి కింద పేర్కొన్న ఐదు రకాల పద్ధతులున్నాయి.

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

1. ఏక స్పర్శా పద్ధతి (Single touch method)
2. ద్వి స్పర్శా పద్ధతి (Double touch method)
3. వేడి చేసి చల్లార్చే పద్ధతి. ఈ పద్ధతిలో చాలా బలహీనమైన అయస్కాంతత్వం ఏర్పడుతుంది.
4. అయస్కాంత ప్రేరణ. ఈ పద్ధతిలో ఏర్పడిన అయస్కాంతత్వం చాలా తాత్కాలికమైంది.
5. విద్యుద్దీకరణ పద్ధతి. ఈ పద్ధతిలో అయస్కాంతీకరించాల్సిన కడ్డీ చుట్టూ రాగి తీగను చుడతారు. దీని ద్వారా కొంత కాలం పాటు ఏకముఖ విద్యుత్ (D.C.)ని ప్రవహింపజేస్తే.. ఆ కడ్డీలో అయస్కాంత ధర్మం కలుగుతుంది. దీన్ని 'విద్యుద్దీకరణ పద్ధతి' అంటారు.

- పదార్థాలన్నింటిలో సులభంగా అయస్కాంతీకరణం చెందేది మెత్తటి ఇనుము. అందువల్ల కింది పదార్థాలను తయారు చేయడానికి మెత్తటి ఇనుమును ఉపయోగిస్తారు.
  1. తాత్కాలిక అయస్కాంతాల తయారీలో
  2. అయస్కాంత కవచాల తయారీలో
  3. ట్రాన్స్‌ఫార్మర్‌లోని చట్రం (Core) ను రూపొందించడానికి
- శాశ్వత అయస్కాంతాల తయారీకి Alnico (Al+Ni+Co)లేదా Steelను ఉపయోగిస్తారు.



అయస్కాంత క్షేత్రం:

ఒక అయస్కాంతం చుట్టూ దాని ప్రభావం విస్తరించి ఉండే పరిధిని 'అయస్కాంత క్షేత్రం' అంటారు.

ప్రమాణాలు:

1) Weber/m²
2) Tesla (International unit)
3) Oersted
4) Gauss

అయస్కాంత క్షేత్ర తీవ్రత దాని నుంచి ఉండే దూరం వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$I \propto \frac{1}{l}$ అందువల్ల ఒక అయస్కాంతం నుంచి దూరంగా వెళుతున్నప్పుడు అయస్కాంత క్షేత్ర తీవ్రత క్రమంగా తగ్గుతుంది.

ఉపయోగాలు:

1. స్పీకర్‌ల వెనుకభాగంలో పళ్లెం ఆకృతిలో ఉండే అయస్కాంత పదార్థాలను ఉపయోగిస్తారు.
2. విద్యుత్ జనరేటర్, సైకిల్ డైనమోలో స్తూపాకార అయస్కాంతాలను వాడతారు. సైకిల్ డైనమోను మైకెల్ ఫారడే అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీనిలో యాంత్రిక శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది.
3. టెలిఫోన్, టెలిగ్రామ్ రిసీవర్లలో అయస్కాంత పదార్థాలను ఉపయోగిస్తారు.
4. చిన్నపిల్లలు ఆడుకొనే ఆటబొమ్మల్లోనూ అయస్కాంత ధర్మాన్ని ఉపయోగిస్తారు.
5. అయస్కాంత ఉష్ణోగ్రతా మాపకంలో ద్రవస్థితిలో ఉండే హీలియం(He) వాయువును ఉపయోగిస్తారు. ఈ ఉష్ణోగ్రతా మాపకాన్ని ఉపయోగించి పరమశూన్య ఉష్ణోగ్రత (–273°C లేదా 0°K) వరకు ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవవచ్చు.
6. వేలాడే రైలు పట్టాలు పనిచేయడంలోనూ అయస్కాంత ధర్మాన్ని ఉపయోగిస్తారు.
7. వైద్య రంగంలో మానసిక పరిపక్వత కలిగించడానికి అయస్కాంత ధర్మాలను ఉపయోగించే పద్ధతిని మాగ్నెటో థెరపీ అంటారు.
8. టేప్ రికార్డర్‌లోని ప్లాస్టిక్ టేపుపై ఫెర్రిక్ ఆక్సైడ్ లేదా ఐరన్ ఆక్సైడ్ పదార్థంతో పూత పూస్తారు.

అయస్కాంత పదార్థాల రకాలు:

మైకెల్ ఫారడే అయస్కాంత పదార్థాలను మూడు రకాలుగా వర్గీకరించాడు. అవి..

1. పారా అయస్కాంత పదార్థాలు: వీటికి బలహీనమైన ఆకర్షణ ఉంటుంది.
   ఉదా: Mg, Mn, Pt, Al, O_2, క్యూప్రిక్ క్లోరైడ్.
2. **ఫెర్రో అయస్కాంత పదార్థాలు:** వీటికి బలమైన ఆకర్షణ ఉంటుంది.
   ఉదా: Ni, Co, Fe, Alnico, KCN, Steel.
   - గది ఉష్ణోగ్రత వద్ద ఫెర్రో అయస్కాంత పదార్థాలు కేవలం ఘనస్థితిలోనే లభిస్తాయి. ఈ స్థితిలో అయస్కాంత పదార్థాన్ని వేడిచేసినప్పుడు ఏదో ఒక ఉష్ణోగ్రత వద్ద అది పారా అయస్కాంత పదార్థంగా మారుతుంది. ఈ ఉష్ణోగ్రతను క్యూరీ ఉష్ణోగ్రత లేదా క్యూరీ బిందువు అంటారు.
3. **దయా అయస్కాంత పదార్థాలు:** ఇవి ఎల్లప్పుడూ ఇతర అయస్కాంత పదార్థాలతో వికర్షితమవుతాయి.
   ఉదా: Ag (వెండి), Au (బంగారం), Cu (రాగి), Hg (పాదరసం), H_2O, H_2. గది ఉష్ణోగ్రత వద్ద డయా అయస్కాంత పదార్థాలు మూడు స్థితుల్లో (ఘన, ద్రవ, వాయు) లభిస్తున్నాయి.

భౌమ్య అయస్కాంతత్వం (Geo Magnetism)

- భూమి ఒక పెద్ద అయస్కాంత గోళమని మొదటిసారిగా 16వ శతాబ్దంలో విలియం గిల్‌బర్ట్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించాడు.
- భూమి అయస్కాంతత్వం గురించి అధ్యయనం చేయడాన్ని 'భౌమ్య అయస్కాంతత్వం' అంటారు.
- జాన్ రాస్ అనే శాస్త్రవేత్త భూమి అయస్కాంత ఉత్తర ధ్రువం 'బూతియా ఫెలిక్స్' అనే ప్రదేశంలో ఉన్నట్లు కనుగొన్నాడు. అయస్కాంత దక్షిణ ధ్రువం 'సౌత్ విక్టోరియా' ప్రదేశంలో ఉన్నట్లుగా షాకెల్టన్ శాస్త్రవేత్త పేర్కొన్నాడు.
- భూమి జ్యామితీయ యామ్యోత్తర రేఖ, అయస్కాంత యామ్యోత్తర రేఖల మధ్యఉండే కోణాన్ని 'అవపాతం' అంటారు.
- భూమి అయస్కాంత క్షేత్ర పరిధి 5,28,000 కి.మీ. విస్తరించి ఉంది. భూమికి సహజ ఉపగ్రహమైన చంద్రుడు, కృత్రిమ ఉపగ్రహాలు ఈ అయస్కాంత క్షేత్ర పరిధిలోనే ఉన్నాయి.
- భూమి అయస్కాంత బలరేఖల్లో ఒకటి మన దేశంలోని కేరళలో ఉన్న త్రివేండ్రం సమీపంలోని 'తుంబా' ప్రదేశాన్ని తాకుతూ వెళుతోంది. అందువల్ల తుంబా వద్ద మొట్టమొదటి రాకెట్ ప్రయోగశాల (తుంబా ఈక్వటోరియల్ సౌండింగ్ రాకెట్ స్టేషన్)ను ఏర్పాటు చేశారు.
- విశ్వాంతరాళం నుంచి భూమివైపు వచ్చే ప్రాథమిక కణాలైన e^-, e^+ (పాజిట్రాన్), ప్రోటాన్, న్యూట్రాన్ మొదలైనవాటిలో ఆవేశిత ప్రాథమిక కణాలను భూమి తన అయస్కాంత క్షేత్రంలో తిరిగి విశ్వాంతరాళంలోకి వికర్షిస్తుంది. ఈ విధంగా వికర్షితమైన ప్రాథమిక కణాలు భూమి చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తాయి. ఈ వలయాన్ని 'వ్యాన్ అలెన్' వలయం అంటారు. భూమిపై ఉండే మానవులకు ఈ వలయం కనిపించదు. కానీ భూమి చుట్టూ పరిభ్రమించే వ్యోమగాములకు కనిపిస్తుంది.
- విశ్వాంతరాళం నుంచి భూమి వైపునకు వస్తున్న ప్రాథమిక కణాల్లో తేలికగా ఉన్న ప్రాథమిక కణాలు (e^-) భూమి వాతావరణంలోకి ప్రవేశించి వాయు కణాలను ఢీకొని వాటిని ఉత్తేజ పరుస్తాయి. ఈ విధంగా ఉత్తేజితం చెందిన వాయుకణాలు వాటి నుంచి కాంతిశక్తిని విడుదల చేస్తాయి. ఈ కాంతి తీవ్రత చాలా తక్కువగా ఉండటం వల్ల ధ్రువ ప్రాంతంలో మాత్రమే కనిపిస్తుంది. ఈ విధంగా ఉత్తర ధ్రువం వద్ద కనిపించే కాంతిని 'అరోరా బొరియాలిస్' అని, దక్షిణ ధ్రువం వద్ద కనిపించే కాంతిని 'అరోరా ఆస్ట్రాలిస్' అంటారు.
- 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో మాగ్నెటిజమ్'ను ముంబయిలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో వివిధ అయస్కాంత పదార్థాలు, భౌమ్య అయస్కాంత పదార్థాలు, వాటి ధర్మాలు, ఉపయోగాలపై పరిశోధన చేస్తారు.

Common nouns followed by 'of'..

NOUNS

We use nouns to refer to animals, people, places and things.

Kinds and uses

- **Proper nouns:** The specific names by which we know an individual animal, a person, a place, such as an institution, a building or a town, or something such as a month, a day of the week, a season or a festival.
  E.g. Smith; Delhi; India Gate; January; Sankranthi.. etc.
  Note: that all proper nouns begin with a capital letter.
- **Common nouns:** words that name people, animals, places and things of the same kind Dog (as in my dog, Goldie), doctor (as in Satish, a doctor), library (as in central library), spoon(as in a plastic spoon)
  Note: that all common nouns begin with a lower-case letter.
- **Common nouns are countable when:**
  - We use a / an in front of them.
    A bag, an orange, a shirt, an engineer
  - We can talk about many of them using their plural forms, with or without numbers in front of them.
    Ships, two books, seven women, many sheep, a few lemons.
  - We can use them in questions that begin with 'how many'.
    How many pens do you need? How many children are present today?
- **Common nouns are uncountable when:**
  - We do not use a/an in front of them.
    Not a slat, but salt; not an oil, but oil.
  - We do not use their plural forms, with or without numbers in front of them, to specify what quantity we are talking about.
    Not a sugar, two sugars, many milks, but a grain of/two spoons of/four bags of/ ten kilograms of / many packets of / a lot of sugar, a little milk.
- We do not use them in questions that begin with 'how many', but only in those that begin with 'how much'.
  Not How money do you owe him? but How much money do you owe him? not A How many plastic is manufactured in a day?, but How much plastic is manufactured in a day?
- **Note:** that some nouns can be used both as countables, when they refer to a thing, and as uncountables, when they refer to the substance or material it is made up of.

There are three glasses on the tray. ('glasses', countable noun).

The tray is made of glass. ('glass', uncountable noun).

Some countable nouns are concrete and represent people, things or activities that can be seen, touched or heard, for example rose, table, basket. Other countable nouns are abstract and represent states, feelings or qualities, which can only be felt or imagined, for example hop, ambition, joy. Similarly, some uncountable nouns are concrete, for example cotton, clothing, bread, while others are abstract, for example peace, pain, anger.

- **Collective nouns:** common nouns followed by 'of' and referring to groups of people or things.

A team of players, an army of soldiers, a bouquet of flowers.

- **Note:** that when using collective nouns, you will usually have to use the complete expression in order to make sense. For example, the collective noun 'bunch' by itself would not tell people what you are talking about because it could be used for grapes, roses or letters. Exceptions to this are, for example, 'an army', 'a bouquet' and 'a gang', which are usually used for soldiers, flowers and thieves respectively.

Plural forms of nouns

We use plural forms of nouns to talk about people, places and things that are more than one in number, for example 'two trolleys', 'a box of brushes', 'a few monkeys'.

Regular forms: You can follow the patterns below to form the plural forms of most nouns.

1. **Add-s in the case of most nouns:** mugs, pets, beds, cups, tubs, chiefs, cans, sums, teachers, dolls, months, smiles, tongues, days, windows.
2. **Add-es after nouns ending in:**
   -s: glasses, classes, passes, masses.
   -x: boxes, taxes, faxes.
   -ch: matches, clutches, stitches.
   -sh: wishes, bushes, dishes.
3. **Add-s after nouns ending in -ay, -ey,-oy, -uy:** rays, keys, toys, guys.
4. **In nouns ending in a consonant letter+-y, replace the final-y with 'ies':** countries, cities, ladies, babies.
5. **In nouns ending in-fe, replace the letters with-ves:** knives, lives, wives.

Irregular forms: There are some nouns for which you cannot find the plural forms by following the patterns above. You will have to learn the plurals of these nouns through reading or by looking them up in a standard dictionary Look at some plurals that do not follow the usual pattern.

1. **Nouns ending in-f forms plurals:**
   - **With a final -f :** roof/ roofs, chief/ chiefs, proof/ proofs.
   - **With a final -ves in place of the -f :** calf/calves, loaf/loaves, leaf/ leaves.
   - **With either a final-s or a final -ves:** dwarf/ dwarfs or dwarves, hoof / hoofs or hooves, scarf/ scarfs or scarves.
2. **Nouns ending in -o form plurals:**
   - **Always with a final-oes:** potatoes, tomatoes, echoes.
   - **With either a final-oes or-os:** buffaloes/ buffalos.
   - **Always with a final-os:** kilos, radios, videos, photos.
3. **Nouns whose plural forms are formed by adding-en/-ren:** oxen, children
4. **Nouns whose plural forms are formed by changes in letters within the singular form:** foot/feet, mouse/mice, man/men.

Tips to remember

- The following words are countable and are normally used in singular form only. The indefinite article a/an should not be used with them.



- The words such as measles, mumps, ethics, maths, politics, phonetics, rickets, billiards and innings look like plural nouns but give singular meaning. So, they take singular form of verbs.
- Some nouns have the same form whether singular or plural.
  Sheep, deer, service, series, species, apparatus.
- The following nouns are always used in the plural form only.
  Cattle, scissors, spectacles, electorate, binoculars, crackers, clergy. These are used with plural form of verbs.
- Add**'s'** to the main word in compound noun to make it plural.
  Sister-in-law, sister's- in-law
- The possessive case of a compound noun is formed by adding**'s'** to the last word.
  Father-in-law's property.
- After the phrases *one of, some of, each of, either of, neither of, any of, none of,* a plural form of a noun is used.
- Nouns indicating numerals should be used in singular form.
  A dozen eggs/ two dozen oranges.
- After collective noun either a singular or plural form of verb is used.
- An apostrophe and 's' is used with living beings only to show possession.
- When two nouns are connected by **'and'** and are closely related add an apostrophe and **s** to the last noun.
- Collective nouns, such as ***family, majority, audience,*** and ***committee*** are singular when they act in a collective fashion or represent one group. They are plural when the members of the collective body act as individuals. Collective nouns will usually be singular in Sentence Correction sentences.

A majority of the shareholders wants the merger.

This sentence is grammatically correct - but confusing. To determine whether a confusing noun requires a singular or plural verb, it might be helpful to visualize what's actually going on in the sentence. Is the sentence talking about something that acts as a *singular entity*? Or is it talking about the individual elements *within* that entity?

In the sentence here, there is no indication that the sentence is referring to the *individuals within* the majority. The "majority" acts as one - as a singular entity - and therefore requires a singular verb, "wants."

Again, the "flock of birds" is referred to as a singular group - we're not talking about *each bird's* direction of flight, but the direction of the flock as a whole - thus it requires the singular verb "is" not the plural verb "are".

The team are always fighting amongst themselves.

This is an example of a collective noun that requires a ***plural*** verb. While 'team' is often used as a singular collective noun, in this case, the sentence describes the fighting that occurs *between the individual members of the team.* "Team" therefore refers to several *individual members*, and requires a plural verb, "are," as a result.

The key to these questions is simplicity: recognize the collective noun, visualize what's going on in the sentence, and proceed.

Directions (Q. 1-6): *Each question below has a blank, indicating that something has been omitted. Choose the word from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.*

1. The work increases our ___ about how the body fights disease.
   1) knowledge 2) knowledges
   3) knowledgably 4) acknowledge
   5) knowledgeable
2. They are doing some fascinating- __________ into the language of dolphins.
   1) Researches 2) researcher
   3) research 4) re searches
   5) re search
3. In our family, we share the ______ between us.
   1) Houseworks 2) housework
   3) houses works 4) house works
   5) house working
4. The first task is to clean up the _____ left behind by the factories.
   1) Pollutions 2) pollution
   3) polluting 4) pollute
   5) polite
5. They are suffering from _____ lack of medical supplies.
   1) a serious 2) serious
   3) seriously 4) seriousness
   5) series
6. He's starting to get a few grey _____ now.
   1) Hair 2) heirs 3) heir
   4) hairs 5) hairy

Key

1) 1 2) 3 3) 2 4) 2
5) 1 6) 4